www.andhrajyothy.com

# ఆంధ్రజ్యోతి



శనివారం | 10-2-2018 | పేజీలు: 16 + 20 | వెల: రూ. 5.00 | సంపుటి: 14 సంచిక: 211 | శ్రీహేవళంబినామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిరరుతువు, మాఘమాసం, బహుళపక్షం; తిథి: దశమి మ. 2.44 తదుపరి ఏకాదశి; నక్షత్రం: జ్యేష్ఠ రా. 7.53 తదుపరి మూల; వర్జ్యం:తె.4.55-6.43; దుర్ముహూర్తం: ఉ.6.49-7.34; అమృతఘడియలు: ఉ.10.00-11.47; రాహుకాలం: ఉ.9.00-10.30; సూర్యోదయం: 6.49; సూర్యాస్తమయం: 6.12 | నిజామాబాద్ సిటీ*

Nizamabad | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Anantapur | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Kakinada | Khammam | Kadapa | Ongole | Nallagonda | Bangalore and Chennai






హైదరాబాద్‌లో జరిగిన 15వ ఆర్థిక సంఘం ప్రాంతీయ భేటీలో కమిషన్ సభ్యులతో తెలంగాణ సీఎస్ సీకే జోషి

ఆంధ్రజ్యోతి ప్రత్యేకం

• ఫార్ములా మటాష్

# దక్షిణాదిని ముంచేస్తారా?

## ఆర్థిక సంఘంపై ఐదు రాష్ట్రాల ధ్వజం

మేం విడిపోయే పరిస్థితి తెస్తారా

క్రమశిక్షణతో ఉండటమే నేరమా

ప్రోత్సహించడం మాని శిక్షిస్తారా

ఉత్తరాదిని అభివృద్ధి చేసుకోండి

ఆ పేరుతో మాకు నష్టం చేస్తారా

దక్షిణాది రాష్ట్రాల ఆగ్రహం

ఆర్థిక సంఘం ముందు నిరసన

2011 జనాభా ప్రాతిపదికకు నో

*పంచపాండవుల్లా దక్షిణాది రాష్ట్రాలు ఏకమయ్యాయి. కేంద్ర ప్రభుత్వం, కేంద్ర ఆర్థిక సంఘం తీరును దుయ్యబట్టాయి. ఉత్తరాది రాష్ట్రాలకు సాయం చేస్తే చేసుకోండి. కానీ.. ఆ పేరుతో తమకు అన్యాయం చేస్తే అంగీకరించే ప్రసక్తే లేదని తేల్చిచెప్పాయి. ఆర్థిక సంఘం చెబుతున్న ఫార్ములా ప్రమాదకరమని.. అది ఉత్తరాది రాష్ట్రాలకు అనుకూలంగా దక్షిణాది రాష్ట్రాలకు ప్రతికూలంగా ఉన్నద'ని ఆగ్రహం వ్యక్తం చేశాయి. జాతీయ విధానం పేరిట దక్షిణాదిని ముంచేస్తారా? దక్షిణాది రాష్ట్రాలు దేశం నుంచి పక్కకెళ్లాలని ఉందా? అని 15వ ఆర్థిక సంఘాన్ని తీవ్రస్వరంతో నిలదీశాయి. విశ్వసనీయ వర్గాల సమాచారం ప్రకారం.. శుక్రవారం హైదరాబాద్‌లో ఈ సమావేశం వాడివేడిగా జరిగింది.*




హైదరాబాద్/అమరావతి, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): ఉత్తరాది రాష్ట్రాలు వెనకబడ్డాయన్న కారణం చూపి.. ఆ కారణంగా వాటికి నిధులు పెంచి, దక్షిణాది రాష్ట్రాలకు కోత పెడితే ఊరుకునేది లేదని, మరో ఐదేళ్ల నష్టపోయేందుకు తాము సిద్ధంగా లేమని దక్షిణాది రాష్ట్రాలు 15వ ఆర్థిక సంఘానికి స్పష్టం చేశాయి. శుక్రవారం హైదరాబాద్‌లో 15వ ఆర్థిక సంఘం సంప్రదింపుల సమావేశం జరిగింది. ఇందులో ఏపీ, తెలంగాణ, తమిళనాడు, కర్ణాటక, కేరళ రాష్ట్రాల ఆర్థిక శాఖ కార్యదర్శులు, ఇతర ముఖ్య అధికారులు పాల్గొన్నారు. విశ్వసనీయవర్గాల సమాచారం ప్రకారం.. "ఉత్తరాదిలోని

మిగతా 2వ పేజీలో...

### ఏప్రిల్ 15కల్లా వివరాలివ్వండి

ఆర్థిక సంఘం ఆదేశం

హైదరాబాద్‌లో ఉన్నత స్థాయి సమావేశం

2

### మే 6న యూజీ నీట్

జూన్ 5న ఫలితాలు విడుదల

శుక్రవారం నుంచి దరఖాస్తులు

16

పీహెచ్‌డీ పరిశోధకులకు నెలకు 80 వేల స్కాలర్‌షిప్!



కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ ఆధ్వర్యంలో రాష్ట్రపతి కోవింద్‌ను కలిసిన ప్రతిపక్షాలు

### లోయా మృతిపై సిట్ వేయాలి

సీబీఐ జడ్జి కేసులో నిజాలు తేల్చాలి

ఐక్యంగా గళమెత్తిన ప్రతిపక్షాలు

16

రాష్ట్రపతికి 114 మంది ఎంపీల వినతి

రాహుల్ సారథ్యంలో కోవింద్ వద్దకు



బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి మురళీధర్‌రావుతో జెనా

### అగ్ర నేతలతో చెట్టపట్టాల్!

పెద్దలతో రాసుకు పూసుకు తిరిగిన తాకట్టువీరుడు సౌమిత్ జెనా

కేజ్రీవాల్, ఆడ్వాణీ, భగవత్, మురళీధర్‌రావు తదితరులతో సంబంధాలు

మహారాష్ట్ర నుంచి రాజ్యసభకు యత్నం.. రాజకీయాల్లోకి దిగిన భార్య

6

### అక్రమార్కుల చెరలో వందల ఎకరాల ప్రభుత్వ భూమి

2 ఊర్లలో నిలిచిన భూసర్వే.. పాసు పుస్తకాలు నిలిపేసిన అధికారులు



### బోదకాలు బాధితులకు
# పింఛన్లు

ఈ బడ్జెట్లోనే నిధుల కేటాయింపు

వచ్చే ఆర్థిక సంవత్సరం నుంచి అమలు

రాష్ట్రంలో 46,476 మందికి లబ్ధి

ప్రతీ ఊర్లో రోగ నిర్ధారణ పరీక్షలు

ప్రభుత్వపరంగా చికిత్స, మందులు

కేసీఆర్ కిట్‌ను ప్రైవేటు ఆస్పత్రులకివ్వం

ఆశా కార్యకర్తలకు మళ్లీ జీతాల పెంపు

వారికి గ్రామ సహాయకులుగా గుర్తింపు

రెండో ఏఎన్ఎంలకు కూడా: కేసీఆర్



**ఢిల్లీకి వెళ్లిన కేసీఆర్**

పంటి నొప్పికి చికిత్స

రెండు రోజులు విశ్రాంతి

హైదరాబాద్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): బోదకాలు బాధితులకు ఊరట. వారికి ప్రతి నెలా వెయ్యి రూపాయల పింఛను ఇవ్వాలని సీఎం కేసీఆర్ నిర్ణయించారు. వచ్చే ఆర్థిక సంవత్సరం నుంచి ఈ పథకాన్ని అమలు చేయనున్నారు. ఈ మేరకు రాబోయే బడ్జెట్లో నిధులు కేటాయిస్తామని చెప్పారు. ఈ నిర్ణయంతో రాష్ట్రవ్యాప్తంగా 46,476 మంది లబ్ధి పొందనున్నారు. చికిత్స కంటే

మిగతా 3వ పేజీలో...

### ఆరోగ్యంలో తెలంగాణకు 11వ స్థానం

కేరళ భేష్.. అట్టడుగున యూపీ.. ఏపీకి 8వ స్థానం

నీతి ఆయోగ్ ఆరోగ్య సూచీ ర్యాంకులు విడుదల

2



3

### ఏప్రిల్ 1 నుంచి 'పెట్టుబడి' చెక్కులు

45 రోజులపాటు రైతులకు పంపిణీ

వారంలో రాష్ట్ర రైతు సమన్వయ సమితి

రూ. 7 వేల కోట్ల రుణం: పోచారం

### రైతు కుటుంబం శ్రమనూ కలుపుతారు

16

వస్తురూపంలో ఇచ్చినా పెట్టుబడి వ్యయమే



మద్దతు ధర లెక్కింపు విధానం ఇదే: జైట్లీ



### కూతురి ఆత్మహత్య.. తండ్రికి 4 ఏళ్ల జైలు

జ్యోతినగర్(గోదావరిఖని), ఫిబ్రవరి 9: కూతురి ఆత్మహత్యకు కారకుడైన తండ్రికి నాలుగేళ్ల కఠిన కారాగార శిక్ష పడింది. ఒక కేసుకు సంబంధించి శుక్రవారం పెద్దపల్లి సబ్ కోర్టు సీనియర్ సివిల్ జడ్జి కె.పట్టాభిరామారావు ఈ మేరకు తీర్పు చెప్పారు. స్థానిక ఇందిరమ్మ కాలనీకి చెందిన దంపతులు గొల్లపల్లి జనార్దన్, స్వరూప తరచూ గొడవపడేవారు. తల్లికి మద్దతుగా నిలిచిన కూతురు సౌజన్య... తండ్రిని మందలించేది. ఒకసారి ఇద్దరి మధ్య గొడవ జరిగినప్పుడు ఆమె తండ్రిని నిలదీసింది. కోపోద్రిక్తుడైన జనార్దన్ కూతురుని తీవ్ర పదజాలంతో దూషించడంతో మనస్తాపానికి గురైన సౌజన్య 2015 నవంబరు 11న ఒంటిపై కిరోసిన్ పోసుకొని నిప్పంటించుకొని ఆత్మహత్య చేసుకుంది. ఈ కేసులో వాదనలు విన్న తర్వాత జనార్దన్‌ను దోషిగా తేల్చి నాలుగేళ్ల కఠిన జైలు శిక్షతోపాటు వెయ్యి రూపాయల జరిమానా విధిస్తూ జడ్జి తీర్పు చెప్పారు.

### బ్యాగుల మోతే!

విద్యార్థులకు తప్పని భారం

ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో నిబంధనలు బుట్టదాఖలు

ప్రభుత్వ ఉత్తర్వులు బేఖాతరు

2



# మోహ క్షయమే మోక్షం

పరంజ్యోతి



ఒకసారి.. అగస్త్య మహర్షి అనుగ్రహ దృష్టి ఒక సామాన్య రైతుపై పడింది. రోజంతా ఆ రైతు ఎండనకా, వాననకా పడుతున్న కష్టాన్ని, అందుకు తగిన ప్రతిఫలం లేక అనుభవిస్తున్న దారిద్ర్యాన్ని చూసిన మహర్షి మనస్సు ద్రవించింది. దీంతో అతడి వద్దకు వెళ్లి.. 'నాయనా, ఈ సంసార సాగరంలో చిక్కుకుని ఎందుకు కష్టపడతావు? నీకు మోక్షం ప్రసాదిస్తాను' అన్నాడు. దానికా రైతు.. 'స్వామీ నా కుమారులు చిన్నవాళ్లు, వ్యవసాయం చేసే స్థితిలో లేరు. కాబట్టి నాకు 10 సంవత్సరాల తర్వాత మోక్షం ప్రసాదించండి' అన్నాడు. సరేనన్న అగస్త్యుడు.. పదేళ్ల తర్వాత వెళ్లగా, కొడుకు పెళ్లి చేశానని, మనవడితో ఆడుకోవాలని ఉందని చెప్పి మళ్లీ పదేళ్లకు రమ్మన్నాడు. అలాగే నన్న అగస్త్య మహర్షి పదేళ్ల తర్వాత వెళ్లగా.. రైతు లేడుగానీ.. ఇంటి గడప దగ్గర ఒక కుక్క పడుకొని ఉంది. ఆ కుక్కే గత జన్మలో రైతు అని అగస్త్యుడు గ్రహించాడు. చనిపోయినా కుటుంబంపై మమకారాన్ని వీడలేక కుక్క జన్మ ఎత్తి కాపలాకాస్తున్నాడని అర్థమైంది. దీంతో ఆ కుక్కకు జ్ఞానం ప్రసాదించి.. ఇప్పటికైనా మోక్షానికి సిద్ధమా అని అడిగాడు. దానికా కుక్క రూపంలో ఉన్న రైతు.. తాను డబ్బు దాచిన స్థలం పిల్లలకు తెలియదని అది దొంగలపాలు కాకుండా కాపలా కాస్తున్నానని, పదేళ్ల తర్వాత రావాలని కోరాడు. పదేళ్ల తర్వాత మళ్లీ అగస్త్యుడు వెళ్తే.. ఆ రైతు పాముగా పుట్టి ఉన్నాడు. దీంతో అగస్త్యుడు ఆ ఇంటివారిని పిలిచి 'మీ పెరట్లోని పుట్టలో నిధి ఉంది' అని చెప్పాడు. అప్పుడు వారు నిధి కోసం ఆ పుట్టను తవ్వి అందులోని పామును చంపేశారు. ఎవరికోసం తాను తపనపడుతున్నాడో వారే క్రూరంగా కొట్టి చంపడంతో పాము రూపంలోని రైతుకు మోహబంధం తెగిపోయింది. మోహక్షయమే మోక్షం గనక రైతుకు మహర్షి దయవల్ల పునర్జన్మ లేకుండా పోయింది. మనిషిని మోహబంధమే మోక్షానికి దూరం చేస్తుందని అగస్త్య మహర్షి ఈ వృత్తాంతం ద్వారా తెలిపారు.

- మాదిరాజు రామచంద్రరావు

## వైద్య సీట్లలో మరో తొండి ఆట

- ఎన్‌సీసీ కోటా సిఫారసు తారుమారు
- వైద్య సీటు కోల్పోయిన విద్యార్థి.. ఆర్టీఐతో తేలిన ఎన్‌సీసీ నిర్వాకం

హైదరాబాద్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): వైద్య సీట్ల వ్యవహారంలో మరో తొండి ఆట వెలుగులోకి వచ్చింది. అధికారుల నిర్వాకంతో మరో విద్యార్థి వైద్య సీటు అవకాశం కోల్పోయాడు. తెలంగాణ క్రీడాప్రాధికార సంస్థ తప్పిదం వల్ల ఇప్పటికే ఒక విద్యార్థి సీటును కోల్పోగా ఎన్‌సీసీ కోటాలోనూ ఇదే జరిగినట్లు తాజాగా తేలింది. ఎన్‌సీసీ, క్రీడలు తదితర రంగాల్లో ప్రతిభ చూపిన వారికి ప్రవేశాల్లో ప్రాధాన్యత ఇస్తున్నారు. ఈ కోటాలో సీట్ల భర్తీకి ఆయా సంస్థలు (ఎన్‌సీసీ, తెలంగాణ క్రీడా ప్రాధికార సంస్థ) ఇచ్చిన జాబితాలే ప్రామాణికం అవుతున్నాయి. వీటిలో తప్పిదాలు విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటమాడుతున్నాయి. ఇంటర్‌లో రెండు సంవత్సరాల ఎన్‌సీసీ కోర్సు ఉంది. ఎన్‌సీసీ నిర్వహించిన పరీక్షలో ఒక మైనారిటీ విద్యార్థికి 500 మార్కులకు 433 మార్కులు వచ్చాయి. ఈ విద్యార్థికి 'ఏ' గ్రేడ్ లభించింది. మరో మైనారిటీ విద్యార్థికి 429 మార్కులు వచ్చాయి. ఇతనికి 'బి' గ్రేడ్‌ను కేటాయించారు. 'ఏ' గ్రేడ్ విద్యార్థికి కాకుండా 'బి' గ్రేడ్ విద్యార్థికి వైద్య కళాశాలలో సీటు దక్కింది. ఆ విద్యార్థి తండ్రి సమాచార హక్కు చట్టాన్ని (ఆర్టీఐ) ఆశ్రయించారు. దీంతో ఎన్‌సీసీ సిఫారసుల్లో చోటుచేసుకున్న పొరపాటు వెలుగులోకి వచ్చింది. ఎన్‌సీసీ ఇచ్చిన గ్రేడింగ్ మారిపోయింది. 'బి' గ్రేడ్ విద్యార్థికి తరువాత 'ఏ' గ్రేడ్ ఇచ్చినట్లు వెల్లడైంది. ఆర్టీఐకి ఇచ్చిన సమాధానంలోనే ఈ రెండు వివరాలూ ఉన్నాయి. అతని పోరాటానికి నెలలు పట్టింది. కానీ ఈలోపు పుణ్యకాలం గడిచిపోయింది. ప్రస్తుత విద్యా సంవత్సరానికి గత ఏడాది సెప్టెంబరులోనే ప్రవేశాలు ముగిశాయి. కాగా క్రీడా కోటాలో అక్రమాలు నిజమేనని విచారణ కమిటీ తేల్చింది. 'వైద్య సీట్లలో తొండి ఆట' అని 'ఆంధ్రజ్యోతి'లో డిసెంబరులో వచ్చిన కథనంపై ప్రభుత్వం విచారణ జరిపించింది. ఈ నివేదిక ప్రభుత్వానికి అందింది. 'క్రీడా కోటాలో సర్టిఫికెట్ల నిర్ధారణకు తగినంత సమయం లేదు. మరోవైపు పని ఒత్తిడి. అందుకే సరిగా చూడలేకపోయాం. ఒక విద్యార్థికి 27(టీ) అని ఇవ్వాల్సి ఉండగా 25(టీ) అని ఇచ్చాం" అని నివేదికలో పేర్కొన్నట్లు తెలిసింది. ఈ వ్యవహారంలో బాధ్యులపై వేటు వేయాలని విద్యార్థుల తల్లిదండ్రులు డిమాండ్ చేస్తున్నారు.

## 11న ట్రాన్స్‌కో జేఎల్‌ఎం రాత పరీక్ష

హైదరాబాద్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి) : ట్రాన్స్‌కోలో జూనియర్ లైన్‌మన్ (జేఎల్‌ఎం) పోస్టుల భర్తీకి ఈనెల 11న రాత పరీక్ష నిర్వహించనున్నారు. 1100 జేఎల్‌ఎం పోస్టులకు గాను గతనెలలో ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేసిన విషయం తెలిసిందే. దరఖాస్తు గడువు జనవరి 20తో ముగియడంతో రాతపరీక్షను ఖరారు చేశారు.

# బ్యాగుల మోతే!

హైదరాబాద్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): ప్రాథమిక పాఠశాలల్లో విద్యార్థుల బ్యాగు బరువు 3-6 కేజీలు ఉంటే.. ఉన్నత పాఠశాలల్లో 6-12 కేజీలు ఉన్నట్లు తేలింది. ఇక, కేజీబీవీల్లో 5-10 కేజీలున్నట్లు వెల్లడైంది. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాల అనే తేడా లేదు. ప్రతి విద్యార్థి అవసరానికి మించి పుస్తకాలు మోస్తున్నట్లు అధికారులు గుర్తించారు. ప్రభుత్వం ఎన్ని చర్యలు తీసుకున్నా విద్యార్థులకు బ్యాగుల మోత తప్పడం లేదని గుర్తించారు. ఏ పాఠశాల కూడా నిబంధనలు పాటించడం లేదని, ప్రభుత్వ ఉత్తర్వులను అన్ని పాఠశాలలు బుట్టదాఖలు చేస్తున్నాయని నిర్ధారించారు. ఇటీవల పాఠశాల విద్యా శాఖ చేపట్టిన పరిశీలనలో ఈ బ్యాగుల మోత బయటపడింది. ఈ 3 నుంచి 9వ తేదీ వరకు రాష్ట్రవ్యాప్తంగా 1226 ప్రభుత్వ పాఠశాలల్లో వివిధ అంశాలపై 10 బృందాలు పరిశీలన చేశాయి. ఈ సందర్భంగా బ్యాగుల బరువుపై విస్తుపోయే వాస్తవాలు వెలుగులోకి వచ్చాయి. ఏ పాఠశాలకు వెళ్లినా విద్యార్థుల బ్యాగులు చిన్నపాటి కొండను తలపిస్తున్నాయని గుర్తించారు. ప్రైవేటు పాఠశాలలైతే కనీస నిబంధనలను కూడా పాటించడం లేదు. ప్రభుత్వ పాఠశాలల్లో పరిస్థితి కొంత మెరుగ్గా ఉంటుందన్న అభిప్రాయం కూడా తప్పని తాజా పరిశీలనలో తేలింది. ప్రతి విద్యార్థి వద్ద అవసరానికి మించి పుస్తకాలున్నట్లు అధికారులు గుర్తించారు. ఒక్కో సబ్జెక్టుకు సుమారు 3 నోటుబుక్‌లు ఉన్నట్లు గమనించారు. వాటితో పాటు మధ్యాహ్న భోజనానికి ప్లేటు, మంచినీళ్ల బాటిల్, టిఫిన్ బాక్సు, ప్యాడ్, కంపాక్స్ బాక్సు, ఇతర సామగ్రి ఉన్నాయి. కొన్నిచోట్ల నిఘంటువు, జీకే పుస్తకాలు కూడా గుర్తించారు. బ్యాగుల బరువుపై వివిధ వర్గాల నుంచి తీవ్ర ఆందోళన వ్యక్తం కావడంతో గత ఏడాది జూలై 18న ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిన విషయం తెలిసిందే. ఏ స్థాయిలో బ్యాగు ఎంత బరువు ఉండాలి? ఏయే పుస్తకాలు తీసుకెళ్లాలి వంటి అంశాలను వాటిలో పేర్కొంది. ఈ నిబంధనలను ఏ పాఠశాల పాటించడం లేదు. అంతేనా, సర్కారు ఉత్తర్వులు ప్రభుత్వ పాఠశాలలకు కాదని డీఈవోలు, ఎంఈవోలు భావించినట్లు, కొందరు ప్రైవేటు పాఠశాలలకు వాట్సాప్ ద్వారా పంపించి అమలు చేయాలని ఆదేశించినట్లు వెల్లడైంది. ఇటువంటి ఉత్తర్వులు వెలువడినట్లు కొంతమంది ఉపాధ్యాయులకు తెలియకపోవడం గమనార్హం. ఉత్తర్వులు జారీ చేయడం తప్ప, ఈ అంశంపై ప్రభుత్వం ఉపాధ్యాయులకు అవగాహన కల్పించడానికి ఎటువంటి చర్యలూ తీసుకోకపోవడం విశేషం.



**నిబంధనల ప్రకారం స్కూల్ బ్యాగు బరువు**

| తరగతి | బరువు |
|---|---|
| 1-2 | 1.5 కేజీలు |
| 3-5 | 2-3 కేజీలు |
| 6-7 | 4 కేజీలు |
| 8-9 | 4.5 కేజీలు |
| 10 | 5 కేజీలు |

**పరిశీలనలో తేలింది...**

| | |
|---|---|
| ప్రాథమిక పాఠశాలల్లో | 3-6 కేజీలు |
| ఉన్నత పాఠశాలల్లో | 6-12 కేజీలు |

# ఏప్రిల్ 15కల్లా వివరాలివ్వండి

- దక్షిణాది రాష్ట్రాలకు 15వ ఆర్థిక సంఘం ఆదేశం
- హైదరాబాద్‌లో ఉన్నతాధికారులతో సమావేశం

హైదరాబాద్, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): దక్షిణాది రాష్ట్రాల అధికారులతో శుక్రవారం 15వ ఆర్థిక సంఘం భేటీ అయింది. ఏప్రిల్ 15 కల్లా రాష్ట్రాలు ఆర్థిక వివరాలను పూర్తిస్థాయిలో ఇవ్వాలని ఆదేశించింది. ఆర్థిక సంఘం కార్యదర్శి అరవింద్ మెహతా ఆధ్వర్యంలో మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి కేంద్రంలో ఈ సమావేశం జరిగింది. ఆర్థిక సంఘం అధికారులు సందీప్, భాటియా, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కర్ణాటక, కేరళ రాష్ట్రాల ముఖ్య కార్యదర్శులు, కార్యదర్శులు, సంయుక్త కార్యదర్శులు, మహారాష్ట్ర అధికారులు పాల్గొన్నారు. తెలంగాణ తరపున ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి కె.రామకృష్ణారావు, డిప్యూటీ కార్యదర్శి సాయిప్రసాద్ హాజరయ్యారు. కమిషన్‌కు పంపాల్సిన వివరాలు, సూచనలు, సలహాల గురించి అరవింద్ మెహతా వివరించారు. కేంద్ర పన్నుల్లో రాష్ట్రాలకు వాటా, గ్రాంట్-ఇన్-ఎయిడ్, స్థానిక సంస్థలకు నిధులపై 15వ ఆర్థిక సంఘం సిఫారసులు చేయనుంది. దీనికి రాష్ట్రాల నుంచి సూచనలు, సలహాలు ఆ రాష్ట్రాల ఆర్థిక పరిస్థితి, ఆర్థిక లోటు, అప్పులు, నగదు నిల్వలు, ఆర్థిక క్రమశిక్షణ వంటి వివరాలు సేకరిస్తోంది. దీని కోసం మొదట దక్షిణాది రాష్ట్రాలతో సమావేశమైంది.

### కాళేశ్వరం సందర్శన

ఆర్థిక సంఘం అధికారులు శనివారం కాళేశ్వరం ప్రాజెక్టును సందర్శించనున్నారు. ప్రాజెక్టుకు జాతీయహోదా ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వం కేంద్రాన్ని కోరుతున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ప్రాజెక్టు నిర్మాణ ప్రగతి, రైతులకు ఒనగూరే ప్రయోజనాలను తెలుసుకుంటారు. ఆదివారం హైదరాబాద్‌కు చేరుకుని వివిధ వర్గాల నుంచి అర్జీలను స్వీకరిస్తారు.

### వాటాలపై సిఫారసులకు కమిషన్ పరిశీలించే అంశాలు

- రాష్ట్రాల పన్ను, పన్నేతర రాబడులు, 2024-25కల్లా రాబడుల మొత్తం
- రక్షణ, అంతర్గత భద్రత, మౌలిక సదుపాయాలు, రైల్వే, వాతావరణ మార్పులు
- పకడ్బందీగా జీఎస్‌టీ అమలు, జీఎస్‌టీ నెట్‌లోకి అర్హులైన వ్యాపారులందరినీ తీసుకురావడంలో రాష్ట్రాల కృషి
- జనాభా నియంత్రణకు రాష్ట్రాలు తీసుకుంటున్న చర్యలు
- కేంద్ర పథకాల అమలు, విపత్తుల అనంతరం పునరుద్ధరణ చర్యలు, నిరంతర అభివృద్ధి లక్ష్యాలు (ఎస్‌డీజీ), వ్యయంలో క్రమశిక్షణ
- మూలధన వృద్ధికి చేపట్టిన చర్యలు, విద్యుత్ నష్టాల తగ్గింపు
- ప్రత్యక్ష నగదు బదిలీ (డీబీటీ)లను ప్రోత్సహించడం, ప్రభుత్వం, లబ్ధిదారుల మధ్య ఉన్న ఆటంకాలను తొలగించడం
- ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌లో ప్రగతి
- స్థానిక సంస్థలకు గ్రాంట్-ఇన్-ఎయిడ్‌ల అందజేత
- పారిశుధ్యం, ఘన వ్యర్థాల నిర్వహణలో చేపట్టిన చర్యల్లో పురోగతి

### కొత్త రాష్ట్రాలకు ఎక్కువ నిధులు ఇవ్వండి: ఈటల



ఆర్థిక సంఘం కార్యదర్శి అరవింద్ మెహతాను రాష్ట్ర ఆర్థిక మంత్రి ఈటల రాజేందర్ కలిశారు. తెలంగాణలాంటి కొత్త రాష్ట్రాలకు ఎక్కువ నిధులు ఇవ్వాలని కోరారు. కొత్తగా ఆవిర్భవించిన రాష్ట్రాల్లో మౌలిక సదుపాయాలు, ప్రాజెక్టులకు ఎక్కువ మొత్తంలో నిధులు అవసరమని చెప్పారు. కేంద్ర పన్నుల వాటాలు, కేంద్ర ప్రాయోజిత పథకాల్లో ఎక్కువ కేటాయింపులు ఉండేలా చూడాలని అన్నారు. రాష్ట్రంలో మిషన్ భగీరథ, మిషన్ కాకతీయ, షాదీ ముబారక్, కల్యాణ లక్ష్మి వంటి పథకాలను అమలు చేస్తున్నామని వివరించారు. కాళేశ్వరం వంటి భారీ ప్రాజెక్టులు చేపడుతున్నామని, వీటికి కేంద్ర సహాయం అవసరం ఉందని తెలిపారు. కమిషనర్ అండ్ డైరెక్టర్ ఆఫ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ (సీడీఎంఏ) అధికారులతో కూడా ఆర్థిక సంఘం భేటీ అయింది. స్థానిక సంస్థలకు కేటాయించే నిధులపై సూచనలు, సలహాలను నిర్ణీత ఫార్మాట్‌లో పంపాలని సూచించింది.

## ఆరోగ్యంలో రాష్ట్రానికి 11వ స్థానం

హైదరాబాద్, న్యూఢిల్లీ, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): ప్రజారోగ్యం, వైద్యసేవల విషయంలో తెలుగు రాష్ట్రాలు చాలా వెనుకబడి ఉన్నాయి. ఈ విషయంలో కేరళ దేశంలోనే అగ్రస్థానంలో నిలిచింది. నవజాత శిశువుల మరణాలు, ఐదేళ్లలోపు పిల్లల మరణాల రేటు, వ్యాక్సినేషన్, ఆస్పత్రిలో ప్రసవాల విషయంలో మిగతా రాష్ట్రాలతో పోల్చితే కేరళ ఎంతో ప్రగతిపథంలో ఉన్నట్లు నీతి ఆయోగ్ తేల్చింది. 'దేశ ప్రగతి, ఆరోగ్యకర రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలకు ర్యాంకింగ్' అనే అంశంపై ఆరోగ్య సూచికను నీతి ఆయోగ్ విడుదల చేసింది. ఈ జాబితాలో ఉత్తరప్రదేశ్ చివరి స్థానంలో ఉంది. 21 పెద్దరాష్ట్రాల విభాగంలో కేరళ, పంజాబ్, తమిళనాడు, గుజరాత్, హిమాచల్ ప్రదేశ్ తొలి ఐదు స్థానాల్లో నిలిచాయి. ఎనిమిది చిన్న రాష్ట్రాలలో మిజోరం, మణిపూర్, మేఘాలయ, సిక్కిం, గోవా తొలి ఐదు స్థానాల్లో ఉన్నాయి. ర్యాంకుల్లో అట్టడుగు స్థానాల్లో ఉత్తరప్రదేశ్, రాజస్థాన్, బిహార్, ఒడిషా, మధ్యప్రదేశ్ రాష్ట్రాలున్నాయి. గత ఆరోగ్య సూచికలో 10వ స్థానంలో ఉన్న తెలంగాణ 11వ ర్యాంకుకు పడిపోగా, ఆంధ్రప్రదేశ్ 9 నుంచి 8కి చేరుకుంది. ఈ వివరాలను నీతి ఆయోగ్ సీఈవో అమితాబ్ కాంత్ వెల్లడించారు. కాగా, కొత్తగా ఏర్పడిన తెలంగాణ మొత్తం 30 ఇండికేటర్లలో పదింట మెరుగుపడిందని, ఒక ఇండికేటర్‌లో బాగా మెరుగుపడిందని నివేదిక తెలిపింది. నవజాత శిశు మరణాల విషయంలో తెలంగాణ 11వ స్థానంలో ఉంది. తక్కువ బరువుతో పుట్టే శిశువుల సమస్య అతి తక్కువగా ఉండి, ఈ ఇండికేటర్‌లో తెలంగాణ దేశంలోనే మొదటి స్థానంలో నిలిచింది. వెయ్యికి ఆరు నుంచి ఐదుగురికి తగ్గింది. లింగ నిష్పత్తిలో తెలంగాణ దేశంలో 9వ స్థానంలో నిలిచింది. పిల్లల టీకాల విషయంలో తెలంగాణకు 12వ స్థానం దక్కింది. ఆస్పత్రుల్లో ప్రసవాల విషయంలో తెలంగాణ అద్భుతమైన ప్రగతిని సాధించింది. 2014-15లో 59 శాతం ఉంటే అది 2015-16కు ఏకంగా 85 శాతానికి చేరి, దేశంలో నాలుగో స్థానంలో నిలిచింది. టీబీ పెరుగుదలలో దేశంలో 15వ స్థానంలో తెలంగాణ నిలిచింది. ఎయిడ్స్ బాధితుల్లో చికిత్స తీసుకుంటున్న వారి సంఖ్య రాష్ట్రంలో పెరిగింది. 2014-15లో దాదాపు 18 నెలల పాటు దేశంలోని అన్ని రాష్ట్రాల్లో అధ్యయనం చేసి నీతిఆయోగ్ ర్యాంకులను ప్రకటించింది. ప్రజల జీవితకాలం పెరిగిందని, మాతా శిశు మరణాలు తగ్గాయని అధ్యయనంలో తేలింది.

**తెలంగాణ ఆరోగ్య స్వరూపం**

| విషయం | ర్యాంకు |
|---|---|
| శిశువుల బరువు | 1 |
| ఆస్పత్రి ప్రసవాలు | 4 |
| నవజాత శిశు మరణాలు | 11 |
| 5 ఏళ్లలోపు మరణాలు | 9 |
| లింగ నిష్పత్తి | 9 |
| వైద్య సిబ్బంది కొరత | 11 |
| ఇమ్యునైజేషన్ | 12 |
| టీబీ కేసులు | 15 |
| 24 గంటల వైద్యం | 16 |



## మయూరంపై మల్లన్న విహారం

శ్రీశైలం, ఫిబ్రవరి 9: శ్రీశైలంలో జరుగుతున్న మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం మల్లికార్జునుడు మయూర వాహనంపై ఊరేగాడు. తొలుత ఉత్సవమూర్తులను సుగంధ పుష్పాలతో ముస్తాబైన మయూర వాహనంపై అధిష్ఠింపజేశారు. అనంతరం క్షేత్ర ప్రధాన వీధుల్లోకి తోడ్కొని వచ్చి గ్రామోత్సవం నిర్వహించారు. తిరుమల తిరుపతి దేవస్థానం తరపున ఈవో ఎ.అనిల్‌కుమార్ సింఘాల్ శుక్రవారం సాయంత్రం భ్రమరాంబ, మల్లికార్జున స్వామికి పట్టువస్త్రాలు సమర్పించారు. రాజగోపురం వద్ద దేవస్థానం ఈవో భరత్‌గుప్తా, ఆలయ అర్చకులు, వేదపండితులు టీటీడీ అధికారులకు స్వాగతం పలికారు.

# దక్షిణాదిని ముంచేస్తారా?

(మొదటిపేజీ తరువాయి...)

వెనుకబడిన రాష్ట్రాలు కూడా అభివృద్ధి చెందాలి కదా! వాటికి నిధులు ఇవ్వకుంటే ఎలా? అభివృద్ధి చెందిన మీకు నిధులు ఎందుకు?" అనేలా ఆర్థిక సంఘం ప్రతినిధులు ఈ భేటీలో దక్షిణాది రాష్ట్రాల అధికారులను ప్రశ్నించారు. 2011 జనాభా లెక్కల ప్రాతిపదికన కేంద్ర నిధుల కేటాయింపుల ప్రస్తావన తెచ్చారు. దీనిపై దక్షిణాది అధికారులు మండిపడ్డారు. " వెనుకబడిన రాష్ట్రాలను ఆదుకోండి. వాటినీ అభివృద్ధి చేయండి. కానీ... దా ని పేరిట దక్షిణాదిలోని ప్రగతిశీల రాష్ట్రాలను శిక్షిస్తారా? మా ప్రాధాన్యాలకు కోతపెట్టి మాకు నష్టం కలిగిస్తారా? క్రమశిక్షణతో ఉండడమే నేరమా? అలా ఉన్నందుకు ప్రోత్సహించడం మాని శిక్షిస్తారా?" అని ఒక రాష్ట్రానికి చెందిన అధికారి తీవ్ర స్వరంతో ప్రశ్నించారు.

### ఉత్తరాది పెంపు.. దక్షిణాదికి ముప్పు..

13వ ఆర్థిక సంఘం వరకు కేంద్రం నిధులను 1971 జనాభా లెక్కలను పరిగణనలోకి తీసుకుని రాష్ట్రాలకు కేటాయిస్తూ వచ్చారు. దీనిని మార్చి... 2011 జనాభాను పరిగణలోకి తీసుకుంటామని 14వ ఆర్థిక సంఘం ప్రతిపాదించగా, దక్షిణాది రాష్ట్రాలు ససేమిరా అన్నాయి. దీనివల్ల తమకు అన్యాయం జరుగుతుందని తెలిపాయి. దీంతో అప్పుడు ఈ ప్రతిపాదనపై వెనక్కి తగ్గారు. పన్నుల్లో 42 శాతం రాష్ట్రాలకు ఇచ్చేలా కొత్త ఫార్ములా తీసుకొచ్చారు. తాజాగా... 15వ ఆర్థిక సంఘం సభ్యులు మరోమారు జనాభా లెక్కల ప్రతిపాదన తీసుకొచ్చారు. దీనిపై దక్షిణాది రాష్ట్రాల అధికారులు తీవ్ర స్థాయిలో అభ్యంతరం వ్యక్తం చేశారు. 1971 వరకు దేశంలో కుటుంబ నియంత్రణపై అవగాహన లేదు. ఆ తర్వాత ఇద్దరు ముద్దు, ముగ్గురు హద్దు, మేమిద్దరం మాకిద్దరు అంటూ కుటుంబ నియంత్రణను ప్రోత్సహించారు. దక్షిణాది రాష్ట్రాలు ఈ విషయంలో ముందున్నాయి. ఒకరు లేదా ఇద్దరు పిల్లలకే పరిమితం కావడంతో జనాభా పెరుగుదల రేటు బాగా తగ్గింది. ఉత్తరాది జనాభా మాత్రం ఇబ్బడి ముబ్బడిగా పెరుగుతూనే ఉంది. దీంతో... 1971 జనాభా లెక్కల ప్రాతిపదికనే కేంద్ర నిధులను కేటాయిస్తూ వచ్చారు. ఇప్పుడు... 2011 జనాభాను పరిగణలోకి తీసుకుంటే దక్షిణాది రాష్ట్రాలు మునిగిపోవడం ఖాయమని శుక్రవారం నాటి సమావేశంలో తేల్చి చెప్పారు. "మేం ఆర్థిక క్రమశిక్షణ పాటిస్తున్నాం. కేంద్రం విధించిన నిబంధనల మేరకు, ఆ ప్రాతిపదికల ఆధారంగా పని చేస్తున్నాం. జనాభాను నియంత్రిస్తున్నాం. అక్షరాస్యతను పెంపొందిస్తున్నాం. అన్ని జాగ్రత్తలు తీసుకుంటూ ఒక పద్ధతి ప్రకారం వెళ్తుంటే మమ్మల్ని శిక్షించడమేమిటి? క్రమశిక్షణ లేని రాష్ట్రాలను ప్రోత్సహించడమేమిటి?" అని నిలదీసినట్లు తెలిసింది. 'అది జాతీయ విధానం' అని ఆర్థిక సంఘం పేర్కొనగా.. జాతీయ విధానమంటే అన్ని రాష్ట్రాలకూ సమన్యాయం చేయాలిగానీ దక్షిణాది రాష్ట్రాల పొట్టగొట్టకూడదని, ఈ పద్ధతి పనికిరాదు అని కుండబద్దలు కొట్టినట్టు చెప్పారు. ఇంత గట్టిగా చెప్పినా.. 15వ ఆర్థిక సంఘం అధికారులు మాత్రం తమ పట్టు వీడలేదు. 'ఇది జాతీయ విధానం. మేమిచ్చిన ఫార్మాట్‌లో మాత్రమే వివరాలను పంపాలి. అప్పుడే మాకు సులువవుతుంది' అని స్పష్టం చేసింది.

### తెలంగాణకు నష్టం..

తెలంగాణ లాంటి కొత్త రాష్ట్రాలకు ఎక్కువ నిధుల అవసరం ఉన్నదని.. తమకు ఎక్కువ కేటాయింపులు ఉండేలా చూడాలని ఆర్థిక మంత్రి ఈటల రాజేందర్ ఆర్థిక సంఘానికి విజ్ఞప్తి చేశారు. మిషన్ భగీరథ, మిషన్ కాకతీయ, షాదీ ముబారక్ వంటి ప్రతిష్ఠాత్మక పథకాలను, భారీ నీటి పారుదల ప్రాజెక్టులను చేపట్టిన తెలంగాణకు బడ్జెట్ కేటాయింపుల విషయంలో నష్టం జరిగిందని గుర్తుచేశారు. ప్రగతిశీల రాష్ట్రాల విషయంలో ఆర్థిక సంఘం తగిన సిఫారసులు చేయాలని కోరారు. 14వ ఆర్థిక సంఘం తప్పుడు అంచనాల వల్ల ఆంధ్రప్రదేశ్‌కు జరిగిన నష్టం గురించి ఆ రాష్ట్ర ఆర్థిక కార్యదర్శి రవిచంద్ర 15వ ఆర్థిక సంఘం సభ్యులకు వివరించారు. "పన్నుల్లో వాటా కింద ఈ ఆర్థిక సంవత్సరం రూ.58 వేల కోట్లు వస్తాయన్నారు. కానీ... 44వేల కోట్లే వచ్చాయి. వచ్చే ఆర్థిక సంవత్సరం రూ.68 వేల కోట్లు వస్తాయంటున్నారు. ఈ తప్పుడు లెక్కల వల్ల మాకు రెవెన్యూలోటు భర్తీలో అన్యాయం జరిగింది. 14వ ఆర్థిక సంఘం లెక్కలు పక్కాగా ఉండి ఉంటే... ఈ ఆర్థిక సంవత్సరంలో రూ.20 వేలకోట్లు రెవెన్యూలోటు కింద వచ్చేది" అని తెలిపారు. దక్షిణాదిన ఉన్న అన్ని రాష్ట్రాల్లోకెల్లా తలసరి ఆదాయం తక్కువగా ఉన్నది ఏపీకేనని చెప్పారు. అయితే రాష్ట్ర వృద్ధి 14% కాగా.. వ్యవసాయ రంగం వృద్ధి 25 శాతమని చెప్పారు. కాబట్టి, వృద్ధిరేటు రెండంకెల్లో ఉన్నా ఖజానాకు తక్షణమే వచ్చే నిధులేవీ లేవని వివరించారు. 14వ ఆర్థిక సంఘం పొరపాటు అంచనాల వల్ల తమకు వాటిల్లిన నష్టాలను దృష్టిలో పెట్టుకుని తమకు సమంజసమైన కేటాయింపులు జరపాలని రవిచంద్ర కోరారు.

## లోకం తీరు



సారు ఎందుకు పీఎం కాలేకపోయారో నాకు ఇప్పుడు అర్థమైంది!!

**ఉష్ణోగ్రతలు**

| కేంద్రం | కనిష్ఠం | గరిష్ఠం |
|---|---|---|
| ఆదిలాబాద్ | 11.0 | 33.1 |
| రామగుండం | 18.0 | 32.0 |
| హైదరాబాద్ | 18.3 | 32.4 |
| నల్లగొండ | 19.2 | 31.6 |
| వరంగల్ | 20.5 | 32.0 |

### సర్వదర్శనానికి 10 గంటలు

తిరుమలలో శుక్రవారం భక్తుల రద్దీ ఎక్కువగా ఉంది. దాదాపు 65 వేల మంది శ్రీవారిని దర్శించుకున్నారు. సర్వదర్శనానికి 10 గంటలు, దివ్యదర్శనానికి సుమారు 2 గంటల సమయం పడుతోంది. ఆదివారం సేవలకు సంబంధించి విజయాబ్యాంకులో శనివారం లాటరీ ద్వారా జారీచేసే టికెట్లు కల్యాణోత్సవం:80, డోలోత్సవం:25. ఆన్‌లైన్‌లో రూ.300 టికెట్లు పొందడానికి www. ttdsevaonline.com లో సంప్రదించాలి. - ఆంధ్రజ్యోతి, తిరుమల



### నేరగాళ్లకు తుపాకీతోనే బదులివ్వండి

ప్రతి ఒక్కరికి భద్రత కల్పించాలి. తుపాకులతో శాంతికి భగ్నం కలిగించేవారిని ఉపేక్షించేది లేదు. అలాంటి వారికి తూటాతోనే బదులివ్వాలి. ఈ విషయంలో అధికారులకు ఎలాంటి సంకోచం అక్కర్లేదు.

- ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్



### ఓటేసింది మందిరం కోసం ట్రిపుల్ తలాక్ కోసం కాదు

ప్రజలు మిమ్మల్ని (ఎన్డీయే) గెలిపించింది రామ మందిర నిర్మాణం కోసం. ట్రిపుల్ తలాక్‌పై చట్టాలు చేయడానికి కాదు. రామ మందిర నిర్మాణానికి వెంటనే మార్గం సుగమం చేయాలి.

- వీహెచ్‌పీ అంతర్జాతీయ అధ్యక్షుడు తొగాడియా

**నేటి పెట్రో ధరలు (లీ.)**

| పెట్రోల్ | డీజిల్ |
|---|---|
| పాత ధర రూ.77.71 | పాత ధర 69.77 |
| కొత్త ధర రూ.77.70 | కొత్త ధర 69.70 |
| తగ్గుదల : 1 పైసా | తగ్గుదల: 7 పైసలు |



### మద్యం మత్తుకు కొత్త మందు

మెల్‌బోర్న్, ఫిబ్రవరి 9: అమితంగా మద్యం సేవిస్తే మత్తు ఆవహించి మెదడు మొద్దు బారుతుంది. కొందరైతే విచక్షణ కోల్పోయి ప్రవర్తిస్తుంటారు. ఆ సమస్య నుంచి బయటపడేసే కొత్త మందును శాస్త్రవేత్తలు గుర్తించారు. 'టాండోస్పైరాన్' అనే ఔషధాన్ని రెండు వారాల పాటు రోజూ తీసుకోవడం వల్ల మెదడు ఉత్తేజితమై, మద్యం వల్ల పాడైన నాడులు తిరిగి పనిచేస్తాయని ఆస్ట్రేలియాలోని క్వీన్స్‌లాండ్ వర్సిటీ పరిశోధకులు తెలిపారు. నాడీ జీవకణాలు ఉత్పత్తి చేసే న్యూరోజెనెసిస్‌పై మద్యం వల్ల కలిగే చెడు ప్రభావాన్ని ఈ మందు తగ్గిస్తుందని వెల్లడించారు.

### బాల్ గేమ్స్ ఎముకలకు భేష్

లండన్, ఫిబ్రవరి 9: మీ పిల్లలు ప్రతి రోజు వ్యాయామం చేస్తున్నారా? చేయకుంటే కనీసం వారానికి రెండు గంటలపాటు బాల్‌గేమ్స్ ఆడించండి. దీని వల్ల పిల్లల్లో ఎముకలు బలంగా తయారవుతాయని పరిశోధనలో తేలింది. 8 నుంచి 10ఏళ్ల వయసున్న పిల్లలు సాధారణ వ్యాయామంతో పోలిస్తే వారంలో 2 గంటలపాటు ఫుట్‌బాల్, టెన్నిస్, బేస్‌బాల్, క్రికెట్ వంటి ఆటలు ఆడితే భవిష్యత్‌లో ఆస్టియోపోరోసిస్ రాకుండా ఉంటుందని పరిశోధకులు చెబుతున్నారు. డెన్మార్క్‌లోని 270 మంది విద్యార్థులపై ఏడాది పాటు పరిశోధన జరిపి ఈ విషయాన్ని వెల్లడించారు.

## సరుకు రవాణాకు నేటి నుంచి ఈ-వే బిల్లులు

▸ స్టేట్ ట్యాక్స్ కమిషనర్ అనిల్ కుమార్

హైదరాబాద్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలోని ఒక జిల్లా నుంచి మరో జిల్లాకు సరుకులను రవాణా చేసుకోవడానికి 'ఈ-వేబిల్లుల'ను నేటి నుంచి పొందాలని రాష్ట్ర ట్యాక్స్ కమిషనర్ అనిల్‌కుమార్ తెలిపారు. ఈనెల ఒకటి నుంచే దేశ వ్యాప్తంగా ఈ-వేబిల్లులు అమలులోకి వచ్చాయన్నారు. కానీ 'ఈ-వే బిల్లుల సిస్టం'లో సాంకేతిక లోపాల కారణంగా ఒక రాష్ట్రం నుంచి మరో రాష్ట్రానికి సరుకు రవాణాకు కేవలం ఇన్‌వాయిస్‌లు ఉంటే చాలని తెలిపారు. వే బిల్లులను రాష్ట్ర వెబ్‌సైట్ www.tgct.gov.in/gstway-bill నుంచి పొందాలని ఆయన సూచించారు.

## పీహెచ్‌డీ పరీక్షలకు న్యాక్ గుర్తింపు తప్పనిసరి

హైదరాబాద్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి) : పీహెచ్‌డీ ప్రవేశపరీక్షల నిర్వహణపై యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యూజీసీ) నూతన నిబంధనలను వెల్లడించింది. న్యాక్ ఏ, ఏ ప్లస్ గుర్తింపు ఉన్న యూనివర్సిటీలు మాత్రమే పీహెచ్‌డీ ప్రవేశపరీక్షలు నిర్వహించేందుకు యూజీసీ అవకాశం ఇచ్చింది. గుర్తింపు లేని వర్సిటీలు ఇతర వర్సిటీల్లో నిర్వహించే ప్రవేశ పరీక్షల ద్వారా పీహెచ్‌డీ అడ్మిషన్లను తీసుకోవచ్చు.

## 'టీజీటీ' వదలినట్లు ఆప్షన్: టీఎస్‌పీఎస్సీ

హైదరాబాద్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): గురుకుల పోస్టుగ్రాడ్యుయేట్ టీచర్ పోస్టుకు ఎంపికైన వారు టీజీటీ పోస్టు వదులుకుంటున్నట్లు ఆప్షన్ ఇవ్వాలని టీఎస్‌పీఎస్సీ సెక్రటరీ వాణిప్రసాద్ కోరారు. ఈ మేరకు శుక్రవారం ఆమె ఓ ప్రకటన విడుదల చేశారు. అంగీకారాన్ని ఆన్‌లైన్‌లో 14 లోగా తెలపాలని సూచించారు.

## కళాశాల విద్యాశాఖకు డిగ్రీ అడ్మిషన్ల బాధ్యత

హైదరాబాద్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి) : డిగ్రీ ప్రవేశాల ప్రక్రియను కళాశాల విద్యాశాఖకు అప్పగిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. రెండేళ్ల నుంచి డిగ్రీ ప్రవేశాలను ఆన్‌లైన్ ద్వారా నిర్వహిస్తున్నారు. మొదటి యేడాది కళాశాల విద్యాశాఖ నిర్వహించగా గతేడాది ఉన్నత విద్యామండలి నిర్వహించింది.

## ఘనంగా పీఆర్‌టీయూ ఆవిర్భావ దినోత్సవం

హైదరాబాద్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి) : పీఆర్‌టీయూ టీఎస్ 48వ ఆవిర్భావ దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించింది. ఈ సందర్భంగా సంఘం కార్యాలయంలో సంఘం జెండాను అధ్యక్షుడు సరోత్తంరెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీపీఎస్ పెన్షన్ విధానం రద్దు కోసం ఈ నెల 22న ధర్నాను నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీలు జనార్దన్‌రెడ్డి, పూల రవీందర్ పాల్గొన్నారు.

## డిగ్రీ అడ్మిషన్లను త్వరగా నిర్వహించాలి

▸ టీఎస్‌సీహెచ్‌ఈకి డిగ్రీ అధ్యాపకుల వినతి

హైదరాబాద్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి) : డిగ్రీ అడ్మిషన్ల ప్రక్రియను దోస్త్ ప్రక్రియ ద్వారా అడ్మిషన్ల ప్రక్రియను పూర్తి చేయాలని గురువారం తెలంగాణ ఉన్నత విద్యామండలి చైర్మన్ పాపిరెడ్డిని ప్రభుత్వ డిగ్రీ లెక్చరర్లు కోరారు. ఈ సందర్భంగా ప్రభుత్వ కళాశాలల గెజిటెడ్ అధ్యాపక సంఘం డైరీని ఆవిష్కరించారు. అధ్యక్షుడుసంజీవయ్య, ప్రధానకార్యదర్శి సురేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

## వేతన పెంపు జీవో ఇవ్వకుంటే ఉద్యమమే

▸ కాంట్రాక్టు లెక్చరర్ల హెచ్చరిక

హైదరాబాద్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి) : యూనివర్సిటీ కాంట్రాక్టు లెక్చరర్ల వేతనం పెంపు ఉత్తర్వులను ఈ నెల 15వ తేదీలోగా జారీ చేయాలని, లేదంటే ఉద్యమం తప్పదని కాంట్రాక్టు లెక్చరర్ల సంఘం ప్రభుత్వాన్ని హెచ్చరించింది. ఈ మేరకు గురువారం ఉన్నత విద్యామండలి చైర్మన్ పాపిరెడ్డికి వినతిపత్రం అందజేశారు. సంఘం అధ్యక్షుడు రామేశ్వరరావు మాట్లాడుతూ.. ప్రభుత్వం స్పందించకపోతే నిరవధిక సమ్మె చేస్తామని హెచ్చరించారు.

## 33 మంది డిప్యూటీ కలెక్టర్లకు పదోన్నతి

హైదరాబాద్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణలో పనిచేస్తున్న 33 మంది డిప్యూటీ కలెక్టర్లకు స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్లుగా పదోన్నతి కల్పిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు శుక్రవారం సీఎం కేసీఆర్ పదోన్నతుల ఫైలుపై సంతకాలు చేశారు. అభియోగాలు నమోదైన ఏడుగురు డిప్యూటీ కలెక్టర్లకు పదోన్నతులు నిరాకరించినట్లు తెలుస్తోంది.

## 'ఎంప్లాయ్‌మెంట్' పునరుద్ధరణకు అవకాశం

హైదరాబాద్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి) : ఎంప్లాయ్‌మెంట్ కార్డుల పునరుద్ధరణకు జూన్ 30 వరకు ప్రభుత్వం వెసులుబాటు కల్పించింది. ఈ మేరకు శుక్రవారం ఉత్తర్వులు జారీ అయ్యాయి. తాజా ఉత్తర్వులతో కార్డులను రెన్యువల్ చేయించుకోలేకపోయిన లక్షలాది మంది నిరుద్యోగులకు తగిన అవకాశం కల్పించినట్లైందని అధికారులు పేర్కొంటున్నారు.

## విద్యుత్తు కొనుగోలు వివరాలు ఇవ్వండి: పీఏసీ

హైదరాబాద్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో విద్యుత్తు కొనుగోలుకు సంబంధించిన పూర్తి వివరాలను సమర్పించాల్సిందిగా ప్రజా పద్దుల కమిటీ (పీఏసీ) అధికారులను ఆదేశించింది. వీటితో పాటు నిర్మాణంలో ఉన్న విద్యుత్తు ఉత్పత్తి ప్రాజెక్టులకు సంబంధించిన వివరాలను కూడా సమర్పించాల్సిందిగా సూచించింది. గీతారెడ్డి అధ్యక్షతన పీఏసీ సమావేశంలో శుక్రవారం జరిగింది. రాష్ట్రంలో విద్యుత్తు కొనుగోలుకు సంబంధించి కుదుర్చుకున్న పీపీఏలపై అధికారులు పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ఇచ్చారు.

# వచ్చే జనవరిలో గజ్వేల్‌కు రైలు

## యుద్ధ ప్రాతిపదికన పనులు పూర్తికావాలి.. రైల్వే అధికారులతో సమీక్షలో మంత్రి హరీశ్

▸ వర్షం కోసం మొగులుకేసి చూసే రోజులుండవు

▸ గజ్వేల్‌లో ప్రతి చెరువుకూ గోదావరి నీరు: హరీశ్


రైల్వే పనులపై దక్షిణమధ్య రైల్వే జీఎంతో సమీక్షిస్తున్న మంత్రి హరీశ్‌రావు

హైదరాబాద్/గజ్వేల్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): వచ్చే ఏడాది జనవరిలోగా గజ్వేల్‌కు రైలు నడవాలని మంత్రి హరీశ్‌రావు అన్నారు. ఇందుకోసం మనోహరాబాద్- కొత్తపల్లి రైల్వే లైన్ పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని రైల్వే అధికారులను కోరారు. రైల్వే లైన్, రైల్వే స్టేషన్ల నిర్మాణం, ఇతర పనుల పురోగతిపై శుక్రవారం మినిస్టర్స్ క్వార్టర్స్‌లోని తన బంగళాలో మంత్రి సమీక్షించారు. ఈ మార్గంలో పెండింగ్‌లో ఉన్న భూసేకరణ ప్రక్రియను త్వరగా పూర్తి చేయాలన్నారు. తూప్రాన్ మండలం పరికిబండ రిజర్వ్ ఫారెస్ట్ పరిధిలో ఉన్న భూముల సేకరణకు అడ్డంకులు తొలగిపోయాయని, మెదక్-అక్కన్నపేట మార్గంలో భూసేకరణను పూర్తి చేయాలని అన్నారు. సీఎం కేసీఆర్ అంచనా కన్నా నెమ్మదిగా రైల్వే పనులు సాగుతున్నట్లు మంత్రి అభిప్రాయపడ్డారు. సిద్దిపేట జిల్లా కేంద్రంతోపాటు గజ్వేల్ పట్టణం వేగంగా అభివృద్ధి చెందుతున్నందున.. రైల్వే లైన్ పనులు వేగం పుంజుకోవాలని సూచించారు. సిద్దిపేట, గజ్వేల్ రైల్వే స్టేషన్ భవనాలను అత్యాధునికంగా నిర్మించాలని కోరారు. కాగా మనోహరాబాద్-కొత్తపల్లి రైలు మార్గానికి సంబంధించి భూసేకరణ దాదాపు పూర్తి కావచ్చిందని దక్షిణమధ్య రైల్వే జనరల్ మేనేజర్ వినోద్‌కుమార్ యాదవ్ తెలిపారు. సమావేశంలో సిద్దిపేట జిల్లా కలెక్టర్ వెంకట్రామరెడ్డి, రైల్వే సీఈ, ఇతర అధికారులు పాల్గొన్నారు. కాగా, గజ్వేల్ మండలంలోని ప్రజ్ఞాపూర్ ఊర చెరువును మినీ ట్యాంక్‌బండ్‌గా మార్చే పనులకు మెదక్ ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డితో కలిసి మంత్రి హాశంకుస్థాపన చేశారు. అనంతరం మాట్లాడుతూ.. గజ్వేల్ నియోజకవర్గంలోని 2లక్షల ఎకరాలకు సాగునీరు అందించేందుకు కృషి చేస్తున్నామని, మిషన్ కాకతీయలో భాగంగా ఇప్పటికే చెరువులన్నీ మరమ్మత్తులు చేశామని తెలిపారు. గజ్వేల్‌ను అంతర్గత రోడ్లు, ఇంటింటికీ కుళాయి నీటితో అద్దంలా మారుస్తామన్నారు.

## సుబాబుల్ రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలి: టీడీపీ-టీఎస్

రాష్ట్రంలోని సుబాబుల్, జామాయిల్ రైతులు గిట్టుబాటు ధర లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, టన్నుకు రూ.5500 ధర కల్పించేలా చర్యలు తీసుకోవాలని టీడీపీటీఎస్ నేతలు మంత్రి హరీశ్‌రావును కోరారు. ఈ మేరకు ఆ పార్టీ ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య, రావుల చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు శుక్రవారం మినిస్టర్స్ క్వార్టర్స్‌లో మంత్రిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఒక్క ఖమ్మం, కొత్తగూడెం జిల్లాలోనే దాదాపు 2.50 లక్షల ఎకరాల్లో సుబాబుల్, జామాయిల్ సాగవుతోందని మంత్రి దృష్టికి తెచ్చారు. బీపీఎల్ కంపెనీతో మాట్లాడి రైతాంగానికి గిట్టుబాటు ధర వచ్చేలా చూడాలని వారు కోరారు.


ఢిల్లీలో కేంద్ర మంత్రి జేపీ నడ్డాను కలిసిన మంత్రి లక్ష్మారెడ్డి

## ఎయిమ్స్‌కు నిధులివ్వండి

▸ కేంద్ర మంత్రులకు రాష్ట్ర మంత్రి లక్ష్మారెడ్డి వినతి

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): తెలంగాణకు ప్రకటించిన ఎయిమ్స్‌కు ఈ బడ్జెట్‌లో నిధులు కేటాయించాలని కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీని, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి జేపీ నడ్డాను రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రి సి.లక్ష్మారెడ్డి కోరారు. శుక్రవారం ఢిల్లీలో పార్లమెంటులోని మంత్రుల కార్యాలయాల్లో వారితో సమావేశమయ్యారు. తెలంగాణకు ఎయిమ్స్‌ను గత బడ్జెట్‌లో ప్రకటించారని, దాని నిర్మాణానికి నిధులు ఇవ్వాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ఎయిమ్స్‌కు కావాల్సిన స్థలం, సదుపాయాల కల్పనకు సుముఖంగా ఉన్నామని చెప్పారు. దీనిపై కేంద్ర మంత్రులు సానుకూలంగా స్పందించినట్లు మంత్రి తెలిపారు. ఆయన వెంట ఎంపీలు జితేందర్‌రెడ్డి, నగేశ్, సీతారాంనాయక్, కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, వేణుగోపాలచారి తదితరులు ఉన్నారు.

## 'మిలియన్ థ్యాంక్స్'

▸ ట్విటర్ ఫాలోవర్లకు కేటీఆర్ కృతజ్ఞతలు

▸ ఐటీ కాంగ్రెస్ సదస్సుకు రావాలని రాష్ట్రపతికి ఆహ్వానం




హైదరాబాద్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): సామాజిక అనుసంధాన వేదిక ట్విటర్‌లో ఒక మిలియన్ ఫాలోవర్లు కలిగిన రాజకీయ నేతల్లో మంత్రి కేటీఆర్ చేరిపోయారు. ఆయనను అనుసరించే వారి సంఖ్య శుక్రవారం ఒక మిలియన్‌కు చేరింది. ఈ సందర్భంగా 'మిలియన్ థ్యాంక్స్' అంటూ తనను అనుసరించేవారికి కేటీఆర్ ట్విటర్ ద్వారా ధన్యవాదాలు తెలిపారు. ఎక్సైజ్ శాఖ మంత్రి పద్మారావు, జీహెచ్‌ఎంసీ మేయర్ బొంతు రామ్మోహన్ పలువురు ప్రముఖులు కేటీఆర్‌కు అభినందనలు తెలిపారు. మరోవైపు, హైదరాబాద్‌లో జరగనున్న ఈ నెల 19 నుంచి 21 వరకు జరిగే వరల్డ్ ఐటీ కాంగ్రెస్ సదస్సుకు హాజరు కావాలని రాష్ట్రపతి రాంనాథ్‌కోవింద్‌ను కేటీఆర్ ఆహ్వానించారు.

# ఏప్రిల్ 1 నుంచి 'పెట్టుబడి' చెక్కులు


▸ అగ్రిటెక్ సదస్సులో మంత్రి పోచారం


జయశంకర్ వ్యవసాయ వర్సిటీలో జరిగిన అగ్రిటెక్ సదస్సులో స్టాల్‌ను సందర్శిస్తున్న మంత్రి పోచారం

హైదరాబాద్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): రైతులకు పంట పెట్టుబడి సాయం చెక్కుల పంపిణీ ఏప్రిల్ 1 నుంచి మే 15 వరకు 45 రోజులపాటు జరగనున్నట్లు వ్యవసాయశాఖ మంత్రి పోచారం శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. రాష్ట్ర రైతు సమన్వయ సమితి మరో వారం రోజుల్లో ఏర్పాటు కానున్నట్లు పేర్కొన్నారు. శుక్రవారం జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయ ప్రాంగణంలో ప్రారంభమైన అగ్రిటెక్ సౌత్-2018 సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. వచ్చే ఏడాది నుంచి మార్కెట్లో పంటలకు మద్దతు ధరల కన్నా తక్కువ ధర పలికితే.. రైతు సమన్వయ సమితులే మద్దతు ధరకు పంటలను కొనుగోలు చేస్తాయన్నారు. రాష్ట్ర రైతు సమన్వయ సమితి నుంచి ఆయా రైతుల బ్యాంకు ఖాతాలకు నేరుగా చెల్లింపులు జరుగుతాయని చెప్పారు. పంటల సేకరణ కోసం రాష్ట్ర రైతు సమన్వయ సమితికి రూ.6 వేల కోట్ల నుంచి రూ.7 వేల కోట్ల వరకు బ్యాంకు రుణం తీసుకునేందుకు ప్రభుత్వం హామీగా ఉంటుందని మంత్రి పేర్కొన్నారు. రైతులకు ప్రభుత్వాలుగా చేయాల్సిన వాటిలో 24 గంటలపాటు ఉచితంగా కరెంటు ఇవ్వడం ఒకటన్నారు. మహబూబ్‌నగర్ జిల్లా రైతు ఒకరు.. ప్రభుత్వం 24 గంటల కరెంటు ఇవ్వడం వల్లనే తన పదెకరాల భూమిలోనూ వరిని సాగు చేసుకోగలుగుతున్నట్లు చెప్పారని, అంతకుముందు ఏడెకరాల్లోనే వరి వేసేవాడినని తెలిపారని పేర్కొన్నారు. శుక్రవారం 'ఆంధ్రజ్యోతి'లో ఇది ప్రచురితమైన విషయాన్ని గుర్తు చేశారు. రానున్న రోజుల్లో వ్యవసాయ యాంత్రీకరణను పెద్ద ఎత్తున ప్రోత్సహించనున్నట్లు సీఎం కేసీఆర్ చెప్పారని, నాట్లు వేయడం నుంచి హార్వెస్టింగ్ వరకూ యంత్రాల ద్వారానే జరగాలన్నారని మంత్రి వెల్లడించారు. నియోజకవర్గానికి ఒక ఆగ్రో ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటుకు మంత్రివర్గ ఉపసంఘం ఏర్పాటైన విషయాన్నీ పోచారం గుర్తు చేశారు. కాగా జయశంకర్ వర్సిటీ ఏర్పడిన రెండేళ్లలో 13 వంగడాలను విడుదల చేసినట్లు వర్సిటీ వీసీ ప్రవీణ్‌రావు తెలిపారు. సదస్సు ప్రారంభ కార్యక్రమంలో సీఐఐ నేషనల్ వాటర్ కమిటీ చైర్మన్ రమేష్ దాట్ల, అగ్రిటెక్ సౌత్ చైర్మన్ అనిల్‌కుమార్, టాఫే లిమిటెడ్ అధ్యక్షుడు కేశవన్, కోరమాండల్ ఇంటర్నేషనల్ లిమిటెడ్ ఎండీ సమీర్‌గోయల్, సీఐఐ వైస్‌చైర్మన్ సంజయ్‌సింగ్ పాల్గొన్నారు. అనంతరం వర్సిటీ ప్రాంగణంలో ఎగ్జిబిషన్‌ను పోచారం ప్రారంభించారు.

## ఉత్తమ్ వస్తే.. కేటీఆర్ రెడీ !

▸ 'సవాల్'పై ఒప్పందానికి సిద్ధమా?: తలసాని



హైదరాబాద్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి) : రానున్న ఎన్నికల్లో టీఆర్‌ఎస్ తిరిగి అధికారంలోకి రాకపోతే రాజకీయ సన్యాసం తీసుకుంటానన్న మంత్రి కేటీఆర్ సవాల్‌కు ప్రతిసవాల్ విసిరిన టీపీసీసీ చీఫ్ ఉత్తమ్ మీడియా సమక్షంలో ఒప్పందం చేసుకునేందుకు ముందుకు రావాలని మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ డిమాండ్ చేశారు. టీఆర్‌ఎస్ కేంద్ర కార్యాలయం తెలంగాణ భవన్‌లో శుక్రవారం ఆయన మాట్లాడుతూ ఎన్నికలయ్యాక సవాల్‌పై ఉత్తమ్ వెనకడుగు వేసే అవకాశం ఉందని, మీడియా ముందు ఒప్పందం చేసుకుంటే మర్చిపోయామని చెప్పే వీలుండదన్నారు. 'ఉత్తమ్ కుమార్‌రెడ్డి అవుట్ డేటెడ్.. రిటైర్‌మెంట్‌కు దగ్గరగా ఉన్న వ్యక్తి' అని వ్యాఖ్యానించారు. "ఇప్పుడు పెద్దగా మాట్లాడేటోళ్లు జాగ్రత్తగా ఉండాలె. మా దృష్టి అంతా వాళ్లపైనే. వచ్చే ఎన్నికల్లో వాళ్లు ఎట్ల గెలుస్తారో చూస్తాం"అని హెచ్చరించారు. "కేంద్ర నిధులను తెలంగాణ ప్రభుత్వం ఖర్చు చేయటం లేదని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మణ్ వ్యాఖ్యలను తప్పుపడుతూ గ్రేటర్ హైదరాబాద్ ఎన్నికల్లో ఒక్క డివిజన్ గెలవని వాళ్లు కూడా విమర్శించే వాళ్లేనా? అని ఎద్దేవా చేశారు. మంత్రి పదవి ఇవ్వటం వల్లే కేసీఆర్‌ను పొగుడుతున్నారన్న కాంగ్రెస్ విమర్శలను విలేకరులు ప్రస్తావించగా "కాంగ్రెసోళ్లు గొట్టంగాళ్లు..వాళ్లు ఏది పడితే అది మాట్లాడుతుంటరు. వాటిపై మీరు అడగాల్సిన అవసరం లేదు. మేమూ..మేము ఫోన్‌లో మాట్లాడుకుంటాం. వాళ్ల విమర్శలకు ఫోన్‌లోనే జవాబు చెప్తా"అని అన్నారు.

## పెత్తనం మాకే ఇవ్వండి!

▸ కేంద్రానికి కృష్ణ, గోదావరి బోర్డుల నివేదిక..15న కీలక సమావేశం

హైదరాబాద్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి) : ప్రాజెక్టులు, వాటి పరిధిలోని నీటి కేటాయింపులు, నీటి విడుదల వంటి విషయాలపై పూర్తి అధికారం తమకే ఉండాలని కృష్ణ, గోదావరి బోర్డులు కేంద్ర ప్రభుత్వాన్ని కోరాయి. ఈ మేరకు గతంలోనే రూపొందించిన వర్కింగ్ మాన్యువల్స్‌ను ఖరారు చేయాలని నివేదించాయి. బోర్డుల విధి విధానాలకు సంబంధించి శుక్రవారం కేంద్ర జల వనరుల అభివృద్ధి శాఖ కార్యదర్శి ఉపేందర్ సింగ్ ఆధ్వర్యంలో ఉన్నత స్థాయి సమావేశం జరిగింది. ఈ మేరకు ప్రాజెక్టులతో పాటు, నీటి కేటాయింపులు, తీసుకున్న నిర్ణయాలు అమలయ్యేలా నియంత్రణ వ్యవస్థ వంటి అంశాల్లో పూర్తి స్థాయి అధికారాలు కల్పించాలని బోర్డు ప్రతినిధులు కేంద్రం దృష్టికి తీసుకువచ్చినట్టు సమాచారం. అందులో భాగంగా ఇంతకు ముందు రూపొందించిన వర్కింగ్ మాన్యువల్స్ ముసాయిదాను ఆమోదించాలని కోరినట్టు తెలిసింది. అయితే ఈ విషయాలపై రాష్ట్రాలతో చర్చించిన తర్వాత తుది నిర్ణయానికి రావాలన్న ఆలోచనలో కేంద్రం ఉన్నట్లు సమాచారం. అందులోభాగంగా ఈ నెల 15న ఢిల్లీలో కీలక సమావేశం నిర్వహించి రాష్ట్రాల అభిప్రాయాలను తెలుసుకోనుంది. అనంతరం ఈ అంశంపై నిర్ణయానికి రానుంది.

## వన్యప్రాణుల సంరక్షణపై దృష్టి సారించండి

▸ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్‌లో పీసీసీఎఫ్ పీకే ఝా

హైదరాబాద్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి) : అటవీ ప్రాంతాల్లోని వన్యప్రాణుల సంరక్షణపై దృష్టి సారించాలని అటవీ శాఖ అధికారులను ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ (పీసీసీఎఫ్) పీకే ఝా ఆదేశించారు. వేసవి సమీపిస్తున్న తరుణంలో అడవుల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, వణ్యప్రాణులకు నీటివసతి, అగ్ని ప్రమాదాల నివారణపై అటవీ శాఖ అధికారులతో సచివాలయం నుంచి శుక్రవారం ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అడవుల్లో నీటి వనరుల లభ్యతపై ఈ నెల 24 నుంచి 26 వరకు సర్వే చేస్తున్నట్లు తెలిపారు. ఇందు కోసం గత నెలలో పులుల గణనలో పాల్గొన్న వలంటీర్ల సహకారం తీసుకోవాలని సూచించారు. ఫిబ్రవరి, మార్చి నెలల్లో అటవీ ప్రాంతాల్లో ఎక్కువ అగ్ని ప్రమాదాలు సంభవించే అవకాశం ఉందని, ముందే గుర్తించిన 430 ప్రాంతాల్లో అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. ప్రతీ జిల్లాలో కొత్తగా ఒక ఫారెస్ట్ అర్బన్ పార్క్‌ను అభివృద్ధి చేయాలని ఆయన అధికారులకు సూచించారు. వచ్చే హరితహారం కోసం నర్సరీలను సిద్ధం చేయాలన్నారు. ప్రభుత్వం చేపట్టిన ప్రాజెక్టులకు అవసరమైన అటవీ అనుమతులు, తాజా పరిస్థితులపై సమీక్షించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో అటవీ శాఖాధికారులు రఘువీర్, పృథ్వీరాజ్, మునీంద్ర, లోకేష్ జైస్వాల్, డోబ్రియాల్, సునీల్ కుమార్, శోభ, తిరుపతయ్య పాల్గొన్నారు.

# బోదకాలు బాధితులకు పింఛన్లు



(మొదటిపేజీ తరువాయి...)

నివారణే ముఖ్యమన్న మాటను ప్రభుత్వం ఆచరణలో పెట్టదలచుకుందని, ఇందుకు గ్రామం యూనిట్‌గా ప్రజలందరికీ ప్రభుత్వ ఖర్చుతోనే రోగ నిర్ధారణ పరీక్షలు చేయించాలని నిర్ణయించిందని తెలిపారు. వైద్య ఆరోగ్య శాఖపై సీఎం కేసీఆర్ శుక్రవారం ప్రగతి భవన్‌లో సమీక్ష నిర్వహించారు. గ్రామస్థాయిలో వైద్యాధికారులు, సిబ్బంది సేవలను మరింత ప్రభావశీలంగా వినియోగించుకునేందుకు కార్యాచరణ రూపొందించాలని ఆదేశించారు.

### మంత్రి తుమ్మల, ఎంపీ కవిత చొరవతో కదలిక

తాము ప్రాతినిధ్యం వహిస్తున్న ప్రాంతాల్లో బోదకాలు బాధితులు పెద్ద సంఖ్యలో ఉన్నారని, కాలు తీసి కాలు వేయలేని పరిస్థితుల్లో ఉన్నారని, వారిని ఆదుకోవాలని ఇటీవల మంత్రి తుమ్మల, ఎంపీ కవిత ముఖ్యమంత్రికి విన్నవించారు. తన సొంత జిల్లాలో కూడా బోదకాలు బాధితులు ఎక్కువగానే ఉన్నారని, వారిని ఆదుకోవాల్సిన బాధ్యత ఉందని భావించిన సీఎం కేసీఆర్ ప్రగతి భవన్‌లో సమీక్ష నిర్వహించారు. అమెరికా వంటి అభివృద్ధి చెందిన దేశాల్లో ప్రతి ఒక్కరు ఎప్పటికప్పుడు రోగ నిర్ధారణ పరీక్షలు చేయించుకుంటారని, రాష్ట్రంలో కూడా అలాంటి అలవాటు చేయించాలని సీఎం కేసీఆర్ నిర్దేశించారు. "అవగాహన ఉన్నవారు, ఆర్థిక స్తోమత కలిగినవారు పరీక్షలు చేయించుకుంటున్నారు. గ్రామీణ, మారుమూల ప్రాంతాల్లో ఉన్నవారు, ముఖ్యంగా పేదలు రోగమొచ్చినప్పుడు తప్ప ఆస్పత్రులకు వెళ్లరు. వైద్య పరీక్షలు చేయించుకోరు. దాంతో, చాలా వ్యాధులను ప్రాథమిక స్థాయిలో గుర్తించలేకపోతున్నారు. బోధకాలును కూడా ప్రారంభ దశలో గుర్తిస్తే నయం చేయవచ్చు. కానీ, ముదిరేదాకా గుర్తించరు. ఇకపై అలా జరగడానికి వీల్లేదు. ప్రతి గ్రామంలో ప్రతి ఒక్కరికీ ప్రభుత్వమే క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయిస్తుంది. రక్త నమూనాలు సేకరించి, అన్ని రకాల రోగ నిర్ధారణ పరీక్షలు చేయిస్తుంది. వ్యాధిని గుర్తిస్తే వెంటనే ప్రభుత్వపరంగానే చికిత్స చేయించాలి. మందులు అందించాలి. ఎంత ఖర్చు అయినా వెనకాడేది లేదు. పేదల ఆరోగ్యం కాపాడడాన్ని మించిన ప్రాధాన్యం ప్రభుత్వానికి ఏదీ లేదు" అని కేసీఆర్ స్పష్టం చేశారు. "రాష్ట్రం ఏర్పడిన తర్వాత ప్రభుత్వ వైద్యం తీరు మారింది. ప్రభుత్వ ఆస్పత్రులు ఎంతో మెరుగయ్యాయి. కేసీఆర్ కిట్ పథకం అద్భుతంగా అమలవుతోంది. తెలంగాణ తీసుకున్న చర్యలను కేంద్ర ప్రభుత్వం కూడా ప్రశంసించింది. వైద్య అధికారులు, సిబ్బంది పనితీరుపై సర్వత్రా సంతృప్తి, సంతోషం వ్యక్తమవుతోంది. ఈ ఒరవడి, స్ఫూర్తి కొనసాగాలి. గ్రామీణ, మారుమూల ప్రాంతాల్లోని నిరుపేదల ముంగిట్లోకే వైద్యం చేరాలి" అని స్పష్టం చేశారు. ఆశా కార్యకర్తలకు ఒకసారి జీతాలు పెంచామని, మరోసారి పెంచేందుకు సిద్ధంగా ఉన్నామని, వారిని విలేజ్ అసిస్టెంట్లుగా గుర్తిస్తామని చెప్పారు. రెండో ఏఎన్‌ఎం జీతాలు పెంచుతామని, వారి సేవలను సమర్థంగా వినియోగించుకుంటామని చెప్పారు.

### కేసీఆర్ కిట్ పథకం ప్రైవేటుకు నో

కేసీఆర్ కిట్ పథకం అద్భుతంగా అమలవుతోందని, పేదలకు ఎంతో మేలు కలుగుతోందని, అనవసర ఆపరేషన్లు బాగా తగ్గాయని సీఎం కేసీఆర్ చెప్పారు. అదనపు భారం పడినా సరే వైద్యులు, సిబ్బంది ఓపికగా విధులు నిర్వర్తిస్తున్నారని, వారికి ఇన్సెంటివ్ ఇస్తామని తెలిపారు. "ప్రైవేటు ఆస్పత్రులకు కూడా కేసీఆర్ కిట్ పథకం వర్తింపజేయాలనే వినతులు వస్తున్నాయి. కానీ, ప్రభుత్వం అందుకు సిద్ధంగా లేదు. ప్రభుత్వ ఆస్పత్రుల్లోనే అవసరమైన సౌకర్యాలు పెంచుతాం. తప్ప, ప్రైవేటు ఆస్పత్రులకు వర్తింపజేయబోం" అని స్పష్టం చేశారు.

## ఢిల్లీకి వెళ్లిన కేసీఆర్

**పంటి నొప్పికి చికిత్స.. రెండు రోజులు విశ్రాంతి**

న్యూఢిల్లీ/హైదరాబాద్, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్ రావుకు పంటి నొప్పి మళ్లీ తిరగబెట్టింది. గతంలో కూడా పంటి నొప్పితో బాధపడిన ఆయన ఢిల్లీలో ప్రముఖ దంత వైద్యుడి వద్ద చికిత్స పొందారు. మళ్లీ నాలుగైదు రోజుల నుంచి ఆయన పంటి నొప్పితో బాధపడుతున్నారు. మెరుగైన చికిత్స కోసం శుక్రవారం సాయంత్రం కేసీఆర్ ఢిల్లీ చేరుకున్నారు. ఈసారి కూడా అదే వైద్యుడి వద్ద చికిత్స చేయించుకోనున్నారు. శనివారం మధ్యాహ్నం మూడు గంటలకు వైద్యుడితో అపాయింట్‌మెంట్ ఉంది. ఆ తరువాత కేసీఆర్ ఢిల్లీలోనే విశ్రాంతి తీసుకుంటారు. ప్రస్తుతానికి ఆయన ఢిల్లీ పర్యటన మూడు రోజులనే సమాచారం ఉంది. ఆదివారం సాయంత్రం వరకు ఉండి హైదరాబాద్ వెళతారని తెలిసింది. అయితే వైద్యుల సూచన మేరకు అవసరమైతే మరో ఒకటి రెండు రోజులు ఢిల్లీలోనే ఉండే అవకాశం ఉంది. ఇది రాజకీయ పర్యటన కాదని టీఆర్‌ఎస్ ఎంపీ తెలిపారు. కేంద్ర మంత్రులను కూడా కలవకపోవచ్చని చెప్పారు.

## పాస్ బుక్‌పై నా ఫొటో వద్దు

▸ రైతు ఫొటో, తెలంగాణ ముద్ర చాలు: కేసీఆర్

▸ ముదురు ఆకుపచ్చ రంగు పుస్తకం ఎంపిక

రైతులకు ఇవ్వనున్న సరికొత్త 'ఎలక్ట్రానిక్ టైటిల్ డీడ్ కమ్ పట్టాదార్ పాస్ పుస్తకాల'పై తన ఫొటో వద్దని సీఎం కేసీఆర్ అధికారులకు సూచించారు. కొత్త పాస్ పుస్తకాల నమూనాలపై శుక్రవారం ప్రగతి భవన్‌లో ఆయన సమీక్షించారు. పంటలకు గుర్తుగా ముదురు ఆకుపచ్చ రంగులో ఉన్న పాస్ పుస్తకాన్ని ఎంపిక చేశారు. ఈ సందర్భంగా పాస్ పుస్తకంలో ఆయన ఫొటో ఉన్న నమూనాను అధికారులు ముఖ్యమంత్రికి చూపించగా.. "పాస్ పుస్తకంపై రైతు ఫొటో తప్ప మరెవరి ఫొటో ఉండరాదు. రాజకీయ నాయకుల ఫొటోలు అవసరం లేదు. కేవలం రైతు ఫొటో, తెలంగాణ ప్రభుత్వ ముద్ర మాత్రమే ఉండాలి" అని స్పష్టం చేశారు. మరోవైపు, 72 లక్షల పాస్ పుస్తకాల ముద్రణ టెండర్లను జాతీయ సెక్యూరిటీ ప్రింటింగ్ ప్రెస్ (ఎస్పీపీ)కి అప్పగించే ఫైలుపై ఆయన సంతకం చేశారు. హైదరాబాద్, నోయిడా, నాసిక్, పుణేల్లో అత్యంత కట్టుదిట్టమైన భద్రత నడుమ పాస్ పుస్తకాలు ముద్రించాలని, పంపిణీ రోజున సంబంధిత మండలాల తహసీల్దార్లు ముద్రణాలయం నుంచి పొందాలని సూచించారు. మార్చి 11న పాస్ పుస్తకాల పంపిణీకి సత్వర చర్యలు తీసుకోవాలన్నారు.

**జిల్లాలవారీగా బోదకాలు బాధితులు**

| | |
|---|---|
| జగిత్యాల | 6463 |
| సిద్దిపేట | 5199 |
| సూర్యాపేట | 4587 |
| కామారెడ్డి | 3342 |
| ఖమ్మం | 2886 |
| సిరిసిల్ల | 2350 |
| జనగాం | 2189 |
| కరీంనగర్ | 1892 |
| నిజామాబాద్ | 1847 |
| వికారాబాద్ | 1823 |
| వరంగల్ రూరల్ | 1777 |
| మహబూబాబాద్ | 1682 |
| నల్లగొండ | 1567 |
| సంగారెడ్డి | 1464 |
| యాదాద్రి | 1410 |
| వరంగల్ అర్బన్ | 1051 |
| మెదక్ | 1047 |
| పెద్దపల్లి | 913 |
| ఆదిలాబాద్ | 673 |
| పాలమూరు | 644 |
| ఆసిఫాబాద్ | 479 |
| నిర్మల్ | 292 |
| మంచిర్యాల | 274 |
| జయశంకర్ జిల్లా | 174 |
| కొత్తగూడెం | 142 |
| నాగర్ కర్నూలు | 112 |
| మేడ్చల్ | 71 |
| రంగారెడ్డి | 55 |
| గద్వాల | 39 |
| వనపర్తి | 32 |
| హైదరాబాద్ | 0 |
| మొత్తం | 46,476 |

# పాలస్తీనాకు బాసట

ప్రధాని నరేంద్రమోదీ పశ్చిమాసియాలో పర్యటించడం ఇదే ప్రథమం కాదు కానీ, పాలస్తీనాలో భారత ప్రధాని అడుగుపెట్టడం మాత్రం ఇదే తొలిసారి. శుక్రవారం ఆరంభమైన మూడుదేశాల పర్యటనలో భాగంగా మోదీ జోర్డన్ రాజధాని అమ్మన్ చేరుకొని ఘనస్వాగతాన్ని అందుకున్నారు. జోర్డన్‌లో భారత ప్రధాని అడుగుపెట్టి కూడా ముప్పయ్యేళ్ళయింది. ఇజ్రాయెల్ ఆక్రమణలతో సరైన విమానాశ్రయాలు లేని పాలస్తీనాకు చేరుకోవడం కోసం ఇక్కడ తొలుత కాలూనిన మోదీ హెలికాప్టర్‌లో రమల్లా చేరుతారు. పాలస్తీనా, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్, ఒమన్ పర్యటనను మోడీ మూడురోజుల్లోనే ముగించబోతున్నప్పటికీ, ఈ యాత్రకు విశేష ప్రాధాన్యం ఉన్నది.

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ దయవల్ల పాలస్తీనా తిరిగి వేడెక్కింది. జెరూసలేంను రాజధానిగా గుర్తిస్తూ ట్రంప్ తీసుకున్న నిర్ణయం నిప్పురాజేసిన స్థితిలో మోదీ పాలస్తీనాలో పర్యటిస్తున్నారు. దశాబ్దాలుగా పాలస్తీనా స్వేచ్ఛాస్వాతంత్ర్యాలకు మద్దతునిస్తూ అంతర్జాతీయ వేదికలపై దానికి అండగా ఉంటూ వచ్చినప్పటికీ, భారత ప్రధానులెవరూ ఇప్పటివరకూ పాలస్తీనాలో కాలూనలేదు. ఇజ్రాయెల్‌తో దౌత్యాన్ని ఆలింగనాల వరకూ తెచ్చిన మోదీ ఈ పాలస్తీనా పర్యటనకు టెలీవీవ్ మార్గాన్ని కాక, జోర్డన్ దారిని ఎంచుకోవడంలోనే చక్కని సందేశం ఉన్నది. ఇజ్రాయెల్‌తో పెరిగిన సాన్నిహిత్యం కానీ, బెంజమీన్ నెతన్యాహూతో వ్యక్తిగతంగా పెంచుకున్న స్నేహం కానీ భారతదేశ దౌత్యవిధానాన్ని పూర్తిగా మార్చివేయలేదని చెప్పడానికి ఈ పర్యటన ఉపకరిస్తుంది. పాలస్తీనాతోనూ, గల్ఫ్ సహకార సంఘం సభ్యదేశాలతోనూ భారత్ తన ప్రయోజనాలను అనుగుణంగానే వ్యవహరిస్తుందన్న సందేశం ఇందులో ఉన్నది. పాలస్తీనా ఆకాంక్ష విషయంలో భారత్ అదే వైఖరి కొనసాగిస్తున్నదన్న సంకేతాలు నిజానికి మొన్నటి డిసెంబరులోనే ప్రపంచానికి విస్పష్టంగా అందాయి. జెరూసలేంను రాజధానిగా గుర్తిస్తూ ట్రంప్ తీసుకున్న నిర్ణయానికి వ్యతిరేకంగా ఐక్యరాజ్యసమితి సర్వప్రతినిధి తీర్మానించినప్పుడు మన దేశం పాలస్తీనా పక్షాన నిలిచింది. అమెరికా, ఇజ్రాయెల్‌తో స్నేహం ఆయుధాలనుంచి ఆలింగనాల వరకూ హెచ్చిన నేపథ్యంలో, భారత్ ఈ తీర్మానానికి అనుకూలంగా ఓటు వేయకున్నా, కచ్చితంగా గైర్హాజరవుతుందని అంతా భావించారు. ఇస్లామిక్ దేశాల సమాఖ్య (ఓఐసీ) ట్రంప్ నిర్ణయాన్ని తూర్పారబట్టడంతోనూ, భద్రతామండలిలో అమెరికా ఆప్తదేశాలే దానిని కాదుపొమ్మనడంతోనూ అమెరికా నిర్ణయానికి వ్యతిరేకంగా ప్రపంచమంతా ఒక్కటిగా నిలవబోతున్న వాతావరణం కనిపించి భారత్ కూడా అదే బాటన నడిచింది. అమెరికా, ఇజ్రాయెల్‌కు భారత్ నిర్ణయం మనస్తాపాన్ని కలిగించినప్పటికీ, పాలస్తీనాకు మరోమారు మనపై నమ్మకం కలిగించింది. మరోవారంలో ట్రంప్ జెరూసలేమ్ నిర్ణయానికి వ్యతిరేకంగా పాకిస్థాన్‌లో లష్కరే తొయ్యబా అధినేత హఫీజ్ సయీద్ ఆధ్వర్యంలో ఓ భారీ బహిరంగ సభ జరిగినప్పుడు పాకిస్థాన్‌లో పాలస్తీనా రాయబారిగా ఉన్న అలీ దానికి హాజరైనారు. దీనిపై భారత్ అభ్యంతరం తెలపగానే, సదరు రాయబారిని పాలస్తీనా వెంటనే వెనక్కు పిలిపించింది. కశ్మీర్ విముక్తి నినాదాలు కూడా ఆ సభలో రేగిన మాట నిజమే అయినప్పటికీ, పాలస్తీనా ఈ చర్యతో భారత్ పట్ల తన ఆత్మీయతను కనబరచిన మాట వాస్తవం. ఇప్పుడు మోదీ పర్యటన సందర్భంగా పాలస్తీనా అధ్యక్షుడు చేసిన వ్యాఖ్యలను గమనించినట్టయితే, భారత్‌పై ఇంకా ఆ దేశం ఎన్నో ఆశలు పెట్టుకుని ఉన్నదని అర్థమవుతున్నది. పాలస్తీనా ఆకాంక్షను ఈడేర్చే విషయంలో భారత్ క్రియాశీలకమైన పాత్ర పోషించాలని ఆ దేశం కోరుకుంటున్నది.

పాలస్తీనా విషయంలో ఏడు దశాబ్దాలుగా భారత్ కొనసాగిస్తున్న వైఖరిలో మార్పు లేదని ఆ దేశాధ్యక్షుడికీ, ప్రజలకు నేరుగా చెప్పడానికి మోదీ పర్యటన ఉపకరిస్తుంది. అరబ్ ఎమిరేట్స్, ఒమన్ పర్యటనలో అర్థికావసరాలు, ఎగుమతులు దిగుమతుల ప్రయోజనాలు, చమురు అవసరాలు ఉండవచ్చును కానీ, పాలస్తీనా వరకూ దాని పునర్మిణంలో భారత్ కీలకభూమిక నిర్వహిస్తుందన్న హామీ ఈ పర్యటన ద్వారా అందుతుంది. పాలస్తీనా కోసం ఇజ్రాయెల్‌ను దూరం పెట్టే గత కాలపు విధానంలో విస్పష్టమైన మార్పు వచ్చినప్పటికీ, మోదీ ప్రభుత్వం కూడా ఇజ్రాయెల్–హాలస్తీనా విషయంలో ఆచితూచి అడుగులు వేయడానికే నిర్ణయించుకున్నట్టు అర్థం. పాలస్తీనా ఆకాంక్షకు నైతిక మద్దతు ఇస్తూనే, ఇజ్రాయెల్‌తో సైనిక, ఆర్థిక, వ్యూహాత్మక సంబంధాలు కొనసాగించడం మోదీ విధానం కావచ్చును. అయితే, ఈ విన్యాసం ఉపరితలంలో భారత్ ప్రయోజనాల వరకూ ఉత్తమం కావచ్చునేమో కానీ పాలస్తీనాకు మాత్రం మేలు చేయదు. అమెరికా అండతో ఇజ్రాయెల్ విర్రవీగుతున్న స్థితిలో ఈ వ్యూహం బలహీనమైన పాలస్తీనాను దాని చావుకు దానిని వదిలివేయడమే అవుతుంది. అంతర్జాతీయ చట్టాలను, ఐక్యరాజ్యసమితి తీర్మానాలను తుంగలో తొక్కి పాలస్తీనాను ఇజ్రాయెల్ రూపుమాపుతున్న స్థితిలో భారత్ బలహీనుల పక్షాన విస్పష్టంగా నిలవాల్సిన అవసరం ఉన్నది. జెరూసలేం విషయంలో ట్రంప్ దూకుడు నిర్ణయం తీసుకొని ఇజ్రాయెల్ పక్షాన స్పష్టంగా చేరిపోయారు. దీని కారణంగా జెరూసలేం వివాదాన్ని తేల్చే విషయంలో మధ్యవర్తిత్వం వహించే హోదాను అమెరికా కోల్పోయింది. అమెరికాతో సంప్రదింపులు జరపడానికి పాలస్తీనియన్లు నిరాకరిస్తున్న స్థితిలో ఆ మధ్యవర్తి స్థానాన్ని భారత్ భర్తీ చేయగలిగితే భారత్ ప్రపంచశక్తిగా అవతరిస్తుంది. అటు పాలస్తీనాలోనూ, ఇటు ఇజ్రాయెల్‌లోనూ సమాన విశ్వాసాన్ని, ప్రజాదరణను పొందుతున్న భారతదేశం ఈ అవకాశాన్ని అందిపుచ్చుకోవడం అవసరం.

## ఆమెకు ఏ వయసులోనూ రక్షణ లేదా!


భారత సంతతికి చెందిన ఎకాలజిస్టు పూర్ణిమా గోవిందరాజులు ఇటీవల కెనడా నుంచి వచ్చి మన కేంద్ర మహిళా శిశు సంవృద్ధి శాఖా మంత్రి మేనకా గాంధీని కలిశారు. లైంగిక నేరాల నుంచి బాలల రక్షణ చట్టం (పిఒసిఎస్ఒ) గురించి విన్న ఆమె బాల్యంలో తనపై అత్యాచారం జరిగిందనీ, ఆ నిందితునిపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేశారు. ఈ చట్టం ప్రకారం బాధిత మహిళపై ఏ వయస్సులోనైనా సరే లైంగిక దాడి జరిగితే ఆమె ఎప్పుడైనా ఆ నిందితునిపై ఫిర్యాదు చేయవచ్చు. బాల్యంలో జరిగిన సంఘటన గురించి 53 ఏళ్ళ వయస్సులో పూర్ణిమ ఫిర్యాదు చేయడానికి కారణం లేకపోలేదు. నిందితుడు ఒక్కడే, బాధితులు మాత్రం కోకొల్లలు అన్న నిజాన్ని ఆమె తట్టుకోలేకపోయింది. తనకు జరిగిన అన్యాయాన్ని బయటపెట్టినప్పుడే తన సోదరి కూడా ఆ నిందితుని బాధితురాలేనన్న నిజం ఆమెను కలచివేసి కెనడా నుంచి భారత్‌కు వచ్చి మరీ ఈ ఫిర్యాదు చేసింది. తన కుటుంబం పేదరికంలో ఉన్నప్పుడు తల్లీదండ్రీ తనను వారి బంధువుల ఇంట్లో విడిచివెళ్లేవారని, ఆ సమయంలో తండ్రి వయస్సున్న ఆ ఇంటి యజమాని తనపై లైంగిక దాడికి పాల్పడ్డాడని ఆమె ఫిర్యాదులో పేర్కొంది. జరిగిందేమిటో కూడా తెలియని వయస్సులో ఆ సంఘటన చాలా కాలం బాధించి, మానసికంగా కృంగి, వైవాహిక జీవితాన్ని కూడా ఆమె సంతృప్తికరంగా అనుభవించలేదు. సంతానం కలిగితే, వారు ఆడపిల్లలైతే ఎలా రక్షించుకోగలనో అన్న భయం తనను వెంటాడేదని ఆమె చెప్పింది.

ఇటువంటి సంఘటనలు మన దేశంలో కోకొల్లలు. లైంగిక వేధింపులకు గురయ్యేవారు యుక్తవయస్సువారే కాదు. నెలల పసిపిల్లల నుండి వృద్ధాప్యం వచ్చిన వారు కూడా బాధితులే. అసలు ఆడపిల్లలకు రక్షణ ఎక్కడుంటుంది? ఏ వయస్సులో వుంటుంది? ఎందుకంటే ఈ మృగాళ్లు మనింట్లో వుండవచ్చు. పక్కింట్లో వుండవచ్చు. మన అన్నో, తమ్ముడో కావచ్చు. అంతెందుకు బిడ్డలపై తండ్రే అత్యాచారం చేసిన ఘటనలు ఎన్నో జరుగుతున్నాయి. బాల్యంలోనే లైంగిక వేధింపులు ఎదుర్కొంటున్న వారిలో పాఠశాల స్థాయివారే ఎక్కువగా వుంటున్నారంటే నమ్మగలమా! పాఠశాల వాచ్‌మెన్ నుంచి విద్య నేర్పించే గురువులదాకా ఇలాంటి దాడులకు పాల్పడుతున్న ఘటనలు రోజూచూస్తున్నాం. మన దేశంలో అత్యాచారం, ర్యాగింగ్, లైంగిక వేధింపుల కేసులు ప్రతి రోజూ నమోదయ్యే ఇతర కేసులకంటే 90 శాతం అధికమని గణాంకాలు తెలియజేస్తున్నాయి.

యునిసెఫ్ గణాంకాల ప్రకారం బాల్యంలో పిల్లలపై జరిగే శారీరక, మానసిక దాడులు, వారిపట్ల అలసత్వం, నిర్లక్ష్యం, లైంగిక వేధింపులు ఇవన్నీ ముఖ్యంగా వారి ఇళ్లల్లోనూ, పాఠశాలల్లోనూ, సంరక్షణ కేంద్రాల్లోనే జరుగుతుంటాయి. ఇంకా వీధుల్లోనూ, పని ప్రదేశాల్లోనూ చోటుచేసుకుంటాయని తెలిపింది. ఈ దాడుల ప్రభావం వారి పెరుగుదల మీద, శారీరక, మానసిక అభివృద్ధి మీద చూపుతుంది. సామాజిక బలహీనతకూ దారితీస్తుంది. దాడుల తీవ్రత వల్ల కొన్ని సందర్భాల్లో మరణాలూ సంభవిస్తాయి. డబ్ల్యుహెచ్‌ఓ పరిశోధనల్లోనూ, ఈ వేధింపులు వారి ఆరోగ్యంపై తీవ్ర ప్రభావాన్ని చూపుతాయనీ, వారి అభివృద్ధికి తీవ్ర ఆటంకంగా మారతాయనీ పేర్కొంది. ఈ నేరాలపై ఎన్ని చట్టాలు వున్నా అమలు జరపడంలో తీవ్ర నిర్లక్ష్యం చూపుతున్నారు. దీంతో నిందితుడు ఒకటి కాదు, ఈ తరహా నేరాలను అనేకం చేయటానికి సిద్ధపడుతున్నాడు. కానీ బాధిత మహిళ జీవితాంతం, మానసికంగా, శారీరకంగా వేదనకు గురౌతూనే వుంది. చట్టాలను పటిష్ఠంగా అమలు జరపాలని ఏళ్లతరబడి పోరాటాలు చేస్తున్నా అలసత్వం వహిస్తున్నారు. ఫలితంగానే ఈ నేరాలు రోజురోజుకు పెరుగుతూనే ఉన్నాయి.

■ అభినవ్

# గ్రామ పంచాయతీలకు కొత్త చట్టం!



ఈ మధ్యకాలంలో తెలంగాణ ప్రభుత్వం గ్రామ పంచాయతీలను బలోపేతం చేయడానికి కొత్త చట్టాన్ని తీసుకు రావడానికి చర్యలు తీసుకుంది. పంచాయతీ రాజ్ మంత్రి అధ్యక్షతన ఏర్పాటైన మంత్రివర్గ ఉప సంఘం పలుమార్లు చర్చలు జరిపి నివేదికను ముఖ్యమంత్రికి అందజేసింది. ముఖ్యమంత్రి తుది నిర్ణయం తీసుకోవాల్సి ఉంది. ఉమ్మడి రాష్ట్రంలో 2012 సంవత్సరములో పంచాయతీ ఎన్నికలు జరుగవలసి ఉండగా అప్పటి ప్రభుత్వం ఎన్నికలు జరుపలేదు. గ్రామ పంచాయతీలకు ఎన్నికలు జరపాలని ఫోరం ఫర్ గుడ్ గవర్నెన్స్, రాష్ట్ర ఉన్నత న్యాయస్థానంలో వాజ్యం వేసింది. దానిపై ఉన్నత న్యాయస్థానం ఎన్నికలు జరపాలని తీర్పు ఇచ్చినా, రాష్ట్ర ప్రభుత్వం తీర్పు అమలుచేయకుండా సర్వోన్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించి రాష్ట్రంలో ఉద్యమాలు జరుగుతున్నాయని ఇట్టి పరిస్థితులలో ఎన్నికలు జరపలేమని చెప్పింది. కాని సర్వోన్నత న్యాయస్థానం ఒప్పుకోక ఎన్నికలు మూడు నెలలలో జరపాలని తీర్పు ఇచ్చింది. చేసేది లేక రాష్ట్ర ప్రభుత్వం 2013 ఆగష్టులో ఉమ్మడి రాష్ట్రంలో గ్రామ పంచాయతీలకు ఎన్నికలు జరిపింది. అటు తరువాత రాష్ట్ర విభజన వరకు అప్పటి ప్రభుత్వం పంచాయతీలను పట్టించుకోలేదు.

ఇక తెలంగాణ రాష్ట్రంలో కూడ పంచాయతీలను ప్రభుత్వం చిన్న చూపే చూసింది. రాష్ట్ర ఆర్థిక సంఘాన్ని నియమించి పంచాయతీలకు నిధులు విడుదల చేయలేదు. నామ మాత్రంగా జి.ఓ. నం. 31, పి.ఆర్ అండ్ ఆర్.డి. డిపార్టుమెంట్, తేది 16–3–2015 ద్వారా రాష్ట్ర ఆర్థిక సంఘాన్ని నియమించినా ఆ సంఘం పనిచేయడానికి సభ్యులను కాని అధ్యక్షులను గాని నియమించలేదు. ఫోరం ఫర్ గుడ్ గవర్నెన్స్ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, గవర్నర్ దృష్టికి తీసుకెళ్ళినా ఫలితం లేకపోయింది. చివరకు రాష్ట్ర ఉన్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించగా న్యాయస్థానం ఆదేశాలతో అధ్యక్షుల వారిని, ఒక సభ్యుడిని నియమించారు. చట్ట ప్రకారం నలుగురు సభ్యులు ఉండాలి. అలాగే ఒక సీనియర్ అధికారిని సభ్య కార్యదర్శిగా నియమించగా ఆయన సెలవుపై వెళ్ళాడు. ప్రస్తుతం నియమించిన రాష్ట్ర ఆర్థికసంఘం ప్రభుత్వాన్ని ఒప్పించి గ్రామ పంచాయతీలకు నిధులు ఇప్పిస్తుందన్న ఆశలేదు.

**సర్పంచ్ ఎన్నిక పద్ధతి, తాండాలను కూడా పంచాయతీలు చేయడం, ఎన్నికలు పార్టీపరంగా నిర్వహించడం వంటి చిన్న చిన్న విషయాలను సమస్యలుగా చూపిస్తూ, కొత్తగా చట్టాన్ని తీసుకురావడం ప్రభుత్వానికి పంచాయతీలపై చిత్తశుద్ధి లేకపోవటాన్ని సూచిస్తున్నది. పంచాయతీరాజ్ చట్టం ప్రత్యక్షంగా ప్రజల మౌలిక సదుపాయాలకు సంబంధించిన విషయం కాబట్టి ప్రజల అభిప్రాయాలను తప్పనిసరిగా తీసుకోవాలి.**

తెలంగాణ రాష్ట్రంలో ఇంకా కొద్ది మాసాలలో గ్రామ పంచాయతీలకు ఎన్నికలు జరిగే సమయంలో ప్రభుత్వం గ్రామ పంచాయతీలకు కొత్త చట్టం తెచ్చే పనిలో ఉంది. 1994లో చేయబడ్డ గ్రామపంచాయతీల చట్టంలో లోపాలు పెద్దగా ఏమీ లేవు. చట్టం అమలు చేయకుండానే కొత్త చట్టం తీసుకురావడానికి ప్రయత్నం చేయడం అర్థం లేని విషయం. ఏవైనా సవరణలు కావాలనుకుంటే చేసుకోవచ్చు. కానీ ఈ పద్ధతి వైద్యుడు చెప్పిన మందులు వాడకుండానే వైద్యుడిని మార్చిన చందంగా ఉంది.

గ్రామ స్వరాజ్యం కావాలంటే పంచాయతీలు బలోపేతం కావాలని గాంధీగారు చెప్పారు. ఈ దిశగా 1957 బలవంత్ రాయ్ మెహతా కమిటీ వేశారు. పంచాయతీ వ్యవస్థ బలోపేతం చేయడానికి కమిటీ పలు సూచనలు చేసినా అవి అమలుకు నోచుకోలేదు. అటుతరువాత వరుసగా ఇంకా 6 సార్లు వివిధ కమిటీలు వేసి చేతులు దులుపుకున్నారు. కాని కమిటీల సిఫారసులు అమలుకాలేదు. ప్రప్రథమంగా పంచాయతీరాజ్ వ్యవస్థను 1959లో రాజస్థాన్ రాష్ట్రంలో, తరువాత ఆంధ్రప్రదేశ్‌లో అమలు చేయడం జరిగింది. తరువాత దశలవారీగా అన్ని రాష్ట్రాల్లో గ్రామ పంచాయతీ వ్యవస్థను ఏర్పాటు చేసి చట్టాలు చేయడం జరిగింది. అయితే పంచాయతీలకు నిధులు, అధికారాలు లేక పంచాయతీ వ్యవస్థ అనుకున్న స్థాయికి చేరలేదు. పంచాయతీలను బలోపేతం చేయడానికి 1992లో 73వ రాజ్యాంగ సవరణ ద్వారా.. షెడ్యులు పదకొండులో చెప్పిన విధంగా 29 అధికారాలను బదలాయించాలని, అలాగే రాష్ట్ర ఆర్థిక సంఘాలను నియమించి వాటి ద్వారా అవసరమైన నిధుల విడుదలకు చర్యలు తీసుకోవాలని నిర్ణయించడం జరిగింది. 29 అధికారాలలో తెలంగాణ రాష్ట్రంలో 10 అధికారాలు మాత్రమే గ్రామ పంచాయతీలకు మార్పిడి చేశారు. ఈ విధంగా దశల వారి మార్పిడితో ఎటువంటి ప్రయోజనం ఉండదు.

పంచాయతీలకు మూడు పద్ధతుల ద్వారా నిధులు అందుతాయి. 1) కేంద్ర ఆర్థికసంఘం సిఫారసు మేరకు కేంద్రం నుంచి స్థానిక సంస్థల గ్రాంటు 2) రాష్ట్ర ఆర్థికసంఘం సిఫారసు మేరకు రాష్ట్ర ప్రభుత్వం నుంచి గ్రాంటులు 3) గ్రామంలో పన్నుల ద్వారా స్వంతంగా సమకూర్చుకొనే నిధులు. గత మూడు సంవత్సరాలు కేంద్రం నుంచి నేరుగా గ్రామపంచాయతీలకు 14వ ఆర్థిక సంఘం సిఫారసుల మేరకు నిధులు విడుదలైనా, మొత్తం డబ్బు పంచాయతీలకు అందలేదు. చాలా సందర్భాలలో రాష్ట్ర ప్రభుత్వం విద్యుత్ బకాయిలు ఇతరత్రా కారణాలతో కోత పెట్టడం జరిగింది. గమనించవలసిన విషయమేమిటంటే కేంద్రం నిధులతో పాటు రాష్ట్ర ప్రభుత్వం కూడ నిధులు విడుదల చేయడం పోయి, కేంద్రం నుంచి వచ్చిన డబ్బులపై కోత విధించింది. అసెంబ్లీ నియోజకవర్గ అభివృద్ధి నిధి (సి.డి.పి.) ప్రత్యేక అభివృద్ధి నిధి (ఎస్.డి.పి.) పేరుతో స్థానిక శాసన సభ్యుడు, జిల్లా మంత్రి వందలకోట్లలో ఖర్చు చేస్తున్నారు. దీనిలో ఎటువంటి పారదర్శకత కాని, ఆడిట్ కాని జరగడం లేదు. పనుల గురించి ఎక్కడా చర్చ జరుగదు. సి.డి.పి మరియు ఎస్.డి.పి నిధులు గ్రామ పంచాయతీలకు, మునిసిపాలిటీలకు విడుదల చేస్తే అవసరమైన పనులు చేపట్టే అవకాశముంది.

మనదేశంలో గ్రామపంచాయతీ వ్యవస్థ బాగా పనిచేస్తున్న వాటిలో కేరళ రాష్ట్రాన్ని ఉదాహరణగా తీసుకోవచ్చు. కేరళ రాష్ట్ర జనాభా సుమారు తెలంగాణ రాష్ట్రంతో సమానంగా ఉంది. అక్కడ 941 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. తెలంగాణ రాష్ట్రంలో ప్రస్తుతం 8695 గ్రామ పంచాయతీలు ఉండగా, వీటికి తోడు అదనంగా 4000 గ్రామ పంచాయతీలను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం ఆలోచిస్తుంది. అంటే మొత్తం 12,695 గ్రామ పంచాయతీలు అన్నమాట! ఇప్పుడు కొత్తగా ఏర్పాటు చేయబోయే గ్రామ పంచాయతీల జనాభా సుమారు 400 నుంచి 600 వరకు ఉంటుంది. ఆర్టికల్ 243 (సి) ప్రకారం పంచాయతీ సభ్యుల సంఖ్య జనాభాపై ఆధారపడి ఉంటుంది. ఉదాహరణకు రాష్ట్రంలో 200 జనాభాకు ఒక పంచాయతీ సభ్యుడు అనుకుంటే కొత్తగా ఏర్పడే పంచాయతీలకు ముగ్గురు సభ్యులు అంటే ఒక సర్పంచ్, ఒక ఉపసర్పంచ్, ఒక వార్డు సభ్యుడు ఉంటారు. ఈవిధంగా గ్రామ పంచాయతీలు ఏర్పడటం ఏమాత్రం సమర్థనీయం కాదు. గ్రామపంచాయతీలు ఆర్థికంగా, పరిపాలనపరంగా నిలబడాలంటే పెద్ద పంచాయతీలు ఉండాలని కేంద్రం రాష్ట్రాలను కోరడం జరిగింది.

10 జిల్లాలతో పాలనలో ఎటువంటి ఇబ్బందులు లేని రాష్ట్రాన్ని 31 జిల్లాలుగా విభజించారు. ఇప్పటికీ తగిన సిబ్బంది, మౌలిక సదుపాయాలు లేక పాలనా వ్యవస్థ ఇబ్బందులకు గురవుతోంది. కొత్త జిల్లాలకు మౌలిక సదుపాయాల కొరకు 1500 కోట్లు అవసరమని అంచనా. ఇక కొత్తగా ఏర్పడే 4,000 పంచాయతీలకు కావలసిన నిధుల సంగతి ఊహకు అందని విషయం.

కేరళ రాష్ట్రంలో అక్కడి రాష్ట్ర ఆర్థిక సంఘం, రాష్ట్ర బడ్జెట్‌లో 35 నుంచి 40% గ్రామ పంచాయతీలకు ఇవ్వడానికి సిఫారసు చేస్తుంది. ఈవిధంగా ప్రతి గ్రామ పంచాయతీకి సాలీన ఒక కోటి నుంచి కోటి యాభై లక్షల దాకా రాష్ట్ర ప్రభుత్వం నుంచి నిధులు విడుదల అవుతాయి. దీనికి తోడు కేంద్ర ప్రభుత్వ నిధులు, స్వంత నిధులతో ప్రతి గ్రామ పంచాయతీ స్వతంత్ర ప్రతిపత్తి కలిగి, తమ గ్రామ పంచాయతీలో కావలసిన పనులు స్థానిక ప్రజలు నిర్ణయించుకుంటారు. అధికార వికేంద్రీకరణలో భాగంగా గ్రామ పంచాయతీలకు కావలసిన నిధులు, విధులు, సిబ్బంది, పనుల నిర్ణయంలో స్వేచ్ఛ, ప్రభుత్వశాఖలతో అనుసంధానంపై గట్టి చర్యలు తీసుకొని గ్రామ పంచాయతీలను కేరళ రాష్ట్ర ప్రభుత్వం బలోపేతం చేసింది.

తెలంగాణ ప్రభుత్వం కొత్తగా తెచ్చే గ్రామ పంచాయతీ చట్టం కంటి తుడుపు చర్య, దానితో పెద్దగా ఒరిగేది ఏమీలేదు. గత నాలుగు సంవత్సరాలుగా పంచాయతీలకు నిధులు ఇవ్వడం, అధికారాల బదలాయింపు వంటివి ఏమీ చేయక, రాష్ట్ర ఆర్థికసంఘాన్ని కోర్టు చెపితేనే కాని నియమించకపోవడం వంటివి పరిశీలించినప్పుడు కొత్త పంచాయతీ చట్టం రాబోయే గ్రామ పంచాయతీ ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని చేస్తున్న కసరత్తు మాత్రమేనని అర్థమవుతోంది. కాని పంచాయతీలకు ఎటువంటి లాభం చేకూరదు. పంచాయతీలకు కావల్సింది అధికారాల బదలాయింపు, హక్కుగా నిధుల విడుదల.

ఏది ఏమైనా మంత్రిమండలి సిఫారసు చేసిన కొత్త చట్టం ముసాయిదాను ప్రజల ముందు ఉంచి వారి సూచనలు, సలహాలు తీసుకొని బిల్లు అసెంబ్లీ ముందు ఉంచితే బాగుంటుంది. ఏ రాష్ట్రంలో అయినా శాసనసభ్యుడు గ్రామ పంచాయతీలు బలోపేతంగా ఉండాలని అనుకోడు. ఎందుకంటే పంచాయతీలు (పంచాయతీ అధ్యక్షుడు) బలంగా ఉంటే శాసనసభ్యుని అధికారాలలో కోత పడుతుంది. సర్పంచ్ ఎన్నిక పద్ధతి, తాండాలను కూడ పంచాయతీలు చేయడం, ఎన్నికలు పార్టీపరంగా నిర్వహించడం వంటి చిన్న చిన్న విషయాలు సమస్యలుగా చూపిస్తూ, కొత్తగా చట్టాన్ని తీసుకురావడంలో ప్రభుత్వం వారికి పంచాయతీలపై చిత్తశుద్ధి లేమిని తెలియజేస్తోంది. పంచాయితిరాజ్ చట్టం ప్రత్యక్షంగా ప్రజల మౌలిక సరుపాయాలకు సంబంధించిన విషయం కాబట్టి ప్రజల అభిప్రాయాలు తప్పనిసరిగా తీసుకోవాలి. ప్రభుత్వం తయారుచేసిన బిల్లు, శాసన సభ ఆమోదించినా అది వేదం కాదు. శాసనసభ బయట కూడ ఎందరో పంచాయతీల పాలనపై అనుభవమున్న మేధావులు ఉన్నారు కాబట్టి కొత్త బిల్లు చట్టం రూపం దాల్చక ముందే ప్రజల అభిప్రాయాలు తీసుకోవడం ఎంతో అవసరం.

■ యం. పద్మనాభరెడ్డి
కార్యదర్శి, ఫోరం ఫర్ గుడ్ గవర్నెన్స్

## కరపత్రం

### తిరుపతిలో ప్రరవే సభలు

ప్రజాస్వామిక దేశాల్లో ప్రజల పక్షాన నిలిచే నాలుగవ స్థంభం పత్రికారంగం. దాని స్వతంత్ర ప్రతిపత్తితో సమాజపు బహుముఖీనతను నిష్పక్షపాతంగా ప్రజల ముందు ఉంచుతుంది. మానవ పరిణామ దశలో మనం ప్రోది చేసుకున్న స్వేచ్ఛ, సమానత్వం, వివక్షలపై పోరాటం వంటి ఆధునిక భావనలకి అండగా నిలిచే అతి పెద్ద వ్యవస్థ పాత్రికేయం. అటువంటి మానవీయరంగంలో పాత్రికేయులుగా మహిళల క్రియాశీల పాత్రను అంచనా వేయడం లక్ష్యంగా ప్రజాస్వామిక రచయిత్రుల వేదిక నాలుగవ మహాసభను నిర్వహించుకొనడానికి సన్నద్ధమవుతున్నది.




సర్వ సమాజిక అంశాలతో పాటు, కుల మత వర్గ రాజకీయ సంబంధ వికృతులను వ్యాఖ్యానించే పాత్రికేయులు దాడులు, హత్యలకు గురవుతున్నారు. స్త్రీలైతే అత్యాచారాలకు కూడా బలవుతున్న వర్తమాన సందర్భం ఇది. ప్రజల ఆలోచనను, చైతన్యాన్ని పెంచే వార్తలను, కథనాలను రాస్తున్న, దృశ్యంగా ప్రసారం చేస్తున్న వాళ్ల గొంతు నొక్కేసే చరిత్ర మనకు కొత్తేమీ కాదు. 1992–2016 మధ్యకాలంలో 70మంది పాత్రికేయులు చంపబడ్డారని నేషనల్ క్రైమ్ రికార్డ్ బ్యూరో చెప్తున్నది. బెదిరింపుల సంగతి సరేసరి. ఛత్తీస్‌గఢ్‌లో ఆదివాసీలపై రాజ్యహింసను రిపోర్ట్ చేస్తోన్న మాలినీ సుబ్రహ్మణ్యం వంటి పాత్రికేయులను వేధించి వెళ్లగొట్టడం మనకు తెలిసిన వర్తమానమే. ఈ క్రమంలో 2017లో గౌరీ లంకేశ్ హత్య ఒక పెద్ద సంచలనం. హిందూ అతివాద జాతీయ రాజకీయల గురించి రాసినందుకు గౌరీ, ఇద్దరు మహిళల అపహరణ కేసులో పోలీసుల వైఖరిని తప్పు పట్టినందుకు సంజీవ్ గోపాలన్, వృద్ధులకు, అనాథలకూ నెలవైన ఒక దేవాలయం మీద 'గాడ్ ఆఫ్ బెగ్గర్స్' అనే డాక్యుమెంటరీ తీసినందుకు బిజూ ముతాతి... ఇలా వరుసగా హత్యలు భావప్రకటనా స్వేచ్ఛకు, సమాచార వినిమయ స్వేచ్ఛకు పెను సవాల్ విసిరాయి. ఈ పరిస్థితుల నేపథ్యంలో ప్రజాస్వామిక రచయిత్రుల వేదిక నాలు గవ మహాసభలు గౌరీ లంకేశ్ స్ఫూర్తి నేపథ్యంలో 2018 ఫిబ్రవరి 10, 11 తేదీలలో తిరుపతిలో జరుగనున్నాయి.

మీడియా ప్రజల అభిప్రాయాలను మలచగలిగిన, ఆలోచనా విధానాన్ని ప్రభావితం చేయగలిగిన శక్తివంతమైన సాధనం. అందులో మహిళలకు సంబంధించిన వార్తలకు ఉన్న చోటు ఎంత, మహిళలకు సంబంధించిన వార్తల, వార్తాకథనాల ప్రచురణలో, ప్రసారంలో ప్రధానంగా పనిచేసే దృక్పథం ఏమిటి? అన్నవి ప్రధానమైన ప్రశ్నలు. అందువల్ల మీడియా సంస్థలలో జెండర్ అసమానతలను సంబోధించి పని చేయడంతోపాటు సమాజంలో జెండర్ సమానత్వం కోసం మీడియా పనిచేయవలసిన తీరును ప్రభావితం చేయడం గురించి కూడా మనం ఆలోచించవలసి ఉంది. ఈ దిశగా ఒక సంభాషణకు వేదికగా ప్రరవే మహాసభలు ఉపయోగపడాలని ఆశిస్తున్నాం. జర్నలిస్ట్ మిత్రులకు, ప్రత్యేకించి మహిళా జర్నలిస్ట్ మిత్రులకు ఇదే మా ఆహ్వానం.

■ ప్రజాస్వామిక రచయిత్రుల వేదిక

### తిరుపతిలో బౌద్ధ మహాసమ్మేళనం



బుద్ధిస్ట్ సొసైటీ ఆఫ్ ఇండియా ఆంధ్రప్రదేశ్ శాఖ, ఆంధ్రప్రదేశ్ సాంస్కృతిక శాఖ సౌజన్యంతో '8వ బౌద్ధ మహా సమ్మేళనం' తిరుపతి తనపల్లి రోడ్డులోని రామా నాయుడు కళ్యాణ మండపంలో ఫిబ్రవరి 9 నుండి 11వ తేదీ వరకూ జరుగుతోంది. 10వ తేదీన 'నేటి సమాజానికి బౌద్ధం ఆవశ్యకత'పై సి.ఆంజనేయరెడ్డి, 'నేటికీ కొనసాగుతున్న బౌద్ధ ఆచారాలు'పై శీలం ప్రభాకర్, 'భారత రాజ్యాంగంలో బౌద్ధ భావజాలం'పై ఎం. గౌతమి, 'బౌద్ధాన్ని ప్రచారం చేసిన ప్రముఖులు'పై మల్లేపల్లి లక్ష్మయ్య, 'బౌద్ధం స్త్రీ విముక్తి'పై సి.హెచ్.స్వరూపరాణి, 'ఆధునిక యుగంలో బౌద్ధం'పై ఇంద్రవెల్లి రమేష్, ' బౌద్ధ సాహిత్య పరిచయం'పై బొర్రా గోవర్ధన్, తెలుగు రాష్ట్రాల్లో బౌద్ధ చైత్యాలు'పై పిల్లి రాంబాబులు ప్రసంగిస్తారు.

■ ఉత్సవ నిర్వాహక కమిటీ

### జర్నలిస్ట్ శ్రీకాంత్ సంస్మరణ సభ

సీనియర్ జర్నలిస్ట్, సాహితీవేత్త గుర్రంకొండ శ్రీకాంత్ సంస్మరణ సభ 11వ తేదీ (ఆదివారం) ఉదయం 11 గంటలకు హైదరాబాద్ సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో జరుగుతుంది. జర్నలిస్ట్ మిత్రులు, సాహితీవేత్తలు, శ్రీకాంత్ మిత్రులు పాల్గొనాల్సిందిగా శ్రీకాంత్ జర్నలిస్టుల శిష్యబృందం కోరుతోంది.

■ శ్రీకాంత్ శిష్య బృందం

# ఎస్సీ, ఎస్టీల నిధుల్లో భారీ కోత!

షెడ్యూల్డ్ కులాలకు, షెడ్యూల్డ్ తెగలకు నిధుల కేటాయింపును గణనీయంగా పెంచుతున్నట్లు ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ తన బడ్జెట్ ప్రసంగంలో పేర్కొన్నారు. అయితే అంతకుముందు కన్నా కొద్దిపాటిగా ఎక్కువగా నిధుల కేటాయింపు జరిగినా, చట్టబద్ధంగా వారి జనాభా నిష్పత్తి ప్రకారం నిధుల కేటాయింపు లేదు.

ఎస్సీ, ఎస్టీలకు ఉద్దేశించిన సంక్షేమ పథకాలకు కేటాయిస్తున్న నిధులను అభివృద్ధి ప్రణాళికలలో భాగంగా కాకుండా ఎస్సీ కంపోనెంట్ ప్లాన్, ఎస్టీ కంపోనెంట్ ప్లాన్‌లలో భాగంగా చూపుతున్నారు. 2011 జనాభా గణాంకాల ప్రకారం దేశ జనాభాలో 16.6 శాతం ఉన్న ఎస్సీలు, 8.6 శాతం ఉన్న ఎస్టీలను కలిపితే మొత్తం జనాభాలో 25 శాతానికి పైగా ఉన్నారు. నీతి ఆయోగ్‌లో సామాజిక రంగానికి సలహాదారు, మాజీ ఆర్థిక కార్యదర్శి రతన్ పి. వాటల్ కేంద్ర పథకాలలో నిధులను వారి జనాభా నిష్పత్తి ప్రకారం కేటాయించాలని స్పష్టమైన సిఫార్సు చేశారు. ఆ ప్రకారంగా మొత్తం అభివృద్ధి నిధులలో నాల్గవ వంతు, మొత్తం బడ్జెట్‌లో 8 శాతం మేరకు ఈ వర్గాలకోసం కేటాయింపులు జరగాలి.




**2018–19 వార్షిక బడ్జెట్‌లో ఎస్సీ ఎస్టీలకు 2.32 శాతం నిధులను మాత్రమే కేటాయించడం గమనిస్తే ప్రధాని మోదీ చెబుతున్న 'సబ్ కా సాత్ సబ్ కా వికాస్' నినాదంగా మాత్రమే మిగిలిపోతున్నట్లు వెల్లడవుతోంది.**

ఈ ఫార్ములా ప్రకారం మొత్తం కేంద్ర బడ్జెట్ రూ.24,42,213.30 కోట్లలో రూ.3,05,277 కోట్లను ఎస్సీ, ఎస్టీలకు కేటాయించాలి. అయితే ఆర్థికమంత్రి రూ.95,754 కోట్లు మాత్రమే కేటాయించారు. అంటే వారికి న్యాయంగా కేటాయించవలసిన రూ.2,09,523 కోట్లను దారిమళ్లించారు. భారత దేశంలో గొప్ప మార్పు తీసుకు రావడం కోసం నీతి ఆయోగ్‌ను ఏర్పాటు చేసినట్లు చెప్పే ప్రధాని నరేంద్ర మోదీ కీలకమైన రంగాలలో అది చేసిన సిఫార్సులను బుట్టదాఖలు చేస్తున్నారు.

ఎస్సీల సంక్షేమానికి 201415లో రూ.20,513 కోట్లు కేటాయించగా రూ.4,499 కోట్లు, అంటే 20 శాతానికి పైగా; ఎస్టీలకు కేటాయించిన నిధులలో రూ.12,466 కోట్లు ఖర్చు పెట్టనే లేదు. 2016–17లో రూ.2,195 కోట్లు ఖర్చు పెట్టనే లేదు. 2018–19 వార్షిక బడ్జెట్‌లో ఈ వర్గాలకు 2.32 శాతం నిధులను మాత్రమే కేటాయించడం గమనిస్తే ప్రధాని చెబుతున్న 'సబ్కా సాత్ సబ్కా వికాస్' కేవలం నినాదంగా మాత్రమే మిగిలిపోతున్నట్లు వెల్లడవుతోంది. యువతలో నైపుణ్యతను పెంపొందింపచేసి, వారిలో స్వయం ఉపాధి అవకాశాలు పెంపొందించేందుకు బడ్జెట్‌లో ప్రాధాన్యత ఇస్తున్నట్లు జైట్లీ చెప్పినప్పటికీ ఎస్సీలకు అందుకోసం కేవలం రూ.13.26 కోట్లు మాత్రమే కేటాయించారు.

కాగా, ఎస్టీల కోసం 2022 నాటికి ప్రత్యేకంగా 'ఏకలవ్య' స్కూళ్లను ప్రారంభించనున్నట్లు ఆర్థికమంత్రి తెలపడం హర్షణీయం. అయితే గిరిజన ప్రాంతాలలో విద్య, వైద్య, రవాణా సదుపాయాలను మెరుగుపరచడంతో పాటు, అటవీ ఉత్పత్తులపై గిరిజనులకు గల హక్కులను కాపాడటం, అటవీ హక్కుల చట్టం ప్రకారం సాగు భూములపై గిరిజనుల హక్కులను నిర్ధారించడం పట్ల ప్రభుత్వ పక్షంగా ఎటువంటి హామీ లభించక పోవడం విచారకరం. మోదీ అధికారం చేపట్టినప్పటి నుంచి అటవీ హక్కుల చట్టం అమలు పట్ల తీవ్ర నిర్లక్ష్య ధోరణి అవలంబిస్తున్నారు.

గిరిజనుల సమగ్ర అభివృద్ధి కోసం 2014లో మోదీ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన 'వనబంధు కళ్యాణ్ యోజన' పథకాన్ని రెండేళ్లకే నీరు కార్చారు. మొదటి సంవత్సరం పది రాష్ట్రాలలో అమలు పరచడం కోసం ఒకొక్క రాష్ట్రానికి రూ.100కోట్ల చొప్పున కేటాయించగా, 201516లో 21 రాష్ట్రాలకు రాష్ట్రానికి రూ 200 కోట్లు చొప్పున కేటాయించారు. ఆ మరుసటి సంవత్సరమే ఈ పథకానికి తిలోదకాలిచ్చారు. బడ్జెట్ కేటాయింపులలో చూపుతున్న గిరిజన సబ్ ప్లాన్ నిధులలో 2013 నుండి 2017 వరకు 10 శాతం చొప్పున కోత విధించారు. ప్రస్తుత బడ్జెట్‌లో ఎస్సీలకు 2.32 శాతం, ఎస్టీలకు 1.60 శాతం మాత్రమే కేటాయింపులు జరిపారు.

■ చలసాని నరేంద్ర

# ఆయుష్మాన్ బడ్జెట్

స్వాతంత్ర్యానంతరం భారతదేశం ప్రవేశపెట్టిన బడ్జెట్లన్నింటిలో ఫిబ్రవరి 1, 2018న ప్రవేశపెట్టిన బడ్జెట్ చిరస్థాయిగా నిలిచిపోతుందనడంలో ఏ మాత్రం అతిశయోక్తి లేదు. సంవత్సరకాలంలో సాధారణ ఎన్నికలున్నా, ప్రజా సంతుష్టీకరణకు బదులు దేశం యొక్క దీర్ఘకాల అభివృద్ధే ధ్యేయంగా ఈ సంవత్సర పద్దుల ప్రణాళికను ప్రజల ముందుంచింది మోదీ ప్రభుత్వం. గత ప్రభుత్వాలు తరతరాలుగా పాటిస్తూ వచ్చిన ఆకర్షక బడ్జెట్‌కు తలాక్ చెప్పి ఆచరణకు ప్రాధాన్యతనిచ్చింది. దేశ ప్రజల తక్షణ, దీర్ఘకాల అవసరాలైన విద్య, వైద్యం, వ్యవసాయం, ఉపాధి, పరిశ్రమలు, గ్రామీణాభివృద్ధి రంగాలకు పెద్దపీట వేస్తూ పేదరికాన్ని కూకటివేళ్ళతో పెకలించే ప్రయత్నం చేస్తున్నామని ఈ బడ్జెట్ ద్వారా ప్రధాని మోదీ స్పష్టమైన సంకేతమిచ్చారు.



**దేశ ప్రజల తక్షణ, దీర్ఘకాల అవసరాలైన విద్య, వైద్యం, వ్యవసాయం, ఉపాధి, పరిశ్రమలు, గ్రామీణాభివృద్ధి రంగాలకు పెద్దపీట వేస్తూ పేదరికాన్ని కూకటివేళ్ళతో పెకలించే ప్రయత్నం చేస్తున్నామని ఈ బడ్జెట్ ద్వారా ప్రధాని మోదీ స్పష్టమైన సంకేతమిచ్చారు.**

ప్రభుత్వాల నిర్లక్ష్యం కారణంగా సుదీర్ఘ కాలంగా దేశ వ్యవసాయం కుంటుపడి అన్నదాతలు ఆత్మహత్యలు చేసుకుంటున్న సమయంలో 2014లో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తూనే రైతు ఆత్మహత్యల నివారణ చర్యలలో భాగంగా 'రైతుల రెట్టింపు ఆదాయం'పై మోదీ దృష్టిసారించారు. ప్రధాన మంత్రి కృషి సించాయి యోజన, ఫసల్ భీమా యోజన, భూ ఆరోగ్య కార్డులు... ఇతర ఎన్నో పథకాల అమలు ద్వారా చెప్పుకోతగ్గ పలితాలు సాధించారు. అయినప్పటికీ రైతులు నేటికి ఆందోళనలోనే ఉన్నారు. ఈ విషయాన్ని స్పష్టంగా గ్రహించిన మోదీ ప్రభుత్వం ప్రతి పంట ఉత్పత్తికి గాను అయ్యే ఖర్చుకు తోడు 50 శాతం అదనంగా రైతుకు లాభం చేకూర్చే విధంగా ప్రతి ప్రధాన పంటకు కనీస మద్దతు ధరను బడ్జెట్లో పొందుపరచింది. ఈ ప్రక్రియ వేగంగా, సమర్థవంతంగా జరిగేందుకు నీతి ఆయోగ్ నిపుణులు బాధ్యత తీసుకుంటారని పేర్కొంది. రైతులకు సకాలంలో పంట ఋణసదుపాయం లభించేందుకుగాను ఈ ఆర్థిక సంవత్సరానికి ఏకంగా 11 లక్షల కోట్ల రూపాయల వితరణను లక్ష్యంగా నిర్దేశించింది. పశువుల, చేపల పెంపకపు మౌలిక సదుపాయాల అభివృద్ధికి 10 వేల కోట్ల రూపాయలను ఖర్చు చేయాలని నిర్ణయించింది.

ప్రపంచంలో అత్యధిక యువకులు గల దేశం మనది. వారిని సమర్థవంతంగా ఉపయోగించుకోవాలంటే నాణ్యమైన విద్య, శిక్షణ అవసరమని గుర్తించి, ఈ బడ్జెట్లో ఉన్నత విద్య మౌలిక వసతుల కోసం లక్ష కోట్లు కేటాయించింది.

ప్రతి పేద కుటుంబం సంపాదనలో సింహభాగం ఖర్చయ్యేది ఆరోగ్యం పైనే. ప్రజల ఆరోగ్యమే ఈ దేశ ఆరోగ్యంగా భావించి మోడీ ప్రభుత్వం సంవత్సరానికి కుటుంబానికి 5 లక్షల ఆరోగ్య బీమా సౌకర్యం కల్పిస్తోంది. విదేశీ వస్తువులపై దిగుమతి సుంకాన్ని 20 శాతానికి పెంచడంతో ఈ దేశ పరిశ్రమల రంగాన్ని ప్రోత్సహించినట్లయింది. దీంతో స్వదేశీ వస్తువుల వాడకం పెరుగుతుంది. ఎప్పుడైతే స్వదేశీ వస్తువుల వాడకం పెరుగుతుందో అప్పుడు స్వదేశీ వస్తువులకు మంచి గిరాకీ లభించి ఈ దేశంలోవున్న పరిశ్రమలకు ప్రోత్సాహం లభించి దేశ యువతకు ఉద్యోగ అవకాశాలు పుష్కలమవుతాయి. అలాగే, సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలకు కార్పొరేటు పన్ను తగ్గించి పరిశ్రమలను లాభాల బాట పట్టించే ప్రయత్నం చేసింది. 50కోట్ల మందికి నూతన గృహవసతి, 4కోట్ల కుటుంబాలకు ఉచిత విద్యుత్ కనెక్షన్లు, 8కోట్ల కుటుంబాలకు ఉచిత గ్యాస్ కనెక్షన్లు, దీనికి తోడు గ్రామీణ రంగంలో మౌలిక వసతులకు పెద్ద పీట వేస్తోన్న ఈ బడ్జెట్ నిక్కచ్చిగా 'సబ్ కా సాత్–సబ్ కా వికాస్'గానే చెప్పుకోవాలి.

■ సత్తు లింగమూర్తి
జేఎన్‌యూ, న్యూఢిల్లీ

## 'భువనగిరి'కి పోటెత్తిన కందులు



యాదాద్రి భువనగిరి జిల్లా కేంద్రంలోని మార్కెట్ యార్డులోని కొనుగోలు కేంద్రానికి రైతులు శుక్రవారం పెద్ద ఎత్తున కందులను తీసుకొచ్చారు. 175 మంది రైతులు 1400క్వింటాళ్ల కందులను తీసుకొచ్చారని అధికారులు తెలిపారు. వచ్చిన కందులను పూర్తిస్థాయిలో కొనుగోలు చేశారు. కందుల కొనుగోలు కేంద్రానికి శనివారం నుంచి వరుసగా ఐదు రోజులు సెలవు ప్రకటించడంతో పెద్దఎత్తున కందులు తరలించారు. దాదాపు 80 శాతం కొనుగోళ్లు జరిగాయని అధికారులు అంటున్నా.. ఇంకా రైతుల వద్ద కందుల రాశులు ఉన్నాయి. దళారులు తెచ్చిన కందులే ఎక్కువగా కొనుగోలు చేసినందునే కొనుగోలు కేంద్రాల్లో రైతుల తాకిడి ఎక్కువైందని అభిప్రాయం వ్యక్తమవుతోంది. - యాదాద్రి

## యాదాద్రిలో వైభవంగా లక్ష్మీ పూజలు



యాదాద్రి శ్రీ లక్ష్మీనరసింహస్వామి సన్నిధిలో శుక్రవారం లక్ష్మీ పూజలు, స్వామికి సువర్ణ పుష్పార్చనలు వైభవంగా జరిగాయి. వేకువ జామునే ప్రధానాలయంలోని మూలమూర్తులను కొలిచిన అర్చకులు బాలాలయంలోని కవచ మూర్తులను హారతి నివేదించి 108 బంగారు పుష్పాలతో అర్చించారు. కల్యాణ మండపంలో ఉత్సవ మూర్తులను అలంకరించి నిత్య కల్యాణోత్సవం జరిపారు. ముందుగా సుదర్శన శతక పఠనంతో హోమం కొనసాగింది. సాయంత్రం ఆండాల్ అమ్మవారి ఊంజల్ సేవోత్సవం జరిగింది. ఆండాల్ అమ్మవారిని దివ్య మనోహరంగా అలంకరించిన పూజారులు ప్రత్యేక సేవలో తీర్చిదిద్ది బాలాలయ మండపంలో ఊరేగింపు నిర్వహించారు. - యాదాద్రి టౌన్



అరెస్టయిన మహిళా మావోయిస్టులు

## ఇద్దరు మహిళా మావోయిస్టుల అరెస్టు

భద్రాచలం, ఫిబ్రవరి 9: ఛత్తీస్‌గఢ్‌లోని బీజాపూర్ జిల్లా ఊసూరు పోలీస్ స్టేషన్ పరిధిలో ఇద్దరు మహిళా మావోయిస్టులను శుక్రవారం పోలీసులు అరెస్టు చేశారు. కూంబింగ్ సందర్భంగా ఇద్దరిని అరెస్టు చేసి డిటోనేటర్లు, వైర్ బాంబులు ఇతర సామగ్రిని స్వాధీనం చేసుకున్నారు. దంతెవాడ జిల్లా పులిపాడులో లొంగిపోయిన నక్సలైట్ లింగాను మావోయిస్టులు కాల్చి చంపినట్లు విశ్వసనీయ వర్గాలు తెలిపాయి.

## విద్యుదాఘాతంతో రైతు మృతి

మదనాపురం, ఫిబ్రవరి 9: వనపర్తి జిల్లా మదనాపురం మండలం గోపన్‌పేటకు చెందిన తెలుగు వెంకన్న (54) శుక్రవారం ఉదయం మరో వ్యక్తితో కలిసి చేను దగ్గర ఉన్న బోరు మోటార్‌ను ఆన్ చేయబోగా విద్యుత్ షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందాడు.

## రైలు కింద పడి విద్యార్థి మృతి

కాజీపేట, ఫిబ్రవరి 9 : వరంగల్ అర్బన్ జిల్లాలోని కాజీపేట-పెండ్యాల రైల్వే స్టేషన్ల మధ్య శుక్రవారం ఓ బీటెక్ విద్యార్థి రైలు కింద పడి మృతి చెందాడు. అనంతపురం జిల్లాకు చెందిన పి.జనార్దన్ (22) కృష్ణా జిల్లాలో బీటెక్ ఫైనల్ ఇయర్ చదువుతున్నాడు. ఉద్యోగం కోసం హైదరాబాద్‌కు వచ్చిన అతడు, తన స్నేహితుడితో కలిసి భద్రాచలం దేవాలయ సందర్శనకు కాకతీయ ఫాస్ట్ ప్యాసింజర్ రైల్లో బయల్దేరాడు. స్నేహితుడు నిద్రలో ఉండగా, పెండ్యాల రైల్వే స్టేషన్ దాటగానే జనార్దన్ రైలు కిందపడి మృతి చెందాడు. అయితే జనార్దన్ ప్రమాదవశాత్తు రైలు కిందపడి మృతి చెందాడా లేక ఆత్మహత్యకు పాల్పడ్డాడా అనే కోణంలో రైల్వే పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

## రైలు కిందపడి కూలీ మృతి

కాజీపేట, ఫిబ్రవరి 9: మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మండలం ఇంటికన్నెకు చెందిన కూలీ ఆర్.మల్లయ్య (42) శుక్రవారం కాజీపేట సమీపంలో రైలు కిందపడి మృతి చెందాడు. మల్లయ్య మణుగూర్ నుంచి సికింద్రాబాద్ వైపు వెళ్లే కాకతీయ రైలులో ప్రయాణిస్తూ రైలు దిగే యత్నంలో దాని కింద పడి చనిపోయాడు.

## 500 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత

చిలుపూర్, ఫిబ్రవరి 9: జనగామ జిల్లా చిలుపూర్ మండలం రాజవరం సమీపంలోని ఏసీపీ వెంకటేశ్వర బాబు శుక్రవారం తనిఖీ చేసి 500 క్వింటాళ్ల రేషన్ బియ్యం అక్రమ నిల్వల్ని పట్టుకున్నారు. మోటం రాజు, జంపయ్య, సిరిగిరి శంకర్, గురువయ్య గ్రామ సమీపంలో పెద్ద ఎత్తున రేషన్ బియ్యాన్ని నిల్వ చేశారనే పక్కా సమాచారంతో బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు.

# త్వరలో తెలంగాణ యూరియా

- ఈ ఏడాది చివరికల్లా అందుబాటులోకి..
- ఆర్‌ఎఫ్‌సీఎల్ నిర్మాణ పనులు 70 శాతం పూర్తి
- సెప్టెంబర్ నాటికి ఉత్పత్తి మొదలు
- ఏటా 13లక్షల టన్నుల యూరియానే లక్ష్యం

కరీంనగర్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): రాష్ట్ర రైతాంగానికి ఈ సంవత్సరాంతానికి తెలంగాణ యూరియా అందుబాటులోకి రాబోతున్నది. రాష్ట్రంలో వ్యవసాయానికి అవసరమయ్యే యూరియా మొత్తం ఇక్కడే తయారు కాబోతున్నది. రామగుండం ఫెర్టిలైజర్స్ అండ్ కెమికల్స్ లిమిటెడ్ (ఆర్‌ఎఫ్‌సీఎల్) ఎరువుల కర్మాగారం పనులు అత్యంత వేగంగా జరుగుతున్నాయి. ఈ ఫ్యాక్టరీ నిర్మాణం రామగుండంలో 2015 సెప్టెంబర్ 25న ప్రారంభం కాగా.. ఇప్పటికి 70 శాతం పూర్తయింది. ఈ ఏడాది సెప్టెంబర్ 24 నాటికి నిర్మాణ పనులు పూర్తి చేయాలన్నది లక్ష్యం. నేషనల్ ఫెర్టిలైజర్స్ (ఎన్‌ఎఫ్‌ఎల్), ఇంజనీర్స్ ఇండియా లిమిటెడ్ (ఇఐఎల్), ఎస్‌సీఐ, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఉమ్మడి భాగస్వామ్యంలో రూ. 5254 కోట్ల అంచనా వ్యయంతో ఆర్‌ఎఫ్‌సీఎల్‌ను నిర్మిస్తున్నారు. ఈ వ్యయంలో 75 శాతం బ్యాంకుల నుంచి రుణంగా, మిగతా 25 శాతం ఈక్విటీగా నిర్ణయించారు. రాష్ట్ర ప్రభుత్వం రూ. 144 కోట్ల 50 లక్షలు పెట్టుబడి పెట్టాల్సి ఉండగా ఇప్పటికి 50 శాతం నిధులను అందజేసింది. కర్మాగారానికి అవసరమైన అన్ని సదుపాయాలను ఎప్పటికప్పుడు సమకూరుస్తున్నది.

**డిమాండ్‌కు తగ్గట్లు..**

రాష్ట్ర వ్యవసాయరంగంలో 26 లక్షల టన్నుల ఎరువుల డిమాండ్ ఉన్నది. ఇందులో 13 లక్షల టన్నులు యూరియా కాగా, మరో 13 లక్షల టన్నుల మేరకు ఇతర ఎరువులు. ఈ కర్మాగారంలో రోజుకు 3850 టన్నుల యూరియా, 2200 టన్నుల అమోనియా తయారీ లక్ష్యంగా పెట్టుకున్నారు. సంవత్సరానికి 13 లక్షల టన్నుల యూరియా, ఏడున్నర లక్షల టన్నుల అమోనియా తయారు కానుంది.

వేగంగా పనులు

ఆర్‌ఎఫ్‌సీఎల్‌కు అవసరమైన ఇంజనీర్ల నియామక ప్రక్రియ మొదలైంది. 65 ఇంజనీర్ పోస్టులను భర్తీ చేసేందుకు నోటిఫికేషన్ కూడా జారీ అయింది. స్థానికంగా టెక్నీషియన్స్, సూపర్‌వైజర్ పోస్టులకుగాను 400 మందిని భర్తీ చేసుకోనున్నారు. రూ. 3850 కోట్లతో కర్మాగారానికి అవసరమైన యంత్రాలకు ఆర్డర్లు ఇవ్వగా ఇప్పటికే 147 రకాల యంత్రాలు ప్లాంట్‌కు వచ్చాయి. ప్రస్తుతం యూరియా, అమోనియా ప్లాంట్ల నిర్మాణ పనులు, రెండు కూలింగ్ టవర్లు, నైట్రోజన్ ప్లాంట్, అమోనియా స్టోరేజ్ ట్యాంకులు, యూరియా ప్రిల్లింగ్ టవర్లు, 220 కేవీ స్విచ్ యార్డ్, సబ్‌స్టేషన్, డీఎం వాటర్ ప్లాంట్, గ్యాస్ ఎయిర్ సిస్టమ్ పనులు చురుకుగా కొనసాగుతున్నాయి. డెన్‌మార్క్‌కు చెందిన హల్బెర్‌పాప్స్ అనే కంపెనీ అమోనియా తయారీకి, ఇటలీకి చెందిన సైపమ్ అనే కంపెనీ యూరియా తయారీకి సాంకేతిక పరిజ్ఞానాన్ని అందించేందుకు ముందుకు వచ్చాయి. గ్యాస్ ఆధారిత ఎరువుల కర్మాగారమైన దీనికి ఆంధ్రప్రదేశ్‌లోని తూర్పు గోదావరి జిల్లా మల్లవరం నుంచి గ్యాస్ సరఫరా చేయాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. గుజరాత్ స్టేట్ పెట్రోలియం లిమిటెడ్ కంపెనీ అయిన జీఎస్‌పీఎల్ ఇండియా ట్రాన్స్‌కో లిమిటెడ్ సంస్థ పైపులైన్ నిర్మాణంతోపాటు గ్యాస్ సరఫరాకు కాంట్రాక్టు పొందింది. మరో పది నెలల్లో రామగుండంలో యూరియా, అమోనియా తయారీ ప్రారంభం కావడం ఖాయమని, అటు తర్వాత రాష్ట్రంలో యూరియా కొరత తలెత్తే పరిస్థితి ఉండదని అధికారులు ధీమాగా చెబుతున్నారు.



రామగుండంలో కొనసాగుతున్న ఎరువుల ఫ్యాక్టరీ నిర్మాణ పనులు

## మున్సిపాలిటీలకు రూ. 318కోట్ల రుణాలు

తాండూరు : తెలంగాణ అర్బన్ డెవలప్‌మెంట్ మౌలిక సదుపాయాల కార్పొరేషన్ కింద రాష్ట్ర ప్రభుత్వం వివిధ మున్సిపాలిటీలకు ఆదాయ వనరులు పెంచుకునేందుకు రుణాలు మంజూరు చేసింది. ఆయా మున్సిపాలిటీల్లో ఐదేళ్ల పాటు ఆర్థిక పరిస్థితులు అంచనాలు వేసి ఈ రుణాలు మంజూరు చేసింది. ముందుకు మున్సిపాలిటీలలో అవసరమైన పనులు కోసం కౌన్సిల్ తీర్మానం చేసి పనులు ప్రతిపాదిస్తే ఈ నిధులు రుణం రూపేణా (అగ్రిమెంట్) మేరకు చెల్లిస్తారు. గతంలో హడ్కో నాబార్డు ద్వారా రుణాలు ఇవ్వగా ప్రస్తుతం తెలంగాణ అర్బన్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ద్వారా రుణం ఇస్తున్నారు.

**వివిధ మున్సిపాలిటీలకు మంజూరైన రుణాల వివరాలు...**

తాండూరు మున్సిపాలిటీకి రూ.25కోట్లు, దేవరకొండకు రూ.5కోట్లు, పాల్వంచకు రూ.5కోట్లు, ఎల్లెందుకు రూ.3కోట్లు, సత్తుపల్లికి రూ.15కోట్లు, మధిరకు రూ.15కోట్లు, పరకాలకు రూ.15కోట్లు, కోరుట్లకు రూ.25కోట్లు, జగిత్యాలకు రూ.25కోట్లు, పెద్దపల్లికి రూ.25కోట్లు, నిర్మల్‌కు రూ.15కోట్లు, భైంసాకు రూ.5కోట్లు, బెల్లంపల్లికి రూ.10కోట్లు, మందమర్రికి రూ.10కోట్లు, ఆర్మూర్‌కు రూ.25కోట్లు, సిద్దిపేటకు రూ.10కోట్లు, జహీరాబాద్‌కు రూ.10కోట్లు, సంగారెడ్డికి రూ.10కోట్లు, సదాశివపేట్‌కు రూ.10కోట్లు, మెదక్‌కు రూ.15కోట్లు, ఆందోల్ జోగిపేట్‌కు రూ.10కోట్లు, దుబ్బాకకు రూ.10కోట్లు, గజ్వేల్‌కు రూ.10కోట్లు, నాగర్‌కర్నూల్‌కు రూ.10కోట్లు మంజూరయ్యాయి.

# పేదల సంక్షేమమే ధ్యేయం: తుమ్మల

- విలువలతో కూడిన విద్య అవసరం: స్పీకర్ మధుసూదనాచారి

పెనుబల్లి/దమ్మపేట/ఏన్కూరు, ఫిబ్రవరి 9: పేద, బలహీన వర్గాలు, రైతు సంక్షేమమే తమ ప్రభుత్వ ధ్యేయమని, వారికి సంక్షేమ పథకాలు అందించి ఆర్థిక స్వావలంబన కల్పించే దిశగా తాము సాగుతున్నామని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు స్పష్టం చేశారు. శుక్రవారం ఖమ్మం జిల్లా పెనుబల్లి మండలంలో విస్తృతంగా పర్యటించిన ఆయన రూ.8 కోట్లతో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. లంకాసాగర్, కారాయిగూడెం గ్రామాల్లో జరిగిన సభల్లో మంత్రి తుమ్మల మాట్లాడారు. రైతులకు వ్యవసాయాన్ని లాభసాటిగా చేసేందుకు ముఖ్యమంత్రి కేసీఆర్ అనేక పథకాలకు రూపకల్పన చేస్తున్నారని వాటిని అందిపుచ్చుకుని లాభాలను ఆర్జించాలన్నారు. ఇందుకోసం ప్రభుత్వం విత్తనాలు, ఎరువులు సబ్సిడీతో ఇవ్వడం, యంత్రాలు, టెక్నాలజీతో పాటు సాగుకు 24 గంటల విద్యుత్ సరఫరా, గోడౌన్లు, మార్కెటింగ్ సౌకర్యాలు, ప్రాజెక్టులు, ఎత్తిపోతల పథకాల ద్వారా తాగునీరు అందించడం, దుక్కి కోసం ఎకరాకు ఖరీఫ్‌లో రూ.4 వేలు, రబీలో రూ.4 వేల చొప్పున సహాయం అందిస్తున్నామన్నారు. 24 గంటల విద్యుత్ సరఫరా, లోవోల్టేజ్ నివారణ కోసం అనేక ప్రాంతాల్లో విద్యుత్ సబ్‌స్టేషన్లను మంజూరు చేశామన్నారు. జిల్లాలోని అన్ని చెరువులను నాలుగు విడతలుగా మిషన్ కాకతీయ పథకం ద్వారా అభివృద్ధి చేస్తున్నామన్నారు. లంకాసాగర్ ప్రాజెక్టుకు గోదావరి నీళ్లు అందిస్తామని, మిషన్ భగీరథ పథకం ద్వారా అన్ని గ్రామాలకు తాగునీరు ఉగాది నాటికి అందిస్తామన్నారు.



పెనుబల్లి మండలం కారాయిగూడెం సభలో మాట్లాడుతున్న తుమ్మల

ఆధునిక సాగు వైపు రైతులను మళ్లించాలని భద్రాద్రి కొత్తగూడెం జేడీఏ అభిమన్యుడిని మంత్రి తుమ్మల ఆదేశించారు. తనను కలిసిన జేడీఏతో మాట్లాడుతూ అర్హులకు రాయితీ ట్రాక్టర్లు అందే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. సమాజానికి విలువలతో కూడిన విద్య ఎంతో అవసరమని, ప్రభుత్వం విద్యకు ప్రాధాన్యమిస్తోందని స్పీకర్ సిరికొండ మధుసూదనాచారి అన్నారు. శుక్రవారం ఖమ్మం జిల్లా ఏన్కూరు మండలం తిమ్మారావుపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 60 వసంతాల వేడుకకు హాజరైన ఆయన విద్యార్థులనుద్దేశించి ప్రసంగించారు. ఒక్కో గురుకుల విద్యార్థికి ఏడాదికి రూ.1.20 లక్షలు ఖర్చవుతుందన్నారు.



స్వరాష్ట్రానికి వెళుతున్న ఛత్తీస్‌గఢ్ కూలీలు

## వెట్టిచాకిరీ నుంచి 24 మందికి విముక్తి

- ఛత్తీస్‌గఢ్ అధికారుల విచారణ ఫలితం

పెద్దపల్లి రూరల్, ఫిబ్రవరి 9: పెద్దపల్లి సమీపంలోని రాఘవాపూర్‌లోని ఒక ఇటుక బట్టీలో నిర్బంధంగా వెట్టిచాకిరీ చేస్తున్న వారికి ఛత్తీస్‌గఢ్ రాష్ట్రానికి చెందిన అధికారులు విచారణ జరిపి విముక్తి కల్పించారు. బలోతబజార్ జిల్లా చందన్ గ్రామానికి చెందిన పలువురు కూలీలు పెద్దపల్లి మండలం రాఘవాపూర్‌లోని ఏబీఎస్ ఇటుక బట్టీలో పని చేస్తున్నారు. కార్మిక శాఖ నిబంధనలకు విరుద్ధంగా వారితో ఎక్కువ గంటలు పని చేయించడంతోపాటు, తక్కువ వేతనాలు ఇస్తున్నారని, వారిని బందీలుగా ఉంచుకుని ఎటూ వెళ్లనీయకుండా వెట్టిచారికీ చేయిస్తున్నారని, బాల కార్మికులచే పనులు చేయిస్తున్నారని అక్కడి కలెక్టర్ రాజశ్రీ రాణా కు కొందరు ఫిర్యాదు చేశారు. దీనికి స్పందించిన అక్కడి కలెక్టర్, ఐదుగురు అధికారులను విచారణకు పంపారు. వారు పెద్దపల్లి కలెక్టర్ శ్రీదేవసేనను కలిశారు. శుక్రవారం బట్టీ వద్ద పని చేస్తున్న 24 మంది కూలీలకు విముక్తి కలిగించి ఛత్తీస్‌గఢ్‌కు తరలించారు.


## కాంట్రాక్టు ఉద్యోగుల కమబద్ధీకరణకు చట్టం

- ఆర్. కృష్ణయ్య డిమాండ్

బర్కత్‌పుర/హైదరాబాద్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల సర్వీస్‌ను క్రమబద్ధీకరించడానికి అసెంబ్లీలో ప్రత్యేక చట్టం తీసుకురావాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్ కృష్ణయ్య డిమాండ్ చేశారు. బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం అర్థ గణాంక శాఖ కాంట్రాక్టు సూపర్‌వైజర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన సదస్సులో మాట్లాడుతూ రాష్ట్రంలో 2 లక్షల 20వేల మంది కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు పని చేస్తున్నారని వీరి సర్వీస్‌ను తక్షణమే రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేశారు. కాంట్రాక్టు ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులరైజ్‌చేస్తూ ప్రభుత్వం జీవోలు జారీ చేస్తున్నప్పటికి న్యాయస్థానాలు స్టేలు ఇస్తున్నాయని దీని వలన అనేక సమస్యలు ఉత్పన్నమవుతున్నాయని ఆయన చెప్పారు. ప్రభుత్వం స్పందించకపోతే 5 లక్షల మందితో హైదరాబాద్‌ను దిగ్బంధం చేస్తామని ఆయన హెచ్చరించారు. తెగించి పోరాటం చేస్తేనే కాంట్రాక్టు ఉద్యోగులు తమ హక్కులను సాధించుకోవచ్చునని ఆయన చెప్పారు.

## దళితుల నిధులు పక్కదారి: వంగపల్లి శ్రీనివాస్

ఉస్మానియా యూనివర్సిటీ, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ, ఎస్టీలకు అందాల్సిన నిధులను మిషన్ కాకతీయ, మిషన్ భగీరథలకు మళ్లిస్తున్నారని టీఎమ్మార్పీఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ వంగపల్లి శ్రీనివాస్ ఆరోపించారు. ఓయూ ఆవరణలో శుక్రవారం ఎస్సీ, ఎస్టీ నిధుల కేటాయింపు-ఖర్చు అనే అంశంపై దళిత, గిరిజనుల ఆధ్వర్యంలో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా యాతాకుల భాస్కర్, ప్రేమ్‌కుమార్‌తో కలిసి వంగపల్లి శ్రీనివాస్ మాట్లాడారు. రాష్ట్ర బడ్జెట్‌లో కేటాయించిన విధంగా ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ నిధులను ఇప్పటికైనా సక్రమంగా ఖర్చు చేయాలని, లేకపోతే రాష్ట్ర వ్యాప్త ఉద్యమం చేస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఎస్సీ, ఎస్టీ నిధులను నోడల్ ఏజెన్సీ ద్వారా ఖర్చు చేయాలని వారు డిమాండ్ చేశారు. ఎస్సీ జాబితాలోని 60 కుల సంఘాలతో త్వరలో సమావేశాన్ని నిర్వహించనున్నట్లు వివరించారు.



మాట్లాడుతున్న ఎస్సీ సంఘ నాయకులు

## రూ. 500 కోట్లతో సేవా కార్యక్రమాలు

- తానా అధ్యక్షుడు జయశేఖర్, ఫౌండేషన్ చైర్మన్ నిరంజన్

భద్రాచలం టౌన్, ఫిబ్రవరి 9: తానా ఆధ్వర్యంలో ఉభయ తెలుగు రాష్ట్రాల్లో గత 40 ఏళ్లలో రూ.500 కోట్లతో అభివృద్ధి, సేవా కార్యక్రమాలు చేపట్టినట్లు తానా ఎలెక్టెడ్ ప్రెసిడెంట్ తాళ్లూరి జయశేఖర్, తానా ఫౌండేషన్ చైర్మన్ శృంగవరపు నిరంజన్ తెలిపారు. శుక్రవారం భద్రాచలంలో వారు విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ప్రధానంగా విద్య, వైద్యానికి తానా అధిక ప్రాధాన్యం ఇస్తూ సేవా కార్యక్రమాలు చేపడుతుందని తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌లో ప్రభుత్వంతో కలిసి ఐదువేల పాఠశాలల్లో డిజిటల్ విద్య ద్వారా ప్రమాణాలను పెంచడానికి కృషి చేస్తోందని అన్నారు. ఈ సందర్భంగా జయశేఖర్, నిరంజన్‌లను విద్యావేత్త చావా లక్ష్మీనారాయణ సత్కరించారు.



మాట్లాడుతున్న జయశేఖర్, నిరంజన్

## విద్యార్థులు సమాజానికి దిక్సూచి: వరవరరావు



మాట్లాడుతున్న వరవరరావు

వడ్డేపల్లి, ఫిబ్రవరి 9 (వరంగల్ అర్బన్): బ్రాహ్మణీయ, భూస్వామ్య, సామ్రాజ్యవాద వ్యతిరేక పోరాటాల్లో అగ్రభాగాన నిలిచిన విద్యార్థులు సమాజానికి దిక్సూచి అని విరసం నేత వరవరరావు అన్నారు. హన్మకొండ వడ్డేపల్లి రోడ్‌లోని విద్యుత్ భవన్‌లో డెమోక్రటిక్ స్టూడెంట్స్ యూనియన్ (డీఎస్‌యూ) రాష్ట్ర ప్రథమ మహాసభలు శుక్రవారం ముగిశాయి. డీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు కంచర్ల బద్రి అధ్యక్షతన శుక్రవారం రాత్రి నిర్వహించిన బహిరంగ సభలో వరవరరావు ముఖ్య అతిథిగా మాట్లాడారు. శాస్త్రీయ విద్య కోసం, సామ్రాజ్యవాదాన్ని ఓడించేందుకు ప్రజాస్వామిక వాదులు, శక్తులు ఏకం కావాలని కోరారు. పోరాడే ప్రజలపై అమలవుతున్న రాజ్య నిర్బంధానికి వ్యతిరేకంగా సమాజంలో ప్రతీ పౌరుడు పోరాడాలని పిలుపునిచ్చారు. రాజకీయ విశ్వాసాల ఆధారంగా అరెస్టయి జైళ్లలో మగ్గుతున్న వారందరినీ రాజకీయ ఖైదీలుగా గుర్తిస్తూ, బేషరతుగా విడుదల చేయాలన్నారు. దండకారణ్యంలో ఆదివాసీలపై దాడులు, ఊచ కోతలను అరికట్టాలని డిమాండ్ చేశారు.

## నల్లగొండ మున్సిపల్ ఉద్యోగిపై నిఘా

- ఢిల్లీలో 420, 409 సెక్షన్ల కింద కేసు నమోదు
- నేడో రేపో ఢిల్లీ పోలీసులు

నల్లగొండ, ఫిబ్రవరి 9: నల్లగొండ మునిసిపల్ కార్యాలయంపై ఢిల్లీ పోలీసులు నిఘా పెట్టినట్లు సమాచారం. పురపాలక సంఘ కార్యాలయంలో పనిచేస్తూ అవినీతి, అక్రమాలకు పాల్పడి సస్పెండ్ అయి తిరిగి ఇటీవల విధుల్లో చేరాడు. అయితే సదరు ఉద్యోగిపై ఢిల్లీలో 420, 409 సెక్షన్లు కేసు నమోదైనట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో ఢిల్లీ పోలీసులు నల్లగొండ పురపాలక సంఘ కార్యాలయం, గతంలో పనిచేసిన దేవరకొండ నగర పంచాయతీల్లో సదరు ఉద్యోగి పనితీరుపై ఆరా తీసినట్లు సమాచారం. ఇదిలా ఉండగా.. ఫిబ్రవరి 1న అతడిని రిలీవ్ చేసినప్పటికీ రిలీవ్ ఆర్డర్ తీ సుకోలేదు.

## సింగరేణిలో సమ్మె మార్చి 12కు వాయిదా

మంచిర్యాల, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి) : సింగరేణిలో సీఎం కేసీఆర్ ఇచ్చిన హామీలను అమలు చేయాలనే డిమాండ్‌తో ఈ నెల 14 న నాలుగు జాతీయ కార్మిక సంఘాలు జరప తలపెట్టిన సమ్మె మార్చి 12కు వాయిదా పడింది. శుక్రవారం డిప్యూటీ సీఎల్‌సీ శ్యాం సుందర్ వద్ద యాజమాన్యంతో జరిగిన చర్చల్లో నెలాఖరుకు అన్ని విషయాలపై నిర్ణయం తీసుకుంటామని సింగరేణి డైరెక్టర్ పవిత్రన్ కుమార్ హామీ ఇచ్చారని కార్మిక సంఘాల ప్రతినిధులు తెలిపారు. తమ డిమాండ్లను ఆమోదించక పోతే మార్చి 12న టోకెన్ సమ్మె చేస్తామని తెలిపారు

# గిడ్డంగుల సంస్థ తూకంలో మోసం

- తూనికలు, కొలతల శాఖ తనిఖీలు
- వే బ్రిడ్జి, ఇండికేటర్ మిషన్ సీజ్
- మేనేజర్, సూపర్‌వైజర్లపై కేసు నమోదు

నల్లగొండ టౌన్, ఫిబ్రవరి 9 : సీడబ్ల్యూసీ గోదాములలో మోసాలు వెలుగు చూస్తున్నాయి. రేషన్ దుకాణాలకు సరఫరా చేసే బియ్యం తక్కువ తూకం వస్తున్నాయన్న ఫిర్యాదు మేరకు శుక్రవారం తూనికలు, కొలతల శాఖ అసిస్టెంట్ కంట్రోలర్ పి.రామకృష్ణ నేతృత్వంలో పౌర సరఫరాల సంస్థ మేనేజర్ భాస్కర్‌రావుతో కలిసి నల్లగొండలోని ఆర్జాలబావి, తిప్పర్తి మండలం దుప్పలపల్లి వద్ద గల గిడ్డంగుల సంస్థ గోదాములో దాడులు నిర్వహించారు. ప్రతి టన్నుకు పది కిలోల బియ్యం చొప్పున, ఐదు టన్నులకు 50 కేజీల బియ్యం తక్కువగా వస్తున్నట్లు గుర్తించారు. దీంతో సదరు గిడ్డంగుల సంస్థల మేనేజర్ సురేష్, సూపర్‌వైజర్‌లు హరిబాబు, భవానిలపై కేసు నమోదు చేసి గోదాముల్లోని వే బ్రిడ్జి, ఇండికేటర్ మిషన్లను సీజ్ చేశారు.

**అక్రమాలు ఇలా వెలుగులోకి..**

ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా ప్రజలకు పంపిణీ చేసే సబ్సిడీ బియ్యం సీడబ్ల్యూఎస్ గోదాం నుంచి ఆయా నియోజకవర్గాల్లో ఉన్న ఎంఎల్ఎస్ పాయింట్లకు, అక్కడ నుంచి నేరుగా డీలర్లకు చేరుతాయి. అయితే తమకు సరఫరా అయ్యే బియ్యం తక్కువగా వస్తున్నాయని చాలా ఏళ్లుగా డీలర్లు చెబుతున్నా అధికారులు పట్టించుకోలేదు. తాజాగా డీలర్లకు ఈ-పాస్ మిషన్లు రావడంతో బియ్యం తక్కువ వస్తున్నాయని డీలర్లు ఇటీవల పౌర సరఫరాల కమిషనర్ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో కమిషనర్ జిల్లా స్థాయి అధికారులకు ఆదేశాలు జారీ చేయడంతో తనిఖీలు చేపడుతున్నారు. ఈ మేరకు శుక్రవారం సీడబ్ల్యూసీ గోదాములో తనిఖీలు నిర్వహించగా అక్రమాలు వెలుగులోకి వచ్చాయి.

## ● శనగకు తెగులు బెడద

పచ్చగా కళకళలాడాల్సిన శనగ పంట ఇది! కేవలం తేమతోనే పండే ఈ పంటకు ఈసారి ఆ తేమ కూడా దక్కడం లేదు. తెగుళ్ల సోకి... బీడుబారుతున్నది. ప్రస్తుతం నిర్మల్ జిల్లాలో ఎక్కడ చూసినా ఇదే దుస్థితి! జిల్లాలో ఖరీఫ్‌లో తీవ్ర వర్షాభావ పరిస్థితుల మూలంగా భూగర్భజలాలు అడుగంటిపోయాయి. ఆ సీజన్‌లో నష్టపోయిన రైతులు.. తేమకే పండే శనగపై ఆశపెట్టుకొని రబీ సీజన్‌లో జిల్లాలో 9వేల హెక్టార్లలో సాగుచేశారు. నేలలో తడి, తేమ శాతం తగ్గిపోవడంతో శనగ పంటకు పచ్చపురుగు పట్టుకుంది. తెగుళ్ల సోకి కాయలన్నీ బుర్రలవుతున్నాయి. పెట్టుబడులు కూడా వచ్చే పరిస్థితి లేదని, ప్రభుత్వమే తమను ఆదుకోవాలని రైతులు వేడుకుంటున్నారు.
- భైంసా





## పత్తికి కూలీల కొరత

పత్తి పంట దిగుబడి ఫర్వాలేదు.. బాగానే పండింది! పత్తిని తెంపేందుకు కూలీలు దొరకకపోవడం ఒక సమస్య అయితే.. అనుకున్న సమయానికి తెంపకపోతే గులాబీ రంగు పురుగు విస్తరించే ప్రమాదం ఉండటం మరో సమస్య. మంచిర్యాల జిల్లాలో నెలకొన్నది ఈ పరిస్థితి. ఇదే అదునుగా మహారాష్ట్ర నుంచి కొందరు దళారులు పంట చేల దగ్గరకు వచ్చి తక్కువ ధరకే పత్తిని కొనుగోలు చేస్తు చేస్తున్నారు.
- మంచిర్యాల, (ఆంధ్రజ్యోతి)



బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మణ్ సమక్షంలో పార్టీలో చేరుతున్న టీఆర్ఎస్ జడ్పీటీసీ సభ్యుడు రామునాయక్, సర్పంచ్‌లు,ఎంపీటీసీలు

## ● కాంగ్రెస్, టీఆర్ఎస్ దొందూదొందే: లక్ష్మణ్

హైదరాబాద్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): అవినీతి, వారసత్వ రాజకీయాలకు కాంగ్రెస్, టీఆర్ఎస్ పార్టీలు మారుపేర్లని, రెండూ దొందూదొందేనని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మణ్ విమర్శించారు. తెలంగాణ ప్రజలు కాంగ్రెస్‌ను నమ్మే స్థితిలో లేరని, టీఆర్ఎస్‌కు అసలు సిసలైన ప్రత్యామ్నాయం బీజేపీ మాత్రమేనని స్పష్టం చేశారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాకు చెందిన టీఆర్ఎస్ నేతలు లక్ష్మణ్ సమక్షంలో శుక్రవారం బీజేపీలో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంక్షేమ పథకాలను నేరుగా లబ్ధిదారులకే చేర్చిన ఘనత ప్రధాని మోదీదేనని పేర్కొన్నారు. కాంగ్రెస్, టీఆర్ఎస్.. మజ్లిస్ పార్టీని పెంచిపోషించాయని దుయ్యబట్టారు. బీసీ రిజర్వేషన్ల బిల్లును పార్లమెంట్‌లో ప్రవేశపెడితే కాంగ్రెస్, టీఆర్ఎస్ అడ్డుకుంటున్నాయని విమర్శించారు.

## ● వారు కేసీఆర్ కాలిగోటికి సరిపోరు : పల్లా

▸ కాంగ్రెస్.. కాలకేయ ముఠా : కర్నె

▸ రేవంత్.. కాంగ్రెస్ అవసరం లేదని అనలేదా?: శంభీపూర్ రాజు



శంభీపూర్ రాజు

హైదరాబాద్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ ప్రయోజనాలను తాకట్టు పెట్టిన కాంగ్రెస్ నేతలు దద్దమ్మలేనని, వారిని అలా కాకుండా ఇంకేమనాలని ప్రభుత్వ విప్ పల్లా రాజేశ్వర్‌రెడ్డి ప్రశ్నించారు. జనతా పార్టీ నుంచి కాంగ్రెస్‌లో చేరిన జైపాల్‌రెడ్డి, ఆయన వారసుడినని గొప్పలు పోతున్న రేవంత్‌రెడ్డి ఒకప్పుడు కాంగ్రెస్‌ను తిట్టినవారేనని గుర్తు చేశారు. టీఆర్ఎస్ఎల్పీలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ సీఎం కేసీఆర్ కాలి గోటికి కూడా కాంగ్రెస్ నేతలు సరిపోరని విమర్శించారు. ఉత్తమ్ నేతృత్వంలోని కాంగ్రెస్ పార్టీ.. కాలకేయ ముఠాలా వ్యవహరిస్తోందని, బాహుబలిలా కేసీఆర్ రాష్ట్రాన్ని కాపాడుతున్నారని ఎమ్మెల్సీ కర్నె ప్రభాకర్ అన్నారు. తెలుగు రాష్ట్రాలకు కాంగ్రెస్ పార్టీ అవసరం లేదంటూ ఆంధ్రజ్యోతిలో వ్యాసం రాసిన రేవంత్‌రెడ్డి.. ఇప్పుడు అదే పార్టీలో ఉన్నారని ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు గుర్తుచేశారు. 2016 జూన్‌లో రేవంత్ రాసిన వ్యాసాన్ని ఆయన విలేకరులకు చూపించారు.

## ● సీపీఎం సభలను జయప్రదం చేయాలి: రాఘవులు

హైదరాబాద్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): ఏప్రిల్‌లో జరగనున్న సీపీఎం అఖిల భారత మహాసభలను విజయవంతం చేయాలని ఆ పార్టీ కేంద్ర కమిటీ పొలిట్‌బ్యూరో సభ్యుడు బీవీ రాఘవులు కార్యకర్తలకు పిలుపునిచ్చారు. హైదరాబాద్‌లో నిర్వహించనున్న మహాసభల్లో తెలంగాణ సంస్కృతి ఉట్టిపడేలా ప్రత్యేక కళారూపాలు ఉండాలని ఎంబీ భవన్‌లో శుక్రవారం జరిగిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో చెప్పారు. ప్రభుత్వాలు అనుసరిస్తున్న విధానాలపై పోరాడుతామని రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం తెలిపారు.

## ● పింఛన్లు ఇవ్వలేని దౌర్భాగ్య పాలన: టీడీపీటీఎస్

హైదరాబాద్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): వికలాంగులు, వితంతువులు, వృద్ధులకు చెల్లించాల్సిన పింఛన్లు కూడా ఇవ్వలేని దౌర్భాగ్య పాలన సీఎం కేసీఆర్‌దని టీడీపీ-టీఎస్ ప్రధాన కార్యదర్శి నన్నూరి నర్సిరెడ్డి విమర్శించారు. అధికారంలోకొస్తే పెద్దకొడుకునవుతానని ప్రగల్భాలు పలికిన కేసీఆర్... పింఛన్‌దారులను ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఒక ప్రకటనలో మండిపడ్డారు.

## ● అప్పులతో బంగారు తెలంగాణ సాధ్యమా?

▸ రైతుల సమస్యలు పట్టించుకోరా? : కోదండరాం

నిజామాబాద్, ఫిబ్రవరి 9: (ఆంధ్రజ్యోతి): ప్రాజెక్టుల పేరుతో ప్రభుత్వం నిధులను దుర్వినియోగం చేస్తూ.. రాష్ట్రాన్ని అప్పుల పాలు చేస్తోందని టీజేఏసీ చైర్మన్ కోదండరాం విమర్శించారు. నిజామాబాద్, బోధన్‌లో నిర్వహించిన పలు కార్యక్రమాల్లో ఆయన పాల్గొని ప్రసంగించారు. అప్పులతో బంగారు తెలంగాణ సాధ్యమా? అని ప్రశ్నించారు. పార్లమెంట్‌లో ఆంధ్ర ప్రాంత డిమాండ్ల కోసం మన ఎంపీలు మద్దతు తెలపడం ఏమిటని ప్రశ్నించారు. రాష్ట్రంలో రైతుల సమస్యలపై పార్లమెంట్‌లో ఎంపీలు మాట్లాడితే బాగుండేదన్నారు. ప్రాజెక్టులపై పెట్టే నిధులతో కాంట్రాక్టర్లకు మాత్రమే లబ్ధి కలుగుతోందన్నారు. ఆ నిధులను విద్యా వ్యవస్థపై ఖర్చుచేయాల్సిందన్నారు. పార్టీపై త్వరలోనే స్పష్టత ఇస్తామని, విధి విధానాలను ప్రకటిస్తామన్నారు.

## ● నేడు జాతీయ లోక్ అదాలత్

▸ పెండింగ్ కేసులకు కలగనున్న మోక్షం

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): కింది స్థాయి కోర్టు నుంచి హైకోర్టు దాకా.. న్యాయస్థానాల్లో ఏళ్ల తరబడి లక్షల్లో కేసులు పెండింగ్‌లో ఉంటున్నాయి. కొన్ని కేసుల్లో కోర్టుల చుట్టూ తిరుగుతున్నా.. ఒక పట్టాన పరిష్కారం లభించదు. బాధితులు లాయర్ల ఫీజులు చెల్లించలేక చితికిపోతుంటారు.. పోరాటం చేయలేమంటూ చతికిలపడిపోతుంటారు. ఇలాంటి కేసులను పరిష్కరించేందుకు సుప్రీంకోర్టు లోక్ అదాలత్‌లను ఏర్పాటు చేసింది. కోర్టు విచారణల మాదిరిగా.. లోక్‌అదాలత్‌లలో గంటల తరబడి వాదోపవాదాలుండవు. ఇరు వర్గాలు రాజీకి సిద్ధంగా ఉంటే చాలు. అయిదు నిమిషాల్లో కేసు పరిష్కారమవుతుంది. జిల్లా కోర్టుల్లో.. కేసుల తీవ్రతను బట్టి ప్రత్యేక బెంచ్‌లను ఏర్పాటు చేస్తారు. సగటున ఒక్కో బెంచ్ రోజుకు 300 కేసులను పరిష్కరిస్తుంది. ఈ వ్యవహారం రెండు పార్టీలకు ముందస్తు సమాచారమిచ్చాకే జరుగుతుంది. ఒక్కసారి లోక్ అదాలత్‌లో తీర్పు వచ్చాక.. బాధితులు, నిందితులు హైకోర్టుల్లో అప్పీల్‌కి వెళ్లే అవకాశముండదు. కోర్టులకే కాకుండా.. పెండింగ్‌లో ఉండే కేసుల పరిష్కారానికి పోలీసులకూ లోక్ అదాలత్ ఒక వరంగా మారింది. రాజీ కుదుర్చుకోదగ్గ కేసులను క్లియర్ చేసేందుకు పోలీసులు లోక్ అదాలత్‌ను సువర్ణావకాశంగా భావిస్తారు.



## ఆర్డర్.. ఆర్డర్..

## ● స్పెషల్ పీపీగా త్రినాథరావు వద్దు

▸ ఆయనపై క్రిమినల్ ఆరోపణలు.. 'వాకపల్లి' కేసులో 2 అప్పీళ్లు

▸ విచారణకు స్వీకరించిన హైకోర్టు

హైదరాబాద్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): విశాఖ జిల్లా వాకపల్లి అత్యాచార బాధితుల కేసులో స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా పల్లా త్రినాథరావును నియమించాలని గతనెల హైకోర్టు సింగిల్ జడ్జి ఇచ్చిన ఆదేశాలపై రెండు అప్పీళ్లు దాఖలయ్యాయి. అందులో ఒకదానిని న్యాయశాఖ ముఖ్యకార్యదర్శి, విశాఖపట్నం కలెక్టర్, హోంశాఖ ముఖ్యకార్యదర్శి సంయుక్తంగా దాఖలు చేశారు. ఈ కేసులో అభియోగాలు ఎదుర్కొంటున్న పోలీసులు మరొక అప్పీలు సమర్పించారు. ప్రభుత్వం దాఖలు చేసిన అప్పీలుపై శుక్రవారం హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రమేశ్ రంగనాథన్, జస్టిస్ కే విజయలక్ష్మిల బెంచ్ విచారణ చేపట్టింది. అయితే, తమ వైపు నుంచీ ఒక అప్పీలు ఉందని, దానినీ ప్రభుత్వం దాఖలు చేసిన అప్పీలు పిటిషన్‌తో జతచేసి విచారణ చేయాలని ఈ కేసులో అభియోగాలు ఎదుర్కొంటున్న పోలీసుల తరపు న్యాయవాది కోరారు. అందుకు ధర్మాసనం సమ్మతించింది. ఈ రెండు అప్పీళ్లపై సోమవారం విచారణ జరుపుతామని తెలిపింది. స్పెషల్ పీపీగా నియమించాలని సింగిల్ జడ్జి ఆదేశించిన త్రినాథరావుపై క్రిమినల్ కేసు నమోదైనట్లు ఏపీ ప్రభుత్వం వాదించింది.

## ● రుణ విమోచన కమిషన్ ఏది?: హైకోర్టు

హైదరాబాద్, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): రైతు రుణ విమోచన కమిషన్ ఏర్పాటులో జాప్యం ఎందుకు జరుగుతోందని హైకోర్టు రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించింది. మూడు నెలల్లో కమిషన్ ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చినా ఇప్పటికీ ఎందుకు అమలు చేయలేదంటూ అసహనం వ్యక్తం చేసింది. 3 నెలల్లో ఏర్పాటు చేయలేకపోతున్నామని, గడువు పొడిగించాలని కోరాల్సి ఉన్నా ఎందుకు నిర్లక్ష్యంగా ఉన్నారని నిలదీసింది. ప్రభుత్వ వైఖరిని కోర్టు ధిక్కరణగా ఎందుకు పరిగణించరాదని, కమిషన్‌ను ఎందుకు ఏర్పాటు చేయలేదో వివరణ ఇస్తూ రెండు వారాల్లో కౌంటర్ దాఖలు చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని ఆదేశించింది. ఈ మేరకు ఏసీజే జస్టిస్ రమేశ్ రంగనాథన్ నేతృత్వంలోని ధర్మాసనం శుక్రవారం ఉత్తర్వులు జారీచేసింది.

# అగ్ర నేతలతో చెట్టపట్టాల్!

## కొత్వాల్‌గూడను తాకట్టుపెట్టిన సౌమిత్‌కు పెద్దల అండ

▸ కేజ్రీవాల్, ఆడ్వాణీ, మోహన్ భగవత్, మురళీధర్‌రావు తదితరులతో సంబంధాలు

▸ మహారాష్ట్ర నుంచి రాజ్యసభకు వెళ్లే యత్నం

▸ రాజకీయాల్లోకి దిగిన భార్య ప్రీతి జెనా

▸ 'ఆంధ్రజ్యోతి' పరిశీలనలో వెల్లడి

(ఆంధ్రజ్యోతి, రంగారెడ్డి జిల్లా ప్రతినిధి)

సౌమిత్ రంజన్ జెనా! కొత్వాల్‌గూడను కేంద్ర ప్రభుత్వరంగ సంస్థ పీఈసీకి తాకట్టు పెట్టిన ఫైసీస్ ఎగ్జిమ్ కంపెనీ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్. ఊరిని తనఖా పెట్టి రూ.332 కోట్లు నొక్కేయడమే కాదు.. పీఈసీకి దాదాపు రూ.650 కోట్ల బకాయిలు ఎగ్గొట్టాడు! ప్రభుత్వాన్ని, జనాన్ని నిండా ముంచి ఖరీదైన కార్లు, బంగళాలతో విలాసవంతమైన జీవితం గడుపుతున్నాడు. అయినా, అతనిపై ఈగ వాలడం లేదు. ఇప్పటి వరకూ ఒక్క కేసు కూడా నమోదు కాలేదు. ఇందుకు కారణం.. అతనికి ఉన్న రాజకీయ సంబంధాలే! ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్, బీజేపీ అగ్రనేత ఎల్‌కే ఆడ్వాణీ, ఆరెస్సెస్ అధినేత మోహన్ భగవత్, బీజేపీ జాతీయ కార్యదర్శి మురళీధర్ రావు, కర్ణాటకకు చెందిన కేంద్ర మంత్రి రమేశ్ చందప్ప సహా పలువురు ప్రముఖులు, అధికార పార్టీ అగ్రనేతలు, కేంద్ర మంత్రులతో ఆయనకు సన్నిహిత సంబంధాలు ఉన్నాయి. రాజకీయ నాయకులతోపాటు సినీ, ఇతర రంగాల ప్రముఖులతో కూడా సౌమిత్‌కు సన్నిహిత సంబంధాలు ఉన్నట్లు 'ఆంధ్రజ్యోతి' పరిశీలనలో వెల్లడైంది. అధికార అండదండలు ఉండడంతోనే కేసులు పెట్టేందుకు కూడా అధికారులు జంకుతున్నారని తెలుస్తోంది. తప్పుడు పత్రాలతో గ్రామానికి గ్రామాన్నే తాకట్టు పెట్టి వందల కోట్ల రుణాన్ని తీసుకున్న సౌమిత్ రంజన్ జెనా ఇప్పటికీ ఢిల్లీలో రాజభోగాలు అనుభవిస్తూనే ఉన్నాడు. అధికార పార్టీ పెద్దలతో చెట్టపట్టాలు వేసుకుని తిరుగుతూనే ఉన్నాడు. అధికార పార్టీల్లోని అగ్రశ్రేణి రాజకీయ నాయకులు మాత్రమే కాదు.. సినీనటి రవీనా టాండన్‌తో పాటు అనేకమంది సినీ ప్రముఖులతో సౌమిత్ కుటుంబానికి సన్నిహిత సంబంధాలున్నాయి. ఒడిసాలో సౌమిత్ కుటుంబానికి కొంత రాజకీయ సంబంధాలుండడం అతనికి కలిసివచ్చింది. అడ్డగోలుగా సంపాదించిన డబ్బు చేతిలో ఉండడంతో రాజకీయ నేతలను విందులు, విలాసాలతో ముంచుతూ ఢిల్లీలో సంబంధాలు పెంచుకున్నాడు. తన ఆర్థిక నేరాల నుంచి బయటపడేందుకు, భవిష్యత్తులో ఇబ్బందుల్లేకుండా ఉండేందుకు రాజకీయాలవైపు అడుగులు వేస్తున్నాడు. ఒడిసాకు చెందిన సౌమిత్ మహారాష్ట్రలోనూ పాగా వేశాడు. ఈ రెండు రాష్ట్రాల్లో ఎక్కడో అక్కడి నుంచి రాజ్యసభకు ప్రాతినిధ్యం వహించేందుకు కొన్నాళ్లుగా అనేక ప్రయత్నాలు చేస్తున్నాడు. రాజ్యసభ లేదా ఎమ్మెల్సీ కావాలంటూ కొందరు అధికార పార్టీ పెద్దల చుట్టూ తిరిగాడు. ఇంతలో ఆయనపై కర్ణాటకలో మైనింగ్ కేసు నమోదు కావడంతో కథ అడ్డంతిరిగింది. మైనింగ్ అక్రమాల కేసులో సిట్ ఇతనిపై విచారణ జరిపి అరెస్ట్ చేసింది. దాంతో, అతని కోరిక నెరవేరలేదు.



ఢిల్లీ సీఎం కేజ్రీవాల్‌తో సౌమిత్ రంజన్ జెనా

### భార్య ప్రీతి జెనా తక్కువేం కాదు

తన రాజకీయ కోరిక నెరవేరకపోవడంతో సౌమిత్ తన భార్యను రాజకీయాల్లోకి తీసుకువచ్చాడు. ఫైసీస్ ఎగ్జిమ్ ఇండియా లిమిటెడ్ సంస్థకు డైరెక్టర్‌గా ఉన్న ప్రీతి జెనా ఇప్పుడు ఆలిండియా ఉమెన్ యునైటెడ్ పార్టీ మహారాష్ట్ర అధ్యక్షురాలిగా వ్యవహరిస్తున్నారు. జనాన్ని నిండా ముంచి విలాసవంతమైన జీవితం అనుభవిస్తున్న ప్రీతి జెనా ఇప్పుడు మహారాష్ట్రలో మహిళలను ఉద్ధరిస్తామన్నట్లుగా ప్రసంగాలు చేస్తోంది. ఆమె ప్రసంగాలు యూట్యూబ్‌లో కూడా ఉన్నాయి.

# రెండు ఊర్లలో నిలిచిన భూసర్వే

▸ పట్టా పాసు పుస్తకాలు నిలిపేసిన అధికారులు

▸ కోర్టు వివాదాల వల్లే సర్వే చేయలేదు: తహసీల్దార్

శంషాబాద్ రూరల్, ఫిబ్రవరి 9: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించిన సమగ్ర భూసర్వే శంషాబాద్ మండల పరిధిలోని బహదూర్‌గూడ, ఘన్సీమియాగూడలో నిలిపోయింది. అందుకు కారణం వందల ఎకరాల ప్రభుత్వ భూమి అక్రమార్కుల కబ్జా కోరల్లో ఉండటమే. బహదూర్‌గూడలో సర్వే నంబర్లు 28, 62లో దాదాపు 1,250 ఎకరాల ప్రభుత్వ భూమి ఉంది. అందులో 650 ఎకరాలను అక్రమార్కులు కబ్జా చేసి ప్లాట్లు చేసి విక్రయించేందుకు సిద్ధమయ్యారు. విషయం తెలుసుకున్న రెవెన్యూ అధికారులు ఆ భూములను తమ ఆధీనంలోకి తీసుకుని బోర్డు పాతేశారు. ఘన్సీమియాగూడలో సర్వే నెంబరు 3,4లో వంద ఎకరాల ప్రభుత్వ భూమిని గోల్డ్‌స్టోన్ ప్రసాద్ కొనుగోలు చేశారని రైతులు ఆందోళన చేయడంతో ప్రభుత్వ ఉన్నతాధికారులు, కలెక్టర్ ఆదేశాల మేరకు ఆ రెండు గ్రామాల్లో సమగ్ర భూ సర్వే నిలిపివేశారు. దీంతో కొత్త పట్టా పాస్‌బుక్కుల పంపిణీ నిలిపివేశారని రైతులు ఆరోపిస్తున్నారు. పట్టా పాస్ పుస్తకాలు లేకపోవడంతో రైతులకు సబ్సిడీ విత్తనాలు, పంట రుణాలు అందక ప్రైవేట్ వడ్డీ వ్యాపారులను ఆశ్రయించడంతో వారు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఘన్సీమియాగూడలో గోల్డ్‌స్టోన్ ప్రసాద్ రైతుల భూములను ఎలా కొనుగోలు చేస్తారంటూ అప్పట్లో టీడీపీ, బీజేపీ, సీపీఎం, సీపీఐ నాయకులు భారీ ఎత్తున ఆందోళనకు దిగారు. టీఆర్ఎస్ ఎంపీ కేశవరావు కూడా ప్రభుత్వ భూములను కొనుగోలు చేశారు. సీఎం కేసీఆర్‌కు విషయం తెలియడంతో తిరిగి ఆ భూములను రైతులకు అందజేశారు. శంషాబాద్ మండలంలో ఇటీవల కొత్వాల్‌గూడ ఊరును తాకట్టు పెట్టి రూ.332 కోట్ల రుణం తీసుకున్న సంగతి పాఠకులకు తెలిసిందే. అలాగే గొల్లపల్లిలో 261 సర్వే నెంబరును సృష్టించి కొందరు అక్రమార్కులు ఏకంగా కోట్లు విలువ చేసే ప్రభుత్వభూమిని అమ్మేందుకు సిద్ధపడ్డట్టు వార్తలు వచ్చాయి.



## గ్రామస్థులు భయపడొద్దు: ఎమ్మెల్యే ప్రకాశ్ గౌడ్

శంషాబాద్/రంగారెడ్డి అర్బన్, ఫిబ్రవరి 9: కొత్వాల్‌గూడ గ్రామాన్ని ఓ ప్రైవేటు కంపెనీ తాకట్టు పెట్టిన వ్యవ్యవహారంపై రాష్ట్ర ప్రభుత్వం స్పందించింది. స్థానిక ఎమ్మెల్యే టి. ప్రకాశ్‌గౌడ్, ఆర్డీవో శ్రీనివాస్, తహసీల్దారు సురేశ్ శుక్రవారం గ్రామాన్ని సందర్శించారు. గ్రామస్థులు భయపడవద్దని, ప్రభుత్వం అండగా ఉంటుందని ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ చెప్పారు. కాగా, ఊరు ఊరునే తాకట్టుపెట్టి రుణం తీసుకున్న ఘరానా మోసగాళ్లను వదలొద్దని మాజీ మంత్రి సబితారెడ్డి డిమాండ్ చేశారు. భూ కుంభకోణాన్ని వెలికితీసిన ఆంధ్రజ్యోతి దినపత్రికను అభినందించారు.

## గొల్లపల్లి భూకుంభకోణం వార్తలో నిజంలేదు: ఆర్డీవో శ్రీనివాస్

గొల్లపల్లి ఖుర్దులోని సర్వే నంబర్ 24 సయ్యద్‌గూడలో 10 ఎకరాల ప్రభుత్వ భూమి కబ్జా అవుతోందని, 261 సర్వే నంబర్‌లో రిజిస్టర్ చేసుకున్నారని ఓ దినపత్రిక (ఆంధ్రజ్యోతి కాదు)లో ప్రచురితమైన వార్తలో వాస్తవం లేదని ఆర్డీవో శ్రీనివాస్ స్పష్టం చేశారు. అసలు 261 సర్వే నంబర్‌లో రిజిస్టర్ చేసినట్టు లేదన్నారు. ఒక వేళ రిజిస్టర్ జరిగినా అది చెల్లదని చెప్పారు. సదరు వ్యక్తులు చేసుకున్న అగ్రిమెంట్ ఆఫ్ సెల్ ద్వారా 215 సర్వే నంబర్‌లో వాళ్లకి పాసుబుక్కు వచ్చినట్టు పేర్కొన్నారు. దాన్ని పెట్టి రోజిలిన్ అనే వ్యక్తి అచ్చేశ్వరి అనే వ్యక్తికి అగ్రిమెంట్ ఆఫ్ సేల్ చేశారన్నారు. అయితే అది ప్రభుత్వ భూమి కాదని ఆర్డీవో వివరించారు.

# 75,300 టన్నుల కందులకే అనుమతి

▸ ఆపై సేకరణకు కేంద్ర వ్యవసాయశాఖ నో !

▸ ఇక కేంద్ర పౌరసరఫరాల శాఖే దిక్కు

▸ పీఎస్ఎస్ స్కీంకు నిధుల కొరతే కారణం

హైదరాబాద్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఆశించిన మేరకు కందులను సేకరించడంలో కేంద్ర వ్యవసాయ శాఖ చేతులెత్తేసింది. 75,300 టన్నుల కందుల సేకరణకు మాత్రమే అంగీకరించింది. అది కూడా.. 2లక్షల టన్నుల కందులను సేకరించాలంటూ సీఎం కేసీఆర్.. ఎంపీల ద్వారా పంపించిన లేఖకు స్పందించి నిర్ణయించింది. ఈ మేరకు 75,300 టన్నుల కందులకే నాఫెడ్ చెల్లింపులు జరపనుంది. కానీ, నాఫెడ్ తరఫున ఇప్పటికే మార్క్‌ఫెడ్, హాకాలు కొనుగోలు కేంద్రాల ద్వారా సుమారు 1.40 లక్షల టన్నుల కందులను సేకరించాయి. దీంతో కేంద్రం అనుమతించిన దానికన్నా అదనంగా సేకరించిన కందులకు మార్క్‌ఫెడ్, హాకాలే చెల్లింపులు జరపాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఈ నేపథ్యంలో మిగిలిన కందులను ధరల స్థిరీకరణ పథకం కింద సేకరించాల్సిందిగా కేంద్ర ఆహార, పౌరసరఫరాల శాఖను కోరాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. వాస్తవానికి తొలుత.. అర్థగణాంక శాఖ (డీఈఎస్) మొదటి ముందస్తు నివేదిక ప్రకారం 33,500 టన్నుల కందుల కొనుగోలు చేయాలని నాఫెడ్‌కు కేంద్రం ఆదేశాలు జారీ చేసింది. అయితే డీఈఎస్ రెండో ముందస్తు అంచనా నివేదిక ప్రకారం 1.13 లక్షల టన్నుల మేరకు కందుల సేకరణకు అనుమతి దొరుకుతుందని అధికారులు భావించగా, కేంద్రం అంగీకరించలేదు. సీఎం లేఖ అనంతరం చివరికి 75,300 టన్నుల మేరకు కందుల సేకరణకు కేంద్ర వ్యవసాయ శాఖ అంగీకరించింది. కేంద్రంలో సవరించిన అంచనాల్లో ధరల మద్దతు పథకం (పీఎస్ఎస్)కు కేటాయింపులు తగ్గడం వల్లే కేంద్రం నిస్సహాయత వ్యక్తం చేస్తున్నట్లు అధికార వర్గాలు చెబుతున్నాయి.

### రూ. 600 కోట్ల రుణానికి అనుమతి

ఇప్పటికే సేకరించిన 1.40 లక్షల టన్నుల కందులకు రూ.763 కోట్ల మేరకు చెల్లింపులు జరపాల్సి ఉండగా.. రూ.226 కోట్ల మేరకు చెల్లిపులు జరిగాయి. ఇంకా రైతులకు రూ.536 కోట్ల వరకూ చెల్లించాల్సి ఉంది. కేంద్రం అనుమతించిన దానికన్నా అదనంగా సేకరించిన కందులకు చెల్లింపులకుగాను హాకా, మార్క్‌ఫెడ్‌కు చెరి రూ.300 కోట్లు చొప్పున రూ.600 కోట్ల మేరకు బ్యాంకుల నుంచి రుణం తీసుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం శుక్రవారం అనుమతినిచ్చింది. మరోవైపు ధరల స్థిరీకరణ నిధి నుంచి నిధులు మంజూరు చేయించుకునే ప్రయత్నాల్లో సర్కారు పడింది.

# పోషకాహార లోపంపై యుద్ధం

▸ 3 జిల్లాల్లో ఎన్ఎన్ఎం అమలు

▸ మొత్తం వ్యయం రూ.21 కోట్లు

హైదరాబాద్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): పోషకాహార లోపాన్ని అధిగమించేందుకు కేంద్ర ప్రభుత్వం 'నేషనల్ న్యూట్రిషన్ మిషన్ (ఎన్ఎన్ఎం)' కు శ్రీకారం చుట్టింది. దేశవ్యాప్తంగా పోషకాహార లోపాలున్న 315 జిల్లాలను కేంద్రం గుర్తించింది. వాటిలో తెలంగాణలోని హైదరాబాద్, ఆదిలాబాద్, మహబూబ్‌నగర్ ఉన్నాయి. ఈ జిల్లాల్లో ఎన్ఎన్ఎం అమలుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రణాళిక రూపొందించింది. రక్తహీనత, తక్కువ బరువు ఉన్న పిల్లలకు, గర్భిణులకు పోషకాహారం అందించడం ఎన్ఎన్ఎం లక్ష్యం. కేంద్రం 60%, రాష్ట్రం 40% వాటా భరిస్తాయి. మొత్తం వ్యయం రూ.21 కోట్లుగా అంచనా వేయగా... కేంద్రం రూ.12.60 కోట్లు విడుదల చేసింది. ఆదిలాబాద్‌లోని 18 ప్రాజెక్టుల పరిధిలో 4,012, మహబూబ్‌నగర్‌లోని 20 ప్రాజెక్టుల పరిధిలో 4,916, హైదరాబాద్‌లోని 5 ప్రాజెక్టుల పరిధిలో 940 అంగన్‌వాడీ కేంద్రాల్లో ఎన్ఎన్ఎంను అమలు చేయనున్నారు. కేంద్ర, రాష్ట్ర రిసోర్స్ సెంటర్లు, రాష్ట్ర ప్రాజెక్టు పర్యవేక్షణ కేంద్రాలను ఏర్పాటు చేసి, వీటికి నోడల్ అధికారులను నియమించనున్నారు. అంగన్‌వాడీ కేంద్రాలపై వీరి పర్యవేక్షణ ఉంటుంది. ఎన్ఎన్ఎస్‌లో భాగంగా అంగన్‌వాడీ కేంద్రాలకు స్మార్ట్‌ఫోన్లు, బరువు కొలిచే పరికరాలు, సూపర్‌వైజర్లకు ట్యాబ్‌లు అందించనున్నారు. ఎన్ఎన్ఎం కింద కేంద్రం అంగన్‌వాడీ టీచర్ల వేతనం రూ.500 పెంచనుందని ఐసీడీఎస్ అధికారి తెలిపారు.

# భూగర్భ జల గోస!

▸ రాష్ట్రంలో అడుగంటుతున్న నీటిమట్టం

▸ నెల రోజుల్లోనే మీటరు లోతుకు..

▸ 24 గంటల విద్యుత్తుతో మరింత పాతాళానికి!

▸ భవిష్యత్తులో ఇబ్బందులు తప్పవు: నిపుణులు




హైదరాబాద్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా భూగర్భజలాలు ప్రమాదకర స్థాయిలో పడిపోతున్నాయి. వ్యవసాయానికి నిరంతర విద్యుత్తు పథకంతో రాష్ట్రవ్యాప్తంగా పంటల సాగు విస్తీర్ణం గణనీయంగా పెరిగింది. దీంతో బోరు బావుల్లోంచి నీటిని అదేపనిగా తోడేస్తుండడం.. రాష్ట్రవ్యాప్తంగా తక్కువ వర్షపాతం నమోదు కావడంతో ఈ సమస్య ఏర్పడిందని అధికారులు విశ్లేషిస్తున్నారు. నెల రోజుల వ్యవధిలోనే ఒక మీటరు మేర నీటి మట్టం పడిపోయిందని అధికారులు తెలిపారు. మున్ముందు నీటి మట్టం మరింతగా పడిపోతుందని హెచ్చరిస్తున్నారు. గత డిసెంబరులో సరాసరి భూగర్భ నీటిమట్టం 9.18 మీటర్లు ఉండగా, ఈ ఏడాది జనవరి నాటికి అది 10.04 మీటర్ల మేరకు పడిపోయింది. వచ్చే రోజుల్లో ఈ నీటిమట్టం మరింత పడిపోయే అవకాశం ఉందని నిపుణులు పేర్కొంటున్నారు. 2017లో సాధారణ వర్షపాతం 852 మిల్లీమీటర్లు కాగా 776 మి.మీ వర్షపాతమే నమోదైంది. అంటే.. సాధారణం కంటే 9 శాతం వర్షాలు తక్కువగా కురిశాయి. దీంతో భూగర్భ నీటిమట్టం పెరగడానికి అవకాశం లేకుండా పోయిందని అధికారులు వివరిస్తున్నారు. నిరుడు జనవరిలో రాష్ట్రంలో సరాసరి భూగర్భ నీటి మట్టం 9.36 మీటర్లు ఉండగా, ఈ ఏడాది జనవరిలో అది 10.04 మీటర్లకు పడిపోయింది. అంటే.. గత ఏడాదితో పోలిస్తే ప్రస్తుతం 0.68 మీటర్ల మేర భూగర్భ నీటి మట్టం తగ్గింది. గత ఏడాది నిజామాబాద్ జిల్లాలో నిరుడు జనవరిలో భూగర్భ జలమట్టం 7.95 మీటర్లుగా నమోదవ్వగా.. ఈ జనవరిలో 11.07 మీటర్ల లోతుకు పడిపోయింది. ఇది నిరంతర విద్యుత్తు ప్రభావమేనని భూగర్భజలవనరుల శాఖ ఉపసంచాలకులు జగన్నాథరావు అన్నారు.

**జిల్లాల వారీగా భూగర్భ నీటి మట్టం వివరాలు (నీటి మట్టాలు మీటర్లల్లో)**

| జిల్లా పేరు | 2017 డిసెంబర్ | 2018 జనవరి |
|---|---|---|
| మహబూబ్‌నగర్ | 10.42 | 11.69 |
| నాగర్‌కర్నూలు | 12.29 | 13.14 |
| వనపర్తి | 6.24 | 6.25 |
| గద్వాల | 5.96 | 6.68 |
| రంగారెడ్డి | 10.82 | 12.17 |
| మేడ్చల్ | 7.67 | 8.40 |
| వికారాబాద్ | 11.74 | 12.92 |
| మెదక్ | 14.78 | 16.07 |
| సంగారెడ్డి | 12.01 | 12.67 |
| సిద్దిపేట | 12.42 | 13.44 |
| నిజామాబాద్ | 10.01 | 11.45 |
| కామారెడ్డి | 10.88 | 12.14 |
| ఆదిలాబాద్ | 7.65 | 8.52 |
| నిర్మల్ | 9.58 | 10.92 |
| మంచిర్యాల | 6.51 | 7.09 |
| కొమురం భీం | 8.46 | 8.35 |
| కరీంనగర్ | 9.10 | 10.00 |
| పెద్దపల్లి | 9.20 | 10.55 |
| జగిత్యాల | 7.05 | 7.36 |
| సిరిసిల్ల | 7.27 | 13.44 |
| వరంగల్ (పట్టణ) | 5.71 | 6.91 |
| వరంగల్ (రూరల్) | 7.27 | 8.27 |
| భూపాలపల్లి | 9.86 | 10.89 |
| మహబూబాబాద్ | 6.06 | 7.43 |
| జనగాం | 9.60 | 10.70 |
| ఖమ్మం | 5.76 | 6.36 |
| కొత్తగూడెం | 8.74 | 9.59 |
| నల్లగొండ | 9.17 | 10.07 |
| సూర్యాపేట | 8.82 | 10.02 |
| యాదాద్రి | 10,31 | 11.01 |
| హైదరాబాద్ | 6.99 | 6.59 |
| మొత్తం | 9.18 | 10.04 |

# రాహుల్ పప్పు కాదు.. పిప్పి చేసే వ్యక్తి

▸ కేటీఆర్ వ్యాఖ్యలు జుగుప్సాకరం: జానా

▸ టీఆర్ఎస్ వైఖరి సిగ్గుచేటు : జీవన్‌రెడ్డి

▸ కేసీఆర్ మౌనం... భయమేనా?: పొన్నం

▸ మోదీ చెప్పుచేతల్లో కేసీఆర్: రేవంత్

▸ కేటీఆర్ ఓ బచ్చా, చిల్లర్: షబ్బీర్‌అలీ

▸ ఉమ్మడిగా పోరాడుదాం: వీహెచ్

(ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్)



మీడియాతో మాట్లాడుతున్న జానారెడ్డి. చిత్రంలో గీతారెడ్డి, జీవన్‌రెడ్డి, సంపత్‌కుమార్

కాంగ్రెస్ పార్టీ, రాహుల్‌ను ఉద్దేశించి మంత్రి కేటీఆర్ చేసిన వ్యాఖ్యలపై మాటల యుద్ధం కొనసాగుతోంది. కేటీఆర్ మాట్లాడిన తీరు జుగుప్సాకరమని సీఎల్పీ నేత జానారెడ్డి మండిపడ్డారు. రాహుల్‌గాంధీ పప్పు కాదని.. గుజరాత్‌ను పిప్పి.. పిప్పి చేసిన వ్యక్తి అని వ్యాఖ్యానించారు. అసెంబ్లీ ఆవరణలోని మీడియాహాల్‌లో శుక్రవారం ఆయన మాట్లాడుతూ కేటీఆర్ తీరు పరిణితి చెందిన నాయకుడు మాట్లాడినట్లుగా లేదన్నారు. రాహుల్ ఒక జాతీయ పార్టీ అధ్యక్షుడని, రెండు పర్యాయాలు ప్రధాని అయ్యే అవకాశం వచ్చినా తృణప్రాయంగా వదిలేశారని గుర్తుచేశారు. తెలంగాణ ప్రజల మనోభావాల్ని కించపరిచేలా ప్రధాని మోదీ మాట్లాడితే, ఉద్యమ పార్టీగా చెప్పుకునే టీఆర్ఎస్ మౌనంగా ఉండటం సిగ్గుచేటని సీఎల్పీ ఉప నేత జీవన్‌రెడ్డి దుయ్యబట్టారు. ఏపీ ఎంపీలు పార్లమెంట్‌లో గొంతు చించుకొని అరుస్తుంటే, తెలంగాణ ఎంపీలు నోటికి గుడ్డ కట్టుకొని కూర్చొని ఉన్నారని మండిపడ్డారు. గీతారెడ్డి మాట్లాడుతూ కేటీఆర్.. విదేశాల్లో చదువుకొని వచ్చిన సంస్కారిగా తాను భావించానని, కానీ ఆయన భాష చూస్తే ఎలాంటి విలువలు నేర్చుకున్నారనే సందేహం కలుగుతోందన్నారు. కేటీఆర్ ఓ బచ్చా, చిల్లర్ అని.. అందుకే కాంగ్రెస్‌ని లోఫర్ అంటున్నాడని ఎమ్మెల్సీ షబ్బీర్‌అలీ ధ్వజమెత్తారు. కేటీఆర్ ముందుగా తన తండ్రి ఏపార్టీ నుంచి వచ్చాడో తెలుసుకోవాలని సూచించారు. టీఆర్ఎస్ దొంగల పార్టీ అని వ్యాఖ్యానించారు. పార్లమెంట్ తలుపులు మూసి తెలంగాణ బిల్లు ఆమోదించారంటూ సభలో ప్రధాని చేసిన వ్యాఖ్యలపై సీఎం మౌనం వ్యూహమా లేక భయమా...అని టీపీసీసీ ఉపాధ్యక్షుడు పొన్నం ప్రభాకర్ ప్రశ్నించారు. కరీంనగర్‌లో ఆయన మాట్లాడుతూ ప్రధాని వ్యాఖ్యలపై స్పందిస్తే కేసీఆర్‌పై సీబీఐ కేసు ఎక్కడ బయటకు వస్తుందోనని భయపడుతున్నారన్నారు. మోదీ చెప్పుచేతల్లో కేసీఆర్ పనిచేస్తున్నారని, అందుకే విభజన హామీలపై టీఆర్ఎస్ ఎంపీలు మాట్లాడటం లేదని కాంగ్రెస్ నేత రేవంత్‌రెడ్డి ధ్వజమెత్తారు. ఎల్లారెడ్డిలో ఆయన మాట్లాడుతూ ప్రత్యేకహోదా కోసం టీడీపీ ఎంపీలు పార్లమెంట్‌ను స్తంభింపజేస్తుంటే, టీఆర్ఎస్ ఎందుకు స్పందించడం లేదన్నారు.కేసీఆర్ ప్రభుత్వంపై ఉమ్మడిగా పోరాడేందుకు కలిసిరావాలని సీపీఐ నేత సురవరం సుధాకర్ రెడ్డిని కాంగ్రెస్ నేత వి.హనుమంతరావు కోరారు. మగ్దూం భవన్‌లో సురవరంతో భేటీ అయిన ఆయన పలు అంశాలపై చర్చించారు.

# మోదీ.. పార్లమెంట్‌ను దుర్వినియోగం చేశారు

▸ రాజకీయాల్లో తిట్లు కేసీఆర్ పుణ్యమే : సురవరం

▸ బాబు.. బీజేపీకి సేవ చేయడం మానుకో : నారాయణ

▸ విభజన హామీల్లో ఒక్కటీ అమలు కాలేదు : చాడ

హైదరాబాద్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి) : బడ్జెట్ ప్రసంగం పేరుతో ప్రధాని మోదీ పార్లమెంట్‌ను దుర్వినియోగం చేశారని సీపీఐ జాతీయ ప్రధాన కార్యదర్శి సురవరం సుధాకర్‌రెడ్డి విమర్శించారు. ప్రధాని నాలుగేళ్ల కిందట పార్లమెంట్‌లో చేసిన ప్రసంగానికి... ప్రస్తుతం చెప్పినదానికి ఏమాత్రం తేడా లేదన్నారు. సీపీఐ రాష్ట్ర కార్యాలయం మగ్దూం భవన్‌లో శుక్రవారం ఆయన మాట్లాడుతూ అప్పటి హోం శాఖ మంత్రి సర్దార్ వల్లబాయి పటేల్‌తో చర్చించాకే కశ్మీర్ విషయంలో నెహ్రూ తన విధానాన్ని ప్రకటించారని, బీజేపీకి చరిత్ర తెలియదని ఎద్దేవా చేశారు. తెలంగాణలో కాంగ్రెస్- టీఆర్ఎస్ మధ్య తిట్ల దండకం మంచిది కాదని, ఈ పరిణామం సీఎం కేసీఆర్ పుణ్యమేనని ఆగ్రహం వ్యక్తం చేశారు. పార్టీ జాతీయ కార్యదర్శి కె.నారాయణ మాట్లాడుతూ టీడీపీ నేత గాలి ముద్దుకృష్ణమనాయుడి మృతికి వైద్యుల నిర్లక్ష్యమే కారణమని ఆరోపించారు. బీజేపీకి కరసేవ చేయటం మానుకోవాలని ఏపీ సీఎం చంద్రబాబుకు సూచించారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శి చాడ వెంకటరెడ్డి మాట్లాడుతూ విభజన చట్టంలో తెలంగాణకు ఇచ్చిన ఏ ఒక్క హామీని కేంద్రం నెరవేర్చలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాగా, ఫార్మాడీ, ఫార్మా-డీ(పీ,బీ) వైద్యుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సీఎం కేసీఆర్‌కు చాడ బహిరంగ లేఖ రాశారు. గ్యాంగ్‌స్టర్ నయీం కేసు విషయంలో ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేందుకు ప్రత్యేక కార్యాచరణ సిద్ధం చేసినట్లు చాడ తెలిపారు. 12న హైదరాబాద్‌లో నయీం బాధితులతో ముఖాముఖి నిర్వహిస్తానని, అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల సమయంలో నయీం ఆగడాలపై బుక్‌లెట్ ముద్రించనున్నట్లు చెప్పారు.

శివరాత్రి రోజు ఉపవాసం చేస్తే భక్తి...ముక్తి..సిరిసంపదల్ని శివుడు అనుగ్రహిస్తాడనేది భక్తుల గాఢ నమ్మకం. అందుకే ఆ రోజు లక్షలాది మంది ఉపవాసం ఉంటారు. పళ్లు, ఫలాలు, డ్రైఫ్రూట్లు తింటారు. ద్రవపదార్థాలు, జ్యూసులు తాగుతారు. అయితే ఆరోగ్య సమస్యలు ఎదుర్కొనేవాళ్లకి కొన్ని ప్రత్యేక రెసిపీలున్నాయి. అలాంటివారికి ఇవి ఆరోగ్యపరంగా బాగుంటాయి. కొన్ని శివరాత్రి రెసిపీలను ఈ వారం 'నవ్య' మీ ముందు ఉంచుతోంది... మీరూ ఆస్వాదించండి...



# లైట్ తీస్కోండి!

## రైతా



**కావలసినవి:** తాజా గడ్డ పెరుగు-ఒక కప్పు, ఉడకబెట్టిన చిలకడదుంప-ఒకటి (తరిగి), ఉడకబెట్టిన బంగాళాదుంప-ఒకటి (తరిగి), కీరకాయ-ఒకటి, వాటర్ చెస్ట్‌నట్స్ (శింఘూరా)- ఐదు(ఉడకబెటి పైనున్న తొక్క తీసి సన్నటి ముక్కలుగా చేయాలి), కొత్తిమీర-గుప్పెడు (తరుగు), పచ్చిమిర్చి- ఒకటి (సన్నటి ముక్కలుగా తరిగి), బాగా వేగించిన పల్లీలు- ఒక టేబుల్‌స్పూను, జీలకర్ర పొడి- అర టీస్పూను, జీలకర్ర-అర టీస్పూను, నూనె- ఒక టీస్పూను, చక్కెర-రుచికి సరిపడా, ఉప్పు-తగినంత.

**తయారీ:**

- బాగా లోతుగా ఉండే సలాడ్ బౌల్‌లో గడ్డ పెరుగును తీసుకుని చిక్కగా చేయాలి.
- అందులో జీలకర్ర పొడి, ఉప్పు, చక్కెర, పచ్చిమిర్చి ముక్కలు వేసి బాగా కలపాలి.
- తర్వాత రెడీగా పెట్టుకున్న కూరముక్కలు, పల్లీలు అందులో వేసి బాగా కలపాలి.
- ఇలా తయారైన రైతాను ఫ్రిజ్‌లో ఉంచాలి.
- రైతాను తాగాలనుకునే ముందు చిన్న మూకుడులో కొద్దిగా నూనె వేసి జీలకర్ర వేయాలి.
- చిటపటలాడుతున్న జీలకర్రను కూల్ కూల్‌గా ఉన్న రైతాపై చల్లాలి.
- రెడీగా ఉన్న కొత్తిమీరను రైతాను దాని మీద చల్లి కొద్ది కొద్దిగా సిప్ చేస్తూ తాగితే శరీరానికి కొత్త శక్తి వచ్చినట్టు ఉంటుంది.

## సొరకాయ హల్వా

**కావలసినవి:** పాలు- అర లీటరు (చిక్కటివి), తొక్క తీసిన సొరకాయ-అర ముక్క, చక్కెర- మూప్పావు కప్పు, కోవా-వంద గ్రాములు, ఏలకుల పొడి-ఒక టీస్పూను, డ్రై ఫ్రూట్స్- ఒక టేబుల్‌స్పూను (బాదం, ఎండుద్రాక్ష, జీడిపప్పులు).

**తయారీ:**

- సొరకాయపై నుండే తొక్క తీసేసి సన్నగా తురమాలి.
- చాలా కొద్ది నీళ్లల్లో సొరకాయ తరుగును ఉడకబెట్టాలి.
- మెత్తగా ఉడికిన సొరకాయ తరుగులోంచి నీళ్లను పూర్తిగా తీసేయాలి.
- స్టవ్ మీద పాన్ పెట్టి అందులో పాలు పోసి సన్నని మంటపై 20 నిమిషాలు ఉడకనివ్వాలి.
- మెత్తగా ఉడికిన సొరకాయ తురుమును అందులో వేసి బాగా సెమి-సాలిడ్ రూపుకు వచ్చేదాకా (అంటే దాదాపు 20 నిమిషాలు)ఉడకనివ్వాలి.
- అదే సమయంలో కోవాను తురిమి దాన్ని కూడా పాన్‌లో వేసి బాగా కలపాలి.
- ఆ తర్వాత చక్కెర వేసి అందులో బాగా కరగనివ్వాలి.
- చివరిగా ఏలకుల పొడి, డ్రైఫ్రూట్ ముక్కలను అందులో వేయాలి.
- సొరకాయ హల్వా రెడీ.



## సాబుదానా కిచిడి

**కావలసినవి:** సగ్గుబియ్యం- రెండు కప్పులు, వేగించిన పల్లీలు- అర కప్పు, పచ్చిమిర్చి- ఆరు, నూనె- పావు కప్పు, కొత్తిమీర తరుగు- గుప్పెడు, పసుపు, ఉప్పు- తగినంత, టొమాటో, బంగాళాదుంప-చెరొక్కొక్కటీ (పెద్దవి).

**తయారీ:**

- సగ్గుబియ్యాన్ని బాగా కడిగి నీరు లేకుండా డ్రై చేసి గంటపాటు అలాగే ఉంచాలి.
- వేగించిన పల్లీలు, పచ్చిమిర్చి, ఉప్పు కలిపి గ్రైండ్ చేయాలి. ఈ పొడిలో నీళ్లు కలపొద్దు.
- ఆరబెట్టిన సగ్గుబియాన్ని పల్లీ, మిర్చీపొడితో బాగా కలపాలి.
- పాన్‌లో నూనె పోసి అది వేడెక్కిన తర్వాత అందులో ఈ మిశ్రమాన్ని వేసి సన్నని మంటపై అరగంటసేపు ఉడకనివ్వాలి. మధ్య మధ్యలో దీన్ని కలపడం మరవొద్దు.
- బంగాళాదుంప తరుగు, టొమాటో ముక్కలు ఇందులో వేయాలి.
- రెడీ అయిన సాబుదానా కిచిడీపై కొత్తిమీర తురుము చల్లి పెరుగుతో వేడి వేడిగా తింటే ఎంతో రుచిగా ఉంటుంది.

## మిక్స్ ఫ్రూట్ స్మూతీ

పళ్లతో చేసిన పదార్థాన్నే తిందామనుకునే భక్తులకు మిక్స్ ఫ్రూట్ స్మూదీ చాలా మంచిది.

**కావలసినవి:** అరటిపండు- ఒకటి, ఆపిల్- ఒకటి, మామిడిపండు- ఒకటి, దానిమ్మ- ఒకటి, పెరుగు- అరకప్పు, తేనె లేదా చక్కెర- ఒక టీస్పూను.

**తయారీ:**

- బ్లెండర్ తీసుకుని అందులో పైన పేర్కొన్న పండ్ల ముక్కలను (మీకు నచ్చిన మరేవైనా పళ్లను కూడా ఇందులో కలుపుకోవచ్చు), తేనె లేదా చక్కెర, ఐస్‌క్యూబ్స్ వేసి బ్లెండ్ చేయాలి.
- దీనికి పెరుగును జోడించి మళ్లీ రెండు నిమిషాలసేపు బ్లెండర్‌లో వేసి కొట్టాలి.
- తర్వాత జల్లెడతో ఒడగట్టి గ్లాసులో పోసి కొన్ని ఐస్ క్యూబులు వేసుకుని తాగితే చిల్ మంటూ స్మూదీ గొంతులోంచి దిగుతూ హాయిగా ఉంటుంది.



## పెసర వేపుడు



**కాలసినవి:** పెసరపప్పు- ఒక కప్పు, నీళ్లు- మూడు కప్పులు, పాలకూర- రెండు టేబుల్‌స్పూన్లు (ఆకులు సన్నగా తరిగి), నూనె- ఆరు టేబుల్‌స్పూన్లు, ఆవాలు- ఒక టేబుల్‌స్పూను, ఎండుమిర్చి-తగినంత, ఉప్పు-తగినంత.

**తయారీ:**

- పెసరపప్పును ముద్దగా కాకుండా సరైన పదునులో ఉడకబెట్టాలి.
- ఉడికిన పప్పును పక్కన పెట్టాలి.
- పాన్ తీసుకోవాలి. అది వేడెక్కిన తర్వాత అందులో నూనె పోయాలి.
- ఆవాలు, ఎండుమిర్చి, పాలకూర తురుము వేసి వేగించాలి.
- అది సరిగా వేగిన తర్వాత అందులో ఉడికిన పప్పును, తగినంత ఉప్పును వేయాలి.
- అలాగే దీంట్లో కొద్దిగా నిమ్మరసం కూడా పిండి పెసర ఫ్రైని బాగా కలపాలి. పెసర వేపుడు రెడీ.

## ఆలూ మఖానా సబ్జి

**కావసినవి:** బేబీ బంగాళాదుంపులు- ఒక కప్పు, పూల్ మఖానా-(తామరగింజలు) ఒక కప్పు, జీలకర్ర- ఒక టీస్పూను, సోంపు- ఒక టీస్పూను, పచ్చిమిర్చి-2 (సన్నగా తరిగి), కారం- ఒకటిన్నర టీస్పూను, పసుపు- అర టీస్పూను, ధనియాలపొడి- ఒక టీస్పూను, ఉప్పు- తగినంత, నూనె- రెండు టేబుల్‌స్పూన్లు.

**తయారీ:**

- బేబీ బంగాళాదుంపల్ని నీళ్లల్లో ఉడకబెట్టాలి. తర్వాత వాటి పైనున్న పొట్టు తీయాలి.
- బాగా లోతున్న పాన్ తీసుకని నూనె పోసి వేడెక్కాక అందులో మఖానా వేసి క్రిస్పుగా రోస్టు కానివ్వాలి. అది రెడీ అయిన తర్వాత విడిగా ఒక ప్లేటులో తీసిపెట్టుకోవాలి.
- పాన్‌లో నూనె వేసి అందులో జీలకర్ర వేసి చిటపటలాడనివ్వాలి. అందులో సోంపు, పచ్చిమిర్చి ముక్కలు కూడా వేసి వేగించాలి. తర్వాత అన్ని మసాలాలు ఇందులో వేసి బాగా కలపాలి.
- తర్వాత ఉడకబెట్టిన బేబీ బంగాళా దుంపలను ఇందులో వేగనివ్వాలి.
- బంగాళాదుంపలకు మసాలా బాగా పట్టిన తర్వాత రోస్టెడ్ మకానాను అందులో మళ్లీ ఇంకోసారి కలపాలి.
- మంటను తగ్గించి నాలుగు నిమిషాల పాటు బంగాళాదుంపలను చిన్న మంటపై టోస్ట్ చేయాలి.
- స్టవ్ మీద నుంచి దించి దానిపై కొత్తిమీర చల్లి వేడిగా తింటే రుచిగా ఉంటుంది.



ఇలా చేద్దాం

# ఉపవాసం ఉంటున్నారా...

**శివరాత్రి అనగానే మనకు చటుక్కున గుర్తుకువచ్చేది ఉపవాసం. ఈ పుణ్య దినమున ఉపవాసముంటే బోళా శంకరుడు తమ పాపాలన్నీ పోగొడతాడని, సిరిసంపదలు ఇస్తాడని భక్తుల పరమ విశ్వాసం. అందుకే శివరాత్రి రోజున పెద్ద సంఖ్యలో భక్తులు ఉపవాసం చేస్తారు. అయితే, ఆ రోజున ఉపవాసం ఉండాలనికునే వాళ్లు కింద చెప్పిన కొన్ని విషయాలను మరవొద్దు. అవి:**

- ఉపవాసానికి కొన్ని రోజుల ముందు నుంచి పిండిపదార్థాలు (కార్బోహైడ్రేట్లు)బాగా ఉండే ఫుడ్స్ తింటే మంచిది. శరీరం పుష్టిగా తయారవుతుంది.
- ఉపవాస దీక్ష మొదలెట్టే ముందర నీళ్లు బాగా తాగాలి.
- శివరాత్రి నాడు ఉపవాసం ఉన్నవాళ్లు పాలు, పళ్లు తీసుకోవచ్చు.
- ఖర్జూరాలు, బాదం, రకరకాల నట్స్ కూడా వీళ్లు తినొచ్చు.
- ఖర్జూరం నీళ్లు మధ్య మధ్యలో తాగుతుంటే మంచిది.
- నీళ్లు మాత్రం బాగా తాగుతుండాలి. అలా అని ఒకేసారి ఎక్కువ నీళ్లు తాగకూడదు.
- ఉపవాసం ఉన్న వారు ఆకుకూరలను సూపులా చేసుకుని తాగొచ్చు.
- నీళ్లల్లో కొద్దిగ ఉప్పు వేసి అందులో నిమ్మకాయ లేదా కమలా పండు రసం పిండి మధ్య మధ్యలో తాగుతుంటే శరీరానికి శక్తి వస్తుంది.
- ఉప్పు వేసిన పలచటి మజ్జిగ కూడా ఉపవాసం దీక్ష చేసే వాళ్లకు మంచిది.
- ఉపవాసం వల్ల శరీరంలో తగిన ఎనర్జీ ఉండదు. అందుకే పళ్లు, పోషకాలు, పీచు పదార్థాలు వంటివి మధ్య మధ్యలో తింటుండాలి.
- ఉపవాసంలో ఉన్నవాళ్లు శ్రమకు దూరంగా ఉండాలి.
- ఉపవాస దీక్ష విరమించేటప్పుడు చక్కెర, ఫ్యాట్స్ ఎక్కువగా ఉన్న వాటిని, ఫ్రైస్‌ను తినొద్దు. తేలికపాటి ఫుడ్ తినడం వల్ల పొట్ట తేలిగ్గా ఉంటుంది.
- ఉపవాసం చేస్తున్నామని ఆ రోజు వేసుకోవాల్సిన మందులను చాలామంది మానేస్తుంటారు. అలా చేయకుండా కొద్ది నీటితో నైనా సరే మాత్రలను తప్పనిసరిగా వేసుకోవాలి.
- ఉపవాస దీక్ష అవగానే ఆకలితో ఒకేసారి ఎక్కువ ఆహారాన్ని తినకుండా కొద్ది కొద్దిగా తినాలి.
- ఉపవాస దీక్షలో ఉన్నప్పుడు పాలు టీతో పాటు గ్రీన్, బ్లాక్, ఊలాంగ్, హెర్బల్ టీలు తాగొచ్చు. అలాగే కాఫీ విషయంలో కేఫినేటెడ్, డికేఫినేటెడ్ ఏదైనా తీసుకోవచ్చు.
- ఎక్కువ సమయం ఉపవాస దీక్షలో ఉంటే హై-ఇంటెన్సిటీ వ్యాయామాలు చేయకూడదు.
- ఫాస్టింగ్ చేసేటప్పుడు తరచూ కునుకు తీయాలి. ఇలా చేయడం వల్ల విశ్రాంతి దొరికి హుషారుగా ఉంటారు.

### ఉపవాసం వల్ల...

- ఏకాగ్రత పెరుగుతుంది.
- శరీర బరువుతో పాటు, ఫ్యాట్ కూడా తగ్గుతుంది.
- బ్లడ్‌షుగర్ ప్రమాణాలు తగ్గుతాయి.
- ఇన్సులిన్ సెన్సిటివిటీని మెరుగుపరుస్తుంది.
- ఎనర్జీ ప్రమాణాలను పెంచుతుంది.
- కొవ్వును కరిగిస్తుంది.
- బ్లడ్ కొలెస్ట్రాల్‌ను తగ్గిస్తుంది.
- అల్జీమర్స్ జబ్బును నిరోధిస్తుంది.
- ఏజింగ్ ప్రాసెస్‌ను రివర్స్ చేస్తుంది.
- మంటను తగ్గిస్తుంది.

### వీరికి వద్దు..

- చిన్న పిల్లలు ఉపవాసం చేయకూడదు.
- అలాగే గర్భిణీలు కూడా ఉపవాసం చేయడం మంచిది కాదు. వీరు ఉపవాసం చేస్తే కడుపులో ఉన్న శిశువుకు మంచిది కాదు.
- అలాగే తీవ్ర అనారోగ్యాలతో బాధపడేవాళ్లు, సీనియర్ సిటిజన్లు కూడా ఉపవాస దీక్షకు దూరంగా ఉంటే మంచిది.
- రక్తపోటు, మధుమేహం, గుండెజబ్బులు, థైరాయిడ్ వంటి వాటితో బాధపడేవాళ్లు ఉపవాసాలు చేయకూడదు.



గుడ్‌ఫుడ్

# నిమ్మకాయ... సర్వౌషధం

**నిమ్మకాయ కోస్తే వచ్చే వాసన ఎంత తాజాగా ఉంటుంది?! ఆ వాసన నచ్చని వారెవరైనా ఉంటారా? అలాంటి తాజా నిమ్మకాయలో ఉన్న ఆరోగ్య సుగుణాలు తెలిస్తే ఆశ్చర్యపోతారు. అవేంటో తెలుసుకుందామా...**

- మూత్రపిండాల్లోని రాళ్లను కరిగించడంలో నిమ్మరసం తోడ్పడుతుంది.
- స్ట్రోక్స్‌ను నివారిస్తుంది. శరీర ఉష్ణోగ్రతను తగ్గిస్తుంది.
- ఇందులో విటమిన్ సి పుష్కలంగా ఉంది. దీంతోపాటు విటమిన్ బి6, విటమిన్-ఎ, ఇ, నియాసిన్, థయామిన్, రిబోఫ్లావిన్, మెగ్నీషియం, పొటాషియం,ప్రొటీన్లు ఉన్నాయి.
- కాన్సర్‌పై గట్టి పోరు చేస్తుంది. మలబద్ధకం, రక్తపోటు, జ్వరం, జీర్ణశక్తి సమస్యలపై బాగా పని చేస్తుంది.
- వీటితోపాటు చర్మం, శిరోజాలు, దంతాల అందాల్ని కాపాడే గుణాలు నిమ్మలో ఉన్నాయి.
- నిమ్మ రక్తాన్ని శుద్ధిచేసే క్లీన్సర్ ఏజెంట్.
- జ్వరం, జలుబు, దగ్గు బాధలను తగ్గిస్తుంది.
- నిమ్మని దంతసంరక్షణలో ఎక్కువగా వాడతారు. నోటిదుర్వాసన రాకుండా కూడా ఇది నివారిస్తుంది.
- నిమ్మరసం మాడుమీద రాసుకోవడం వల్ల చుండ్రు తగ్గడమే కాదు జుట్టు రాలడం కూడా తగ్గుతుంది. అంతేకాదు జుట్టుకు సంబంధించిన పలు సమస్యలను ఇది నివారిస్తుంది.
- నిమ్మరసాన్ని నేరుగా వెంట్రుకలకు రాసుకుంటే అవి సహజమైన నల్లని రంగుతో బాగా మెరుస్తాయి.
- నిమ్మరసం సహజసిద్ధమైన యాంటిసెప్టిక్ మెడిసెన్. ఇది చర్మానికి సంబంధించిన ఎన్నో సమస్యలను పరిష్కరిస్తుంది.
- సన్‌బర్న్ వల్ల తలెత్తే నొప్పి నిమ్మరసం వల్ల పోతుంది.
- యాక్నె, ఎగ్జిమాల మీద కూడా నిమ్మ బాగా పనిచేస్తుంది.
- యాంటి ఏజింగ్ గుణాలు దీంట్లో ఉన్నాయి.
- చర్మం మీద ముడతలను పోగొడుతుంది.
- నిమ్మకాయరసంలో కొద్దిగా తేనె వేసుకుని రోజూ ఉదయమే తాగితే చర్మం కాంతివంతంగా తయారవుతుంది.
- కాలిన పాత గాయాల మచ్చలపై నిమ్మరసం పూస్తే ఆ మచ్చలు పోతాయి.
- చర్మం కాలినపుడు ఆ మంటను తగ్గిస్తుంది.
- దీంట్లో యాంటిసెప్టిక్ గుణాలు ఉండడంతో శరీరంలో అంతర్గతంగా సంభవించిన రక్తస్రావాన్ని సైతం ఆపగలదు.
- నిమ్మరసంలో కొద్దిగా తేనె, గోరువెచ్చటి నీళ్లు కలిపి రోజూ తాగితే బరువు తగ్గుతారు.
- ఊపిరితిత్తుల సమస్యల నుంచి కూడా నిమ్మ సాంత్వననిస్తుంది.
- కలరా, మలేరియా వంటివి జబ్బులను నిమ్మ నివారించగలదు. ఎందుకంటే మందే పేర్కొన్నట్టు నిమ్మలో రక్తాన్ని శుద్ధి చేసే గుణం ఉంది.
- గొంతు ఇన్ఫెక్షన్లపై కూడా నిమ్మ బాగా పనిచేస్తుంది.



ఇది విన్నారా?



## టిమోర్ సముద్రం!

ఆరాపురా సముద్రం, టిమోర్ ద్వీపకల్పాలు, ఆస్ట్రేలియా, ఇండోనేషియా దేశాల మధ్యన టిమోర్ సముద్రం ఉంది. ఈ సముద్రం లోతు తక్కువగా ఉండటం వల్ల అనేక దిబ్బలు ఏర్పడ్డాయి. ఈ సముద్రంలో ఉండే ద్వీపకల్పాల్లో జనావాసం లేదు. ఆయిల్, హైడ్రోకార్బన్ నిల్వలు ఎక్కువగా ఉన్నాయి. దీని లోతు గరిష్టంగా 10,500 అడుగులు. టిమోర్ సముద్ర విస్తీర్ణం 480 కి.మీ. పెనుతుపాన్లు ఏర్పడే ప్రాంతంగా ఇది ప్రసిద్ధి చెందింది.

నీతికథ

## ప్రార్థనలు నమ్మినవాడు!

ఒక గ్రామానికి కాటకం వచ్చింది. వానలు కురవలేదు. గ్రామస్థులంతా ఒక రోజు గుడికి వెళ్లి వానల కోసం జపాలూ, హోమాలూ, ప్రార్థనలూ జరిపించ నిశ్చయించుకున్నారు.

ఆ రోజు ఉదయమే గ్రామస్తులంతా గుడికి బయలుదేరారు. వాళ్ల వెంట ఒక చిన్న కుర్రవాడు గొడుగు చేత బట్టుకుని బయలుదేరాడు.

"గొడుగు దేనికి తెస్తున్నావురా? ఆకాశాన ఒక మబ్బుతునకైనా లేదు!!" అన్నారు పెద్దవాళ్లు వాడితో.

"ఇప్పుడు లేదనుకో. హోమాలూ, జపాలూ, ప్రార్థనలూ చెయ్యటం వల్ల వాన వస్తుందిగద. అప్పుడు మనం జోరున కురిసే వానలో ఇంటికి తిరిగి రావద్దా?" అన్నాడు కుర్రవాడు.


ఆ ఊరివాళ్లలో ప్రార్థనలలో నిజమైన నమ్మకం ఉండినవాడు ఆకుర్రవాడు ఒక్కడే.

- నూలు చెన్న కేశవులు

కిడ్ సైంటిస్ట్

## నీటిని వంచే దువ్వెన!

కావలసినవి




[illegible]

పేపర్ కళ

## 'ఫంజా' విసరండి!

[illegible]



సామెత

విత్తు ఒకటి వేస్తే చెట్టు ఒకటి మొలుస్తుందా?



పిగ్‌కాసో గురించి తెలుసా! 'హే! రాసింది తప్పు...! పికాసో కదా' అని మీకు ఆలోచన రావచ్చు. పిగ్‌కాసో కూడా పికాసోలా ఓ ఫేమస్ పెయింటర్. పికాసో వేసిన పెయిటింగ్‌లు ఎవర్‌గ్రీన్. వాటిని కొనాలంటే బోల్డెంత ఖర్చు చేయాల్సిందే. ఇప్పుడు పిగ్‌కాసో గీసిన 'కళాఖండాలు' కొనాలంటే కూడా వేల డాలర్లు వదిలించుకోవాల్సిందే. అసలు ఎవరీ పిగ్‌కాసో అని ఆత్రుతగా ఉంది కదూ! పేరులోనే ఉంది. పిగ్...కాసో! అవును నిజమే... ఓ పంది. ఆశ్చర్యంగా ఉందా! అయితే ఫ్లాష్‌బ్యాక్‌లోకి వెళ్లాల్సిందే!



# పిగ్‌కాసో ..The Artist

దక్షిణాఫ్రికాకు చెందిన జోనె లెఫ్సన్ గురించి మీకు తెలియాల్సిందే. ఆమె చాలా ఏళ్ల నుంచి వన్యప్రాణుల హక్కుల గురించి పోరాడుతున్న ఓ కార్యకర్త. జంతువుల అక్రమ రవాణాను అరికట్టి, 'ఫ్రాన్‌స్చోక్ ఫార్మ్ శాంక్చురీ' పేరుతో రకరకాల జంతువులను తన దగ్గరే పెంచుకుంటున్నారు కూడా. కొన్నేళ్ల క్రితం, ఓ పదినెలల వయసున్న ఓ పందిని రక్షించారు.

### ఇది చాలా స్పెషల్!

జంతువుల ఆలనా పాలనా చూడటంలో లెఫ్సన్ రూటే సెపరేటు. కేవలం ఆహారం, ఆశ్రయం... ఇలాంటివే కాకుండా వాటిని సమ్‌థింగ్ స్పెషల్‌గా తీర్చిదిద్దడానికి ప్రయత్నిస్తూంటారు. ఈ పందికి రకరకాల ఆటవస్తువులను పరిచయం చేశారు. దాంతో వాటితో ఆడుకోవడం మొదలుపెట్టింది. అలాగే అందులో భాగంగానే పెయింటింగ్ బ్రష్‌లను కూడా ఉంచారు. కానీ వాటితో ఎక్కువ సేపు గడపడం అక్కడివారిని ఆకర్షించింది. అంతే ఆ కుంచెను రంగులో ముంచి బొమ్మలు వేయడం నేర్పించారు. అంతే టక్కున పట్టేసింది మిగతావన్నీ వదిలేసి, పెయింటింగ్‌నే లోకంలా భావిస్తోంది. ఇక, కుంచె పట్టిందంటే చాలు సదరు పంది బోల్డెన్ని కళాఖండాలు గీయాల్సిందే.

### అబ్‌స్ట్రాక్ట్ పెయింటర్!

ఈ పిగ్‌కు ఉన్న స్పెషల్ టాలెంట్ చూసి, లెఫ్సన్ దీనికి పికాసో పేరు కలిసి వచ్చేలా 'పిగ్‌కాసో' అని నామకరణం చేసింది. ఇంతకీ ఇది గీసే బొమ్మలకు ఏదో ఒక ఆకారం ఉందనుకుంటారేమో! ఇది అబ్‌స్ట్రాక్ట్ పెయింటింగ్. అంటే మీరు 'బిజినెస్ మ్యాన్' సినిమా చూసే ఉంటారు. అందులో కాజల్ వేస్తున్న పెయింటింగ్స్‌ను చూసి మహేశ్‌బాబు "ఏంటీ పిచ్చి గీతలు?" అని అడుగుతాడు. అప్పుడు కాజల్, "ఇది అబ్‌స్ట్రాక్ట్ పెయింటింగ్" అని ఆమె బదులిస్తుంది. సరిగ్గా లెఫ్సన్‌దీ ఇదే మాట. అంటే చూడటానికి పిచ్చిగీతల్లా ఉన్నా ఈ నైరూప్య చిత్ర కళాఖండాల లోపల ఏదో అర్థం ఉంటుందట. అది అర్థం చేసుకున్న కొంత మంది కళాహృదయులు పిగ్‌కాసో వేసిన తొలి పెయింటింగ్‌ను 24 వేల ర్యాండ్లు (సుమారు లక్షా 20 వేల రూపాయలు)కు కొనుకున్నారట.

### విదేశాల్లోనూ గిరాకీ!

గతేడాది నుంచే పిగ్‌కాసో గీసిన పెయింటింగ్‌లను వేలానికి పెట్టింది. జర్మనీ, దక్షిణ కొరియా, మలేసియా దేశాల వాళ్లు కూడా కొనుకున్నారట. ఒక్కొక్కటి రెండు వేల డాలర్ల చొప్పున అమ్ముడు పోయింది. అలా ఇప్పటివరకూ లెఫ్సన్ ఈ పెయింటింగ్‌ల మీద రెండు లక్షల ర్యాండ్లు (సుమారు రూ. 20 లక్షలు) సంపాదించింది. ఇటీవలే 7 లక్షల 50 వేల ర్యాండ్లు (సుమారు 30 లక్షల 50 వేల రూపాయలు) ఖరీదు చేసే 30 పెయింటింగ్‌లు దక్షిణాఫ్రికాలోనే అమ్మకానికి పెట్టింది లెఫ్సన్. దానికీ మంచి స్పందన వచ్చింది. త్వరలోనే లండన్, ప్యారిస్, ఆమ్‌స్టర్‌డ్యామ్‌లలో కూడా పిగ్‌కాసో పెయింటింగ్‌లను ప్రదర్శనకు ఉంచనున్నారు.

### షెడ్యూల్ కూడా...!

పిగ్‌కాసో ప్రతిసారి బొమ్మలు గీస్తూ కూర్చుంటుందనుకుంటే పొరబాటే! "నేను బొమ్మలు గీయమని దానిని బలవంత పెట్టను. అది వేయాలనుకున్నప్పుడు కుంచె పట్టిందంటే చాలు అలా వేస్తూనే ఉంటుంది. ప్రతి రోజూ తెల్లవారు ఝామునే లేచి పెయింటింగ్ వేస్తుంది. అలాగే మళ్లీ సాయంత్రమే! మధ్యలో రెస్ట్ తీసుకుంటుంది" అని లెఫ్సన్ చెప్పుకొచ్చారు. ఇలా బ్రష్‌తో పెయింటింగ్ వేసే జంతువులు ఇప్పటివరకూ ఏవీ లేవట. పిగ్‌కాసో ప్రపంచంలోనే మొదటిది.



పాడుకుందాం!

### ప్రగతిబాట

[illegible]

- డా. పత్తిపాక మోహన్




మన ఆట

### జాతీయ క్రీడ



[illegible]

### కల్పితం... కాని నిజం!



[illegible]

చదువుదాం!

### చిలిపి ప్రశ్నలు!

[illegible]

సేకరణ: గంగరాజు మోహనరావు

క్విజ్

### వ్యాధులు, వాటి అధ్యయన శాస్త్రాల పేర్లను గుర్తించండి

1) రక్తం, దానికి సంబంధించిన వ్యాధులు
2) క్లోమ వ్యాధులు
3) కాలేయ వ్యాధులు
4) గుండె సంబంధ వ్యాధులు
5) కిడ్నీ సంబంధ వ్యాధులు

ఎ) గైనకాలజీ
బి) హెపటాలజీ
సి) హెమటాలజీ
డి) యూరాలజీ
ఇ) కార్డియాలజీ

### ఆణిముత్యం

[illegible]

### తేడాలు గుర్తించండి



### డైలీ సుడోకు - 102

| | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|
| | | | | | 2 | | 4 | |
| 2 | | | | 9 | | | | 6 |
| | 8 | | 1 | | 5 | 9 | | |
| | 2 | 5 | | | | | | 4 |
| | | 9 | | 4 | | 3 | | |
| 1 | | | | | | 8 | 5 | |
| | | 6 | 3 | | 9 | | 7 | |
| 9 | | | | 8 | | | | 3 |
| | 3 | | 6 | | | | | |

ఎలా పూరించాలి?

[illegible]

నిన్నటి సుడోకు - 101 సమాధానం

[illegible]

'నాటకం' అంటే అదేమిటని ఆశ్చర్యపోతూ ప్రశ్నించే తరం వచ్చేస్తున్న కాలంలో... 'ఆఁ! ఎవరు చూస్తారులే!' అని పెద్దలు కూడా పెదవి విరిచే రోజుల్లో... రంగస్థలానికి పూర్వ వైభవాన్ని తీసుకురావాలనీ, కళలకు పట్టం కట్టాలనీ తపిస్తోంది వరంగల్ గ్రామీణ జిల్లా వర్ధన్నపేటకు చెందిన భారతీయ నాటక కళా సమితి. ఈనెల తొమ్మిదో తేదీ నుంచి పదమూడు వరకూ వార్షికోత్సవాలను జరుపుకొంటున్న ఈ సంస్థకు దాదాపు నాలుగున్నర దశాబ్దాల సుదీర్ఘ చరిత్ర సొంతం. సంస్థ చేస్తున్న కృషి గురించి సమితి ప్రధాన కార్యదర్శి ఈగ సాంబయ్య మాటల్లోనే...

కృషి



నాలుగున్నర దశాబ్దాల...

# నాటక వర్ధనం

వినోదం ఫోన్ల రూపంలో అర చేతుల్లోకి వచ్చేసి... ప్రదర్శన కళారూపాల ఉనికి ప్రశ్నార్థకమైపోతున్న తరుణంలో నలభై నాలుగేళ్ళుగా తన అస్తిత్వాన్ని నిలబెట్టుకుంటోంది మా భారతీయ నాటక కళా సమితి. నాటక రంగానికి పటిష్టమైన వేదిక కల్పించడంతోపాటు మానవీయ విలువలకు పట్టం కట్టాలనే ఆశయంతో 1974లో మా నాన్నగారు ఈగ శ్రీహరి ఈ సంస్థకు అంకురార్పణ చేశారు. దేశభక్తినీ, జాతీయ సమగ్రతనూ ప్రోత్సహించడం కూడా మా ప్రధాన లక్ష్యాల్లో ఉన్నాయి. కాలానుగుణంగా మారుతూ, ఎన్నో ఒడుదొడుకులను తట్టుకొని, ఆశయాల నుంచి పక్కకు జారిపోకుండా తన సాంస్కృతిక మూలాలను మా సంస్థ నిలబెట్టుకుంటోంది.

### విరాళాలతోనే నడుపుతున్నాం!

గ్రామీణ తెలంగాణలో సొంత ఆడిటోరియం, బహిరంగ వేదిక, సౌండ్, లైట్ పరికరాల లాంటివన్నీ ఉన్న అతికొద్ది గ్రామీణ నాటక బృందాల్లో మాదీ ఒకటి. నాటకాన్ని ఒక కళారూపంగా పరిరక్షించడం, రాబోయే తరాల్ని ప్రోత్సహించడానికి నాటక పోటీలు నిర్వహించడం, కోలాటం, భజన, హరికథల్లాంటి ప్రాచీన కళారూపాల్ని కాపాడడం, ఔత్సాహికులకూ, విద్యార్థులకూ శిక్షణ శిబిరాలు, వర్క్‌షాపులూ నిర్వహించడం, నాటక దర్శకత్వం, సంగీతం, మేకప్ తదితర అంశాల్లో వర్క్‌షాపులు కండక్ట్ చెయ్యడం, నాటకాలపై వచ్చిన పుస్తకాలు, ఆడియో, వీడియోలతో గ్రంథాలయ నిర్వహణ, ప్రాచీన కళారూపాలపై పుస్తక ప్రచురణ... ఇవి మా లక్ష్యాల్లో కొన్ని. మా సంస్థకు రాజకీయపరమైన ఎలాంటి సంబంధాలూ లేవు. మేము చిన్నచిన్న విరాళాల మీద ఆధారపడి మనుగడ సాగిస్తున్నాం.

### ఎందరో మహానుభావుల ప్రశంసలు

స్వాతంత్ర్య సమరయోధుడు అల్లూరి సీతారామరాజు జీవితం, రంప పితూరీలో అల్లూరి పాత్రపై ప్రదర్శించిన నాటకం మా సమితికి బాగా పేరు తెచ్చినవాటిలో ఒకటి. తెలుగు సినీ, నాటక రంగాలకు, ఇతర రంగాలకు చెందిన అనేక మంది ప్రముఖులు మా నాటకాలను చూసి ప్రశంసలు అందించారు. వారిలో జమున, జె.వి.సోమయాజులు, కోట శ్రీనివాసరావు, దేవదాస్ కనకాల, సుత్తివేలు, బాబూమోహన్, ఆర్.పి. పట్నాయక్, పొత్తూరి వెంకటేశ్వరరావు, అల్లూరి నారాయణరావు తదితరులున్నారు.



### పరిష్కారాలూ కూడా చూపిస్తాం!

సమకాలీన సమాజం ఎదుర్కొంటున్న సమస్యల్ని మా సమితి తరఫున ప్రదర్శించే నాటకాల్లో ప్రధానంగా చెబుతాం. అయితే కేవలం సమస్యలను ప్రస్తావించి వదిలెయ్యకుండా పరిష్కారాలు కూడా చూపిస్తాం. అందుకే మా జిల్లాలోని ప్రేక్షకులందరూ మా నాటకాల్ని ఇంత కాలంగా ఆదరిస్తున్నారు. సామాజిక, రాజకీయ, ఆరోగ్య, నైతిక సంబంధమైన సమస్యలూ, వాటి పరిష్కారాలతో ఆడియోలూ, వీడియోలూ రూపొందించాలనుకుంటున్నాం. ఇక, ఈ ఏడాది వార్షికోత్సవాల సందర్భంగా రోజూ రెండు నాటక ప్రదర్శనలు ఏర్పాటు చేస్తున్నాం. ఈ నాటకాల్లో మహిళల హక్కులు, స్వచ్ఛ భారత్, కుటుంబ సమస్యలు, విద్యార్థుల సమస్యలు, వ్యక్తిత్వ వికాసం, వ్యవసాయ సంక్షోభం, గ్రామాలనుంచి పట్టణాలకు వలస ప్రధాన అంశాలుగా ఉంటాయి.

పేరెంటచ్

## కొత్తవాళ్ల పరిచయాలూ ముఖ్యమే...!

మొట్టమొదటి సారిగా ఇంటికొచ్చిన బంధువుల్నో, అతిథుల్నో, స్నేహితుల్నో పిల్లలకు పరిచయం చేస్తుంటాం. కొంత మంది పిల్లలకు కొత్తవారితో కలవడం ఎంత మాత్రం ఇష్టం ఉండదు. వాళ్లు అడిగే ప్రశ్నలకు సమాధానం చెప్పడం గానీ, వాళ్లు ప్రేమతో ఏదైనా ఇస్తే తీసుకోవడం గానీ నచ్చదు. చివరికి వాళ్లు తమను తాకడాన్ని కూడా భరించలేరు. వాళ్లు దగ్గరకు తీసుకోవాలని ఒంటిమీద చేయి వేస్తే ఏదో జెర్రులు పాకుతున్నట్లు కంపరానికి లోనవుతూ ఉంటారు. మిగతా అందరితోనూ బాగానే ఉండే పిల్లల్లో కూడా కొందరు ఇలా బిగుసుకుపోతూ ఉంటారు. దీనికంతా కారణం వాళ్లెవరో తెలియకపోవడమే! ముందే తెలియని వాళ్లను భయం భయంగా చూడటం పిల్లల్లో ఉండే ఒక సాధారణ లక్షణం. కొత్తవాళ్లు మంచి వాళ్లు కాకపోవచ్చుననే భావనే చాలా మంది పిల్లల్లో ఉంటుంది. దీనికి వారి ఆహార్యం, వారి హావభావాలు, వారి చూపులు నచ్చకపోవడం, భయాన్ని కలిగించడం కూడా ఒక కారణమే. ఎప్పటి నుంచో తెలిసిన వాళ్లల్లో కూడా కొంత మంచితో పాటు కొంత చెడు కూడా ఉండడాన్ని పిల్లలు గమనించకుండా ఏమీ ఉండరు. కానీ, కొత్తవాళ్లల్లో మాత్రం మొత్తానికి మొత్తం చెడే ఉంటుందన్నట్లు వాళ్లు చూస్తారు. దానికి కారణం అక్కడో ఇక్కడో ఎవరో బాగా విసిగించిన చేదు అనుభవం ఏదైనా కారణం కావచ్చు. నిజంగానే అలాంటి అనుభవం తాలూకు అభిప్రాయం ఏదైనా ఉంటే వాళ్ల మనసులోంచి దాన్ని తీసివేసే ప్రయత్నం చేయాలి. ఎలా అంటే.., కొత్త వాళ్లలో చెడు ఏదైనా ఉందే అనుకున్నా, పాత వాళ్లల్లో కూడా మంచితో పాటు ఎంతో కొంత చెడు కూడా ఉంటుంది కదా! ఏ మనిషి కూడా పూర్తిగా మంచీ కాదు, పూర్తిగా చెడూ కాదు. అందువల్ల చెడు ఉందన్న కారణంగా దూరంగా ఉంచాలనుకుంటే మనం పరిచయం చేసుకోదగ్గ మనిషి ప్రపంచంలో ఎవరూ ఉండరు. అందుకే ప్రతి మనిషి లోనూ మంచీ చెడు రెండూ ఉంటాయని ముందే అనుకుని మనిషిని పరిచయం చేసుకోవాలి. మంచీ చెడుల విషయం అలా ఉంచి మనకు పరిచయం అయ్యేవాళ్లల్లో కొన్ని సార్లు చాలా గొప్పవాళ్లు కూడా ఉంటారు. కొత్తవాళ్లు అన్న కారణంగా వారికి దూరంగా ఉంటే వాళ్లు మనకు తెలిసే అవకాశం ఉండదు. ఈ అర్థం బోధపడేలా పిల్లలకు అప్పుడప్పుడు చెబుతూ ఉండాలి. ఇవన్నీ అవగాహనకు వచ్చినప్పుడే కొత్త పరిచయాల పట్ల పిల్లలు ఆసక్తి చూపుతారు, అప్పుడే కొత్త కొత్త వాళ్లతో ఏర్పడ్డ పరిచయాలతో వాళ్ల జీవితం కొత్త పుంతలు తొక్కుతుంది.



కౌన్సెలింగ్ కార్నర్

## నాకు సర్జరీ తప్పదా?

**నాకు 28 ఏళ్లు. గత సంవత్సర కాలంగా మలంలో రక్తం పడుతోంది. ఓ వారం పాటు ఈ సమస్య వేధించి, ఆ తర్వాత తగ్గిపోతుంది. ఆ తర్వాత ఓ నెల రోజుల తర్వాత మళ్లీ సమస్య మొదలవు తుంది. డాక్టర్‌ని కలిస్తే ఇది పైల్స్ సమస్య అనీ, దీనికి శస్త్ర చికిత్స తప్ప మరో మార్గం లేదనీ చెప్పారు. నాకు ఆపరేషన్ అంటే చాలా భయం. నా సమస్యకు సరైన మందులేవైనా ఉంటే తెలుపగలరు.**

**- సురేష్,** యానాం

మలంలో రక్తం పడటానికి చాలా కారణాలుంటాయి. కాబట్టి రోగిని పరీక్షించనిదే చెప్పడం కష్టం. పైల్స్, ఫిషర్స్, ఫిస్ట్యులా, చివరికి అమీబియాసిస్‌తో కూడా ఇలా మలంలోంచి రక్తం పడుతూ ఉంటుంది. మీకున్నది పైల్స్ సమస్యే అయితే, దానికి మలబద్ధకమే ప్రధాన కారణం. నిరంతరం మలబద్ధకంతో [illegible] కుంటుపడుతుంది. దాంతో మలబద్ధకం సమస్య మొదలవుతుంది. ఈ స్థితి ఏళ్ల పర్యంతం కొనసాగితే అంతిమంగా ఇది పైల్స్ సమస్యకు దారి తీస్తుంది. అందువల్ల వెంటనే మీరు మీ మీ ఆహారపు అలవాట్లను మార్చుకోండి. పండ్లు, ఆకుకూరలు, మొలకెత్తిన గింజల వంటి పీచుపదార్థాలు ఉన్న ఆహారం ఎక్కువగా తీసుకోండి. మాంసాహారం తగ్గించి, కూరగాయలు ఎక్కువగా తినండి. పొగతాగడం, మద్యం సేవించడం లాంటి అలవాట్లుంటే సమస్య పెరుగుతుంది. నీళ్లు ఎక్కువగా తాగాలి. ఎక్కువసేపు కూర్చుని ఉండకూడదు. ప్రస్తుత ఉపశమనం కోసం రోజూ రెండు సార్లు జాత్యాది ఘృతం అనే లేపనాన్ని పైపూతగా వాడండి. రోజూ పడుకోబోయే ముందు కరక్కాయ చూర్ణాన్ని వేడినీటితో కలిపి తీసుకుంటే మలబద్ధకం తగ్గుతుంది. ఆ తర్వాత క్రమంగా పైల్స్ సమస్య కూడా తొలగిపోతుంది. అప్పుడింక శస్త్రచికిత్సతో పనే ఉండదు. ఒకవేళ ఇప్పటికీ మీరు నిర్లక్ష్యంగానే ఉండిపోతే మందులు పనిచేయని స్థితి ఏర్పడుతుంది. ఒత్తిడి మరీ ఎక్కువై రక్తనాళాలు ఉబ్బి కిందికి జారితే అప్పుడింక ఆయుర్వేదంలోని క్షారసూత్ర విధానంలో పైల్స్ చికిత్స చేయవలసి ఉంటుంది. మీరు వెంటనే మీ ఆహారపు అలవాట్లను మార్చుకుంటే మీకు ఈ సమస్యే ఉండదు.

**- డాక్టర్ విఠల్ రావు,** రిటైర్డ్ ప్రొఫెసర్
డాక్టర్ బి.ఆర్. కె. ఆర్ ఆయుర్వేద వైద్య కళాశాల, హైదరాబాద్



# 4 టు 4.. ఓపిగ్గా!



- రెజీనా



కొన్నిసార్లు ఫొటోలు చూడగానే చాలా ఆసక్తిగా అనిపిస్తాయి. ఈ మధ్య 'అ!'లో రెజీనా పోస్టర్ టాలీవుడ్ డైరక్టర్ రాజమౌళిని సైతం అట్రాక్ట్ చేసిందట. ఈ ఫొటో చూడగానే "ఈ అమ్మాయి ఇప్పుడప్పుడే ఇంకేం సినిమాలు చేయదా? ఇంతగా టాటూలు వేయించుకుంది?" అని ఆయన విస్తుపోయారట. అందరి దృష్టినీ ఆకట్టుకున్న 'అ!' సినిమాలోని బ్యాక్‌లుక్ గురించి రెజీనా తమిళ మీడియాతో చాలా విషయాలు చెప్పుకొచ్చారు. "వైవిధ్యమైన హెయిర్ స్టైల్, చేతుల మీద గ్యాప్ లేనంతగా టాటూలు వేయించుకుని సినిమాలో నటించాలని ముందుగా నాకు కేరక్టర్ చెప్పేటప్పుడే వివరించారు. దాంతో షూటింగ్ ముందురోజే నేను హైదరాబాద్‌కి చేరుకున్నా. ఆ హెయిర్ స్టైల్ పూర్తి చేసి, వెనుక వైపు జుట్టు కట్ చేసి, డైమండ్ షేప్‌లు వచ్చేలా జాగ్రత్తలు తీసుకుని, ఆ తర్వాత చేతి వేళ్ల వరకు టాటూలు డిజైన్ చేయడానికి సరిగ్గా 24 గంటలు పట్టింది. అందులోనూ అప్పటికి వీపుమీద చెట్టు వేయనేలేదు. దానికి ఇంకా మరింత సమయం పట్టిందనుకోండి. మొదటి రోజు సాయంత్రం నాలుగు గంటలకు మొదలైన హెయిర్‌స్టైల్, టాటూ ప్రక్రియ మరుసటి రోజు అదే సమయానికి పూర్తయింది. మధ్యలో నేను రెండు గంటలు నిద్రపోయాననుకోండి. ఆ లుక్‌తో మొదటి షెడ్యూల్‌లో నాలుగు రోజులు షూట్ చేశాను. అలా మూడు షెడ్యూళ్లు పూర్తయ్యాయి. ఆ షూటింగ్ జరిగినన్ని రోజులు నేను స్నానం చేయలేదు. కేవలం స్పాంజ్ బాత్ చేశానంతే. కొన్నిసార్లు మనం నమ్మి చేసే పాత్రల కోసం అంతగా కష్టపడాల్సి ఉంటుంది. అప్పుడే ప్రేక్షకుల ప్రశంసలు దక్కుతాయి" అని వివరించారు రెజీనా.

# అవన్నీ చెత్త మాటలు...



- కంగన

'సర్వ బ్రాహ్మణ్ మహాసభ'పై మణికర్ణిక మండిపడింది! ఝాన్సీ లక్ష్మీభాయ్ జీవితకథ ఆధారంగా రూపొందుతోన్న హిందీ చిత్రం 'మణికర్ణిక'. ఝాన్సీ లక్ష్మీభాయ్‌గా కంగనా రనౌత్ నటిస్తున్న ఈ చిత్రానికి క్రిష్ దర్శకత్వం వహిస్తున్నారు. ఇందులో ఝాన్సీ లక్ష్మీభాయ్ విదేశీయుడితో ప్రేమలో పడినట్లు చిత్రీకరిస్తున్నారనీ, దీన్ని మేం సహించబోమని 'మణికర్ణిక' చిత్రబృందంపై 'సర్వ బ్రాహ్మణ్ మహాసభ' తీవ్ర విమర్శలు చేసింది. విదేశీయుడికి, మణికర్ణికకు మధ్య శృంగార సన్నివేశాలు చిత్రీకరిస్తున్నారని ఆరోపించారు. వీటిని కంగనా రనౌత్ ఖండించారు. చెత్త మాటలుగా అభివర్ణించారు. "ఝాన్సీ లక్ష్మీభాయ్ గురించి అలా ఆలోచించడం కూడా నీచమే. మా చిత్రంలో అటువంటి సన్నివేశాలు లేవు. నిజం చెప్పాలంటే... వాళ్ల మాటలే లక్ష్మీభాయ్ ప్రతిష్ఠను దిగజార్చేలా ఉన్నాయి. మా చిత్రరచయిత విజేంద్రప్రసాద్‌గారు ఆయన కుమార్తెకు మణికర్ణిక అని పేరు పెట్టుకున్నారు. అటువంటి వ్యక్తి ఆమె ప్రతిష్ఠకు భంగం వాటిల్లేలా ఎందుకు రాస్తారు?! ఈ విమర్శలు మమ్మల్ని చాలా బాధించాయి" అని కంగనా రనౌత్ పేర్కొన్నారు.

# ఆ పిల్ల ఎదురొస్తే.. గుండెకాయ గోలెట్టేస్తది!



సమంత

ఊర్లో చెరువు.. చెరువులో బట్టలు ఉతకడానికి వెళ్లిన రామలక్ష్మి. పక్కనే రాగి బక్కెట్టు, బిందె. చేస్తున్న పని మధ్యలో ఆపి ఎవరో పిలిస్తే పైకి లేచినట్టు నిలుచున్న రామలక్ష్మి. అది కూడా మామూలుగా కాదు... పైటను గట్టిగా నడుములో దోపి, ఓ కాలు బండమీద పెట్టి, పావడాను మోకాలి పైకెత్తి, కుడి మోకాలి మీద ఓ చెయ్యి, నడుం మీద ఎడమ చెయ్యి వేసుకుని దూరంగా చూస్తున్న ఆమె చూపులు ఆ ఊరి కుర్రాళ్ల గుండెకాయల్లో గోలెట్టించేస్తుంటాయి... చిట్టిబాబుకయితే మరీనూ.. ఆమె ఎదురుపడితే అతనికి పండగే. ఆమెకే కాదు.. ఆ ఊరికే 18 ఏళ్ల వయసొచ్చినట్టు సంబరపడిపోతాడు. ఇంతకీ ఎవరా రామలక్ష్మి. ఎవరా చిట్టిబాబు.. వీరిద్దరి మధ్య కథేంటి? అనేగా మీ ఆత్రుత. తెలుసుకోవాలంటే 'రంగస్థలం' సినిమా చూడాల్సిందే. సుకుమార్ దర్శకత్వం వహిస్తోన్న ఈ చిత్రాన్ని మైత్రీ మూవీస్ సంస్థ నిర్మిస్తోంది. నవీన్ ఎర్నేని, వై. రవిశంకర్, మోహన్ నిర్మాతలు. దేవిశ్రీప్రసాద్ సంగీతాన్ని సమకూర్చారు. ఈ చిత్రంలో సమంత పాత్రను పరిచయం చేసే టీజర్‌ను శుక్రవారం విడుదల చేశారు. ఈ టీజర్‌లో సమంత తల నిండా నూనె పెట్టుకుని గట్టిగా జడ అల్లుకుని కనకాంబరాలు పెట్టుకుని కాసింత బిగుసుకుపోయి సైకిల్ నడుపుతూ, తలమీద చెరకు గడలు పెట్టుకుని నడుస్తూ ప్రేక్షకులను ఆకట్టుకుంటోంది. బ్యాక్‌గ్రౌండ్‌లో "ఓహోహోహో... ఏం వయ్యారం ఏం వయ్యారం.. ఏ మాటకామాట సెప్పుకోవాలి కానీండి.. ఈ పిల్ల ఎదురొస్తుంటే మా ఊరికే పద్దెనిమిది సంవత్సరాల వయసొచ్చినట్టుంటుందండీ. ఈ సిట్టిగాడి గుండెకాయని గోలెట్టేసిందీ ఈ పిల్లేనండీ. పేరు.. రామలక్ష్మి అండీ.. ఊరు.. " అంటూ రామ్‌చరణ్ చెప్పిన వాయిస్ ఓవర్ వినిపిస్తుంది. ఆ వెంటనే 'రంగా రంగా రంగస్థలానా... అంటూ గట్టిగా వినిపించే నేపథ్య సంగీతం మరింత స్పెషల్ అట్రాక్షన్‌గా ఉంది. ఇప్పటికే షూటింగ్ పూర్తయిన ఈ చిత్రాన్ని మార్చి 30న ప్రేక్షకుల ముందుకు తీసుకురావడానికి సన్నాహాలు చేస్తున్నారు. ఫిబ్రవరి 13న తొలి పాటను విడుదల చేయనున్నారు.



సందీప్ కిశన్, మంజుల,అమైరా

# పవన్‌కల్యాణ్‌గారికి పర్ఫెక్ట్ కథ ఉంది!

- మంజుల

"నా దగ్గర ఒక అద్భుతమైన సబ్జెక్ట్ ఉంది. అది పవన్‌కల్యాణ్‌గారికి పర్ఫెక్ట్‌గా సరిపోతుంది. ఆయన చాలా జెన్యూన్ వ్యక్తి. చాలా డిఫరెంట్‌గా ఉంటారు. ఆ కథ వింటే ఆయన తప్పకుండా సినిమా చేస్తారు. ఆ ఒక్కటీ చేసి పవన్ రాజకీయాల్లోకి వెళ్లొచ్చు" అని మంజుల ఘట్టమనేని అన్నారు. ఆమె దర్శకత్వంలో సందీప్ కిషన్, అమైరా దస్తూర్, త్రిదా చౌదరి నటించిన చిత్రం 'మనసుకు నచ్చింది'. ఆనంది ఆర్ట్స్, ఇందిరా ప్రొడక్షన్స్ సంయుక్తంగా నిర్మించాయి. పి.కిరణ్, సంజయ్ స్వరూప్ నిర్మాతలు. రథన్ సంగీతం సమకూర్చారు. ఈ చిత్రంలోని ఆరో పాటను గురువారం సాయంత్రం హైదరాబాద్‌లో సీనియర్ జర్నలిస్టులు నాగేంద్రప్రసాద్, శ్రీను, డా. చల్లా భాగ్యలక్ష్మి ఆవిష్కరించారు. మంజుల మాట్లాడుతూ "పరిశ్రమలో పుట్టి పెరిగిన అమ్మాయిని నేను. మంచి కథతో ఈ చిత్రం తీశాను. చోటా.కె.నాయుడుగారు చూసి తను ఇప్పటిదాకా చూసిన లవ్‌స్టోరీల్లో ఇది బెస్ట్ అని కితాబిచ్చారు. ఆయనకే కాదు, మనసున్న ప్రతి ఒక్కరికీ నచ్చుతుంది. మావారు సంజయ్‌గారు నటించిన సినిమాలన్నీ హిట్ అవుతున్నాయి. పాప జాన్వి కీలక పాత్రలో నటించింది. ఎక్కడా ఖర్చుకు వెనకాడకుండా చేసిన చిత్రమిది. మహేశ్ ప్రకృతికి వాయిస్ ఓవర్ ఇచ్చాడు. పాటలు, ట్రైలర్ చూసి బాగా ఇంప్రెస్ అయ్యాడు. తనతో ఓ సినిమాను నిర్మిస్తాను. ఆ వివరాలను కూడా త్వరలోనే వెల్లడిస్తాను" అని అన్నారు. మంచి లవ్‌స్టోరీలో భాగమైనందుకు ఆనందంగా ఉందని సందీప్, అమైరా, అనితా చౌదరి అన్నారు. ఈ లవ్‌స్టోరీ ప్రతి గుండెనూ తడుతుందని, ఫిబ్రవరి 16న విడుదల చేస్తామని నిర్మాతలు తెలిపారు.

# పోలికే ఉండదు



- వరుణ్ తేజ్

"కోట్ల మంది అభిమానాన్ని, స్టార్‌డమ్‌ను వదులుకుని రాజకీయాల్లోకి వెళ్లాలంటే గట్స్ ఉండాలి. అది కల్యాణ్ బాబాయ్‌లో చాలా ఎక్కువ ఉంది. నేను అయితే అంత సాహసం చెయ్యలేను" అని వరుణ్‌తేజ్ అన్నారు. ఆయన కథానాయకుడిగా నటించిన చిత్రం 'తొలిప్రేమ' వెంకీ అట్లూరి దర్శకత్వంలో బీవీఎస్ఎన్ ప్రసాద్ నిర్మించిన చిత్రమిది. శనివారం ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్న సందర్భంగా శుక్రవారం వరుణ్‌తేజ్ విలేకర్లతో మాట్లాడారు.

## ఎగ్రెసివ్ క్యారెక్టర్‌తో...


20 ఏళ్ల కిత్రం బాబాయ్ నటించిన 'తొలిప్రేమ'కు ఈ సినిమాకు ఏ పోలిక ఉండదు. కథకు యాప్ట్ అవుతుందని అదే టైటిల్ పెట్టాం. మొదట రెండు మూడు ఇంగ్లిష్ టైటిల్స్ అనుకున్నాం. ప్రేమకథకు తెలుగు టైటిల్ అయితే బావుంటుందని ఆ టైటిల్ పెట్టాం. ఈ జనరేషన్‌కు సంబంధించిన ప్రేమకథ ఇది. తను చేసిందే కరెక్ట్ అనుకునే యువకుడిగా కనిపిస్తా. కాస్త ఎగ్రెసివ్‌గా కూడా ఉంటుంది నా పాత్ర. మొదటి చూపులోనే ప్రేమలో పడటం, బ్రేకప్ అవ్వడం, మళ్లీ ఒకటవ్వడం అన్నది దర్శకుడు ఆసక్తికరంగా తెరకెక్కించాడు. క్లైమాక్స్ పార్ట్ నాకు బాగా నచ్చింది.

## 'ఫిదా' కన్నా ముందే...

జనరల్‌గా సినిమాకు కథే హీరో అంటారు. వెంకీ అట్లూరి ఈ కథ చెప్పాక నాకూ అదే అనిపించింది. దాదాపుగా ప్రేమకథలన్నీ ఒకేలా ఉంటాయి. దర్శకుడు ఎంత ఫ్రెష్‌గా చూపించాడనేది ముఖ్యం. ఈ సినిమాతో వెంకీ తనకంటూ ఓ ప్రత్యేకమైన మార్క్ తెచ్చుకుంటాడు. 'ఫిదా' కన్నా ముందు సైన్ చేసిన సినిమా ఇది. దిల్ రాజుగారి బ్యానర్‌లో చెయ్యాల్సిన సినిమా ఇది. ఆయన 'ఫిదా'తోపాటు పలు ప్రాజెక్ట్‌లతో బిజీగా ఉండటం వల్ల ప్రసాద్‌గారు తీశారు. ఎన్ని సినిమాలు చేసి, ఎంత పేరు తెచ్చుకున్నా స్టార్‌డమ్ జోలికి వెళ్లను. ముందు పెర్‌ఫార్మర్ అనిపించుకోవడమే నా లక్ష్యం. జయాపజయాలు పక్కనపెడితే సినిమా సినిమాకు నా నటనలో డెవలప్‌మెంట్ అయితే ఉంది. ఇది నేనంటున్న మాట కాదు. సన్నిహితులు, ప్రేక్షకులు చెబుతున్న మాట. కథల ఎంపికలో నా మీద నాకు నమ్మకం పెరగడానికి 'ఫిదా' కారణం. మా కుటుంబం మొత్తం మన సినిమాలతోపాటు వరల్డ్ సినిమా మీద ఎక్కువ దృష్టి పెడతాం.

# మణిరత్నం 'నవాబ్'

అరవింద్ స్వామి, శింబు, అరుణ్ విజయ్, విజయ్ సేతుపతి హీరోలుగా మద్రాస్ టాకీస్ పతాకంపై మణిరత్నం స్వీయ దర్శకత్వంలో నిర్మిస్తున్న చిత్రానికి తెలుగులో 'నవాబ్', తమిళంలో 'సెక్క సెవంద వానమ్' టైటిల్స్‌ని ఖరారు చేశారు. ఈ చిత్రానికి 'లైకా ప్రొడక్షన్స్' సుభాష్‌కరణ్ నిర్మాణ భాగస్వామి. టైటిల్‌తో పాటు నలుగురు హీరోల కళ్లు మాత్రమే కనిపించేలా ఫస్ట్‌లుక్ డిజైన్ చేసి, శుక్రవారం విడుదల చేశారు. అలాగే, చిత్రీకరణ మొదలైందని తెలిపారు.



## ప్రత్యక్ష పన్ను వసూళ్లు రూ.6.95 లక్షల కోట్లు

న్యూఢిల్లీ: ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో గడిచిన పది నెలల కాలాని (ఏప్రిల్ 2017-జనవరి 2018)కి ప్రత్యక్ష పన్ను వసూళ్లు రూ.6.95 లక్షల కోట్లకు చేరుకున్నాయి. గత ఆర్థిక సంవత్సరం (2016-17)లో ఇదేకాలానికి నమోదైన వసూళ్లతో పోలిస్తే 19.3 శాతం వృద్ధి చెందాయి. 2017-18 ఆర్థిక సంవత్సరానికి ప్రత్యక్ష పన్నుల రాబడి అంచనాను రూ.10.05 లక్షల కోట్లకు సవరించగా.. అందులో 69.2 శాతానికి సమానమైన పన్నులు వసూలయ్యాయి. గడచిన పది నెలల్లో కార్పొరేట్ పన్ను వసూళ్లు ఏడాది ప్రాతిపదికన 19.2 శాతం వృద్ధి చెందగా.. వ్యక్తిగత ఆదాయ పన్ను వసూళ్లు 18.6 శాతం పుంజుకున్నాయి. ఈ పది నెలల్లో మొత్తం రూ.1.26 లక్షల కోట్లు రిఫండ్ చేసినట్లు కేంద్ర ప్రభుత్వం వెల్లడించింది.



## యమహా వైజెడ్‌ఎఫ్-ఆర్3

యమహా ఇండియా.. ఆటో ఎక్స్‌పోలో సరికొత్త స్పోర్ట్స్ మోడల్ వైజెడ్ఎఫ్ ఆర్3ని విడుదల చేసింది. డ్యూయల్ చానల్ యాంటీ లాక్ బ్రేకింగ్ సిస్టమ్ (ఎబిఎస్) టెక్నాలజీ, హై గ్రిప్ మెట్‌జెలర్ రేడియల్ టైర్స్‌తో ఈ బైక్‌ను తీసుకువచ్చింది. ఈ బైక్ ధర 3,48,000 రూపాయలు (ఢిల్లీ ఎక్స్‌షోరూమ్). 321 సిసి, 4 స్ట్రోక్, ఇన్‌లైన్ 2 సిలిండర్, ఫ్యూయల్ ఇంజక్టెడ్ ఇంజన్ ఈ బైక్ ప్రత్యేకతలు.

## జెబిఎస్ సోలారిస్ నుంచి ఎకో లైఫ్



జెబిఎం ఆటో లిమిటెడ్, యూరప్‌కు చెందిన మొబిలిటీ దిగ్గజం సోలారిస్ బస్ అండ్ కోచ్ జాయింట్ వెంచర్ సంస్థ జెబిఎం సోలారిస్ ఎలక్ట్రిక్స్.. ఎకో లైఫ్ పేరుతో ఎలక్ట్రిక్ బస్‌ను తీసుకువచ్చింది. ఢిల్లీ ఆటో ఎక్స్‌పోలో జెబిఎం గ్రూప్ చైర్మన్ ఎస్‌కె ఆర్య, సోలారిస్ బస్ సిఇఒ సోలాంజే ఒల్‌జుస్కా ఈ బస్‌ను విడుదల చేశారు. జీరో ఎమిషన్ వాహనమైన ఎకో లైఫ్ పదేళ్ల నిర్వహణలో 959 టన్నులకు సమానమైన కార్బన్ డై ఆక్సైడ్, 3.5 లక్షల లీటర్ల డీజిల్‌ను ఆదా చేస్తుందని జెబిఎం తెలిపింది. లిథియం బ్యాటరీలతో కూడిన ఎకో లైఫ్.. ట్రాఫిక్ పరిస్థితులను బట్టి 10-15 గంటల్లో 150-200 కిలోమీటర్లు ప్రయాణిస్తుందని తెలిపింది.

## మెంజా ఎలక్ట్రిక్ బైక్



ఎలక్ట్రికల్ ఆటోమోబైల్ మాన్యుఫ్యాక్చరింగ్ కంపెనీ మెంజా మోటార్స్ ప్రైవేట్ లిమిటెడ్.. భారత మార్కెట్లోకి మెంజా లూకాట్‌ను తీసుకువచ్చింది. ఈ నెల ద్వితీయార్థం నుంచి ప్రీ బుకింగ్‌లు ప్రారంభించి ఆగస్టులో బైక్‌లను డెలివరీ చేయనున్నట్లు మెంజా మోటార్స్ తెలిపింది. ఈ బైక్ ధర 2,79,999 రూపాయలు. ఏదేనీ వాల్ సాకెట్ నుంచి లేదా ఆన్‌బోర్డ్‌లో కూడా చార్జ్ చేసుకోవటం ఈ బైక్ ప్రత్యేకత. మేకిన్ ఇండియాలో భాగంగా ఈ బైక్‌ను స్థానికంగానే ఉత్పత్తి చేయనున్నట్లు తెలిపింది.

# తెలంగాణలో టఫే 'జెఫార్మ్'

### 50 హెక్టార్ల విస్తీర్ణంలో ఏర్పాటు యోచన



హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): తెలంగాణలో వ్యవసాయ ఉత్పాదకతతోపాటు రైతుల ఆదాయాన్ని పెంచేందుకు తమ వంతుగా కృషి చేస్తున్నట్లు ట్రాక్టర్స్ అండ్ ఫార్మ్ ఎక్విప్‌మెంట్ లిమిటెడ్ (టఫే) ప్రెసిడెంట్, చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ (ప్రొడక్ట్ స్ట్రాటజీ, కార్పొరేట్ సంబంధాలు) టిఆర్ కేసవన్ తెలిపారు. ఇందులో భాగంగా రాష్ట్రంలో జెఫార్మ్‌ను ప్రభుత్వ సహకారంతో ఏర్పాటు చేయనున్నామని, దీని విస్తీర్ణం 50 హెక్టార్లు ఉంటుందని కేసవన్ శుక్రవారం నాడిక్కడ విలేకరుల సమావేశంలో తెలిపారు. దీనికి కనీసం 50 కోట్ల రూపాయల అవసరం ఉంటుందని చెప్పారు. జెఫార్మ్ ఏర్పాటు కోసం ములుగు, రాజన్న సిరిసిల్లా, రంగారెడ్డి జిల్లాలోని షాబాద్‌లో స్థలాలను పరిశీలించినట్లు చెప్పారు. జెఫార్మ్ ద్వారా రైతులకు ఉచిత శిక్షణ ఇవ్వడంతోపాటు సాగులో మెళకువలు, విభిన్న రకాల పంటల సాగు, తక్కువ కాలంలో ఎక్కువ ఆదాయాన్ని ఇచ్చే పంటల సాగు గురించి రైతులకు పూర్తి స్థాయిలో అవగాహన కల్పిస్తామని తెలిపారు. ఇప్పటికే చెన్నైలో 200 ఎకరాల విస్తీర్ణంలో జెఫార్మ్‌ను నిర్వహిస్తున్నామని, రాజస్థాన్, అసోమ్, కర్ణాటకలో జెఫార్మ్‌లను ఏర్పాటు చేయనున్నామని చెప్పారు. కార్పొరేట్ సామాజిక బాధ్యతలో భాగంగా జెఫార్మ్ ద్వారా రైతులకు సహకారం అందిస్తున్నామన్నారు.

### ఉపకరణాల ప్లాంట్

తెలంగాణలో 30 ఎకరాల విస్తీర్ణంలో హైఎండ్ ప్రెసిషన్ ఇంప్లిమెంట్స్ (ఉపకరణాలు) ప్లాంట్‌ను ఏర్పాటు చేసే యోచన కూడా ఉందని కేసవన్ తెలిపారు. ఈ ప్లాంట్ కోసం 100-200 కోట్ల రూపాయల పెట్టుబడి ఉంటుందన్నారు. ఈ ప్లాంట్‌లో తయారు చేసే ఉపకరణాల ద్వారా ఉత్పాదక వ్యయాన్ని, రసాయనిక ఎరువుల వినియోగాన్ని తగ్గించవచ్చన్నారు. ఈ మేరకు నెల రోజుల్లో రాష్ట్ర ప్రభుత్వంతో అవగాహన ఒప్పందం కుదుర్చుకునే అవకాశం ఉందని ఆయన తెలిపారు.

### ఫార్మర్2ఫార్మర్ విస్తరణ

ట్రాక్టర్ ఇతర వ్యవసాయ యంత్రాలు కలిగిన రైతులు, వాటి అవసరం ఉన్న రైతులకు ప్రయోజనం కల్పించే ఫార్మర్ 2 ఫార్మర్ సదుపాయాన్ని తెలంగాణకు విస్తరించనున్నట్లు కేసవన్ తెలిపారు. మొబైల్ యాప్ ఆధారంగా రైతులు తమ వద్ద వినియోగంలో లేని యంత్రాలను ఇతర రైతులకు అద్దెకు ఇవ్వవచ్చని చెప్పారు.

# హైదరాబాద్‌లో ఎన్‌పిసిసి కార్యాలయం

### గ్లోబల్ ఇపిసిసి కాంట్రాక్టులపై దృష్టి

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్) : అబుదాబికి చెందిన ఇపిసి కాంట్రాక్టుల కంపెనీ ఎన్‌పిసిసి (నేషనల్ పెట్రోలియం కన్‌స్ట్రక్షన్ కంపెనీ) హైదరాబాద్‌లో కార్యాలయాన్ని ప్రారంభించింది. శుక్రవారం తెలంగాణ ఆర్థిక మంత్రి ఈటల రాజేందర్ ఈ కార్యాలయాన్ని ప్రారంభించారు. అబుదాబి, ముంబై, హైదరాబాద్‌లలో తాము మూడు కార్యాలయాలు నడుపుతున్నామని, వాటిలో 1200 మంది ఇంజనీర్లు పని చేస్తున్నారని కంపెనీ చైర్మన్ అకిల్ మధి చెప్పారు. హైదరాబాద్‌లో కార్యాలయం ప్రారంభించే లక్ష్యంతో తాము ఇప్పటికే ప్రపంచ వ్యాప్తంగా ఇపిసి కాంట్రాక్టులు నిర్వహిస్తున్న అనివా సంస్థలో 80 శాతం వాటాలు కొనుగోలు చేసినట్లు



ఎన్‌పిసిసి కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న మంత్రి ఈటల రాజేందర్

ఆయన తెలిపారు. ప్రస్తుతం ఈ కార్యాలయంలో 450 మంది ఇంజనీర్లు పని చేస్తున్నారని, తమకు లభించే కాంట్రాక్టుల ఆధారంగా మరింత ఎక్కువ మందిని నియమించుకునే విషయం పరిశీలిస్తామని ఆయన అన్నారు. 1984లో ముంబై కార్యాలయాన్ని ప్రారంభించి ఆయిల్, గ్యాస్ రంగంలో ఇపిసి కాంట్రాక్టులు నిర్వహిస్తున్నామని, ఒఎన్‌జిసి తమకి అతిపెద్ద క్లయింట్ అని అకిల్ తెలిపారు. ఇటీవలే తమకు 38 కోట్ల డాలర్ల విలువైన కాంట్రాక్టు ఒఎన్‌జిసి నుంచి వచ్చినట్లు చెప్పారు.

### పరిశ్రమలకు పెద్దపీట

తెలంగాణ ప్రభుత్వం స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు అందుబాటులోకి తెచ్చే లక్ష్యంతో పరిశ్రమలకు పెద్దపీట వేస్తున్నదని ఈటల ఈ సందర్భంగా తెలిపారు. టిఎస్ ఐపాస్ ద్వారా 15 రోజుల్లో పరిశ్రమలకు అనుమతులు మంజూరు చేయడంతో పాటు నిరంతర విద్యుత్, పరిశుభ్రమైన నీరు కూడా అందిస్తున్నదని ఆయన చెప్పారు. 24 గంటలూ విద్యుత్‌తో పాటు తాగు నీటి అవసరాలకు ఉపయోగపడే స్వచ్ఛమైన నీటిని పరిశ్రమలకు అందిస్తున్న రాష్ట్రం దేశం మొత్తంలో తెలంగాణ ఒక్కటేనని ఆయన అన్నారు.

# డ్రోన్ టెక్నాలజీతో అనేక ప్రయోజనాలు

▸▸ తెలంగాణ ఐటి మంత్రి కెటిఆర్

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): డ్రోన్ టెక్నాలజీతో చాలా ఉపయోగాలున్నాయని తెలంగాణ ఐటి శాఖ మంత్రి కె తారక రామరావు అన్నారు. భద్రత, వ్యవసాయం, మైనింగ్‌తోపాటు పట్టణాభివృద్ధి ఇంకా పలు రంగాల్లో డ్రోన్లను ఉపయోగించుకోవడం ద్వారా మరింత సమర్థవంతంగా నిర్ణయాలు తీసుకునేందుకు వీలుంటుందన్నారు. శుక్రవారం సైయెంట్ ఐటి పార్క్‌లో జరిగిన 'హ్యాక్‌డ్రోన్ 2018' విజేతల ప్రకటన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న కెటిఆర్ మాట్లాడుతూ.. బహుళ ప్రయోజనాలున్న డ్రోన్ టెక్నాలజీని ప్రోత్సహించేందుకు తెలంగాణ ప్రభుత్వం ప్రత్యేక పాలసీని ప్రకటించిందన్నారు. ప్రజల మేలు, సమాజ సంక్షేమం కోసం ఈ సాంకేతికతను విరివిగా వినియోగించుకోవాల్సిన అవసరం ఉందని ఆయన అభిప్రాయపడ్డారు. సైయెంట్ కూడా డ్రోన్ల తయారీలోకి ప్రవేశిస్తోందని ఆయన చెప్పారు.

### హ్యాక్‌డ్రోన్ విజేతల్లో హైదరాబాద్ టీమ్

డిజెఐ, సైయెంట్ సంయుక్తంగా హ్యాక్‌డ్రోన్‌ను నిర్వహించాయి. ఈ నెల 5-9 తేదీల్లో జరిగిన ఈ పోటీ కార్యక్రమంలో 4 వేలకు పైచిలుకు పాల్గొన్నారు. అందులో విద్యార్థులు, స్టార్టప్‌లు ఇంకా పలు సంస్థలున్నాయి. వినూత్న సాంకేతికతను ప్రదర్శించిన ఏడు



గురు ఫైనలిస్టులను ఎంపికచేసి, ముగ్గురిని తుది విజేతలుగా ప్రకటించారు. మహిళల భద్రత కోసం వినూత్న టెక్నాలజీని అభివృద్ధి చేసిన హైదరాబాదీ టీమ్ డ్రోన్ ఫోర్స్ ఉత్తమ విజేతగా ఎంపికైంది.

## ఆర్‌బిఐ పేరుతో నకిలీ సైట్లు

▸▸ హెచ్చరించిన రిజర్వ్ బ్యాంక్

న్యూఢిల్లీ: భారతీయ రిజర్వ్ బ్యాంక్ (ఆర్‌బిఐ) పేరుతో పుట్టుకొస్తున్న నకిలీ వెబ్‌సైట్ల పట్ల జాగ్రత్తగా ఉండాలని అధికారులు హెచ్చరించారు. ఈ మేరకు శుక్రవారం ఓ 'హెచ్చరిక నోటీసు' జారీ చేశారు. www.rbi.org.in అనే వెబ్‌సైట్‌ను తాము అధికారికంగా నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. అచ్చుగుద్దినట్లు ఇదే వెబ్‌సైట్ కంటెంట్‌తో హ్యాకర్లు www.indiareserveban.orgను సృష్టించారని పేర్కొన్నారు. 'ఆర్‌బీఐ వెబ్‌సైట్‌లో బ్యాంకు ఖాతాదారుల వ్యక్తిగత వివరాలేవీ సేకరించం. నకిలీ వెబ్‌సైట్‌లో మాత్రం.. ఈకేవైసీ పేరుతో బ్యాంకు ఖాతాదారుల పేరు, అకౌంట్ నంబరు, బ్యాంకు వివరాలు, కస్టమర్ పిన్ నంబరు వంటి వివరాలను సేకరిస్తున్నారు. ఈ వివరాలతో హ్యాకర్లు ఖాతాదారుల ఇంటర్నెట్ బ్యాంకింగ్‌ను అనధికారికంగా వినియోగించే ప్రమాదముంది' అని పేర్కొన్నారు. ఇదే వెబ్‌సైట్ తరహాలో.. www.rbi.org, www.rbi.in తదితర ఫేక్ వెబ్‌సైట్ల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

## పెగా సిస్టమ్స్‌కు ఇ-ప్రగతి కాంట్రాక్టు

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్) : ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చేపట్టిన ఇ-ప్రగతి ప్రాజెక్ట్ నిర్వహణ కాంట్రాక్టును పెగా సిస్టమ్స్ చేజిక్కించుకుంది. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం.. అన్ని ప్రభుత్వ శాఖలు, సర్వీసులను ఒకే ప్లాట్‌ఫామ్ ద్వారా అందించేందుకు ఇ-ప్రగతి పోర్టల్‌ను ప్రారంభిస్తోందని, ఈ ప్రాజెక్ట్‌కు సంబంధించి టెక్నాలజీ, సాఫ్ట్‌వేర్ సేవలను అందించే కాంట్రాక్టును పెగా సిస్టమ్స్ గెలుచుకుందని సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ సుమన్ రెడ్డి వెల్లడించారు. ప్రభుత్వ డిజిటల్ ట్రాన్స్‌ఫార్మేషన్ ప్రాజెక్టు అయిన ఇ-ప్రగతి ద్వారా 33 శాఖలు, 315 ఏజెన్సీలు, 745 సిటిజన్ సర్వీసులను ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అందించనుందని చెప్పారు. ఇ-ప్రగతి ప్రాజెక్ట్‌కు ఏపి ప్రభుత్వం రూ.2,400 కోట్లు వెచ్చిస్తోందని సుమన్ రెడ్డి తెలిపారు. అన్ని ప్రభుత్వ సర్వీసులను ఇంటిగ్రేట్ చేయటం ద్వారా పౌరులకు ఆన్‌లైన్ సేవలను అందించనుంది.

## గేమింగ్, యానిమేషన్‌పై బ్రిటన్ ఆసక్తి

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతనిస్తున్న గేమింగ్, యానిమేషన్, విఎఫ్ఎక్స్ రంగాల్లో సహకరించేందుకు బ్రిటన్ ఆసక్తి చూపిస్తోంది. భవిష్యత్తులో ఈ రంగాలు విస్తృత ఉపాధి అవకాశాలు అందిస్తాయని బ్రిటన్‌లోని భారత హైకమిషన్, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం సంయుక్తంగా నిర్వహించిన 'గేమింగ్ అండ్ ఇమ్మెర్సివ్ టెక్ సదస్సు'లో పాల్గొన్న బ్రిటిష్ పారిశ్రామికవేత్తల బృందం పేర్కొంది. ఈ రంగాలను ప్రోత్సహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక పాలసీ ప్రకటించడంపై హర్షం వ్యక్తం చేశారు. బ్రిటన్‌కు చెందిన 15 కంపెనీల ప్రతినిధులు ఈ సదస్సులో పాల్గొని రాష్ట్ర ఐటి శాఖ అధికారులతో వివిధ అంశాలపై చర్చించారు. ఈ రంగంలో రాష్ట్ర ప్రభుత్వానికి పూర్తి సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. అనంతరం వారు నగరంలో పర్యటించి వివిధ పరిశ్రమలను పరిశీలించారు.

## డెమో డిపాజిటర్లకు మార్చి 31 వరకే గడువు

న్యూఢిల్లీ : పాత పెద్ద నోట్ల రద్దు తర్వాత మీ బ్యాంకు ఖాతాలో పెద్ద మొత్తం నగదు డిపాజిట్ చేశారా? అయితే వచ్చే నెల 31లోగా ఆ నగదు ఎలా వచ్చిందో తెలుపుతూ, మీ ఆదాయ పన్ను (ఐటి) రిటర్న్‌లు ఫైల్ చేయాల్సిందే. కంపెనీలు, ట్రస్టులు, రాజకీయ పార్టీలు, ఇతర సంస్థలకూ ఇది వర్తిస్తుందని ఐటి శాఖ శుక్రవారం తెలిపింది. ఈ గడువులోగా రిటర్న్‌లు ఫైల్ చేయకపోతే ప్రాసిక్యూషన్ కూడా ఉంటుందని హెచ్చరించింది.

# బెంగళూరులో హెలీటాక్సీలు!

బెంగళూరు (ఆంధ్రజ్యోతి): బెంగళూరులో ట్రాఫిక్ జామ్‌లకు చెక్ పెడుతూ హెలీటాక్సీ సేవల ప్రారంభానికి కార్యాచరణ పూర్తయింది. మరో వారం రోజుల్లోనే ఈ సేవలు అందుబాటులోకి రానున్నాయి. ప్రస్తుతం ఎయిర్‌పోర్టు నుంచి ఎలక్ట్రానిక్ సిటీకి ప్రయాణించాలంటే కనీసం 2-3గంటలు పడుతోంది. విదేశాల నుంచి వచ్చే ప్రముఖులకు ఇది ఇబ్బందిగా మారుతోంది. హెలీటాక్సీ సేవలు అందుబాటులోకి వస్తే ఈ దూరాన్ని 15 నిమిషాల్లోనే చేరుకునే అవకాశం ఉంటుంది. ఇందుకుగాను తంబి ఏవియేషన్ ప్రైవేట్ లిమిటెడ్ మూడు హెలిటాక్సీలను సిద్ధం చేస్తోంది. 13సీట్ల సామర్థ్యం కలిగిన 412 రకం హెలికాప్టర్లు రెండు, ఐదు సీట్ల కెపాసిటీ కలిగిన బెల్-407 హెలికాప్టర్ ఒకదాన్ని ఉపయోగించనున్నారు. ఆన్‌లైన్ బుకింగ్ కోసం మొబైల్ అప్లికేషన్ సిద్ధమైంది. టికెట్ ధర రూ.2,500 నుంచి రూ.3 వేలు వరకూ ఉండే అవకాశం ఉంది.

## మూడింతలైన జిఒసిఎల్ లాభం

హైదరాబాద్: హిందూజా గ్రూపునకు చెందిన జిఒసిఎల్ కార్పొరేషన్ లిమిటెడ్ (గతంలో గల్ఫ్ ఆయిల్ కార్పొరేషన్) మెరుగైన ఆర్థిక ఫలితాలు ప్రకటించింది. డిసెంబరుతో ముగిసిన మూడు నెలల కాలానికి (క్యు3) కంపెనీ కన్సాలిడేటెడ్ లాభం మూడింతలై రూ.10.05 కోట్లకు చేరుకుంది. గత ఆర్థిక సంవత్సరంలో ఇదేకాలానికి లాభం రూ.3.3 కోట్లుగా నమోదైంది. ఆదాయం మాత్రం వార్షిక ప్రాతిపదికన రూ.168 కోట్ల నుంచి రూ.140 కోట్లకు తగ్గింది. హైదరాబాద్ కేంద్రంగా ఈ సంస్థ కార్యకలాపాలు సాగిస్తోంది.



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్ఐఎన్ఎల్ సిఎండి మధుసూదన్

# లాభాల్లోకి విశాఖ ఉక్కు

▸▸ రెండేళ్ల నష్టాలకు బ్రేక్
▸▸ కంపెనీ సిఎండి మధుసూదన్ వెల్లడి

విశాఖపట్నం (ఆంధ్రజ్యోతి): రాష్ట్రీయ ఇస్పాత్ నిగమ్ లిమిటెడ్ (ఆర్ఐఎన్ఎల్-విశాఖ ఉక్కు కర్మాగారం) గత రెండేళ్ల నష్టాలను అధిగమించి ఈ ఏడాది లాభాల బాటలోకి వచ్చిందని సిఎండి పి.మధుసూదన్ వెల్లడించారు. ఈ ఏడాది జనవరి నెలాఖరుకు రెండేళ్ల నష్టాలను భర్తీ చేసుకొని బ్రేక్ ఈవెన్ సాధించామన్నారు. ఫిబ్రవరి, మార్చి నెలల విక్రయాల ద్వారా సుమారు రూ.100 కోట్ల లాభాన్ని నమోదుచేస్తామని విశ్వాసం వ్యక్తంచేశారు. ప్రస్తుతం ఉక్కు పరిశ్రమకు మార్కెట్ సానుకూలంగా ఉందన్నారు. గత మూడు నెలల నుంచి ముడి ఇనుము, కోకింగ్ కోల్ ధరలు పెరగడం వల్ల ఉత్పత్తి వ్యయం పెరిగిందని, ఆ మేరకు ఉక్కు ధరలు కూడా పెంచాల్సి వచ్చిందన్నారు. ఆర్ఐఎన్ఎల్ చరిత్రలో ఎన్నడూ లేనివిధంగా ఒక్క డిసెంబరు నెలలోనే రూ.2 వేల కోట్ల విలువైన 5.65 లక్షల టన్నుల ఉక్కును విక్రయించామని వివరించారు. ఆధునీకరణ పనులన్నీ పూర్తయిపోయాయని, ఇప్పుడు 63 లక్షల టన్నుల ఉత్పత్తి సామర్థ్యంతో అన్ని యూనిట్లు పనిచేస్తున్నాయన్నారు. ఉక్కు విక్రయాలు పెరగడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పథకాలు దోహదపడుతున్నాయన్నారు. స్మార్ట్ సిటీల నిర్మాణానికి, రాజధాని అమరావతి, పోలవరం ప్రాజెక్టు నిర్మాణ పనులకు విశాఖ ఉక్కును వినియోగిస్తున్నారని వివరించారు. అమరావతిలో గత పది నెలల్లో లక్ష టన్నుల విశాఖ ఉక్కు విక్రయించామన్నారు.

### ఎగుమతుల విస్తరణ

ఇంతకు ముందు పొరుగు దేశాలకు మాత్రమే ఆర్ఐఎన్ఎల్ ఉత్పత్తులను ఎగుమతి చేశామని, ఈ ఏడాది అమెరికాకు వైర్‌రాడ్లు, ఫిలిప్పీన్స్‌కు రౌండ్లు ఎగుమతి చేశామన్నారు. కేంద్ర ప్రభుత్వం కొత్తగా ప్రవేశపెట్టిన కోస్టల్ షిప్పింగ్ (తీర ప్రాంత రవాణా)ను ఉపయోగించుకొని మల్టీ మోడల్ ట్రాన్స్‌పోర్ట్ సిస్టమ్ (ఎంఎంటిఎస్) ద్వారా మరిన్ని ఎగుమతులు సాధించాలనే లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. ఇందుకోసం సొంతంగా లాజిస్టిక్స్ సౌకర్యాలు కల్పించుకునే దిశగా చర్యలు మొదలయ్యాయన్నారు.

### నీతి అయోగ్ అనుమతిస్తే కుక్కునూరు గనులు

నాలుగు దశాబ్దాల క్రితం ఏర్పాటైన విశాఖ ఉక్కుకు ఇప్పటివరకు సొంత గనులు లేని విషయమై మాట్లాడుతూ.. కొత్తగా వచ్చిన చట్టం ప్రకారం ఏ రాష్ట్రం గనులను ఆ రాష్ట్రమే కేటాయించాలని, దీనిపై కేంద్రానికి ఎటువంటి అధికారం లేదన్నారు. వేలంపాటల్లో అందరితోపాటు పాల్గొని దక్కించుకోవలసిందేనన్నారు. పశ్చిమ గోదావరి జిల్లా కుక్కునూరులోని గనులు కేటాయించడానికి ఏపి ప్రభుత్వం సానుకూలంగా ఉందని, అక్కడ 63 ఎఫ్ఈ రకం ముడి ఇనుము లభిస్తుందని, సుమారు 300 లక్షల టన్నులు అక్కడ వుండవచ్చునని అంచనా వేస్తున్నామన్నారు. వీటి కోసం ఎపిఎండిసితో కలిసి జాయింట్ వెంచర్‌కు వెళుతున్నామని, దీనికి స్పెషల్ పర్పస్ వెహికల్ (ఎస్‌పివి) ఏర్పాటు చేసి నీతి అయోగ్‌కు దరఖాస్తు చేయాల్సి ఉందన్నారు.

### ఉప సంహరణతో సంస్థకు మేలు

ఆర్ఐఎన్ఎల్‌లో పెట్టుబడుల ఉపసంహరణకు కేంద్రం రెండేళ్ల క్రితమే నిర్ణయం తీసుకుందని, మార్కెట్ బాగున్నప్పుడు వాటాల విక్రయం జరిగే అవకాశం ఉందన్నారు. విశాఖ ఉక్కులో కేంద్రం రూ.4,890 కోట్లు పెట్టుబడి పెట్టిందని, అందులో పది శాతం వాటాలు విక్రయిస్తారని, అంటే రూ.489 కోట్ల విలువైన వాటాలను అమ్ముతారని ఆయన చెప్పారు.. ఇది సంస్థకు ఆర్థికంగా నష్టమైనప్పటికీ షేర్‌మార్కెట్‌లో కంపెనీ లిస్టింగ్‌కావడం వల్ల విశ్లేషకులు, నిపుణులు సంస్థపై దృష్టిసారిస్తారని, దానివల్ల పనితీరు మెరుగుపడడంతోపాటు మరింత సమర్థంగా పని చేసే అవకాశం కలుగుతుందన్నారు.

# టాటా స్టీల్ లాభం ఐదు రెట్లు

### క్యు3లో రూ.1,136 కోట్లుగా నమోదు

న్యూఢిల్లీ: దేశీయ ఉక్కు దిగ్గజం టాటా స్టీల్ మెరుగైన పనితీరు కనబర్చింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో మూడో త్రైమాసికం (అక్టోబర్-డిసెంబర్ 2017)లో కంపెనీ కన్సాలిడేటెడ్ లాభం దాదాపు ఐదు రెట్లు పెరిగి రూ.1,136 కోట్లకు చేరుకుంది. దేశీయ మార్కెట్లో వ్యాపారం పుంజుకోవడంతోపాటు గత ఆర్థిక సంవత్సరంలో ఇదేకాలానికి రాబడుగులు కనిష్ఠ స్థాయిలో నమోదవడం (లో బేస్ ఎఫెక్ట్) కూడా అనూహ్య వృద్ధికి ప్రధాన కారణాలు. మూడో త్రైమాసికంలో సంస్థ కన్సాలిడేటెడ్ ఆదాయం 20.8 శాతం ఎగబాకి రూ.33,672.48 కోట్లకు చేరుకుంది. అంతకు ఏడాదిక్రితం ఇదే సమయంలో రెవెన్యూ రూ.29,154.75 కోట్లుగా ఉంది. దేశీయ మార్కెట్‌లో సంస్థ వ్యాపారం 10.6 శాతం వార్షిక వృద్ధితో రూ.15,596 కోట్లకు చేరుకోగా.. యూరప్ మార్కెట్ బిజినెస్ 20.7 శాతం పుంజుకొని రూ.14,693 కోట్లకు పెరిగింది. క్యు3లో కంపెనీ నిర్వహణ లాభం రూ.5,697 కోట్లకు చేరుకుంది. గడిచిన తొమ్మిది నెలలుగా సంస్థ అన్ని మార్కెట్లలో అద్భుతమైన పనితీరు కనబరుస్తోందని, ముున్ముందు త్రైమాసికాల్లోనూ ఇదే జోరును కొనసాగించనుందని టాటా స్టీల్ సిఇఒ, ఎండి టివి నరేంద్రన్ ఆశాభావం వ్యక్తం చేశారు.

Q3 ఫలితాలు

## ఇండియా సిమెంట్ లాభాల్లో భారీ క్షీణత

ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసికం (క్యు3)లో ఇండియా సిమెంట్ లాభం 56.87 శాతం క్షీణించి రూ.15.24 కోట్లకు పడిపోయింది. గత ఆర్థిక సంవత్సరంలో ఇదేకాలానికి కంపెనీ లాభం రూ.35.34 కోట్లుగా ఉంది. సమీక్ష కాలానికి సంస్థ ఆదాయం రూ.1,216.75 కోట్లకు పరిమితమైంది. అంతకు ఏడాది క్రితం ఇదే కాలానికి రెవెన్యూ రూ.1,270.95 కోట్లుగా నమోదైంది. వార్షిక ప్రాతిపదికన ఖర్చులు కూడా రూ.1,216.71 కోట్ల నుంచి రూ.1,201.51 కోట్లకు తగ్గింది.

## రూ. 1,664 కోట్లకు సెంట్రల్ బ్యాంక్ నష్టాలు

డిసెంబరుతో ముగిసిన మూడో త్రైమాసికం(క్యు3)లో సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా పనితీరుకు మొండి బకాయిలు భారీ గండికొట్టాయి. దాంతో బ్యాంక్ నష్టాలు రూ.1,664.22 కోట్లకు చేరుకున్నాయి. అంతక్రితం ఏడాదిలో ఇదే కాలానికి బ్యాంక్ నష్టాలు రూ.605.70 కోట్లుగా నమోదయ్యాయి. క్యు3లో సెంట్రల్ బ్యాంక్ ఆదాయం రూ.6,589.32 కోట్లకు తగ్గింది. గత ఆర్థిక సంవత్సరంలో ఇదేకాలాని (అక్టోబరు-డిసెంబరు 2016)కి రూ.6,787.87 కోట్ల ఆదాయం ఆర్జించగలిగింది. వార్షిక ప్రాతిపదికన బ్యాంక్ స్థూల నిరర్థక ఆస్తులు(గ్రాస్ ఎన్‌పిఎ) 14.14 శాతం నుంచి 18.08 శాతానికి ఎగబాకాయి. నికర ఎన్‌పిఎలు 8.54 శాతం నుంచి 9.45 శాతానికి చేరుకున్నాయి. క్యు3లో మొండి బకాయిలు, చిల్లర ఖర్చుల కోసం కోసం బ్యాంక్ రూ.3,427.03 కోట్ల కేటాయింపులు(ప్రొవిజనింగ్) జరిపింది.

## ఓఎన్‌జిసి లాభంలో 15 శాతం వృద్ధి

ప్రభుత్వ రంగ ఇంధన ఉత్పత్తి సంస్థ ఓఎన్‌జిసి మూడో త్రైమాసిక (క్యు3) లాభం 15 శాతం వృద్ధి చెంది రూ.5,014.67 కోట్లకు చేరుకుంది. గత ఆర్థిక సంవత్సరంలో ఇదేకాలానికి కంపెనీ లాభం రూ.4,352.33 కోట్లుగా నమోదైంది. క్యు3 ఆదాయం 15.4 శాతం పెరిగి 24,122.42 కోట్ల రూపాయలకు ఎగబాకిందని రెగ్యులేటరీ ఫైలింగ్‌లో ఓఎన్‌జిసి వెల్లడించింది.

## ఎం అండ్ ఎం లాభం రూ.1,215 కోట్లు

దేశీయ వాహన తయారీదారు మహీంద్రా అండ్ మహీంద్రా (ఎం అండ్ ఎం) మూడో త్రైమాసిక లాభం 12.49 శాతం పెరిగి రూ.1,215.91 కోట్లకు చేరుకుంది. అంతకు ఏడాదిక్రితం ఇదే సమయంలో సంస్థ రూ.1,080.85 కోట్ల లాభం ఆర్జించగలిగింది. ఆదాయం మాత్రం వార్షిక ప్రాతిపదికన రూ.11,843.74 కోట్ల నుంచి రూ.11,577.78 కోట్లకు తగ్గింది. మూడో త్రైమాసికం (అక్టోబరు-డిసెంబరు 2017)లో మొత్తంగా 1,21,786 వాహనాలను విక్రయించినట్లు ఎం అండ్ ఎం వెల్లడించింది. డిసెంబర్ 2016తో ముగిసిన మూడు నెలలతో పోలిస్తే సేల్స్ 8 శాతం పెరిగాయి. ప్యాసింజర్ వాహన విక్రయాలు 6.1 శాతం, ట్రాక్టర్లు 6 శాతం వృద్ధి నమోదు చేసుకోగలిగాయి. ఆశాజనక వర్షపాతంతో రిజర్వాయర్లు కళకళలాడుతుండటం గ్రామాల్లో సేద్యం పుంజుకుందని, ఫలితంగా ట్రాక్టర్లకు డిమాండ్ పెరిగిందని మహీంద్రా పేర్కొంది.

## బిఒబికి మొండిబకాయిల గండి

### క్యు3లో 56 శాతం తగ్గిన లాభం

ప్రభుత్వ రంగానికి చెందిన బ్యాంక్ ఆఫ్ బరోడా (బిఒబి) మూడో త్రైమాసిక లాభం 56 శాతం క్షీణించి రూ.112 కోట్లకు పడిపోయింది. గత ఆర్థిక సంవత్సరంలో ఇదే సమయానికి బ్యాంక్ లాభం రూ.253 కోట్లుగా ఉంది. మొండిబకాయిలతో ఏర్పడిన గండి పూడ్చుకునేందుకు క్యు3లో బ్యాంక్ ప్రొవిజనింగ్ (నిధుల కేటాయింపులు) రూ.3,155 కోట్లకు పెరిగింది. వార్షిక ప్రాతిపదికన కేటాయింపులు 93 శాతం పెరగడం లాభాలపై ప్రభావం చూపింది. డిసెంబర్ చివరినాటికి బ్యాంక్ స్థూల నిరర్థక ఆస్తులు (గ్రాస్ ఎన్‌పిఎ) 11.31 శాతానికి చేరుకున్నాయి. సెప్టెంబరు చివరినాటికి 11.16 శాతంగా నమోదైంది.

| సెన్సెక్స్ | నిఫ్టీ | బంగారం | వెండి | రూపాయి డాలర్ | ముడి చమురు |
|---|---|---|---|---|---|
| 34005.76 | 10454.95 | 30130 | 37920 | 64.40 | 64.22 |
| ↓ 407.40 | ↓ 121.90 | ↑ 125 | ↑ 250 | ↓ | ↓ |

బంగారం: ముంబై - 10 గ్రాములు (99.9 స్వచ్ఛత)

# హెచ్‌పిసిఎల్ లాభాలు జూమ్

**క్యు3లో రూ.1,950 కోట్లకు చేరిక.. ఒక్కో షేరుపై రూ.14.50 డివిడెండ్**

న్యూఢిల్లీ: ప్రభుత్వ రంగ ఇంధన విక్రయ సంస్థ హిందుస్థాన్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ (హెచ్‌పిసిఎల్) ఆర్థిక ఫలితాలు మార్కెట్ అంచనాలను మించాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో డిసెంబరుతో ముగిసిన మూడో త్రైమాసికానికి కంపెనీ లాభం 22 శాతం వార్షిక వృద్ధితో రూ.1,950 కోట్లకు ఎగబాకింది. గత ఆర్థిక సంవత్సరంలో ఇదేకాలానికి లాభం రూ.1,590 కోట్లుగా నమోదైంది. రిఫైనరీ మార్జిన్లు పుంజుకోవడంతోపాటు నిల్వ ఇంధనపై రాబడి పెరగడం క్యు3 లాభాల పెరుగుదలకు తోడ్పడిందని హెచ్‌పిసిఎల్ చైర్మన్, ఎండి ముకేష్ కె సురానా తెలిపారు. ముంబై, వైజాగ్‌లో చమురు శుద్ధి ప్లాంట్లను కలిగి ఉన్న ఈ సంస్థ.. గత ఏడాది అక్టోబరు-డిసెంబరు కాలానికి పీపా ముడి చమురు శుద్ధిపై 9.04 డాలర్ల లాభం ఆర్జించింది. అంతక్రితం సంవత్సరంలో ఇదే కాలానికి రిఫైనరీ మార్జిన్ 6.38 డాలర్లుగా ఉంది. అంతర్జాతీయ మార్కెట్లో ముడిచమురు ధరలు అనూహ్యంగా పెరగడంతో నిల్వ ఇంధనంపై రూ.1,477 కోట్ల అదనపు ఆదాయం లభించిందని సురానా వెల్లడించారు. క్యు3లో కంపెనీ టర్నోవర్ రూ.62,832 కోట్లకు చేరుకుంది. డిసెంబర్ 2016తో ముగిసిన మూడు నెలలకాలానికి టర్నోవర్ రూ.55,471 కోట్లుగా నమోదైంది. హెచ్‌పిసిఎల్ బోర్డు ఒక్కో షేరుపై రూ.14.50 మధ్యంతర డివిడెండ్ ప్రకటించింది. దాంతో కంపెనీ డివిడెండ్ రూపంలో రూ.2,659 కోట్లు (డివిడెండ్ డిస్ట్రిబ్యూషన్ టాక్స్‌తో కలిపి) చెల్లించాల్సి వస్తుందని సురానా తెలిపారు.

# మొండిబకాయిలు రూ.2 లక్షల కోట్లు

**భారీగా క్షీణించిన ఎస్‌బిఐ ఆర్థిక స్థితి.. క్యు3 నష్టం రూ.1,887 కోట్లు.. 17సంవత్సరాల్లో తొలి త్రైమాసిక నష్టం**

ముంబై: దేశంలో అతిపెద్ద ప్రభుత్వ రంగ బ్యాంకైన ఎస్‌బిఐ (స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా).. అనూహ్యంగా భారీ నష్టాలను ప్రకటించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో డిసెంబర్‌తో ముగిసిన మూడో త్రైమాసికం(క్యు3)లో బ్యాంక్ ఏకంగా రూ.1,886.57 కోట్ల నష్టాన్ని చూపింది. 17సంవత్సరాల కాలంలో(1999 జనవరి-మార్చి) ఒక త్రైమాసికంలో బ్యాంక్ నష్టాన్ని నమోదుచేయడం ఇదే ప్రథమం. గత ఆర్థిక సంవత్సరంలో ఇదే సమయానికి ఎస్‌బిఐ రూ.2,152.14 కోట్ల నికర లాభం ఆర్జించగలిగింది. సెప్టెంబర్‌తో ముగిసిన మూడు నెలలకాలాని(క్యు2)కీ రూ.2,610 కోట్ల ప్రాఫిట్ నమోదు చేసుకుంది. భారీగా పెరిగిన మొండిబకాయిల కోసం పెద్ద ఎత్తున కేటాయింపులు జరపాల్సి రావడం, ట్రెజరీ లావాదేవీల్లో భారీ నష్టాలు నిరాశాజనక ఫలితాలకు ప్రధాన కారణం. మొండిబకాయిలతోపాటు చిల్లర ఖర్చుల కోసం బ్యాంక్ రూ.18,876.21 కోట్ల ప్రొవిజనింగ్ జరిపింది. గత ఆర్థిక సంవత్సరంలో మూడో త్రైమాసికంలో కేటాయింపులు రూ.8,942.83 కోట్లుగా నమోదయ్యాయి. క్యు3లో బ్యాంక్ స్టాండలోన్ నష్టం రూ.2,416 కోట్లుగా నమోదైంది.

## రెండంకెల స్థాయికి మొండి పద్దుల వాటా

గత ఆర్థిక సంవత్సరానికి తక్కువ చేసి చూపిన రూ.23,330 కోట్లతో కలిపి మూడో త్రైమాసికంలో మొత్తం రూ.25 వేల కోట్ల బకాయిలు మొండిపద్దుల్లోకి చేరాయి. డిసెంబర్ 2017 చివరినాటికి ఎస్‌బిఐ మొండి బకాయిల లేదా స్థూల నిరర్థక ఆస్తుల(గ్రాస్ ఎన్‌పిఎ) పద్దులోకి చేరిన వాటి వాటా ఏకంగా రెండెంకల స్థాయికి (10.35 శాతం) చేరుకుంది. అంతక్రితం చివరినాటికి గ్రాస్ ఎన్‌పిఎలు 7.23 శాతంగా ఉన్నాయి. ఇక నికర ఎన్‌పిఎల నిష్పత్తి వార్షిక ప్రాతిపదికన 4.24 శాతం నుంచి 5.61 శాతానికి ఎగబాకింది. విలువ ప్రకారంగా చూస్తే.. గ్రాస్ ఎన్‌పిఎలు రూ.1,08,172.32 కోట్ల నుంచి దాదాపు రూ.2 లక్షల కోట్ల (రూ.1,99,144.43 కోట్లు)కు చేరుకున్నాయి. ఇక నికర ఎన్‌పిఎలు సైతం రూ.61,430.45 కోట్ల నుంచి రూ.1.02 లక్షల కోట్లకు చేరుకున్నాయి.



రజనీష్ కుమార్

## క్యు4లో మరింత ఒత్తిడి

మొండిబకాయిల సమస్య అంత త్వరగా పరిష్కారం అయ్యేలా కన్పించడం లేదని, వచ్చే త్రైమాసికం(క్యు4)లో బ్యాంక్‌పై ఒత్తిడి మరింత పెరిగే అవకాశం ఉందని ఎస్‌బిఐ చైర్మన్ రజనీష్ కుమార్ సంకేతాలిచ్చారు. వచ్చే ఆర్థిక సంవత్సరం నుంచి పరిస్థితి క్రమంగా మెరుగపడనుందని ఆశాభావం వ్యక్తం చేశారు.



## బులియన్

| బంగారం (10 గ్రాములు) | హైదరాబాద్ | విజయవాడ | విశాఖపట్నం | ప్రొద్దుటూరు | చెన్నై |
|---|---|---|---|---|---|
| 24 క్యారెట్లు | 31,070 | 31,000 | 30,970 | 30,950 | 30,010 |
| క్రితం ముగింపు | 30,920 | --- | 30,900 | --- | 30,010 |
| 22 క్యారెట్లు | 28,770 | 28,800 | 28,490 | 28,610 | 28,660 |
| క్రితం ముగింపు | 28,630 | --- | 28,420 | --- | 28,580 |
| వెండి (కిలో) | 39,900 | 40,200 | 38,800 | 39,100 | 40,900 |
| క్రితం ముగింపు | 38,700 | --- | 38,800 | --- | 40,700 |



| ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. | | వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్ | |
|---|---|---|---|
| హైదరాబాద్ | 68.00 | విజయవాడ | 73.00 |
| కరీంనగర్ | 69.00 | గుంటూరు | 73.00 |
| వరంగల్ | 70.00 | ఒంగోలు | 75.00 |
| మహబూబ్‌నగర్ | 68.00 | చిత్తూరు | 65.00 |
| కర్నూలు | 68.00 | నెల్లూరు | 73.00 |
| విశాఖపట్నం | 69.00 | అనంతపురం | 72.00 |
| గోదావరి | 72.00 | | |



| రిటైల్ (ఒక గుడ్డు) ధర రూ. 4.10 | | నెక్ (100 గుడ్లు) | |
|---|---|---|---|
| హైదరాబాద్ | 350.00 | చిత్తూరు | 373.00 |
| వరంగల్ | 352.00 | చెన్నై | 380.00 |
| విజయవాడ | 338.00 | నమక్కల్ | 365.00 |
| గోదావరి | 338.00 | బెంగళూరు | 365.00 |
| విశాఖపట్నం | 345.00 | ముంబై | 395.00 |



## ఫారెక్స్ (థామస్‌కుక్ రేట్లు) (రూపాయల్లో..)

| కరెన్సీ | కొనుగోలు | అమ్మకం |
|---|---|---|
| యుఎస్ డాలర్ | 58.58 | 67.93 |
| పౌండ్ | 81.63 | 94.68 |
| యూరో | 71.80 | 83.26 |
| ఆస్ట్రేలియా డాలర్ | 45.57 | 52.73 |
| బహ్రెయిన్ దినార్ | 158.65 | 181.80 |
| కువైట్ దినార్ | 177.50 | 220.97 |
| ఒమని రియాల్ | 155.36 | 177.78 |
| సౌదీ రియాల్ | 15.57 | 18.46 |
| సింగపూర్ డాలర్ | 43.97 | 52.09 |
| యుఎఇ దిరమ్ | 15.94 | 18.64 |

# ఒక రోజు ముచ్చటే...

## మళ్లీ గ్లోబల్ కలవరం.. సెన్సెక్స్ 400 పాయింట్లు డౌన్

ముంబై : ఏడు రోజుల వరుస పతనాల నుంచి కోలుకున్నట్టే కనిపించిన దేశీయ స్టాక్ మార్కెట్ అంతర్జాతీయ మార్కెట్ల నుంచి వచ్చిన ప్రతికూల సంకేతాల కారణంగా తిరిగి నష్టాల్లోకి జారుకుంది. మార్కెట్లో కనిపించిన రికవరీ ఒక రోజు ముచ్చటగానే ముగిసింది. సెన్సెక్స్, నిఫ్టీ రెండూ భారీ నష్టాలు నమోదు చేశాయి. నెల రోజుల కనిష్ఠ స్థాయిల్లో ముగిశాయి. అమెరికాలో నిరుద్యోగిత సంఖ్య వరుసగా రెండో వారంలో కూడా తగ్గినట్టు వచ్చిన వార్తలతో ద్రవ్యోల్బణం పోటెత్తుతుందని, వడ్డీ రేట్లు త్వరితంగా పెరుగుతాయన్న భయాలు మార్కెట్లను చుట్టుముట్టాయని మార్కెట్ విశ్లేషకులంటున్నారు. అంతర్జాతీయంగా వడ్డీ రేట్లు పెరిగితే వర్ధమాన దేశాల మార్కెట్లకు నిధుల వరద తగ్గుతుందని కూడా ఇన్వెస్టర్లు భావించారని వారు వ్యాఖ్యానించారు. ఈ ఆందోళనల నేపథ్యంలో అమెరికా మార్కెట్‌లో భారీ ఎత్తున అమ్మకాలు సాగడంతో డోజోన్స్ ఇండెక్స్ రెండో పెద్ద పతనాన్ని నమోదు చేయడం భారత మార్కెట్‌పై కూడా ప్రభావం చూపిందని వారన్నారు. ప్రపంచ దేశాల్లో వడ్డీ రేట్ల భయాలు...దేశీయంగా ద్రవ్యోల్బణంపై వాటి ప్రభావం, అంతర్జాతీయ వృద్ధికి సంబంధించిన ఆందోళనలు, నిధుల తగ్గుదలకు సంబంధించిన ఆందోళనలు మార్కెట్ సెంటిమెంట్‌పై వారం అంతా ప్రభావం చూపినట్టు బిఎన్‌పి పారిబా మ్యూచువల్ ఫండ్ సీనియర్ ఫండ్ మేనేజర్ కార్తిక్‌రాజ్ లక్ష్మణన్ అన్నారు.

- సెన్సెక్స్ 407.40 పాయింట్లు దిగజారి 34005.76 పాయింట్ల వద్ద ముగిసింది. జనవరి నాలుగో తేదీ తర్వాత సెన్సెక్స్ నమోదు చేసిన కనిష్ఠ స్థాయి ఇదే. వారం మొత్తం మీద సెన్సెక్స్ 1061 పాయింట్లు నష్టపోయింది.
- నిఫ్టీ 121.90 పాయింట్ల నష్టంతో 10454.95 పాయింట్ల వద్ద ముగిసింది. వారం మొత్తం మీద నిఫ్టీ 305.65 పాయింట్లు నష్టపోయింది.
- ఈ భారీ కరెక్షన్‌తో సెన్సెక్స్ జనవరి 29న నమోదు చేసిన జీవితకాల గరిష్ఠ స్థాయి 36443.98 పాయింట్ల నుంచి 6.69 శాతం దిగజారగా నిఫ్టీ కూడా అదే రోజు నమోదు చేసిన రికార్డు 11171.55 పాయింట్ల నుంచి 6.41 శాతం దిగజారింది.
- వడ్డీ రేట్ల భయాలతో బ్యాంకింగ్, ఫైనాన్షియల్ కంపెనీల స్టాక్‌లు భారీగా నష్టపోయాయి. బ్యాంకెక్స్, నిఫ్టీ బ్యాంక్ ఇండెక్స్ 1.76 శాతం మేరకు నష్టపోయాయి. ప్రధానంగా యస్ బ్యాంక్ 2.84 శాతం, ఐసిఐసిఐ బ్యాంక్ 2.33 శాతం నష్టపోయాయి. నష్టపోయిన బ్యాంకింగ్ షేర్లలో ఎస్‌బిఐ, హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్, హెచ్‌డిఎఫ్‌సి, యాక్సిస్ బ్యాంక్, కోటక్ బ్యాంక్, ఇండస్ ఇండ్ బ్యాంక్ ఉన్నాయి.
- బిఎస్ఇలో నష్టపోయిన ఇతర షేర్లలో ఇన్ఫోసిస్, భారతి ఎయిర్‌టెల్, విప్రో, టాటా మోటార్స్, అదానీ పోర్ట్స్, ఎల్ అండ్ టి, హీరో మోటోకార్ప్, మారుతి సుజుకీ, బజాజ్ ఆటో, ఐటిసి, ఆర్ఐఎల్, మహీంద్రా, ఒఎన్‌జిసి, ఎన్‌టిపిసి ఉన్నాయి.
- ట్రెండ్‌కు ఎదురీది లాభపడిన షేర్లలో టాటా స్టీల్, ఏషియన్ పెయింట్స్, డాక్టర్ రెడ్డీస్, టిసిఎస్, హెచ్‌యుఎల్, కోల్ ఇండియా ఉన్నాయి. రంగాల వారీగా చూస్తే మెటల్, రియాల్టీ, పవర్, కన్స్యూమర్ డ్యూరబుల్స్ ఉన్నాయి.
- ఎక్స్ఛేంజీల వద్ద అందుబాటులో ఉన్న గణాంకాల ప్రకారం గురువారం ఎఫ్‌పిఐలు 2,297 కోట్ల రూపాయల విలువ గల షేర్లు విక్రయించగా దేశీయ సంస్థలు 2,373.59 కోట్ల రూపాయల విలువైన కొనుగోళ్లు జరిపాయి.



### గ్లెన్‌మార్క్ 8 శాతం డౌన్

క్యు3లో అత్యంత నిరుత్సాహపూరిత ఫలితాలు ప్రకటించడంతో ఫార్మా రంగానికి చెందిన గ్లెన్‌మార్క్ షేరు 8 శాతం మేరకు నష్టపోయింది. ఒక్కరోజులోనే కంపెనీ మార్కెట్ విలువ 1211 కోట్ల రూపాయల మేరకు తుడిచిపెట్టుకుపోయింది. బిఎస్ఇలో ఈ షేరు 7.43 శాతం నష్టపోయి 535.10 రూపాయల వద్ద ముగియగా ఎన్ఎస్ఇలో 7.66 శాతం నష్టపోయి 535.20 రూపాయల వద్ద ముగిసింది. ఇంట్రాడేలో ఈ షేరు 9.5 శాతం వరకు నష్టపోయింది.

### మహీంద్రా శాన్యోలో వాటాల విక్రయం

స్పెషాలిటీ స్టీల్ ఉత్పత్తి చేసే తమ అనుబంధ విభాగం మహీంద్రా శాన్యోలో 22 శాతం వాటాలను శాన్యో స్పెషల్ స్టీల్ కంపెనీకి విక్రయిస్తున్నట్టు మహీంద్రా అండ్ మహీంద్రా శుక్రవారం ప్రకటించింది. డీల్ విలువ 146.32 కోట్ల రూపాయలని కంపెనీ పేర్కొంది. ఈ విక్రయం అనంతరం జాయింట్ వెంచర్‌లో తమ వాటా 29 శాతానికి తగ్గుతుందని, అది అనుబంధ విభాగం హోదాను కోల్పోతుందని తెలిపింది.

### మాక్స్ ఫైనాన్షియల్ రూ.5,000 కోట్ల సమీకరణ

ప్రిఫరెన్షియల్ షేర్ల జారీ ద్వారా 5 వేల కోట్ల రూపాయలు సమీకరించాలనుకుంటున్నట్టు మ్యాక్స్ ఫైనాన్షియల్ సర్వీసెస్ ప్రకటించింది. అనుబంధ సంస్థ మాక్స్ లైఫ్ ఇన్సూరెన్స్ విస్తరణకు, జీవితబీమా రంగంలో అందుబాటులోకి వచ్చే కంపెనీలేవైనా ఉంటే వాటిని కొనుగోలు చేయడానికి ఈ నిధులు ఉపయోగించుకోనున్నట్టు తెలిపింది. మాక్స్ లైఫ్ నిర్వహణలోని నిధుల పరిమాణం తొలిసారిగా 50 వేల కోట్ల రూపాయల మైలురాయిని దాటిందని కంపెనీ పేర్కొంది.

## రాబోయే బేర్ మార్కెట్ అత్యంత దారుణం



రాబోయే బేర్ మార్కెట్ అత్యంత దారుణంగా ఉంటుందని, తాను ఇంతవరకు జీవితకాలంలో చూడనంత ఘోరంగా ఉంటుందని ప్రముఖ అంతర్జాతీయ ఇన్వెస్టర్, 75 సంవత్సరాల వయోవృద్ధుడు జిమ్ రోగర్స్ హెచ్చరించారు. అయితే మార్కెట్ ఇప్పటికిప్పుడే బేరిష్ అవుతుందా అన్నది ఆయన చెప్పలేదు. అంతర్జాతీయ ఆర్థిక సంక్షోభం తర్వాత అమెరికాలో డెట్ భారీగా పేరుకుపోవడమే ఇందుకు కారణమని ఆయన అన్నారు. ఒక్కరోజు విరామం ఇచ్చినట్టుగా కనిపించిన ప్రపంచమార్కెట్‌లో తిరిగి అమ్మకాలు హోరెత్తడంలో కూడా ఆశ్చర్యం లేదని, ఈ తిరోగమనం మరింతగా కొనసాగుతుందని ఆయన అంచనా వేశారు. జీవితకాలంలో తాను ఎన్నో బేర్ మార్కెట్లు చూశానని, కాని రాబోయే బేరిష్ ట్రెండ్ అన్నింటికన్నా దారుణంగా ఉంటుందని ఆయన పేర్కొన్నారు. ఫెడరల్ రిజర్వ్ వడ్డీ రేట్లు పెంచే వరకు మార్కెట్లలో ఈ ఆటుపోట్లు తప్పవని, ఆ తర్వాత తిరిగి పురోగమనం మొదలవుతుందని ఆయన అభిప్రాయపడ్డారు.

## భారీ లాభాల్లో ఫోర్టిస్ హెల్త్ షేర్లు

ముంబై: ఫోర్టిస్ హెల్త్‌కేర్ కంపెనీ షేరు శుక్రవారం భారీ లాభాలతో ముగిసింది. ఉదయం బిఎస్ఇలో నష్టాలతో ప్రారంభమైన ఈ షేరు కొద్ది సేపటికే ఒక దశలో 24.54 శాతం పెరిగింది. చివరికి 17.61 శాతం లాభాలతో రూ.148.30 వద్ద ముగిసింది. మణిపాల్ హాస్పిటల్స్‌లో ఫోర్టిస్ హెల్త్‌కేర్ కంపెనీని విలీనం చేసేందుకు సంబంధించిన చర్చలు చివరి దశకు చేరాయన్న వార్తతో ఈ షేర్లకు డిమాండ్ ఏర్పడింది. దీంతో బిఎస్ఇ, ఎన్ఎస్ఇల్లో శుక్రవారం 8.96 కోట్ల షేర్లు చేతులు మారాయి. ఫలితంగా కంపెనీ మార్కెట్ క్యాప్ ఒక్క రోజులోనే రూ.1,152.54 కోట్లు పెరిగి రూ.7,691.54 కోట్లకు చేరింది.


## బిఎస్ఇలో తెలుగు రాష్ట్రాల కంపెనీల షేర్లు (BSE)

ACI INFOCOM 5.53(5.65)861
ADITYA SPIN. 8.4(8.4)590
AGRO TECH FO 645.1(644.4)550
AISHWARYA TE 7.39(7.41)12547
ALPHAGEO (I) 848.6(861.35)4296
ALU FLUORIDE 117.9(121.2)8346
AMAR RAJA BA 798.45(810.2)12549
ANDHRA BANK 47.2(47.2)473861
ANDHRA CEMEN 11.88(12.02)28057
ANDHRA PETRO 64.6(68)589893
ANJANI PORTL 211.5(209.75)1802
ASTRA MICRO 105.15(106.65)54701
AUROB.PHARMA 590.15(601.9)448272
AVANTEL LTD 605.5(568.7)29521
AVANTI FEEDS 2437.95(2523.2)26886
B.N.RATHI SE 39.95(40.8)3940
BALAJI AMINE 644(637.95)10709
BAMBINO AGRO 256(244)5656
BARTRONICSIN 13.39(13.5)19336
BHAGIRA.CHEM 287.6(293.3)1038
BHAGYA INL 43.7(43.2)15934
BHARATFIN 998.75(1011.7)16524
BNR UDYOG 31.5(34.45)604
CAMBRIDGE 81.6(80.05)9564
CAT TECHN. 1.3(1.3)927
CCHHL 15.8(15.5)87819
CCL PRODUCTS 294.1(298.55)5765
CELESTIAL 17.35(17.25)29566
CIL SECURITS 31.4(33.35)2771
COROM INTER 532.7(545.85)5883
CUBEX TUBING 23.85(24.55)715
CYBERMATE 3.69(3.43)128253
CYIENT 628.05(624)6447
DANLAW TECH. 77.25(80.05)5780
DECAN CEMENT 574.85(581.5)529
DHAN ROTO SP 40.65(38.75)1897
DIAMONPOWER 16.65(17.35)57713
DIVI'S LAB. 1016.75(1028.6)26072
DIVYA.GRANIT 106.25(108)717
DQ ENT 15.95(16.3)5301
DR.REDDY'S 2194.8(2178.95)49074
EMPEE SUGARS 4.71(4.51)14630
EVEREST ORG. 145.35(138.45)1393
FACOR ALLOYS 3.66(3.49)199742
FIRSTOBJ 15.4(15.2)5324
GATI LTD. 116.85(117.05)134240
GAYATRI PROJ 200.25(202.7)9824
GENNEX LAB 4.91(4.95)237043
GMR INFRASTR 19.65(19.35)4022695
GODAVARI DRU 34.1(34.5)512
GOLDST INFRA 194.7(198.7)19855
GOLDSTONE EN 15.25(14.55)5790
GRANULES (I) 118.8(118.55)152403
GVK POWERINF 20.3(19.65)2238067
HBL P SYS 57.6(59.25)174708
HERITGFOOD 702.15(696.8)104069
I.C.S.A. IND 4(4.18)27500
IKF TECHNO .95(.99)110169
INCAP LTD. 101.85(104.55)4475
IPAPPM 342.95(325.1)24020
IVRCL LTD 4.93(5.06)73458
KAKATIYA CEM 313.75(314.85)7228
KALLAM SPG. 24.25(23.95)21920
KAVERI SEED 477.5(473.5)34668
KCP LTD 136.85(138.5)56575
KERNEX MICRO 41.65(43.55)16846
KNR CONST 310.35(306.65)29162
KREBS BIOCHM 141.25(136)150
LANCO INFRA 1.36(1.38)3498429
LOKESH MACH 71(64.55)79975
LOTUS CHOC 49.35(50.8)7576
MADHUCON PRJ 30.35(30.05)28241
MOLD-TEK TEC 64.95(64)2004
MOSCHIP SEMI 35.5(34.1)87459
MSR INDIA 41.2(39.5)7214
N C L IND. 253.45(256.95)7379
NACLIND 47.15(47.75)63870
NATCO PHARM 812.35(826.75)36518
NCC 114.35(113.7)344722
NEHA INTER. 8.61(8.37)25703
NETTLINX LTD 83.05(84)12799
NEULAND LAB. 696.7(701.65)1362
NIHAR INFO 13.8(13.25)508
NILE LTD. 882.85(880.2)4237
NTL 4.11(4.12)10638
OIL COUNTRY 45.05(46.45)16035
PADMALAYA TE 4.96(4.98)11469
PALRED 93.75(96.2)2234
PANYAM CEMEN 54(55.25)30790
PENNAR STEEL 64.8(59.55)266591
PFL INFOTECH 10.04(9.57)3048
PHYTOCHEM I. 68.3(70.65)5009
PITTI LAMIN. 88.4(85.4)25899
POKARNA LTD 210.05(212.3)4335
PRAJAY ENGS. 14.3(14.8)21636
PREMIER EXPL 406.4(411.45)2805
PRISM CEMENT 133(133.7)290762
RAIN 391.65(383.4)820996
RAJ PACKAGIN 38(38.5)185
REG.CERAMIC 5.53(5.72)301
RESTILE CER. 7.79(7.81)4612
SAGAR CEM. 988.45(981.15)3454
SAMKRG PIST. 308.1(310.7)7504
SAMPRE NUTRI 60.15(58.9)4792
SANGHI IND. 118.15(122.7)34746
SATVAH.ISPAT 25.2(25.3)20873
SAVEN TECHNO 20.55(20.4)1664
SMPL 1.45(1.45)8021
SMS PHARMACE 95.1(95.75)12262
SREE RAYALA 192.65(193.9)4372
STEEL EXCH 33.1(31.55)44387
SUJANA INDUS 1(.97)67628
SURANATP 5.6(5.52)559
SURYACHAKRA 1.46(1.4)78423
SURYAMBA SP 78.95(72.2)16210
SURYLAK.COTT 87(85.35)1023
SUVEN LIFE S 195.4(197.85)38463
TAJ GVK HOTL 175.4(174.6)20546
TANLA 32.05(32.65)103415
TRANSCORP IN 37(37.95)15799
TRANSGENE BI 2.19(2.24)26253
TRANSPORT CO 282.65(274.15)18153
USHER AGRO 7.52(7.68)2964
VICEROY HOTE 17.1(16.15)117256
VIJAY TEXTIL 55.95(53.55)4029
VIMTA LABS 197.7(194.75)6590
VIRAT CRANE 43.95(44.45)678
VIRINCHI 127.5(124.9)65677
VISAKA IND. 698.15(680.9)12106
VISTA PHARMA 41.95(40.05)39254
VIVIMED LABS 85.45(86.4)103065
VST INDUS. 3218.65(3210)645
WATERBASE 368.25(382.75)700163
XLENERGY 2.96(3.11)45880
YBRANTDIGI 5.98(6.03)1278113
ZEN TECH 114.55(117.85)33120
ZENOTECH 44.5(45)7068

## ఎన్ఎస్ఇ-500 (NSE)

షేర్ల ప్రస్తుత, క్రితం ముగింపు ధరలు, వాణిజ్య పరిమాణం వరుసగా

AARTIDRUGS 612.4(612.55)5524
AARTIIND 1139.2(1137.35)27632
ABAN 186.95(188.85)868446
ABB 1590.8(1594.85)152775
ABFRL 156.4(154.05)395746
ABGSHIP 11.35(11.4)4783
ACC 1660.95(1693.25)478965
ADANIENT 210.1(204.5)6060617
ADANIPORTS 399(405.1)2936187
ADANIPOWER 33.8(32.8)13839094
ADANITRANS 205(197.55)1066912
AEGISCHEM 261.95(266.7)125903
AHLUCONT 345.6(341.6)5971
AIAENG 1446.7(1440.7)117059
AJANTPHARM 1416.5(1397.8)281479
AKZOINDIA 1772.3(1779.65)2569
ALBK 59.5(59.3)2493842
ALLCARGO 192.6(192.5)199849
ALOKTEXT 3.6(3.7)2226249
AMARAJABAT 800.1(809.65)328643
AMBUJACEM 258.9(261.9)1742418
AMTEKAUTO 24.3(24.85)287414
ANANTRAJ 59.35(59.75)1666228
ANDHRABANK 47.25(47.25)4409590
APARINDS 767.55(751.3)18183
APLLTD 545.25(541.75)19361
APOLLOHOSP 1122.7(1131.8)236165
APOLLOTYRE 270.8(269.75)2254834
ARVIND 398.6(402.9)830148
ASHIANA 179.1(182.55)142179
ASHOKA 245.2(238.35)436308
ASHOKLEY 134.2(134.15)17062623
ASIANPAINT 1130.75(1124.05)666922
ASTRAL 795.15(794.95)34327
ASTRAZEN 1013.55(1038)10400
ATUL 2749.05(2724.75)10686
AUROPHARMA 589.5(601.85)5001450
AVANTIFEED 2444(2515)163108
AXISBANK 557.55(568.45)5865587
BAJAJ-AUTO 3099.25(3157.95)175504
BAJAJCORP 494.25(481.05)32334
BAJAJELEC 537(510.15)1221873
BAJAJFINSV 5059.35(5057.25)144600
BAJAJHIND 14(13.65)5496545
BAJAJHLDNG 2693.8(2709.75)6149
BALKRISIND 1138.4(1131.25)587252
BALLARPUR 15.2(15.25)1314290
BALMLAWRIE 243.65(236.05)257595
BALRAMCHIN 120.4(119.9)6443942
BANKBARODA 156.25(156.2)6223913
BANKINDIA 142.2(142.35)3180829
BASF 2121.65(2080.9)20653
BATAINDIA 714.9(710.55)567632
BBTC 1313(1331.95)99388
BEML 1256.15(1246)362519
BERGEPAINT 246.65(250.8)297527
BFUTILITIE 473.5(438.9)1664920
BGRENERGY 121.9(123.4)71628
BHARATFIN 997.7(1011.85)733222
BHARATFORG 762.8(761.2)3003733
BHARTIARTL 422.5(429.8)4861350
BHEL 94.4(95.15)8587666
BHUSANSTL 53.05(52.25)7629380
BIOCON 606.95(614.9)1527841
BIRLACORPN 998.9(1009.95)22753
BLISSGVS 204.95(203.55)241112
BLUEDART 4521.6(4566.05)30924
BLUESTARCO 744.55(725)25997
BOMDYEING 245.1(242.25)8964229
BOSCHLTD 19482.6(19592.25)19118
BPCL 475.4(478.2)2862450
BRFL 66.95(63.8)62548
BRIGADE 295.4(300)35423
BRITANNIA 4641.15(4628)120741
CADILAHC 411.75(405.2)1645064
CANBK 321.15(323.15)2570155
CAPF 687.2(689.85)577004
CARERATING 1351.1(1335.2)24704
CASTEXTECH 5.2(5.2)654338
CASTROLIND 196.2(194.65)2295290
CCL 294.65(298.65)94365
CEATLTD 1548.7(1524.7)797724
CENTRALBK 67.4(67)783594
CENTURYPLY 324.2(326.6)235328
CENTURYTEX 1262.35(1268.5)546864
CERA 3380.5(3333.25)21923
CESC 1007.6(992.3)610960
CHAMBLFERT 155.05(156.6)502479
CHENNPETRO 376.4(372.9)1245868
CHOLAFIN 1322.55(1305.3)179399
CIPLA 621.4(612.65)2373799
CLNINDIA 620.9(624.6)32282
COALINDIA 300.15(300)4731060
COLPAL 1100.85(1100.85)270893
CONCOR 1317.65(1341.35)137679
COROMANDEL 535.05(545.75)136201
CORPBANK 35.6(35.85)209796
COX&KINGS 250.65(255.35)44180
CRISIL 1945.1(1980.7)5298
CUB 162.25(162.25)1133364
CUMMINSIND 824.45(839.6)150859
CYIENT 628.4(623.85)84195
DABUR 340.55(340.3)744243
DALMIABHA 2794.05(2795.45)60427
DBCORP 317.45(327.4)70374
DBREALTY 56(53.35)1248095
DCBBANK 171(168.45)1641707
DCMSHRIRAM 543.4(545.95)158019
DEEPAKFERT 361.6(371)132937
DELTACORP 350.75(335.95)4113255
DEN 109(113.6)815181
DENABANK 22.4(22.75)1465262
DHANUKA 685.5(692.05)14634
DHFL 514.45(513.4)3078295
DISHTV 73.85(73.7)4025485
DIVISLAB 1016.55(1029.9)472189
DLF 229.05(229.35)7906691
DREDGECORP 707.75(738.1)1219281
DRREDDY 2193.8(2180.45)479123
DYNAMATECH 1763.55(1783.8)2783
ECLERX 1346.3(1340)10380
EDELWEISS 250(259.6)1940976
EICHERMOT 27747.95(28198)33515
EIDPARRY 326.45(326.5)105144
EIHOTEL 181.1(180.05)229920
ELECTCAST 34(32.7)599267
ELGIEQUIP 336.4(334.55)81145
EMAMILTD 1088.05(1115.7)140768
ENGINERSIN 168.25(170.35)1969296
EROSMEDIA 198.55(199.05)547157
ESCORTS 910.7(906.8)1581578
ESSDEE 68.8(69)12902
ESSELPACK 279.85(276.4)17810
EVEREADY 379.55(380.95)127115
EXIDEIND 208.25(209.85)2369594
FCONSUMER 63.7(64.95)4648995
FDC 287(281.4)494018
FEDERALBNK 94.85(94.75)5325441
FINCABLES 669.95(676.1)19565
FINPIPE 696.1(702.35)34893
FLFL 376.75(377.7)28758
FORTIS 148.6(126.05)86214453
FSL 44.05(41.25)8677209
GAIL 462.45(461.85)1881540
GATI 116.65(117.3)766692
GDL 214.8(218.8)45690
GEPIL 859.2(859.85)12983
GESHIP 395.15(389.25)32054
GET&D 406.1(415.1)22447
GILLETTE 6546.1(6495.25)10115
GLAXO 2466.25(2461.65)8985
GLENMARK 535.2(579.6)6588431
GLOBOFFS 34.25(34.7)8124
GMDCLTD 148.45(143.15)1152189
GMRINFRA 19.55(19.35)34887960
GODFRYPHLP 862.05(859.2)142548
GODREJCP 1016.6(1017.55)255643
GODREJIND 550.05(551.25)342194
GODREJPROP 839.35(822.55)285524
GPPL 145.95(146.45)319495
GRANULES 118.75(118.45)1502108
GREAVESCOT 131.3(130.45)645388
GREENPLY 367.35(363.1)360662
GRINDWELL 499.65(501.3)12523
GRUH 532.85(509.45)1196140
GSFC 132.5(129.4)2671247
GSKCONS 6080.2(6188.7)9191
GSPL 202.5(207.35)1221996
GUJFLUORO 776.95(780.35)82980
GUJGASLTD 856.85(849.9)11517
GULFOILLUB 1075.05(1012.7)58884
GVKPIL 20.3(19.6)7005994
HATHWAY 37.05(38.95)1156848
HAVELLS 515.25(520.9)891993
HCC 35.1(35.1)9346629
HCL-INSYS 57.7(55.5)3774181
HCLTECH 964(944.35)1728253
HDFC 1773.05(1811.8)2773971
HDFCBANK 1849.5(1880.95)1602238
HDFCBANK 1909(1936)110000
HDIL 51.55(52.55)11191822
HEIDELBERG 161.65(161.3)660087
HEROMOTOCO 3546.1(3582.2)604849
HEXAWARE 341.2(337.35)1971739
HFCL 30.7(28.4)20047876
HIMATSEIDE 364.15(364.1)48287
HINDALCO 243.5(245.2)7024965
HINDCOPPER 79.2(79.65)3510327
HINDPETRO 395.7(399.8)11811951
HINDUNILVR 1333.05(1329.55)810004
HINDZINC 303.55(287.3)5294692
HMT 35.2(34.7)1134
HMVL 243(240.6)5972
HONAUT 16985.95(16962)601
HOTELEELA 23.75(19.8)4019928
HSIL 419.25(423.3)53890
HTMEDIA 95.05(96.6)169703
IBREALEST 227.6(212.7)23667077
IBULHSGFIN 1288.4(1314.4)1678616
ICICIBANK 326.75(333.85)9493398
ICRA 3917.05(3972.45)973
IDBI 62.75(61.6)7582351
IDEA 83.7(85.55)13065572
IDFC 53.25(53.8)3014128
IFBIND 1379.55(1366.25)19954
IFCI 23.4(23.35)10191660
IGARASHI 813.6(811.3)16060
IIFL 735.75(754.4)236207
IL&FSTRANS 75.8(76.3)400730
INDHOTEL 136.95(136.85)982808
INDIACEM 161.4(161.35)7985869
INDIANB 339.4(340.45)526269
INDOCO 273.7(274.4)161880
INDUSINDBK 1649.85(1670.85)1206481
INEOSSTYRO 943.95(962.2)3801
INFRATEL 341.5(349.2)3050243
INFY 1109.15(1134.25)2191345
INGERRAND 745(743)10992
INOXLEISUR 305.4(302.95)247551
INOXWIND 123.85(122.25)133313
INTELLECT 196.2(191.5)1171525
IOB 20.9(21.05)911316
IOC 378.65(385.6)4405890
IPAPPM 343.25(326.95)103282
IPCALAB 620.05(593.35)1893767
IRB 221.9(222.95)1093074
ITC 271.35(274.1)14204123
J&KBANK 70.2(70.65)295424
JAGRAN 168.95(170)130534
JAICORPLTD 161.5(159.5)2403112
JBCHEPHARM 300.5(302.8)171665
JBFIND 177.15(185.6)73460
JCHAC 2324.65(2328.2)4969
JETAIRWAYS 791.7(776.55)4967663
JINDALPOLY 345.45(342.75)62622
JINDALSTEL 272.65(266.3)15474462
JISLJALEQS 118.15(115)15323838
JKCEMENT 1025.85(1038.15)34764
JKIL 316.15(307.35)116097
JKLAKSHMI 415.1(419.25)48117
JKTYRE 177.25(176.7)882586
JMFINANCIL 150(158)1365171
JPASSOCIAT 17.5(17.75)50821831
JPINFRATEC 14.95(14.9)1816839
JPPOWER 6.45(6.45)1853790
JSWENERGY 82.5(82.6)2454333
JSWHL 1722.85(1727.65)2459
JUBILANT 942.1(970.2)724616
JUBLFOOD 1998.7(1999.9)665951
JUSTDIAL 449.05(455.7)3463897
JYOTHYLAB 352.35(353)14527
KALPATPOWR 472.6(462.7)85697
KANSAINER 504.35(503.25)138706
KEC 357.55(355)851669
KESORAMIND 141.2(143.2)478959
KIRLOSENG 374.95(375.05)8164
KITEX 290.65(287.45)77237
KOLTEPATIL 326.55(328.7)229438
KOTAKBANK 1032(1051.75)1898563
KPIT 215.25(221.15)3531882
KRBL 586.8(560.4)112382
KSCL 478.55(472.4)425647
KSK 14.25(13.65)1078977
KTKBANK 135.95(136.35)1662834
KWALITY 89.45(90.95)1117825
L&TFH 163.5(163.2)4285346
LAKSHVILAS 124.5(126.4)599571
LAOPALA 618.3(618.7)15342
LAXMIMACH 5738.3(5724.35)2041
LICHSGFIN 511.85(514.45)2114572
LITL 1.4(1.45)617344
LT 1329.25(1347.4)2029257
LUPIN 822.15(812.45)2767071
M&M 750.05(752.2)2214895
M&MFIN 444.3(449.2)1998434
MAGMA 160.2(159.15)47735
MAHINDCIE 213.9(215.7)144946
MAHLIFE 460.9(468.25)15454
MANAPPURAM 104.35(108.6)6314872
MANPASAND 399.95(406.2)93123
MARICO 297.2(300.1)622959
MARKSANS 39.9(39.5)3224427
MARUTI 8936.1(9030.7)364892
MAYURUNIQ 497.25(499.4)9212
MCDOWELL-N 3194(3154.5)333151
MCLEODRUSS 171.65(172.1)196393
MERCK 1497.35(1477)20538
MHRIL 305.3(304.95)82662
MINDACORP 197.85(195.7)269781
MINDTREE 717.2(733.3)669860
MMTC 56.75(55.95)1844345
MOIL 234.5(234.6)442127
MONSANTO 2503(2500)33058
MOTHERSUMI 359.95(364)1810554
MOTILALOFS 1129.6(1157.7)340368
MPHASIS 897.6(872.05)369172
MRF 70013.8(70171.05)4799
MRPL 118.75(118.05)1254990
MTNL 22.4(22.85)1272942
MUTHOOTFIN 421.9(430.7)1561318
NATCOPHARM 813.5(829.6)375203
NATIONALUM 73.5(71.65)6088336
NAUKRI 1293.5(1240)186014
NAVKARCORP 171.15(171.35)120577
NCC 114.25(113.9)3899571
NETWORK18 51.6(50.8)478160
NHPC 28.7(28.7)5087255
NIITTECH 829.95(827.85)515853
NITINFIRE 6.3(6)494022
NLCINDIA 101.2(102.6)320219
NMDC 136(133.7)4129629
NTPC 163.25(163.7)3765185
OBEROIRLTY 454.45(476.15)767406
OFSS 4069.15(4092.8)34297
OIL 355.05(362.1)573610
OMAXE 228.8(229.1)490230
ONGC 187.35(188.7)7314145
ORIENTBANK 110.3(110.05)1956701
ORIENTCEM 151.05(156.75)58751
ORISSAMINE 1752.95(1772.5)2413
PAGEIND 21398.95(20702.75)26133
PARSVNATH 22.25(21.55)122621
PCJEWELLER 369.8(382.15)6146933
PEL 2633.75(2705.8)113681
PERSISTENT 796.3(794.1)130234
PETRONET 246.8(248.9)3675351
PFC 109.3(110.15)3653807
PFIZER 2309.3(2267.95)23293
PFS 33.5(33.55)654585
PGHH 9310(9273.65)58488
PHOENIXLTD 589.3(619.9)125697
PIDILITIND 878.2(884.9)486696
PIIND 810.45(823.05)88018
PNB 156.8(159.35)9608396
POLARIS 469.3(463.55)397063
POWERGRID 193.2(193.2)8540478
PRAJIND 94.95(97.35)891301
PRESTIGE 301.95(295.7)325060
PRISMCEM 133.25(133.45)1071867
PTC 99.05(96.3)2185660
PUNJLLOYD 21.85(21.65)1824582
PURVA 153.35(156.6)401879
PVR 1396.6(1414.15)232769
RADICO 335.45(338.5)1596719
RAIN 392.25(383.7)5468991
RAJESHEXPO 812.45(810.75)204367
RALLIS 229.35(233)189396
RAMCOCEM 710.9(725.15)170452
RAMCOSYS 458.2(460.8)20910
RATNAMANI 960.85(984.8)9114
RAYMOND 966.15(966.25)670273
RCF 87.15(86.75)3449902
RCOM 27(26.55)104526292
RECLTD 149.95(150.55)3059986
REDINGTON 141.9(143.9)149893
RELAXO 612.75(608.75)57602
RELCAPITAL 494.7(470.15)12044249
RELIANCE 897.85(904.55)5294279
RELINFRA 451.5(444.2)3132223
RENUKA 15.65(15.3)5588449
REPCOHOME 588.15(590.55)124823
RIIL 479.5(479.2)586937
RKFORGE 797.65(795.9)37710
RNAVAL 40.2(38.25)10176739
ROLTA 68.7(66.4)1805145
RPOWER 44.9(42.2)17106102
RTNPOWER 6.4(6.4)7122442
RUCHISOYA 16.4(16.5)832039
SADBHAV 395.85(406.25)99459
SADBHIN 136.3(137.9)28670
SAIL 93.95(86)44334778
SANOFI 4724.9(4720.45)7476
SBIN 296.4(301.4)15750824
SCHAEFFLER 5345.45(5403.1)1109
SCHNEIDER 111.4(112.2)60390
SCI 77.4(76.25)935022
SHARDACROP 382.9(395.2)390677
SHILPAMED 520.15(514.5)14703
SHK 281.8(283.25)86246
SHOPERSTOP 535.5(530.6)52914
SHREECEM 17041.45(17005.05)16017
SHRIRAMCIT 1935.75(1979.6)24703
SIEMENS 1229.4(1226)155707
SIMPLEXINF 575.1(578.15)9071
SINTEX 22.35(22.75)2795686
SITINET 19.7(20)194874
SJVN 36.95(36.5)1663722
SKFINDIA 1791.45(1723.65)17980
SMLISUZU 805.1(825.7)146268
SNOWMAN 52.55(52.15)955559
SOBHA 567.15(559.85)864020
SOMANYCERA 694.2(690.55)4353
SONATSOFTW 285.95(290.75)229927
SOUTHBANK 27.5(27.7)6186935
SPARC 440.25(432.05)318748
SREINFRA 81.75(82.2)1947188
SRF 1875.05(1843.2)227219
SRTRANSFIN 1311.3(1337.6)863164
STAR 739.75(712.05)633985
STCINDIA 155.55(156.85)63631
SUNDARMFIN 1661.45(1650.75)20341
SUNDRMFAST 529.65(524.55)76521
SUNPHARMA 582.7(584.1)3796079
SUNTV 973.55(1006.55)1086075
SUPREMEIND 1185.8(1187.2)44494
SUVEN 195.45(197.6)250622
SUZLON 13.5(13.25)38953133
SWANENERGY 198.7(195.7)190229
SYMPHONY 1688.7(1702.3)9766
SYNDIBANK 65(65.4)3041785
SYNGENE 593.9(599.55)34375
TAKE 169(166.45)252887
TATACHEM 700.75(708.15)1210510
TATACOFFEE 138.8(140.45)432595
TATACOMM 638.1(618.95)730373
TATAELXSI 998.25(995.9)390409
TATAGLOBAL 278.25(280.45)3121544
TATAMOTORS 368.75(374.85)8816777
TATAMTRDVR 207.1(210.9)1958642
TATAPOWER 85.05(85.05)3539836
TATASPONGE 1047.3(1054.2)167196
TATASTEEL 685.3(671.45)9140288
TBZ 116(117.45)294994
TCS 2971.7(2974.2)1051229
TECHM 595.25(608.25)3481551
TECHNO 364.9(365)10666
TEXRAIL 93.6(93.8)699422
THERMAX 1183.65(1197.8)22573
THOMASCOOK 238.25(238.75)82497
TIDEWATER 6565.8(6693.7)1094
TIMKEN 826.9(834.15)10557
TITAN 796.8(800.75)1564899
TNPL 421.15(419.2)93272
TORNTPHARM 1434.35(1380.85)228837
TORNTPOWER 268.5(257.5)2067974
TREEHOUSE 13.1(13.1)31691
TRIDENT 73.05(73.8)492729
TRITURBINE 125.85(126.9)466357
TTKPRESTIG 7040.85(7000.15)28864
TTML 6.5(6.6)511487
TV18BRDCST 55.4(54.7)4138109
TVSMOTOR 664.8(666.2)914427
TVSSRICHAK 3627.1(3589.2)5937
TVTODAY 478.65(456.8)244774
UBL 1063.35(1059.4)252701
UCOBANK 29.2(29.55)1083529
UFLEX 389.35(380.75)194616
ULTRACEMCO 4153.3(4167)181041
UNICHEMLAB 370.4(371.7)688546
UNIONBANK 126.25(125.15)3752919
UNITECH 7.5(7.55)21230851
UPL 708.35(718.05)1245192
VAIBHAVGBL 693.15(692.8)6882
VAKRANGEE 201.7(192.1)20709071
VEDL 316.3(314.45)9515144
VIDEOIND 19(18.1)1826977
VIJAYABANK 61.1(60.15)1633104
VINATIORGA 879.9(871.15)20148
VIPIND 356.45(354.05)237683
VOLTAS 593.7(600.2)749611
VRLLOG 432.4(432.6)46925
VSTIND 3208.3(3196.6)1367
VTL 1319.65(1315.3)41249
WABAG 569.6(570.5)56271
WABCOINDIA 7039.7(7340.05)12864
WELCORP 165(165.95)496132
WELSPUNIND 67.65(67.65)1097178
WHIRLPOOL 1543.65(1455.75)118342
WIPRO 285(289.8)3151977
WOCKPHARMA 808.25(791.55)1998726
WONDERLA 366.95(369.2)49399
ZEEL 580.95(584.8)868462
ZEELEARN 43.25(43.45)340932
ZENSARTECH 936.7(940.25)7628
ZYDUSWELL 1147.2(1146.9)23831



విమాన గోపుర స్వర్ణ తాపడం (ఊహా చిత్రం); విమాన గోపురం ప్లాన్

# యాదాద్రికి స్వర్ణ కళ

## విమాన గోపురం, ధ్వజ స్తంభం, శయనశాలకు బంగారు తాపడం.. ప్రధాన ద్వారాలకు వెండి తొడుగు

### భక్తులు సమర్పించిన బంగారం.. వినియోగానికి ప్రభుత్వం అనుమతి

యాదాద్రి, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ ఆధ్యాత్మిక క్షేత్రంగా తిరుమల స్థాయిలో అభివృద్ధి పనులు సాగుతున్న స్వయంభూ యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి ఆలయం బంగారు శోభను సంతరించుకోనుంది. ప్రాచీన శిల్ప కళా సౌరభం ఉట్టిపడే విధంగా నిర్మితమవుతున్న ఆలయ విమాన గోపురంతో పాటు ధ్వజస్తంభం, స్వామివారి శయనశాలకు బంగారం తాపడం చేయాలని నిర్ణయించారు. ఆలయ పునర్నిర్మాణంలో భాగంగా కొత్తగా నిర్మిస్తున్న ఏడు గోపురాలలో విమాన గోపురానికి స్వర్ణతాపడం చేయాలని సీఎం కేసీఆర్ సంకల్పించం తెలిసిందే. భక్తులు స్వామివారికి సమర్పించిన బంగారం, వెండిని వినియోగించాలన్న ప్రతిపాదనకు దేవాదాయశాఖ కమిషనర్ శివశంకర్ పరిపాలనాపరమైన అనుమతులు జారీ చేసినట్టు తెలిసింది. ఎంత బంగారం అవసరమవుతుంది, అందుబాటులో ఎంత ఉందనే దానిపై ఆలయ అధికారులను నివేదిక కోరినట్టు తెలిసింది. అలాగే ప్రధాన ద్వారాలకు, గడపలకు వెండి తొడుగులను అమర్చనున్నారు.

#### స్వామివారి ఖజానాలో 45 కేజీల బంగారం

లక్ష్మీనరసింహస్వామికి భక్తులు బంగారం, వెండిని కానుకగా సమర్పించి మొక్కులు చెల్లించుకుంటారు. ఇలా స్వామివారి ఖజానాలో దాదాపు 45 కిలోల బంగారం, 2వేల కిలోలకు పైగా వెండి ఉన్నట్టు అంచనా. వీటిలో 20 కిలోల బంగారం స్వామివారికి ప్రత్యేక ఉత్సవాల్లో, రోజు వారీ అలంకరణకు వినియోగించే ఆభరణాలు, పూజా సామగ్రి రూపంలోను, మరో 25 కిలోలు ముడి బంగారంగా ఆలయ ఖజానాలో ఉందని ఆలయ వర్గాల ద్వారా తెలుస్తోంది. దాదాపు 1500 కిలోల ముడి వెండి అందుబాటులో ఉందని సమాచారం.

#### త్వరలో టెండర్లు

బంగారు, వెండి తొడుగుల పనులను నిపుణులకు అప్పగించడానికి వైటీడీఏ అధికారులు సన్నాహాలు ప్రారంభించారు. నిపుణుల ఎంపిక కోసం వైటీడీఏ వైస్ చైర్మన్, ఇంజనీర్ ఇన్ చీఫ్, మైనింగ్ సాంకేతిక నిపుణులతో ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేశారు. ఈ కమిటీ ఇప్పటికే దేశవ్యాప్తంగా వివిధ ఆలయాలకు బంగారు, వెండి తొడుగు పనులు చేసిన చెన్నై చెందిన నిపుణులను సంప్రదించారు. అంచనా వ్యయంతో పాటు చార్జీలపై ప్రాథమికంగా పరిశీలన జరిపారు. త్వరలోనే టెండర్లు పిలవనున్నట్టు తెలిసింది.



#### 47 అడుగుల విమాన గోపురం

యాదాద్రి ఆలయ విమాన గోపురానికి స్వర్ణ తాపడం చేస్తామని ముఖ్యమంత్రి కేసీఆర్ 2014లో అక్టోబరు 17న తొలి పర్యటనలోనే ప్రకటించారు. స్వామివారు కొలువైన కొండగుహ గర్భాలయంపై 47 అడుగుల విమాన గోపుర నిర్మాణ పనులు ప్రారంభించారు. సుదర్శన చక్రం ప్రతిష్ఠించే ఈ గోపురానికి మొదట 32 పొరలతో వెండి రేకులతో తాపడం అమరుస్తారు. దానిపై బంగారు తాపడం చేయనున్నారు. దీనికి దేవస్థానం వద్ద గల భక్తులు సమర్పించిన ముడి బంగారం వినియోగించడానికి ప్రభుత్వం అంగీకరించింది. గర్భాలయం ఎదుటగల ధ్వజ స్తంభం, ముఖ మండపంలోని స్వామివారి శయనశాలను కూడా స్వర్ణ తాపడం చేయనున్నారు.



## వాగులో కర్రల వంతెన

ఆళ్లపల్లి, ఫిబ్రవరి 9: అది పూర్తిగా అటవీ ప్రాంతం.. వాగులు వంకలు దాటడమంటే ఓ సాహసమే. నేటికీ బ్రిడ్జిలకు నోచుకోకపోవడంతో రవాణా కష్టతరంగా మారింది. ఇక వర్షాకాలమైతే పరిస్థితి చెప్పనక్కర్లేదు. ఆ మన్యంవాసుల రవాణా కష్టాలకు నిదర్శనంగా నిలుస్తోంది భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఆళ్లపల్లి మండలంలోని జల్లేరువాగు. ఈ వాగుపై వంతెన నిర్మాణానికి గతేడాది జూన్‌లో రూ.2.75కోట్లు మంజూరుకాగా.. పనులు మాత్రం నేటికీ ప్రారంభం కాలేదు. దీనిపై అధికారులను ప్రశ్నిస్తే.. టెండరు సమస్య ఏర్పడిందని.. అది త్వరలోనే పరిష్కారమవుతుందని చెబుతున్నారు. ఈ నేపథ్యంలో ఈ వాగుమీదుగా ట్రాక్టర్లు, వాహనాలు వెళ్లలేని పరిస్థితి. ఇక రైతులైతే తాము పండించిన పంటలను మార్కెట్‌కు తరలించాలంటే నరకం చూడాల్సిన దుస్థితి. పెద్దూరు, నడిమిగూడెం, జాకారం, లొద్దిగూడెం, సందిబంధం, బోడయికుంట, అడవి రామవరం, పాతూరు గ్రామాల గిరిజన రైతులు ఈ మార్గం గుండానే పంటలను తరలిస్తుంటారు. ఈ క్రమంలో ఎన్నో ఇబ్బందులు పడిన రైతులు... పంట ఉత్పత్తులను వాహనాల్లో తరలించేందుకు ప్రత్యామ్నాయం ఆలోచించారు. ఆ జల్లేరు వాగులో కర్రలతో తాత్కాలిక వంతెనను నిర్మించారు. దీంతో వాహనాలు ఆ ఇసుకలో కూరుకుపోకుండా రాకపోకలకు సులువుగా మారిందని రైతులు పేర్కొంటున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి.. అడ్డంకులను తొలగించి జల్లేరువాగుపై వంతెన నిర్మించాలని స్థానికులు వేడుకుంటున్నారు.

# కాళేశ్వరం సందర్శించిన నేహాల్

**బ్రాండ్ అంబాసిడర్ హోదాలో పర్యటన**

మహదేవపూర్/మహదేవ్‌పూర్ రూరల్ ఫిబ్రవరి 9: తెలంగాణ నీటిపారుదల శాఖ బ్రాండ్ అంబాసిడర్‌గా నియమితుడైన ఐదేళ్ల బాల మేధావి నేహాల్ శుక్రవారం కాళేశ్వరం ప్రాజెక్టు పనులను సందర్శించాడు. నేహాల్ ఇటీవలే తన అమోఘమైన ప్రతిభతో రాష్ట్రంలోని సాగునీటి ప్రాజెక్టుల వివరాలను అనర్గళంగా చెప్పి రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి హరీశ్‌రావు మెప్పును పొందిన విషయం తెలిసిందే. తాను కాళేశ్వరం పనులను సందర్శిస్తానని నేహాల్ అనడంతో మంత్రి హరీశ్‌రావు అధికారులకు ఆదేశాలిచ్చారు. దీంతో శుక్రవారం చిన్నారి నేహాల్ తన తల్లిదండ్రులు రజని, హనుమంతరావులతో కలిసి కాళేశ్వరం వచ్చి స్వామి వారిని దర్శించుకున్నాడు. స్వామి వారికి ప్రత్యేక పూజలు చేసిన తర్వాత ఈవో శ్రీనివాస్ ఘనంగా సన్మానించారు. అనంతరం కన్నెపల్లి వద్ద నిర్మిస్తున్న పంప్ హౌస్ పనులను తల్లిదండ్రులతో కలిసి నేహాల్ వీక్షించాడు. నీటిపారుదల శాఖ ఇంజనీర్లు పనులు పురోగతిపై వివరించారు. ప్రాజెక్టు పూర్తయ్యాక మళ్లీ వచ్చి చూస్తానని నేహాల్ చెప్పాడు. మేడిగడ్డ వద్ద నిర్మిస్తున్న బ్యారేజీ నిర్మాణాన్ని నేహాల్ శుక్రవారం సందర్శించాడు. డీఈ ప్రకాష్ నేహాల్‌కు, కుటుంబ సభ్యులకు బ్యారేజీ వివరాలను తెలిపారు.



కన్నెపల్లి పంప్ హౌస్‌ను పరిశీలిస్తున్న నేహాల్



# నాడు ఆధిపత్య పోరు.. నేడు అభివృద్ధి జోరు

## ఫ్యాక్షన్ పల్లెల్లో కొత్త అధ్యాయం.. కక్షలకు దూరంగా టేకులపల్లి

ఇల్లెందు, ఫిబ్రవరి 9: బాంబులతో బంతులాడుకున్నారు.. ఆస్తులను బుగ్గి చేసుకున్నారు. పట్టపగలే ప్రత్యర్థుల తలలు, మొండేలు వేరు చేసి గోనె సంచుల్లో మూట కట్టి హడలెత్తించారు. అందరూ చూస్తుండగానే నడిబజారులో కొడవళ్లతో దాడులు.. ప్రతిదాడులు.. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా టేకులపల్లి మండలం రక్తచరిత్ర ఇది. సీమ ఫ్యాక్షన్ రాజకీయాలకు ఏమాత్రం తీసిపోకుండా కొన్నేళ్ల పాటు సాగిన ఆధిపత్య పోరుకు నిలువెత్తు సాక్ష్యం. అయితే ఇదంతా ఒకప్పటి మాట.. నాడు రక్తపుటేరులు పారించిన పల్లెలు.. ఇప్పుడు అభివృద్ధి దిశగా అడుగులు వేస్తున్నాయి. గతంలో గ్రూపులు, వర్గ రాజకీయాలతో కునారిల్లిన గిరిజన తండాలు ప్రస్తుతం సీసీ రోడ్లు, అంగన్‌వాడీ భవనాలు, ఆస్పత్రులు, సంక్షేమ వసతి గృహాల భవనాలతో కళకళలాడుతున్నాయి.



టేకుపల్లి మండలంలోని గ్రామాలను కలుపుతూ నిర్మిస్తున్న బ్రిడ్జి

#### ఆధిపత్య పోరులో నెత్తుటి ధార

టేకులపల్లి మండలంలో లక్కినేని వెంకటేశ్వర్‌రావు, గోనెల వెంకటనారాయణ నడుమ తలెత్తిన విభేదాలు గ్రామాలు, తండాలను రక్తపుటేరులు పారించాయి. 1990ల్లో వీరి మధ్య వైరం తీవ్రస్థాయికి చేరింది. ఇద్దరూ కాంగ్రెస్‌కు చెందిన నాయకులైనప్పటికీ చెరొక వర్గానికి ప్రాతినిధ్యం వహిస్తూ మండలంలో ఆధిపత్యం కోసం పోటీపడేవారు. ఆ రోజుల్లోనే లక్కినేని వెంకటేశ్వర్ రావు ఇల్లెందు ఎల్‌ఎంబీ బ్యాంక్ చైర్మన్‌గా, ఇల్లెందు, కొత్తగూడెం నియోజకవర్గాల్లో కీలక నేతగా కాంగ్రెస్ రాజకీయాలను శాసించేవారు. మరో వర్గం నేతగా ఎదిగిన గోనెల వెంకటనారాయణ జిల్లా కాంగ్రెస్ కమిటీ కార్యదర్శిగా, బేతంపూడి సొసైటీ సింగిల్ విండో చైర్మన్‌గా వ్యవహరించేవారు. గోనెల-లక్కినేని వర్గాల మధ్య ఘర్షణ అంటే ఆ ప్రాంతాలకు వెళ్లేందుకే పోలీసులు జంకేవారు. 1992లో ముత్యాలంపాడులో గోనెల నారాయణను ప్రత్యర్థులు ఆయన ఇంటి ఎదుటే బాంబులతో దాడిచేసి హత్య చేయడంతో మండలం అట్టుడికిపోయింది. ముత్యాలంపాడు, సులానగర్, కోయగూడెం, ముత్యాలంపాడు స్టేజీ, పాతతండా, కొత్తతండా, రాంపురం, తూర్పుగూడెంల్లో ఇళ్ల దహనాలు జరగడం సంచలనం సృష్టించింది. తన సోదరుడిని చంపిన వారిపై ప్రతీకారం తీర్చుకునేందుకు యత్నిస్తున్న దశలోనే గోనెల నరేందర్ అనూహ్యంగా దారుణ హత్యకు గురయ్యారు. కొందరు వ్యక్తులు నరేందర్ తల, మొండెం వేరు చేయటం అప్పట్లో నిర్ఘాంతపరిచింది. నరేందర్‌ను చంపిన ఇద్దరు నిందితులు ఆ వెంటనే పోలీసుల ఎన్‌కౌంటర్‌లో మృతి చెందడం చర్చనీయాంశమైంది. ఇలా పరస్పర దాడులతో ఆరేళ్లపాటు టేకులపల్లి మండలం అట్టుడికింది.



సాగునీరు అందించేందుకు నిర్మించిన ఎత్తిపోతల



టేకులపల్లిలో నిర్మించిన బాలికల హాస్టల్ భవనం

#### ప్రజాప్రతినిధులుగా మారడంతో..

సీమ ఫ్యాక్షన్ రాజకీయాలను తలపించిన ఆధిపత్య రాజకీయాలు 1998 నుంచి క్రమేపీ కనుమరుగయ్యాయి. ప్రధాన ప్రత్యర్థులుగా సాగిన రెండు కుటుంబాలు తొలుత వేర్వేరు పార్టీల్లో పని చేసినా.. ఆ తర్వాత కాంగ్రెస్‌లో చేరి పాత కక్షలు, కార్పణ్యాలకు చరమగీతం పాడారు. దారుణ హత్యకు గురైన గోనెల వెంకటనారాయణ సతీమణి విజయలక్ష్మి ఆ తర్వాతి కాలంలో టేకులపల్లి జెడ్పీటీసీగా గెలుపొంది ఖమ్మం జెడ్పీ చైర్‌పర్సన్‌గా ఎన్నికయ్యారు. లక్కినేని రాజకీయ వారసుడు లక్కినేని సురేందర్‌రావు జెడ్పీటీసీగా గెలుపొందారు. ఈ మండలం నుంచే నలుగురు ఎమ్మెల్యేలుగా, ఇద్దరు జిల్లా పరిషత్ చైర్మన్లుగా ఎన్నిక కావడం ఇక్కడ మరో విశేషం.





1. ఎడ్లబండ్లలో తరలించడానికి సిద్ధంగా ఉన్న కలప; 2. కవ్వాల్ టైగర్‌జోన్‌లోని తాళ్లపేట రేంజ్‌లో చెట్ల పరిస్థితి

# అడవి కన్నీరు

## ఉమ్మడి ఆదిలాబాద్‌లో యథేచ్ఛగా వనమేథం.. అక్రమంగా కలప తరలింపు

మంచిర్యాల, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్రంలో 27,292 చదరపు కిలోమీటర్ల అటవీప్రాంతం ఉంది. ఇందులో ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లాలో 7,101.30 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలో అడవులున్నాయి. ఇదంతా లెక్కల్లో. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో 44.9 శాతం అటవీ ప్రాంతం ఉండగా, మంచిర్యాల జిల్లాలో 45 శాతం కావడం గమనార్హం. ఇప్పుడు ఆ అడవి కన్నీరు పెడుతున్నది. ఈ ప్రాంతం లో ఒకప్పుడు వర్షం అత్యధికంగా కురిసే జిల్లాగా పేరుంది. ఇప్పుడు వర్షాలు కూడా కురవడం లేదు. సాధారణ వర్షం కన్నా ఇటీవల జూన్, జులై, ఆగష్టులో అతి తక్కువ వర్షపాతం నమోదైంది. ఇందుకు కారణం అడవిని యథేచ్ఛగా నరికివేస్తున్న స్మగ్లర్లు. వారికి అండదండలుగా ఉంటున్న అధికారగణం, రాజకీయ నాయకులేనంటే అతిశయోక్తి కాదు. పులులు, చిరుతలు, ఇతర జంతువులు నీరు దొరకక పట్టణాల వైపుకు తరలివస్తున్న సంఘటనలు. పెరుగుతున్నాయి.

#### అందరి వద్దా ఫోన్లు

మొత్తం జిల్లాలో మూడు, నాలుగు వేలకు ఈ పని చేసే వారు సుమారు 300 మంది ఉంటారని సమాచారం. వీరందరూ రోజు కూలీలాగా పని చేస్తారు. అందరి వద్ద సెల్‌ఫోన్లు ఉంటాయి. పది మందికి ఒక లీడర్ ఎక్కడికక్కడ ఈ నిర్దేశించిన స్థావరం వద్దకు దుంగలు చేరే విధంగా ఎప్పటికప్పుడు సమాచారం తీసుకొని ఏర్పాట్లు చేస్తాడు. ఒక వేళ పకడ్బందీగా ఫారెస్టు అధికారులు ఎవరైనా ఉంటే వారి నిఘా నుంచి తప్పించడం కోసం అవసరమైతే కొన్ని రోజులు కలపను దాచి ఉంచుతారు. బీట్ అధికారులు, సిబ్బంది ఎప్పటికప్పుడు చేయాల్సిన తనిఖీలు చేయకుండానే ఏర్పాట్లు చేసుకుంటారు. సెక్షన్ ఆఫీసర్లు, బీట్ అధికారులు, ఇతర బేస్ క్యాంప్ సిబ్బంది ఎవరు కూడా పట్టించుకోరు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో దశాబ్దాలుగా స్మగ్లర్ల చేతుల్లో అడవి నరికివేతకు గురవుతున్నది. గడిచిన రెండు సంవత్సరాల నుంచి అయితే విచ్చలవిడిగా నరికివేత కొనసాగుతున్నప్పటికీ పట్టించుకునేవారు లేరు. కొత్తగా జిల్లాలు ఏర్పడిన తర్వాత ఇది మరింత పెరిగిపోయింది.

#### చిత్తం వచ్చినట్లు నరికివేత..

స్మగ్లర్లు మంచిర్యాల, ఆదిలాబాద్, కుమరంభీం ఆసిఫాబాద్, నిర్మల్ జిల్లాల్లోని అటవీ ప్రాంతాల్లో చెట్లు నరికే కూలీలను ఏర్పాటుచేసుకుంటున్నారు. వారు నరికి ఎడ్ల బండ్లు, ద్విచక్ర వాహనాలు, మెటోడోర్ వ్యాన్‌ల ద్వారా రోడ్లు దాటిస్తున్నారు. ఉమ్మడి జిల్లాలో ఈ పని కోసం ప్రతీ రోజు వంద వరకు వాహనాలు తిరుగుతుంటాయనేది సమాచారం. కల్లెడ, తాటిగూడ, మంగి, ఎర్రబండ, తిర్యాణి, గండిగోపాల్‌పూర్, మామిడిపల్లి, లింగాపూర్, కొమ్ముగూడ, నంబాల లాంటి దండేపల్లి మండలంలోని ప్రాంతాలు, అటు జన్నారంలో తాళ్లపేట రేంజ్‌లోగల గ్రామాలు ఇటు కాసిపేట మండలంలో 4గ్రామాల గుండా అటవీ ప్రాం తాల నుంచి నరికివేత అనంతరం చెట్లను దుంగలుగా తయారు చేసి రవాణా చేస్తారు. దొరికితే దొంగ....లేకపోతే లేదు. ప్రతీ రోజు సుమారు ఉమ్మడి జిల్లా నుంచి 8 నుంచి 12 లక్షల రూపాయల విలువైన కలప కరీంనగర్, హైదరాబాద్, వరంగల్‌కు తరలివెళ్తుంది. గుట్టలమీద నుంచి నరికి తీసుకువచ్చే ఈ చెట్లను సైకిల్‌ల మీద, స్కూటర్లు, మోటార్‌సైకిళ్ల మీద కొద్ది దూరం, అనంతరం ఎడ్ల బండ్ల మీద తీసుకువస్తారు.

#### చెట్ల లెక్కలు ఎక్కడ?

చెట్టును నరికివేసిన సమాచారం ఎప్పటికప్పుడు బీట్ అధికారి తెలుసుకోవాల్సి ఉంటుంది. నరికివేతకుగురైన చెట్ల లెక్క బీట్ ఫెల్లింగ్ రిజిస్ట్రర్‌లో రాయాల్సి ఉంటుంది. లక్షల రూపాయల విలువైన కలప నరికివేతకు గురవుతూ జిల్లా సరిహద్దులు దాటుతున్నప్పటికి వాటి లెక్కలు మాత్రం రిజిస్ట్రర్‌లలో కనిపించవు. అక్కడక్కడ చిన్న చిన్న చెట్లు నరికివేతకు గురైతే వాటి లెక్కలు రాసేస్తారు. లెక్కలన్నీ అబ్రకదబ్రా లెక్కలే. ఎక్కడికక్కడ స్మగ్లర్లు ఎవరిని పడితే వారిని మానేజ్ చేసుకుంటున్న దాఖలాలున్నాయి. వీరెవరికీ బదిలీలు కావు. ఏళ్ల తరబడి ఒకే దగ్గర పనిచేసే విధంగా పైరవీ చేయించుకుంటారు. బేస్ క్యాంపులు ఏర్పాటు చేసినప్పటికీ వాటి ఫలితం లేదు. అక్కడినుంచే వారి కనుసన్నలలోనే స్మగ్లింగ్ జరుగుతున్నట్టు ఆరోపణలున్నాయి.

#### 2, 3 వేలకు కొని 20 వేలకు అమ్ముతున్నారు..

ఒక దుంగను రూ. 2, 3 వేలకు కొనుగోలు చేసి రూ. 20 వేలకు అమ్ముతున్నారు. ఈ అమ్మకం చేస్తున్న వారు ఉమ్మడి జిల్లాలకు సంబంధించిన స్మగ్లర్లు కాగా ఇతర జిల్లాలలో వీటిని కొనుగోలు చేసే వారు మరో ఐదుపది వేలు పెంచుకొని అమ్ముకుంటున్నారు. కాసిపేట మండలంలోని దేవాపూర్ ప్రాంతంలోని కలప నాణ్యమైందని, ఎక్కువ రేటు పలుకుతుంది. ఇది లోకల్‌గానే రూ.4 వేల నుంచి 5 వేలకు అ మ్ముతుంటారు. దీని కొనుగోలుకు మంచి డిమాండ్ ఉంది.




**» ముఖ్య సమాచారం**

- అర్హత: 50 శాతం మార్కులతో 12వ తరగతి / తత్సమానం (ఫిజిక్స్, కెమిస్ట్రీ, బయాలజీ / బయోటెక్నాలజీ, ఇంగ్లీష్ సబ్జెక్టులతో). చివరి సంవత్సరం విద్యార్థులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు.
- వయసు: 17 ఏళ్లు (డిసెంబర్ 31, 2018 నాటికి).
- దరఖాస్తు: ఆన్‌లైన్ ద్వారా
- దరఖాస్తుకు చివరి తేదీ: మార్చి 9, 2018.
- తెలుగు రాష్ట్రాల్లో పరీక్షా కేంద్రాలు: హైదరాబాద్, వరంగల్, గుంటూరు, కాకినాడ, కర్నూలు, విజయనగరం, విశాఖపట్నం, తిరుపతి, విజయవాడ, రాజమహేంద్రవరం, నెల్లూరు.
- వెబ్‌సైట్: http://cbseneet.nic.in/

**బైపీసీ విద్యార్థులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న నేషనల్ ఎలిజిబిలిటీ కమ్ ఎంట్రెన్స్ టెస్ట్ (నీట్ - యూజీ) నోటిఫికేషన్ వెలువడింది. దేశ వ్యాప్తంగా మెడికల్, డెంటల్ కోర్సుల్లో ప్రవేశానికి ఉద్దేశించిన ఈ పరీక్షను సీబీఎస్ఈ (సెంట్రల్ బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్) నిర్వహిస్తోంది. తెలుగు రాష్ట్రాల్లో ఉన్న ప్రత్యేక నిబంధనల కారణంగా ఈ పరీక్షకు మన విద్యార్థులు అర్హులేనా? సెంట్రల్ పూల్‌లో చేరితే లాభమా? నష్టమా? అనే కోణంలో ఎన్నో చర్చలు జరిగాయి. అంతిమంగా నీట్ తప్పనిసరి అని రెండు రాష్ట్రాల ప్రభుత్వాలు స్పష్టం చేశాయి. ఈ నేపథ్యంలో డాక్టర్ కలను సాకారం చేసే నీట్ పరీక్ష విధానం, మెరుగైన ర్యాంక్‌కు చేయాల్సిన సన్నాహాలపై విశ్లేషణ..**

# నెగ్గుదాం... నీట్

సుప్రీం కోర్టు తీర్పును అనుసరించి దేశవ్యాప్తంగా మెడికల్, డెంటల్ కోర్సుల్లో ప్రవేశం పొందాలంటే నీట్‌లో అర్హత సాధించటం (ఎయిమ్స్, జిప్‌మర్ సంస్థలకు మినహాయింపు ఉంది) తప్పనిసరి. నీట్ పరీక్షను దేశవ్యాప్తంగా మే 6వ తేదీన నిర్వహిస్తారు.

- ఈ పరీక్షలో భాగస్వామ్యమైన అన్ని రాష్ట్రాలు.. తమ రాష్ట్రాల్లోని మెడికల్ / డెంటల్ కోర్సుల్లో 15 శాతం సీట్లను ఆల్ ఇండియా కోటాకు కేటాయించాల్సి ఉంటుంది. మిగతా 85 శాతం సీట్లు ఆయా రాష్ట్రాల అభ్యర్థులతో భర్తీ చేస్తారు.
- ఆల్ ఇండియా కోటాలోని 15 శాతం సీట్ల కోసం ఎవరైనా పోటీ పడొచ్చు. దీనికి సంబంధించిన మెరిట్‌లిస్ట్‌ను సీబీఎస్ఈ రూపొందిస్తుంది. దాని ఆధారంగా ఆన్‌లైన్‌లో కౌన్సిలింగ్ నిర్వహిస్తుంది.
- ఏఎఫ్ఎంసీ, ఈఎస్ఐ, బీహెచ్‌యూ, ఏఎంయూ, డీమ్డ్ యూనివర్సిటీలు ఆల్ ఇండియా కోటాలో ఉంటాయి.

### » తెలుగు రాష్ట్రాలు

తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలు ఈ ఏడాది 15 శాతం సీట్లను ఆల్ ఇండియా కోటాకు ఇవ్వడానికి అంగీకరించాయి. తద్వారా ఆల్ ఇండియా కోటాలోని సీట్లకు పోటీపడే అవకాశం తెలుగు విద్యార్థులకు లభిస్తుంది. దీంతో సీటు తెచ్చుకొనే అవకాశాలు మరింతగా మెరుగుపడతాయి. మిగతా 85 శాతం సీట్లను తెలుగు రాష్ట్రాల అభ్యర్థులతో భర్తీ చేస్తారు. తెలుగు రాష్ట్రాల విద్యార్థులు గమనించాల్సిన కీలక మార్పు.. ఈ సంవత్సరం నుంచి ఆయుష్ కోర్సులకు (ఆయుర్వేద, హోమియోపతి, యునానీ, నేచురోపతి వంటివి) కూడా నీట్ ర్యాంక్‌నే ప్రాతిపదికగా తీసుకుంటారు. కాబట్టి ఆయుష్ కోర్సులు లక్ష్యంగా ఉన్న వారు కూడా నీట్ రాయాల్సిందే. వ్యవసాయ, ఫార్మసీ కోర్సుల కోసం ఎంసెట్ రాయాల్సి ఉంటుంది.

### » అబ్రాడ్ మెడిసిన్‌కు కూడా

మరో కీలక అంశం.. విదేశీ యూనివర్సిటీల నుంచి మెడిసిన్ / డెంటల్ కోర్సులు చేయాలనుకునేవారు నిర్దేశించిన విధంగా నీట్‌లో అర్హత సాధించాలి. లేనిపక్షంలో అనుమతించరు. విదేశాల నుంచి ఎంబీబీఎస్ పూర్తి చేస్తున్న విద్యార్థుల్లో ఆశించిన ప్రమాణాలు ఉండటం లేదు. దీంతో కొన్ని ప్రమాణాలు తప్పనిసరిగా ఉండాలనే ఉద్దేశంతో ఈ నిబంధనను ప్రవేశపెట్టారు. గతంలో 12వ తరగతిలో 50 శాతం మార్కులుంటే విదేశాల్లో మెడిసిన్ చేసేందుకు మెడికల్ కౌన్సిల్ ఎన్‌ఓసీ జారీ చేసేది.

### » పరీక్ష విధానం

పరీక్షను ఆబ్జెక్టివ్ విధానంలో నిర్వహిస్తారు. హిందీ, ఇంగ్లీష్‌తోపాటు తెలుగు, కన్నడ, బెంగాలీ, గుజరాతీ, మరాఠీ, ఒరియా, ఉర్దూ, తమిళం, అస్సామీ భాషల్లో కూడా నీట్ ఉంటుంది. తెలుగు విద్యార్థులకు తెలుగు / ఇంగ్లీష్ భాషల్లో ప్రశ్నపత్రాన్ని ఇస్తారు. ఇందులో బయాలజీ, ఫిజిక్స్, కెమిస్ట్రీ నుంచి 180 ప్రశ్నలు ఉంటాయి. సరైన సమాధానానికి 4 మార్కుల చొప్పున 720 మార్కులకు పరీక్ష ఉంటుంది. నెగిటివ్ మార్కింగ్ కూడా ఉంది. ప్రతి తప్పునకు ఒక మార్కు కోత విధిస్తారు సమాధానాలను గుర్తించడానికి మూడు గంటల (180 నిమిషాలు) సమయం ఇస్తారు.

| సబ్జెక్ట్ | ప్రశ్నలు | మార్కులు |
|---|---|---|
| బయాలజీ | 90 | 360 |
| ఫిజిక్స్ | 45 | 180 |
| కెమిస్ట్రీ | 45 | 180 |

### » బయాలజీ

11, 12వ తరగతికి చెందిన ఎన్‌సీఈఆర్‌టీ పుస్తకాలను ప్రామాణికంగా తీసుకొని సీబీఎస్ఈ నీట్ ప్రశ్నపత్రాన్ని రూపొందిస్తుంది. తెలుగు విద్యార్థుల్లో సీబీఎస్ఈ సిలబస్‌ను ఎంచుకున్నవారు తక్కువగా ఉంటారు. సీబీఎస్ఈ విధానంలో 11వ తరగతి నుంచి బయాలజీని చదివిన వారు తెలుగు విద్యార్థులతో పోల్చితే ఎక్కువ లబ్ధి పొందుతున్నారు. మన దగ్గర ఇంటర్మీడియెట్‌లో బయాలజీని బోటనీ, జువాలజీగా విభజించారు. కానీ సీబీఎస్ఈలో బయాలజీ ఒకే సబ్జెక్ట్‌గా ఉంటుంది. బోటనీ, జువాలజీ అంటూ విభజన ఉండదు. తెలుగు రాష్ట్రాల్లోని ఇంటర్మీడియెట్ బోర్డులు సీబీఎస్ఈ సిలబస్‌ను పరిశీలించి కొన్ని సబ్జెక్టులకు సిలబస్‌లో కొన్ని పాఠ్యాంశాలను అదనంగా చేర్చారు. నీట్‌కు సిద్ధమవుతున్న విద్యార్థులు ఎన్‌సీఈఆర్‌టీ 11, 12వ తరగతుల పుస్తకాలను చదవడం మంచిది. అయితే కచ్చితంగా 11, 12 తరగతుల సిలబస్ నుంచే ప్రశ్నలు వస్తాయని చెప్పలేం. కాబట్టి 8 నుంచి 10 తరగతి వరకు ఉన్న బయాలజీ సిలబస్‌పై కూడా అవగాహన పెంచుకోవడం ప్రయోజనకరంగా ఉంటుంది. ఎన్‌సీఈఆర్‌టీతో పోల్చినప్పుడు అదనపు పాఠ్యాంశాలను నేర్చుకోవడం సగటు విద్యార్థిపై అదనపు భారాన్ని మోపడమే. ఉదాహరణకు మన సిలబస్‌లో యానిమల్ టిష్యూ, ఎంజైమ్‌ల గురించి కొన్ని అదనపు అంశాలను చేర్చారు. నీట్ ఎన్‌సీఈఆర్‌టీ సిలబస్ ఆధారంగానే జరుగుతుంది. కాబట్టి ఎన్‌సీఈఆర్‌టీ పుస్తకాల్లో లేని అంశాలను చదవడం వల్ల పెద్దగా ప్రయోజనం ఉండదు.

- నీట్ కోసం నిర్దేశించిన ఎన్‌సీఈఆర్‌టీ సిలబస్‌లో 11వ తరగతిలో 22 అధ్యాయాలు, 12వ తరగతిలో 16 అధ్యాయాలు ఉన్నాయి. ఈ 38 అధ్యాయాలను సమగ్రంగా చదవాలి. ఇందులో ప్రతి అధ్యాయం నుంచి రెండు ప్రశ్నలు రావొచ్చు. వీటితోపాటు 11వ తరగతిలోని ప్లాంట్ ఫిజియాలజీ, హ్యూమన్ ఫిజియాలజీ, 12వ తరగతిలోని జెనెటిక్స్ అండ్ ఎవల్యూషన్ యూనిట్‌లో ప్రతి అధ్యాయం నుంచి 3 ప్రశ్నలు అడిగే అవకాశం ఉంది.
- బయాలజీలో డయాగ్రామ్ ఆధారంగా కాన్సెప్ట్‌ను నేర్చుకునే ప్రయత్నం చేయాలి. దీని వల్ల అవగాహన పెరగడంతోపాటు కాన్సెప్ట్ / డయాగ్రామ్ ఆధారిత ప్రశ్నలకు సులభంగా సమాధానాలు గుర్తించవచ్చు.

11వ తరగతిలో చదవాల్సిన అంశాలు...

- ప్లాంట్ కింగ్‌డమ్, యానిమల్ కింగ్‌డమ్ అధ్యాయాలలో జీవరాశుల పేర్లు, శాస్త్రీయ నామాలతో ఉదాహరణలుగా ఇచ్చారు. వీటిపై అవగాహన పెంచుకోవాలి. ఫోటోసింథిసిస్, రెస్పిరేషన్ సైకిల్స్‌కు సంబంధించిన ఫ్లో చార్ట్‌ను విరివిగా ప్రాక్టీస్ చేయాలి.
- డైజెస్టివ్ సిస్టమ్, రెస్పిరేటరీ సిస్టమ్, ఎక్రటరీ సిస్టమ్‌లలో భాగాల వరుస క్రమాన్ని గుర్తుంచుకోవాలి.
- బయోమాలిక్యుల్స్ చాప్టర్ ఆర్గానిక్ కెమిస్ట్రీతో అనుసంధానమై ఉంటుంది. ప్రిపరేషన్‌లో కెమిస్ట్రీ పరిజ్ఞానాన్ని అన్వయించడం ప్రయోజనకరం.
- సెల్ డివిజన్‌కు సంబంధించి మిటోసిస్, మీయోసిస్ మధ్య తేడాలను ఎక్కువగా నేర్చుకోవాలి.
- స్ట్రక్చరల్ ఆర్గనైజేషన్ ఇన్ యానిమల్స్ అంశంలోని వానపాము, బొద్దింక, కప్పలకు సంబంధించిన వ్యవస్థలపై కచ్చితమైన అవగాహన ఉండాలి.
- 12వ తరగతిలో మొదటి నాలుగు అధ్యాయాలను డయాగ్రామ్ ఆధారిత కాన్సెప్ట్‌తో సులభంగా అవగాహన చేసుకోవచ్చు.

12వ తరగతిలో అంశాలు...

- Principles of Inheritance and Variation చాప్టర్‌లోను తప్పనిసరిగా చదవాలి.
- Molecular Basis of Inheritance చాప్టర్‌లో స్కీమాటిక్ డయాగ్రామ్స్ నేర్చుకోవాలి.

**రిఫరెన్స్ బుక్స్**

- *Cengage Learning India A to Z Biology for NEET Class XI, XII.*
- *Objective NCERT at your Fingertips (NEET) -Biology*



**ఎ. శ్రీనివాసరావు**
బయాలజీ అధ్యాపకులు

### » కెమిస్ట్రీ

- ఇందులో వచ్చే ప్రశ్నల్లో 35 వరకు సులభంగానే ఉంటాయి.
- కెమిస్ట్రీ కోసం ప్రథమ, ద్వితీయ సంవత్సరాల అకాడమీ పుస్తకాలను సమగ్రంగా చదవాలి. తరవాత మాక్ టెస్ట్‌లను ప్రాక్టీస్ చేయాలి. ఈ విధంగా చేస్తున్నప్పుడు ప్రతి ప్రశ్న నేపథ్యాన్ని అవగాహన చేసుకుంటూ ముందుకు సాగాలి. తద్వారా ప్రశ్నను ఎలా అడిగినా సమాధానం ఇవ్వగలరు. పరీక్షలో సమయం ఆదా అవుతుంది. చాలా మంది ప్రిపరేషన్ కోసం రకరకాల పుస్తకాలను చదువుతుంటారు. ఏ పుస్తకాన్నీ పరిపూర్ణంగా చదవరు. ఏదైనా ఒక పుస్తకానికి మాత్రమే ప్రిపరేషన్‌ను పరిమితం చేయడం ఉత్తమం.
- ఆవర్తన పట్టిక, రసాయన బంధం, సమన్వయ సంయోజనీయ బంధం, ఎస్, పీ, డీ, ఎఫ్ బ్లాక్ మూలకాలు.. అధ్యయాలను సమగ్రంగా చదవాలి. వాటిలోని ప్రశ్నలను ప్రాక్టీస్ చేయాలి.
- స్టాకియోమెట్రీలో మోల్, తుల్యాంక భారం, భారం - ఘనపరిమాణం అంశాలపై క్షుణ్నంగా అవగాహన చేసుకోవాలి. తద్వారా రసాయన శాస్త్రంలోని ప్రాబ్లమ్స్‌ను సులభంగా చేసే అవకాశం ఉంటుంది.
- కర్బన రసాయనశాస్త్రంలో నామకరణ విధానం, అణుసాదృశ్యం బాగా చదవాలి. ఇందులోని సమీకరణాలపై పట్టు సాధించాలి. అంతేకాకుండా భౌతిక ధర్మాలు, భేదపరిచే విషయాలను క్షుణ్నంగా చదివి ప్రాక్టీస్ చేయడం ఉత్తమం.
- ప్రతి అధ్యాయంలో అన్ని అంశాలను సమగ్రంగా చదవాలి. ఎందుకంటే టాపిక్ చివరి కొన్ని తెలియని అంశాలు ఉండే అవకాశం ఉంటుంది. సులువే అని ఏ ఒక్క అంశాన్ని కూడా విస్మరించకూడదు.
- ఒకే ప్రశ్నలో రెండు లేదా మూడు ప్రాబ్లమ్స్ ఇమిడి ఉంటాయి. వీటిని జాగ్రత్తగా గమనించి వాటికి సరిపోయే సూత్రాలను నోట్ చేసుకోవాలి.
- కర్బన రసాయనశాస్త్రంపై అధికంగా దృష్టి సారించాలి. భౌతిక రసాయన శాస్త్రంలో థియరీ భాగానికి ప్రాధాన్యం ఇవ్వాలి.



**డా. కె. చంద్రశేఖర్**

### » ఫిజిక్స్

- ఇందులో 45 ప్రశ్నలను ప్రయత్నించే విధంగా ప్రిపరేషన్ ఉండాలి. ప్రతి అధ్యాయంలోని కాన్సెప్ట్ ఆధారిత ప్రాబ్లమ్స్‌ను ప్రాక్టీస్ చేయాలి.
- రోజూ మాక్ టెస్టులు రాయాలి. గంటకు 45 ప్రశ్నలు సాధించే విధంగా ప్రణాళికతో ఉండాలి. తద్వారా సమయపాలన, కచ్చితమైన సమాధానాన్ని గుర్తించే నైపుణ్యం అలవడుతుంది.
- ఫిజిక్స్‌లో 25 నుంచి 30 ప్రశ్నలను సాధించాలనుకునే విద్యార్థులు ఎలక్ట్రోడైనమిక్స్, మోడ్రన్ ఫిజిక్స్, హీట్, థర్మోడైనమిక్స్, ఎస్‌హెచ్ఎం, వేవ్స్, సిస్టమ్ ఆఫ్ పార్టికల్స్, గ్రావిటేషన్, లాస్ ఆఫ్ మోషన్ పాఠ్యాంశాలపై దృష్టిసారించాలి. 2017 నీట్ ఫిజిక్స్ విశ్లేషణ..

| అధ్యాయం | ప్రశ్నలు | మార్కులు |
|---|---|---|
| ఎలక్ట్రోడైనమిక్స్ | 10 | 40 |
| హీట్ అండ్ థర్మోడైనమిక్స్ | 5 | 20 |
| మెకానిక్స్ | 13 | 52 |
| మోడ్రన్ ఫిజిక్స్ | 8 | 32 |
| ఆప్టిక్స్ | 5 | 20 |
| ఎస్‌హెచ్ఎం, వేవ్స్ | 4 | 16 |

# జాబ్ కార్నర్

## జిప్‌మర్

జవహర్‌లాల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ పోస్ట్‌గ్రాడ్యుయేట్ మెడికల్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్ (జిప్‌మర్) - మంగళగిరి, నాగపూర్ ఎయిమ్స్ క్యాంపస్‌ల్లో ఫ్యాకల్టీ పోస్టుల భర్తీకోసం దరఖాస్తులు కోరుతోంది.

- మొత్తం ఖాళీలు: **104** (ఒక్కో క్యాంపస్‌కు 52 ఖాళీలు ఉన్నాయి)
- విభాగాలు: అనాటమీ/ ఫిజియాలజీ / బయోకెమిస్ట్రీ / కమ్యూనిటీ మెడిసిన్ / పాథాలజీ / మైక్రోబయాలజీ / ఫార్మకాలజీ / ఫోరెన్సిక్ మెడిసిన్ అండ్ టాక్సికాలజీ
- పోస్టులవారీ ఖాళీలు: ఒక్కో క్యాంపస్‌లో ప్రొఫెసర్ 8, అడిషనల్ ప్రొఫెసర్ 4, అసోసియేట్ ప్రొఫెసర్ 4, అసిస్టెంట్ ప్రొఫెసర్ 16, సీనియర్ రెసిడెంట్ 12, ట్యూటర్స్ / డెమాన్‌స్ట్రేటర్స్ 8 ఖాళీలు ఉన్నాయి.
- అర్హత: ప్రొఫెసర్ పోస్టులకు సంబంధిత విభాగంలో ఎండి / ఎంఎస్ / డిఎన్‌బి పూర్తిచేసి ఉండాలి. పోస్టును అనుసరించి నిర్దేశించినమేరకు టీచింగ్ / రీసెర్చ్ అనుభవం ఉండాలి. ట్యూటర్ / డెమాన్‌స్ట్రేటర్ పోస్టులకు ఎంబిబిఎస్ లేదా సంబంధిత విభాగంలో ఎమ్మెస్సీ ఉత్తీర్ణులై ఉండాలి.
- వయసు: దరఖాస్తు నాటికి ప్రొఫెసర్లు, అడిషనల్ ప్రొఫెసర్లకు 58; అసోసియేట్ ప్రొఫెసర్, అసిస్టెంట్ ప్రొఫెసర్లకు 50; సీనియర్ రెసిడెంట్‌కు 33; డెమాన్‌స్ట్రేటర్స్ / ట్యూటర్స్‌కు 35 ఏళ్లు మించరాదు
- నెల వేతనం: ప్రొఫెసర్లకు రూ.1,59,100 అడిషనల్ ప్రొఫెసర్లకు రూ.1,39,600 అసోసియేట్ ప్రొఫెసర్లకు రూ.1,31,400 అసిస్టెంట్ ప్రొఫెసర్లకు రూ.1,01,500 సీనియర్ రెసిడెంట్లకు రూ.67,700 ట్యూటర్/ డెమాన్‌స్ట్రేటర్లకు రూ.56,100 ఇస్తారు
- ఎంపిక: ప్రొఫెసర్ పోస్టులన్నింటికీ పర్సనల్ ఇంటర్వ్యూ ద్వారా సీనియర్ రెసిడెంట్, ట్యూటర్ / డెమాన్‌స్ట్రేటర్ పోస్టులకు రాత పరీక్ష, ఇంటర్వ్యూ ద్వారా అభ్యర్థులను ఎంపిక చేస్తారు.
- దరఖాస్తు ఫీజు: రూ.500 (ఎస్సీ / ఎస్టీలకు రూ.200 కాగా దివ్యాంగులకు ఫీజు మినహాయింపు వర్తిస్తుంది)
- దరఖాస్తుకు ఆఖరు తేదీ: మార్చి 16
- వెబ్‌సైట్: www.jipmer.puducherry.gov.in

## నర్సింగ్ ఆఫీసర్లు

భోపాల్‌లోని ఆలిండియా ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (ఎయిమ్స్) - నర్సింగ్ ఆఫీసర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- మొత్తం ఖాళీలు: **700**
- పోస్టులవారీ ఖాళీలు: సీనియర్ నర్సింగ్ ఆఫీసర్ 100, నర్సింగ్ ఆఫీసర్ 600
- అర్హత: బిఎస్సీ (నర్సింగ్ / పోస్ట్ సర్టిఫికెట్ / నర్సింగ్ - పోస్ట్ బేసిక్ / ఆనర్స్ - నర్సింగ్) చేసుండాలి. కనీసం మూడేళ్లు స్టాఫ్ నర్స్‌గా పనిచేసి ఉండాలి. నర్సింగ్ ఆఫీసర్ పోస్టులకు డిప్లొమా (జనరల్ నర్సింగ్ మిడ్ వైఫరీ) అభ్యర్థులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. సీనియర్ నర్సింగ్ ఆఫీసర్లకు మూడేళ్లు, నర్సింగ్ ఆఫీసర్లకు రెండేళ్ల అనుభవం ఉండాలి.
- వయసు: పోస్టును అనుసరించి 21 నుంచి 35 ఏళ్ల మధ్య ఉండాలి.
- ఎంపిక: కంప్యూటర్ బేస్డ్ టెస్ట్, స్కిల్ టెస్ట్ / ప్రొఫిషియెన్సీ టెస్ట్ ద్వారా
- దరఖాస్తు ఫీజు: రూ.1000
- ఆన్‌లైన్ దరఖాస్తుకు ఆఖరు తేదీ: మార్చి 6
- వెబ్‌సైట్: www.aiimsbhopal.edu.in

## పవర్ గ్రిడ్ కార్పొరేషన్

పవర్ గ్రిడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ - నార్తర్న్ రీజియన్ ట్రాన్స్‌మిషన్ సిస్టం కోసం డిప్లొమా ట్రైనీ, జూనియర్ ఆఫీసర్ ట్రైనీ పోస్టుల భర్తీకోసం దరఖాస్తులు కోరుతోంది.

- మొత్తం ఖాళీలు: **28**
- పోస్టులవారీ ఖాళీలు: డిప్లొమా ట్రైనీ (ఎలక్ట్రికల్ 20, సివిల్ 5), జూనియర్ ఆఫీసర్ ట్రైనీ (హెచ్ఆర్) 3
- అర్హత: డిప్లొమా ట్రైనీలకు సంబంధిత విభాగంలో 70 శాతం మార్కులతో డిప్లొమా పూర్తిచేసి ఉండాలి. జూనియర్ ఆఫీసర్ ట్రైనీలకు 55 శాతం మార్కులతో (పీజీ / పీజీ డిప్లొమా / ఎంబిఏ) (హ్యూమన్ రిసోర్స్ / పర్సనల్ మేనేజ్‌మెంట్ / ఇండస్ట్రియల్ రిలేషన్ / ఎంఎస్‌డబ్ల్యు) ఉత్తీర్ణులై ఉండాలి.



- వయసు: దరఖాస్తు నాటికి 27 ఏళ్లు మించకూడదు.
- ట్రైనింగ్ వ్యవధి: ఏడాది
- స్టయిపెండ్: నెలకు రూ.16,500
- ఎంపిక: అభ్యర్థులను సెలెక్షన్ టెస్ట్ ద్వారా ఎంపిక చేస్తారు. జూనియర్ ఆఫీసర్లకు కంప్యూటర్ స్కిల్ టెస్ట్ కూడా ఉంటుంది.
- సెలెక్షన్ టెస్ట్ వివరాలు: ఇందులో రెండు పార్టులు ఉంటాయి. పార్టు 1లో ప్రొఫెషనల్ నాలెడ్జ్ టెస్ట్ ఉంటుంది. ఈ టెస్ట్‌లో సంబంధిత విభాగం నుంచి 120 ప్రశ్నలు ఇస్తారు. పార్టు 2లో సూపర్‌వైజరీ ఆప్టిట్యూడ్ టెస్ట్ ఉంటుంది.
- దరఖాస్తు ఫీజు: రూ.300
- ఆన్‌లైన్ దరఖాస్తుకు ఆఖరు తేదీ: ఫిబ్రవరి 27
- వెబ్‌సైట్: www.powergridindia.com

## బిట్స్ పిలాని

పిలానిలోని బిర్లా ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ & సైన్స్ - ఆన్ క్యాంపస్, ఆఫ్ క్యాంపస్ ఫ్యాకల్టీ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- పోస్టులు: అసిస్టెంట్ ప్రొఫెసర్, అసోసియేట్ ప్రొఫెసర్, ప్రొఫెసర్
- ఆన్ క్యాంపస్ పోస్టులకు అర్హత: అసిస్టెంట్ ప్రొఫెసర్లకు పిహెచ్‌డి పూర్తిచేసి ఉండాలి. పోస్ట్ పిహెచ్‌డితోపాటు ఆరేళ్ల అనుభవం ఉన్నవారిని మిగిలిన పోస్టులకు ఎంపిక చేస్తారు.
- ఆఫ్ క్యాంపస్ పోస్టుల అర్హత: ఎంఇ / ఎంటెక్ (ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ - ఎంబెడెడ్ సిస్టమ్స్, మైక్రో ఎలక్ట్రానిక్స్ / మెకానికల్ - డిజైన్ ఇంజనీరింగ్ అండ్ మాన్యుఫ్యాక్చరింగ్ / కంప్యూటర్ సైన్స్ & సాఫ్ట్‌వేర్ సిస్టమ్స్ / మేనేజ్‌మెంట్ - మార్కెటింగ్) ఉత్తీర్ణతతోపాటు అనుభవం ఉండాలి లేదా సంబంధిత విభాగంలో పిహెచ్‌డి పూర్తిచేసి ఉండాలి
- ఆన్‌లైన్ దరఖాస్తుకు ఆఖరు తేదీ: ఫిబ్రవరి 19
- వెబ్‌సైట్: www.bits-pilani.ac.in/careers

# కౌన్సెలింగ్

## విదేశీ విద్య

**ప్ర: నేను కెమికల్ ఇంజనీరింగ్‌లో బిటెక్ చదువుతున్నాను. అమెరికాలో ఎమ్మెస్ చేయాలనుంది. అక్కడ ఏ యూనివర్సిటీలో చేరితే మంచిదో తెలుపగలరు.**

***- గోనుగుంట్ల హరీష్, విజయవాడ***

జ: కెమికల్ ఇంజనీరింగ్ విద్యార్థులకు యునైటెడ్ స్టేట్స్‌లో మంచి యూనివర్సిటీలు అందుబాటులో ఉన్నాయి. పరిశోధనా రంగం మీద ఆసక్తి ఉన్నవారికి యూరప్‌లో మంచి అవకాశాలు ఉన్నాయి.

- యుఎస్ఎలోని మసాచుసెట్స్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ, స్టాన్‌ఫోర్డ్ యూనివర్సిటీ, యూనివర్సిటీ ఆఫ్ కాలిఫోర్నియా (బెర్కలీ)లు కెమికల్ ఇంజనీరింగ్ విభాగంలో అనేక రకాల కోర్సులను అందిస్తున్నాయి.

**ప్ర: నేను ఇసిఇ విభాగంలో బిటెక్ మొదటి సంవత్సరం చదువుతున్నాను. పోస్ట్ గ్రాడ్యుయేషన్ కోసం అబ్రాడ్ వెళ్లాలనుకుంటున్నాను. అందుకోసం ఏమి చేస్తే బాగుంటుందో తెలపండి.**

***- సి హెచ్. కళ్యాణ్ చక్రవర్తి, ఏలూరు***

జ: ప్రస్తుతం మీరు మొదటి సంవత్సరం చదువుతున్నారు కాబట్టి అకడమిక్స్ మీద శ్రద్ధ పెట్టండి. మూడో సంవత్సరంలో చేరినప్పటి నుంచి అబ్రాడ్ వెళ్లేందుకు ప్రయత్నాలు ప్రారంభించాలి. అకడమిక్స్‌తోపాటు జిఆర్ఇ, టోఫెల్ వంటి పరీక్షలకు సిద్ధం కావాలి. ఈ పరీక్షల్లో మంచి మార్కులు వచ్చినప్పటికీ అకడమిక్స్‌లో మెరిట్ రాకపోతే విదేశీ యూనివర్సిటీల్లో ప్రవేశం దొరకడం కష్టం. కాబట్టి అకడమిక్ మెరిట్ కోసం కృషి చేయాలి. అకడమిక్స్‌లో మంచి మార్కులు సాధిస్తే యుఎస్ఎలోగానీ, యూరోపియన్ దేశాల్లో గానీ చదువుకొనే అవకాశం లభిస్తుంది.

**ప్ర: నేను ఎక్కడైనా విదేశాల్లో ఫార్మసీలో పీజీ చేయాలనుకుంటున్నాను. విదేశాల్లో ఏ సంస్థలు అందిస్తున్నాయో తెలియజేయగలరు.**

***- వై తేజస్విని, వరంగల్***

జ: ఫార్మసీలో క్లినికల్ సంబంధిత ప్రోగ్రామ్స్‌ను అందించే యూనివర్సిటీలు కొన్ని దేశాల్లో మాత్రమే ఉన్నాయి. ముఖ్యంగా యుకె, యుఎస్ఏ, కెనడా, యూరోపియన్ దేశాల్లో ప్రముఖ ఫార్మసీ యూనివర్సిటీలు ఉన్నాయి. అయితే ఇక్కడ ప్రవేశం దొరకాలంటే ఆయా యూనివర్సిటీలు నిర్వహించే ప్రవేశ పరీక్షల్లో అర్హత పొందాల్సి ఉంటుంది.



**ప్ర: నేను బికాం చదువుతున్నాను. అబ్రాడ్‌లో ఎంబీఏ చేయాలనుకుంటున్నాను. దీనికి సంబంధించి విదేశాల్లో గుర్తింపు పొందిన యూనివర్సిటీల వివరాలను తెలుపగలరు.**

***- ఎస్. అజయ్ కుమార్, హైదరాబాద్***


జ: అంతర్జాతీయ విశ్వవిద్యాలయాల్లో ఎంబిఏ ప్రోగ్రామ్ చేయాలంటే నిర్దేశించిన క్రెడిట్స్ ఉండాలి. పేరు పొందిన యూనివర్సిటీలన్నీ 180 - 240 వరకు క్రెడిట్స్ ఉండాలన్న నిబంధన పెడుతున్నాయి. ఒక్కోసారి అభ్యర్థుల పని అనుభవాన్ని కూడా పరిగణనలోకి తీసుకుంటారు. సాధారణంగా మనదేశంలో సంవత్సరం / సెమిస్టర్ వారీగా కోర్సులు ఉంటాయి. అందుకే అకడమిక్ కోర్సులకు సంబంధించి 16 ఏళ్ల ఎడ్యుకేషన్‌తోపాటు అనుభవం గురించి అడిగే అవకాశం ఉంది.

- మంచి యూనివర్సిటీలో ప్రవేశం లభించాలంటే జీమ్యాట్, ఐఇఎల్‌టిఎస్ / టోఫెల్ వంటి పరీక్షల్లో స్కోరు సాధించడం తప్పనిసరి. ప్రపంచవ్యాప్తంగా చాలా యూనివర్సిటీలు ఎంబీఏ ప్రోగ్రామ్‌ను అందిస్తున్నాయి. ఆయా యూనివర్సిటీ వెబ్‌సైట్ల ద్వారా పూర్తి వివరాలను తెలుసుకోవచ్చు.
- కెనడా : www.educanada.ca
- యుఎస్ఏ : in.usembassy.gov
- జర్మనీ : www.daad.de

***- కిరణ్ గల్లా, P2P ఓవర్సీస్***

## ఐపీఎల్ వేలం @ 46.5 మిలియన్లు

**న్యూఢిల్లీ:** ఈ ఏడాది ఐపీఎల్ ఆరంభానికి ముందే ఓ రికార్డు నమోదుచేసింది. సాధారణంగా అభిమానులు ఐపీఎల్ లైవ్ మ్యాచ్‌లను వీక్షించేందుకు ఎక్కువ ఆసక్తి చూపుతారు. అయితే, ఈసారి మాత్రం ఐపీఎల్ ఆటగాళ్ల కోసం నిర్వహించిన వేలానికీ విశేష స్పందన లభించింది. బెంగళూరు వేదికగా గతనెల 27, 28వ తేదీల్లో నిర్వహించిన ఐపీఎల్ వేలాన్ని రికార్డుస్థాయిలో 46.5 మిలియన్ల మంది వీక్షించినట్లు బ్రాడ్‌కాస్ట్ ఆడియన్స్ రీసెర్చ్ కౌన్సిల్ (బార్క్) ప్రకటించింది. నిరుడుతో పోలిస్తే ఈమారు వేలాన్ని వీక్షించిన వారి సంఖ్య ఐదురెట్లు అధికమని తెలిపింది. ఆటగాళ్ల వేలం స్టార్‌స్పోర్ట్స్ నెట్‌వర్క్‌లోని ఆరు చానెళ్లలో ప్రసారమైన సంగతి తెలిసిందే. ఈ సీజన్ ఐపీఎల్ ఏప్రిల్ 7న ముంబైలో ప్రారంభం కానుంది.





## ఐసీసీ డైరెక్టర్‌గా ఇంద్రానూయి



**దుబాయ్:** పెప్సీకో చైర్మన్, సీఈవో ఇంద్రా నూయి అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) తొలి స్వతంత్ర మహిళా డైరెక్టర్‌గా నియమితులయ్యారు. వచ్చే జూన్‌లో ఆమె ఐసీసీ బోర్డులో చేరతారు. స్వతంత్ర చైర్మన్ హోదాలో ఆమె బాధ్యతలు నిర్వర్తిస్తారు. ఈమేరకు శుక్రవారం ఇక్కడ జరిగిన ఐసీసీ బోర్డు సమావేశంలో ఇంద్రానూయి నియామకాన్ని ఖరారు చేశారు. ఇంద్రానూయి పదవీ కాలం రెండు సంవత్సరాలు. అయితే ఆరేళ్లు మించకుండా ఆమె పదవీకాలాన్ని రెండుసార్లు పొడిగించవచ్చు. 'ఐసీసీలో చేరనుండడం ఎంతో ఉత్కంఠ కలిగిస్తోంది. బోర్డులోని మిత్రులు, ఇతర ఐసీసీ భాగస్వాములు, ప్రపంచంలోని క్రికెటర్లతో కలిసి పనిచేసేందుకు ఎదురుచూస్తున్నా. క్రికెట్‌ను మరింత జనరంజకంగా తీర్చిదిద్దడంలో నావంతు పాత్ర పోషిస్తా' అని ఇంద్రానూయి ఓ ప్రకటనలో తెలిపారు. ఓ మహిళను స్వతంత్ర డైరెక్టర్‌గా నియమించడం ఐసీసీ పరిపాలనను మెరుగుపరచడంలో ముందడుగుగా చైర్మన్ శశాంక్ మనోహర్ అభివర్ణించారు.

### 'ఆసియా'లో ముగిసిన భారత్ పోరు

**అలోర్ సెటార్ (మలేసియా):** ఆసియా బ్యాడ్మింటన్ టీమ్ చాంపియన్‌షిప్‌లో భారత్ పోరు ముగిసింది. శుక్రవారం జరిగిన క్వార్టర్‌ఫైనల్స్‌లో పురుషులు, మహిళల జట్లు పరాజయంపాలయ్యాయి. సింధు నేతృత్వంలోని మహిళల జట్టు 1-3తో ఇండోనేసియా చేతిలో ఓడిపోయింది. జట్టులో సింధు మినహా అందరూ ఓడారు. పురుషుల క్వార్టర్స్‌లో శ్రీకాంత్ సారథ్యంలోని భారత్ 1-3తో చైనా చేతిలో ఓడింది. ఈ పోరులోనూ శ్రీకాంత్ తప్ప అంతా చేతులెత్తేశారు.

### ఫెడ్ కప్‌లో హాంకాంగ్‌పై భారత్ విజయం

**న్యూఢిల్లీ:** ఫెడరేషన్ కప్ మహిళా టెన్నిస్ టోర్నీలో ఎట్టకేలకు భారత్ విజయాన్ని నమోదు చేసింది. తొలుత చైనా, ఆ తరువాత కజకిస్థాన్ చేతిలో ఓడిన భారత జట్టు శుక్రవారం జరిగిన పోరులో 3-0తో హాంకాంగ్‌పై గెలిచింది. తొలి సింగిల్స్‌లో కర్మన్ కౌర్, రెండో సింగిల్స్‌లో అంకిత, డబుల్స్‌లో ప్రార్థన- ప్రాంజల జోడీ ప్రత్యర్థులను ఓడించారు. తదుపరి రౌండ్‌లో భారత్ చైనీస్ తైపీతో శనివారం తలపడుతుంది.

# చారిత్రక ఘట్టం ఆవిష్కృతం

- కలిసి నడిచిన ఉత్తర, దక్షిణ కొరియా
- వింటర్ ఒలింపిక్స్ ఆరంభం



వింటర్ ఒలింపిక్స్ ప్రారంభ వేడుకల్లో జాతీయ పతాకంతో భారత అథ్లెట్ శివ కేశవన్

**ప్యాంగ్‌చాంగ్ (దక్షిణకొరియా) :** మంచు కొండల్లో జరిగే అద్భుత క్రీడా పోటీల వేదిక.. వింటర్ ఒలింపిక్స్ శుక్రవారం అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యింది. ఈ క్రీడలను దక్షిణ కొరియా అధ్యక్షుడు మూన్ జే ఇన్ ప్రారంభించారు. సంయుక్త కొరియా మహిళా హాకీ జట్టు అందించిన కాగడాతో దక్షిణ కొరియా ఫిగర్ స్కేటింగ్ స్వర్ణ పతక మాజీ విజేత కిమ్ యు నా ఒలింపిక్ జ్యోతిని వెలిగించింది. కాగా ఉత్తర కొరియా నియంత కిమ్ జోంగ్ ఉన్ చెల్లెలు కిమ్ యో జింగ్, అమెరికా ఉపాధ్యక్షుడు మైక్ పెన్స్ ముందు వరుసలోనే ఆశీనులయ్యారు. కొన్నేళ్లుగా ఉత్తర, దక్షిణ కొరియాల మధ్య తీవ్ర ఉద్రిక్తత నెలకొన్న విషయం తెలిసిందే. ఆరంభ వేడుకల్లో నీలం-తెలుపు రంగులతో కూడి ఐక్య కొరియా పతాకతో రెండు దేశాల అథ్లెట్లు మార్చ్‌పాస్ట్‌లో పాల్గొనగా స్టేడియం చప్పట్లతో మార్మోగింది.

**భారత పతాకంతో కేశవన్..**

ఇక మార్చ్‌పాస్ట్‌లో స్టార్ లుగెర్ శివ కేశవన్, క్రాస్‌కంట్రీ స్కీయర్ జగదీష్ సింగ్, చెఫ్-డి-మిషన్ హర్జిందర్‌సింగ్‌లతో కూడిన ఆరుగురు సభ్యుల భారత బృందం పాల్గొంది. ఆరో వింటర్ ఒలింపిక్స్‌లో పాల్గొంటున్న కేశవన్.. భారత పతాకతో ముందుకు నడిచాడు.



## అన్ని క్రీడలపైనా ప్రత్యేక దృష్టి

మంత్రి హరీశ్‌రావు

**సిద్దిపేట, ఆంధ్రజ్యోతి:** క్రీడాకారులకు తమ ప్రభుత్వం ఎల్లవేళలా అండగా ఉంటుందని భారీ నీటిపారుదల శాఖ మంత్రి టి. హరీశ్‌రావు అన్నారు. హెచ్‌సీఏ ఆధ్వర్యంలో వెంకటస్వామి స్మారక టీటీఎల్ మ్యాచ్‌లను శుక్రవారం సిద్దిపేటలో మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ, ప్రతీ క్రీడపైనా రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. గ్రామీణ స్థాయిలో క్రీడాకారుల ప్రతిభ వెలికితీసేందుకు ఈ లీగ్ నిర్వహిస్తుండడం అభినందనీయమన్నారు.

## అఫ్రీది సేనదే ఐస్ క్రికెట్ సిరీస్



**సెయింట్ మోరిట్జ్:** వెటరన్ క్రికెటర్ల 'మంచు' సమరాన్ని షాహిద్ అఫ్రీది నేతృత్వంలోని రాయల్స్ జట్టు 2-0తో కైవసం చేసుకుంది. సెహ్వాగ్ సారథ్యంలోని పాలెస్ డైమండ్స్ వరుసగా రెండోమ్యాచ్‌లోనూ ఓడింది. కలిస్ (37 బంతుల్లో 13 ఫోర్లు, 3 సిక్సర్లతో 90 నాటౌట్) చెలరేగి ఆడడంతో రాయల్స్ 8 వికెట్ల తేడాతో డైమండ్స్‌ను చిత్తుగా ఓడించింది. టాస్ నెగ్గి తొలుత బ్యాటింగ్ చేసిన సెహ్వాగ్ సేన 20 ఓవర్లలో ఐదు వికెట్లకు 205 పరుగులు చేసింది. సెహ్వాగ్ (22 బంతుల్లో 9 ఫోర్లు, సిక్సర్‌తో 46)తో పాటు సైమండ్స్ (42 బంతుల్లో 4 ఫోర్లు, 5 సిక్సర్లతో 67 నాటౌట్), కైఫ్ (30 బంతుల్లో 3 ఫోర్లు, 5 సిక్సర్లతో 57) హాఫ్ సెంచరీలతో మెరిశారు. అనంతరం భారీ లక్ష్యాన్ని రాయల్స్ 16.4 ఓవర్లలో రెండు వికెట్లు కోల్పోయి సునాయాసంగా ఛేదించింది. కలిస్ 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్'గా, ఒవైస్ షా 'మ్యాన్ ఆఫ్ ద సిరీస్'గా నిలిచారు.

ఒకే ఒక్క విజయం.. పాతికేళ్ల ఎదురుచూపులకు చరమగీతం పాడనుంది.. దక్షిణాఫ్రికా గడ్డపై పరాభవాలకు సమాధానం ఇవ్వనుంది.. ఎంతో మంది ఆటగాళ్లు కన్న కలలను సాకారం చేయనుంది. సఫారీ నేలపై ఇప్పటిదాకా అందకుండా ఊరిస్తున్న వన్డే సిరీస్ విజయం కోసం భారత జట్టు కేవలం ఒక్క మ్యాచ్ దూరంలోనే ఉంది. ప్రత్యర్థి వెన్నులో గుబులు పుట్టిస్తున్న కోహ్లీ సేన ఇప్పటికే 3-0తో స్పష్టమైన ఆధిక్యంలో ఉంది. అందుకే మరో విజయం చాలు.. జట్టు చిరస్మరణీయ క్షణాలను ఆస్వాదించేందుకు.. అభిమానులు సగర్వంగా తలెత్తుకునేందుకు.. ఇదే లక్ష్యంతో చరిత్రలో మైలురాయిలా నిలిచే గెలుపు కోసం నేడు జరిగే నాలుగో వన్డేలో భారత్ బరిలోకి దిగనుంది.. ఈ విజయంతో భారత జట్టు ఖాతాలో నెంబర్‌వన్ ర్యాంకు కూడా వచ్చి చేరుతుంది.

ఇక అన్ని విభాగాల్లో బలహీనపడిన దక్షిణాఫ్రికాకు డివిల్లీర్స్ ఆశాకిరణంగా మారాడు. ఒంటిచేత్తో మ్యాచ్ స్వరూపాన్ని మార్చి వేయగల సత్తా కలిగిన ఈ స్టార్ బ్యాట్స్‌మన్ ఆఖరి మూడు వన్డేలకు అందుబాటులో ఉండడంతో వారికి ప్రాణాలు లేచి వచ్చినట్టయ్యింది. ఈ మ్యాచ్‌కు ఆతిథ్య జట్టు గులాబీ జెర్సీతో బరిలోకి దిగబోతోంది. ఈ జెర్సీ ఒంటి మీదుంటే శివాలెత్తిపోయే డివిల్లీర్స్‌ను భారత బౌలర్లు ఏమేరకు అడ్డుకుంటారో చూడాలి!

# 'తొలి' సిరీస్ ఊరిస్తోంది!

సాయంత్రం 4.30 గం. నుంచి SONY TEN 1



3 వాండరర్స్ మైదానంలో భారత్ ఏడు మ్యాచ్‌ల్లో ఆడగా మూడుసార్లు గెలిచింది.

5 గులాబీ జెర్సీతో ఆడిన ఐదు మ్యాచ్‌ల్లోనూ దక్షిణాఫ్రికా నెగ్గింది.

100 శిఖర్ ధవన్‌కిది వందో వన్డే.

- దక్షిణాఫ్రికాతో నేడు నాలుగో వన్డే
- గెలిస్తే సిరీస్‌తో పాటు భారత్‌కు నెం.1 ర్యాంకు
- డివిల్లీర్స్‌పైనే ఆతిథ్య జట్టు ఆశలు

**జొహాన్నెస్‌బర్గ్:** వరుస విజయాలతో జోరుమీదున్న భారత్ ఇప్పుడు అత్యంత కీలక మ్యాచ్‌పై కన్నేసింది. 1991-92లో తొలిసారిగా పర్యటించినప్పటి నుంచి ఏ భారత జట్టూ సాధించని వన్డే సిరీస్‌ను దక్కించుకునేందుకు సిద్ధమైంది. ఆరు వన్డేల సిరీస్‌లో భాగంగా శనివారం జరిగే నాలుగో మ్యాచ్‌లో ఆడనుంది. ఈ మ్యాచ్ నెగ్గితే 4-0తో తొలిసారిగా సిరీస్‌ను భారత్ వశం చేసుకుంటుంది. అలాగే వన్డేల్లో టాప్ ర్యాంకు కూడా అధికారికంగా ఖరారవుతుంది. గతంలో 2010-11 టూర్‌లో ధోనీ సారథ్యంలోని భారత జట్టు ఇక్కడ సిరీస్ నెగ్గినట్టే కనిపించింది. ఐదు వన్డేల సిరీస్‌లో మొదట 2-1 ఆధిక్యంలో కొనసాగి ఆ తర్వాత రెండు మ్యాచ్‌లు ఓడింది. ఇప్పుడూ అలాంటి పరిస్థితి రాకుండా ఉండాలంటే ఎలాంటి అలక్ష్యం లేకుండా ప్రత్యర్థిని దెబ్బతీయాల్సి ఉంటుంది. అటువైపు దక్షిణాఫ్రికాకు అతిపెద్ద సాంత్వన.. డివిల్లీర్స్ రాక. తమ వరుస ఓటములకు అతడి మేజికల్ బ్యాటింగ్ అడ్డుకట్ట వేస్తుందనే ఆశతో ఉంది. బ్రెస్ట్ క్యాన్సర్‌పై అవగాహన పెంచే కార్యక్రమంలో భాగంగా సఫారీ జట్టు గులాబీ జెర్సీతో ఈ మ్యాచ్ బరిలోకి దిగనుంది. 2011లో ఈ జట్టు తొలిసారిగా 'పింక్ వన్డే' ఆడింది.



డివిల్లీర్స్

**ఎదురులేని స్థితిలో...:** భారత్‌కు ఈ సిరీస్‌కున్న ప్రాముఖ్యం ఏమిటో బాగానే తెలుసు. అందుకే హ్యాట్రిక్ విజయాలు సాధించినా ఎలాంటి ఏమరుపాటులో లేమని ఓపెనర్ ధవన్ ఇప్పటికే స్పష్టం చేశాడు. ఈ మ్యాచ్‌కూ జట్టులో మార్పులు ఉండకపోవచ్చు. బ్యాటింగ్‌లో కోహ్లీ అదరగొడుతున్నాడు. ఇప్పటికే రెండు సెంచరీలతో హోరెత్తించాడు. ధవన్ ఫామ్ సరేసరి. రోహిత్ ఒక్కడే క్రీజులో కుదురుకునేందుకు ఇబ్బందిపడుతున్నాడు. ఇప్పటిదాకా అతడు చేసిన మొత్తం పరుగులు 35 మాత్రమే.. అయినా అతని స్థానానికి ఢోకా లేనట్టే. మిడిలార్డర్ అంతగా ఆకట్టుకోలేకపోతున్నా కోహ్లీ మాయతో ఇబ్బంది ఎదురవడం లేదు. కానీ ధోనీ, పాండ్యా, జాదవ్ బ్యాట్లను ఝుళిపించాల్సి ఉంది. బౌలింగ్‌లో స్పిన్నర్లు కుల్దీప్, చాహల్ ప్రత్యర్థిని చాపచుట్టేస్తున్నారు. ఇప్పటిదాకా పడిన 28 వికెట్లలో 21 వీరిపేరిటే ఉన్నాయి. పేసర్లు భువనేశ్వర్, బుమ్రా ఈ మ్యాచ్‌లో కూడా రాణిస్తే భారత్‌కు మరో విజయం సులువవుతుంది.

**డివిల్లీర్స్‌పైనే ఆశలు..:** మూడు వన్డేల్లోనూ ఓటములతో నిరాశగా ఉన్న దక్షిణాఫ్రికాను గట్టెక్కించేందుకు డివిల్లీర్స్ రంగంలోకి దిగనున్నాడు. ఈ వన్డేకు అతను ఫిట్‌గా ఉన్నట్టు శుక్రవారం సాయంత్రం టీమ్ మేనేజ్‌మెంట్ ప్రకటించింది. ప్రాక్టీస్‌లో అతను ఇబ్బంది లేకుండా బంతిని హిట్ చేశాడు. వైవిధ్యమైన షాట్లతో క్రికెట్ ప్రపంచాన్ని ఉర్రూతలూగించే ఈ స్టార్ ఆటగాడికి స్పిన్ బౌలింగ్‌ను కూడా దీటుగా ఎదుర్కొనే సత్తా ఉంది. 2015లో జరిగిన పింక్ వన్డేలో విండీస్‌పై డివిల్లీర్స్ వేగవంతమైన (31 బంతుల్లో) శతకంతో రికార్డు సృష్టించాడు. ఓవరాల్‌గా 5 గులాబీ వన్డేల్లో 250 పరుగులు సాధించాడు. ఈ మ్యాచ్‌లో అతడు మూడో నెంబర్‌లో రానున్నాడు. డుమిని నాలుగోస్థానానికి వెళతాడు. మిల్లర్, జోండోలలో ఒకరు బెంచ్‌కే పరిమితం కావాల్సి ఉంటుంది. ఆమ్లా, మార్‌క్రమ్ రాణించాల్సి ఉంది.

### పిచ్, వాతావరణం

సహజంగానే ఇక్కడి పిచ్ భారీ స్కోర్లకు అనుకూలంగా ఉంటుంది. నేటి మ్యాచ్‌లో కూడా బ్యాట్స్‌మెన్ చెలరేగవచ్చు. చిరు జల్లులకు అవకాశమున్నా ఆటకు ఇబ్బందిలేదు.

### జట్లు (అంచనా)

**భారత్:** రోహిత్, ధవన్, కోహ్లీ (కెప్టెన్), రహానె, ధోనీ, జాదవ్, పాండ్యా, భువనేశ్వర్, కుల్దీప్, బుమ్రా, చాహల్.

**దక్షిణాఫ్రికా:** ఆమ్లా, మార్‌క్రమ్ (కెప్టెన్), డివిల్లీర్స్, డుమిని, బెహర్డీన్, మిల్లర్/జోండో, మోరిస్, ఫెహ్లుక్వాయో, రబాడ, మోర్కెల్, తాహిర్.

## క్లీన్‌స్వీప్‌పై అమ్మాయిల గురి

- సౌతాఫ్రికాతో చివరి వన్డే నేడు

**పోచెఫ్‌స్ట్రూమ్:** అదిరిపోయే ఆటతో.. వరుసగా రెండు విజయాలతో సిరీస్‌ను పట్టేసిన భారత అమ్మాయిలు ఇప్పుడు క్లీన్‌స్వీప్‌పై గురిపెట్టారు. సౌతాఫ్రికా మహిళలతో మూడు వన్డేల సిరీస్‌లో భాగంగా శనివారం జరిగే చివరి మ్యాచ్‌లో విజయమే లక్ష్యంగా బరిలోకి దిగుతున్నారు. గత రెండు మ్యాచ్‌ల జోరును కొనసాగిస్తూ.. ఈ వన్డేలోనూ నెగ్గి సఫారీలను 3-0తో వైట్‌వాష్ చేయాలని మిథాలీసేన కృత నిశ్చయంతో ఉన్నది. మహిళల వన్డే చాంపియన్‌షిప్‌లో భాగంగా జరుగుతున్న ఈ సిరీస్‌లో మిథాలీసేన అటు పేస్‌తో పాటు స్పిన్‌తోనూ సఫారీలను ఇబ్బందులకు గురిచేస్తున్నది. గత మ్యాచ్‌తో 200 వికెట్లు ఖాతాలో వేసుకున్న పేసర్ జులన్ గోస్వామి అంతే గొప్పగా సిరీస్‌ను ముగించాలని భావిస్తోంది. బ్యాటింగ్ విభాగం కూడా పటిష్ఠంగా ఉంది. ముఖ్యంగా ఓపెనర్ స్మృతి మంధాన 84, 135 స్కోర్లతో జోరు మీదుండగా.. హర్మన్‌ప్రీత్ కౌర్, వేదా కృష్ణమూర్తి గత మ్యాచ్‌తో ఫామ్‌లోకి వచ్చారు. వీరంతా అదే జోరును కొనసాగిస్తే.. సిరీస్‌ను క్లీన్‌స్వీప్ చేయడం భారత్‌కు కష్టం కాబోదు. మరోవైపు ఇప్పటికే సిరీస్ కోల్పోయి డీలా పడ్డ సౌతాఫ్రికా జట్టు చివరి మ్యాచ్‌లో నెగ్గి పరువైనా దక్కించుకోవాలని కోరుకుంటోంది.

## కోహ్లీపైనే ఆధారపడడం తగదు

(కృష్ణమాచారి శ్రీకాంత్)

కోహ్లీ బ్యాటింగ్ గురించి ఎంత చెప్పినా తక్కువే అవుతుంది. ప్రత్యర్థిగా నేను వివ్ రిచర్డ్స్ బ్యాటింగ్‌ను ఆస్వాదిస్తా. అతడు ఊచకోత మొదలెట్టాడంటే ప్రత్యర్థి చేష్టలుడిగిపోవాల్సిందే. ప్రస్తుతం దక్షిణాఫ్రికా పరిస్థితి కూడా అటువంటిదే. కోహ్లీ విజృంభణకు విలవిలలాడుతోంది. కోహ్లీ క్రీజులో ఉన్నంత సేపు భారత్ స్కోరు 300 తక్కువగా ఊహించలేం. గత రెండు దశాబ్దాలలో భారత్‌కు టెండూల్కర్, ద్రావిడ్, కుంబ్లే వంటి మేటి ఆటగాళ్లు లభించారు. వారి సరసన చేర్చదగిన ఆటగాడు కోహ్లీ. పరిస్థితులు ఎలాంటివైనా పోరాడే తత్వమే అతడిని ఇతరుల కంటే మెరుగ్గా నిలబెడుతోంది. మూడో వన్డేలో కోహ్లీ సాధించిన సెంచరీ సాటిలేనిది. దక్షిణాఫ్రికా పర్యటనలో భారత ఆధిపత్యం నాకు ఆనందాన్ని కలిగిస్తున్నా.. జట్టు ఎక్కువగా కోహ్లీ బ్యాటింగ్‌పైనే ఆధారపడడం ఆందోళనకరం. ఇది అన్నివేళలా సాధ్యం కాకపోవచ్చు. సమష్టిగా రాణిస్తేనే భారత్ మేజర్ టోర్నీలను గెలవగల జట్టుగా నిలబడుతుంది. బౌలింగ్‌లోనూ స్పిన్నర్లే విన్నర్లుగా రాణిస్తున్నారు. ప్రొటీస్ జట్టులో డివిల్లీర్స్ రాక వారిలో స్ఫూర్తిని నింపేదే. అయితే అది భారత సిరీస్ విజయాన్ని ఆపేది కాదని నా భావన. - టీసీఎం



### లంకకు భారీ ఆధిక్యం..

**ఢాకా:** బంగ్లాదేశ్‌తో రెండో టెస్టులో శ్రీలంక రెండోరోజుకే భారీ ఆధిక్యం దక్కించుకొని మ్యాచ్‌పై పట్టు బిగించింది. ఓవర్‌నైట్‌స్కోరు 55/4తో రెండోరోజైన శుక్రవారం ఆట కొనసాగించిన బంగ్లా తొలిఇన్నింగ్స్‌లో 110 పరుగులకే కుప్పకూలింది. 112 పరుగుల ఆధిక్యంతో రెండో ఇన్నింగ్స్ ఆరంభించిన లంక రెండోరోజు ఆట ముగిసేసరికి 8 వికెట్లకు 200 రన్స్ చేసింది. రోషన్ సిల్వ (58), లక్మల్ (7) క్రీజులో ఉన్నారు. మరో మూడు రోజుల ఆట మిగిలున్న మ్యాచ్‌లో లంక ఇప్పటికి 312 పరుగుల ఆధిక్యంతో కొనసాగుతున్నది.

### హైదరాబాద్, ఆంధ్ర విజయం

**హైదరాబాద్, ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి:** విజయ్ హజారే ట్రోఫీలో భాగంగా శుక్రవారం జరిగిన గ్రూప్-డి మ్యాచ్‌లో హైదరాబాద్ 4 వికెట్ల తేడాతో సౌరాష్ట్రపై గెలిచింది. తొలుత సౌరాష్ట్ర నిర్ణీత 50 ఓవర్లలో 7 వికెట్లకు 277 పరుగులు చేసింది. లక్ష్య ఛేదనలో అక్షత్‌రెడ్డి (94), రాయుడు (76) రాణించడంతో హైదరాబాద్ మరో మూడు బంతులు మిగిలి ఉండగానే గెలుపొందింది. గ్రూప్-సి మ్యాచ్‌లో ఆంధ్ర జట్టు ఒక వికెట్ తేడాతో గోవాను ఓడించింది.

# నెలకు 70- 80 వేల ఉపకార వేతనం

- పీఎంఆర్‌ఎఫ్ పథకానికి కేబినెట్ ఆమోదం
- మేధోవలసలకు చెక్ పెట్టడమే లక్ష్యం
- ఏటా 1000 మంది రిసెర్చ్ స్కాలర్లకు కేటాయింపు
- ఐదేళ్లపాటు రిసెర్చ్ గ్రాంటు కింద రూ.2 లక్షలు
- 2018-19 విద్యా సంవత్సరం నుంచి అమల్లోకి

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 9: అమెరికా నుంచి ఆస్ట్రేలియా దాకా.. ఆఫ్రికా నుంచి యూరప్ దాకా చాలా దేశాల్లో మన భారతీయులు తమ ప్రతిభాపాటవాలను ప్రదర్శిస్తున్నారు. ఇది గర్వకారణమే అయినా.. ఈ మేధోవలస కారణంగా మన దేశం ఎంతగానో నష్టపోతోంది. దశాబ్దాలుగా కొనసాగుతున్న ఈ మేధోవలసను ఆపేందుకు మోదీ సర్కారు నడుం బిగించింది. ఐఐటీలు, ఐఐఎస్ఈఆర్‌లు, ఎన్ఐటీల్లోని మన ప్రతిభావంతులకు విదేశాల నుంచి అందే స్కాలర్‌షిప్‌లకు దీటుగా.. భారత్‌లోనే స్కాలర్‌షిప్ ఇచ్చే 'పీఎం రిసెర్చ్ ఫెలోషిప్' పథకానికి కేబినెట్ ఆమోదం తెలిపింది. దీంట్లో భాగంగా మూడేళ్లపాటు ఏటా 1000 మంది విద్యార్థులకు.. పీహెచ్‌డీ కోర్సులు చేసేందుకు వీలుగా నెలకు దాదాపు రూ.70 వేల నుంచి 80 వేల దాకా ఉపకారవేతనం ఇవ్వనున్నారు!! అంతేకాదు.. వార్షిక పరిశోధన గ్రాంటు కింద రూ.2 లక్షల దాకా ఇస్తారు. వచ్చే మూడేళ్లలో ఈ పథకం కింద ఖర్చు చేసేందుకు రూ.1650 కోట్లు కేటాయించింది. 2018-19 విద్యా సంవత్సరం నుంచి ఈ పథకం అమల్లోకి వస్తుంది. అత్యంత అధునాతన శాస్త్ర, పరిశోధన రంగాల్లో మన యువత దేశీయంగా పరిశోధనలు కొనసాగించేందుకు ఈ పథకం ఎంతగానో ఉపయోగపడుతుందని కేంద్ర మంత్రి ప్రకాశ్ జావడేకర్ అన్నారు. ఈ పథకం కింద చేసే పరిశోధనలు మన దేశ ప్రాధాన్యాల అనుగుణంగా ఉంటాయని.. అదే సమయంలో దేశంలోని ఉన్నత విద్యా సంస్థల్లో నాణ్యమైన ఫెకల్టీ అందుబాటులోకి వస్తుందని ఆయన పేర్కొన్నారు. కేంద్రం ప్రారంభించిన ఈ పథకంలో భాగంగా స్కాలర్‌షిప్ పొందాలంటే.. విద్యార్థులకు క్యుములేటివ్ గ్రేడ్ పాయింట్ యావరేజ్ (సీజీపీఏ) 8.5గా ఉండాలి. ఈ పథకం కింద.. బీటెక్ చివరి సంవత్సరంలో ఉన్నవారికి, పూర్తిచేసినవారికి, ఇంటిగ్రేటెడ్ ఎంటెక్, ఎమ్మెస్సీ (సైన్స్ అండ్ టెక్నాలజీ) పూర్తిచేసినవారికి వారి అర్హతలను బట్టి ఐఐటీలు, ఐఐఎస్సీల్లో పీహెచ్‌డీ చేసేందుకు ప్రవేశార్హత కల్పిస్తారు. పథకానికి అర్హులైనవారికి తొలి రెండేళ్లు రూ.70 వేలు ఫెలోషిప్‌గా ఇస్తారు. మూడో సంవత్సరంలో రూ.75 వేలు, నాలుగు, ఐదు సంవత్సరాల్లో రూ.80 వేలు ఇస్తారు. అంతర్జాతీయ కాన్ఫరెన్స్‌ల్లో, సెమినార్లలో తమ పరిశోధన పత్రాలను సమర్పించడానికి అవసరమైన ప్రయాణ, ఇతరత్రా ఖర్చుల నిమిత్తం ఐదేళ్లపాటు అదనంగా రూ.2 లక్షల రిసెర్చ్ గ్రాంటు ఇస్తారు.



## ముక్కెరపై ముచ్చట

- ముక్కు కుట్టించుకున్న అమెరికా జడ్జిలు

చెన్నై, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): భారతీయ సంస్కృతి, సంప్రదాయాలు ఇప్పటికీ పాశ్చాత్యుల్ని ఆకట్టుకుంటూనే ఉన్నాయి. తమిళనాడులో ఆధ్యాత్మిక పర్యటనకు వచ్చిన అమెరికాకు చెందిన ఇద్దరు మహిళా న్యాయమూర్తులు తమిళ సంస్కృతి సంప్రదాయాలకు ముగ్ధులైపోయారు. తంజావూరు జిల్లా కుంభకోణంలో ముక్కుపుడకలు ధరించిన మహిళలను చూసి ముచ్చటపడ్డారు. వెంటనే స్థానిక నగల దుకాణానికి వెళ్లి ముక్కు కుట్టించుకుని, బంగారు ముక్కెరలను కొనుగోలు చేసి ధరించారు. అమెరికా విశ్వవిద్యాలయానికి చెందిన యోగా శిక్షకురాలు ఆండ్రస్ నోరేముల్ నేతృత్వంలో ఆ దేశానికి చెందిన ఇద్దరు మహిళా న్యాయమూర్తులు.. ఎనిమిది మంది పరిశోధక విద్యార్థినులు శుక్రవారం కుంభకోణంలోని ఆలయాలను సందర్శించారు. వీరిలో ఇద్దరు న్యాయమూర్తులు, మరో యువతి ముక్కు, చెవులు కుట్టించుకున్నారు. చెవులకు అందమైన జుమికీలు అలంకరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. జుమికీలు, ముక్కెరలు ధరించిన తర్వాత తమ అందం ద్విగుణీకృతమైందని చెప్పారు.

# మే 6న 'నీట్'

- నోటిఫికేషన్ విడుదల.. జూన్ 5వ తేదీన ఫలితాలు
- శుక్రవారం నుంచి అందుబాటులో దరఖాస్తులు

అమరావతి, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): ఎంబీబీఎస్, బీడీఎస్ సీట్ల భర్తీకి సెంట్రల్ బోర్డు ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ (సీబీఎస్‌సీ) శుక్రవారం నీట్ - 2018 నోటిఫికేషన్ విడుదల చేసింది. మే 6న నీట్ పరీక్షను నిర్వహించనుంది. జూన్ 5న పరీక్షా ఫలితాలు విడుదల కానున్నాయి. తెలుగు, తమిళం, కన్నడ, ఇంగ్లిష్, హిందీతో పాటు తొమ్మిది భాషాల్లో ప్రశ్న పత్రాన్ని అందించనుంది. అభ్యర్థులు దరఖాసు సమయంలోనే వారి భాషను ఎంపిక చేసుకోవచ్చు. 12వ తరగతి పాసైన వారు నీట్ రాయడానికి అర్హులు. 17-25 మధ్య వయసువారై ఉండాలి. ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ అభ్యర్థులకు 5 ఏళ్ల మినహాయింపు ఉంటుంది. జనరల్, ఓబీసీ అభ్యర్థులు రూ.1400 దరఖాస్తు రుసుం చెల్లించాలి. ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగ అభ్యర్థులు రూ.750 చెల్లిస్తే సరిపోతుంది. దరఖాస్తులను మార్చి 9 వరకు ఆన్‌లైన్‌లో చేసుకోవచ్చు. దరఖాస్తులో మార్పులకు నాలుగు రోజులు (మార్చి 12-16) అవకాశం ఉంటుంది. ఏప్రిల్ రెండో వారంలో హాల్‌టికెట్లును డౌన్‌లోడ్ చేసుకోవచ్చు.

## భారత్‌కు కచ్చిత సమయం!

- 100కోట్లతో త్వరలో ప్రాజెక్టు: కేంద్రం




న్యూఢిల్లీ, ఫిబ్రవరి 9: భారత ప్రామాణిక కాలమానం (ఐఎస్‌టీ).. భారతీయులంతా పాటించే సమయం. కానీ, ఏది కచ్చిత సమయమో ఇప్పటికీ సరిగా తెలీదు. రైల్వే స్టేషన్‌కు వెళితే ఒకలా.. బ్యాంకులకు వెళితే మరోలా.. వాతావరణ శాఖకు వెళితే ఇంకోలా.. టీవీ చానళ్లలో వేరేలా ఉంటాయి. వాటిని పోల్చి చూస్తే కనీసం ఐదు నుంచి పది నిముషాల వ్యత్యాసం ఉంటుంది. దీని వల్ల పలు సమస్యలు ఉత్పన్నమవుతున్నాయని భావించిన కేంద్రం ఐఎస్‌టీ కచ్చిత సమయాన్ని దేశవ్యాప్తంగా ఒకేలా చేసేందుకు రూ.100కోట్లతో ప్రాజెక్టును చేపట్టాలని నిర్ణయించింది. త్వరలోనే ప్రారంభించనున్న ఈ ప్రాజెక్టులో భాగంగా ప్రస్తుతం ఉన్న ఐదు ప్రాంతీయ ల్యాబ్ (అహ్మదాబాద్, బెంగళూరు, భువనేశ్వర్, ఫరీదాబాద్, గువహటి)లలో మౌలిక సదుపాయాలను మెరుగుపర్చనుంది. కొత్తగా మరో రెండు ల్యాబ్‌లను ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. ఇందుకోసం తాజా బడ్జెట్‌లో రూ.20 కోట్లు కేటాయించారని కేంద్ర వినియోగదారుల వ్యవహారాల శాఖ కార్యదర్శి అవినాశ్ శ్రీవాస్తవ తెలిపారు. ఈ నిర్ణయం దేశభద్రతకు, సైబర్ నేరాల దర్యాప్తునకు ఉపయోగపడుతుందని చెప్పారు.

## 'నాథూ లా' మార్గంలో మానస సరోవర యాత్ర

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 9: కైలాస మానస సరోవర యాత్రకు వెళ్లే భారతీయులకు అత్యంత కీలకమైన 'నాథూ లా' మార్గాన్ని తిరిగి అందుబాటులోకి తీసుకురానున్నట్లు చైనా ప్రకటించింది. గత ఏడాది డోక్లాంలో ఉద్రిక్తత నేపథ్యంలో.. ఆ దేశం ఈ మార్గాన్ని మూసివేసిన విషయం తెలిసిందే. గత ఏడాది డిసెంబరులో చైనాతో జరిగిన చర్చల్లో భాగంగా.. ఈ మార్గంలో యాత్రికుల అనుమతిని ప్రధానంగా ప్రస్తావించామని విదేశీ వ్యవహారాల శాఖ సహాయ మంత్రి వీకే సింగ్ ఇటీవల లోక్‌సభకు తెలిపారు.

## యూపీలో మార్చి11న ఉప ఎన్నికలు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 9: ఉత్తరప్రదేశ్, బిహార్‌లలో ఉప ఎన్నికలను మార్చి 11న నిర్వహించనున్నట్లు ఎన్నికల కమిషన్ (ఈసీ) ప్రకటించింది. యూపీ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ ఖాళీ చేసిన గోరఖ్‌పూర్, ఉప ముఖ్యమంత్రి కేశవ్ ప్రసాద్ మౌర్య రాజీనామా చేసిన ఫూల్‌పూర్ లోక్‌సభ స్థానాలతోపాటు బిహార్‌లోని అరరియా లోక్‌సభ సీటుకు పోలింగ్ జరుగనుంది. అరారియాలో ఆర్‌జేడీ ఎంపీ మహ్మద్ తస్లిముద్దీన్ మరణంతో ఉప ఎన్నిక అనివార్యమైంది. ఈ మూడు స్థానాలకు ఈ నెల 13న నోటిఫికేషన్ జారీ కానుంది. 20వ తేదీ వరకు నామినేషన్ల పర్వం కొనసాగుతుంది. మర్నాడు వాటి పరిశీలన.. 23లోపు నామినేషన్లు ఉపసంహరణకు అవకాశమిస్తారు. మార్చి 11న పోలింగ్ జరుగుతుంది. మార్చి 14న ఓట్ల లెక్కింపు, ఫలితాల ప్రకటన ఉంటాయి.

## ఉగ్రవాదికి ఏడేళ్ల జైలుశిక్ష

బెంగళూరు, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): పాకిస్థాన్‌కు చెందిన లష్కర్-ఏ-తాయిబా ఉగ్రవాది బిలాల్ అహమ్మద్ కూట అలియాస్ ఇమ్రాన్ జలాల్‌కు బెంగళూరు కోర్టు ఏడేళ్ల జైలుశిక్ష, రూ. 50వేల జరిమానా విధించింది. 2007లో బెంగళూరులో అనుమానాస్పదంగా పట్టుబడిన బిలాల్ నుంచి పోలీసులు ఒక రైఫిల్, 200 బుల్లెట్లు, 5 హ్యాండ్ గ్రనేడ్‌లు, శాటిలైట్ ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు. భారత్‌కు వ్యతిరేకంగా పోరాటం చేసేందుకు ఎల్ఈటీ ఉగ్రవాద సంస్థకు అనుకూలంగా పని చేస్తున్నట్లు విచారణలో నిందితుడు అంగీకరించాడు. దీంతో పీఎంఎల్ఈ ప్రత్యేక న్యాయస్థానం జడ్జి శివశంకర్ అమరణ్ణ గురువారం తీర్పునిచ్చారు.

## డ్రైవింగ్ లైసెన్స్‌కు నివాస ధ్రువీకరణగా ఆధార్

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 9: డ్రైవింగ్ లైసెన్స్‌కు దరఖాస్తు చేసుకునే వారు ఇకపై వయస్సు, నివాస ధ్రువీకరణ పత్రాలుగా ఆధార్‌ను జత చేయొచ్చు. ఈ మేరకు కేంద్ర ప్రభుత్వం ముసాయిదాను సిద్ధం చేసింది. కేంద్ర మోటారు వాహన నిబంధనల సవరణలో భాగంగా.. డ్రైవింగ్ లైసెన్స్ దరఖాస్తు ఫారంలో.. ఆధార్‌కూ స్థానం కల్పించనుంది. ఈ వివరాలను కేంద్ర న్యాయశాఖ మంత్రి రవి శంకర్ ప్రసాద్ రాజ్యసభకు తెలిపారు.

## రిజిజుపై రేణుక సభాహక్కుల తీర్మానం

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 9: ఫేస్‌బుక్ పోస్ట్ పెట్టి తనను అవమానించడాన్ని నిరసిస్తూ కాంగ్రెస్ ఎంపీ రేణుకా చౌదరి.. కేంద్ర మంత్రి కిరణ్ రిజిజుపై రాజ్యసభలో.. సభా హక్కుల ఉల్లంఘన తీర్మానం ప్రవేశపెట్టారు. రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై చర్చలో ప్రధాని సమాధానమిస్తుండగా రేణుక పెద్దపెట్టున నవ్వారు. దీనిపై రిజిజు తన ఫేస్‌బుక్‌లో ఈ ఘటనను ప్రస్తావిస్తూ.. 'రామాయణ్' సీరియల్‌లోని శూర్పణఖ పగలబడి నవ్వుతూ ఉన్న వీడియో క్లిప్‌ను పోస్టు చేయడం వివాదాస్పదమయ్యింది.

## రైతు కుటుంబం శ్రమనూ కలుపుతారు: జైట్లీ

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 9: పంటలకు కనీస మద్దతు ధరను నిర్ణయించే సమయంలో పెట్టుబడి వ్యయంలో రైతు కుటుంబం పడే శ్రమను కూడా పరిగణనలోకి తీసుకుంటామని ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ ప్రకటించారు. ఒకటిన్నర రెట్లు మద్దతు ధరలో.. పెట్టుబడి వ్యయాన్ని ఎలా లెక్కిస్తారో తేల్చాలని విపక్షాలు డిమాండ్ చేశాయి. దానిపై మంత్రి రాజ్యసభలో వివరణ ఇచ్చారు. సాగు కోసం రైతు చెల్లించిన మొత్తం సొమ్ము విలువ, రైతు కుటుంబం శ్రమ(ఏ2+ఎఫ్ఎల్) కలిపి, దానికి 50 శాతం చేర్చి.. మద్దతు ధర నిర్ణయిస్తామన్నారు. నగదు రూపంలోనే కాకుండా వస్తు రూపంలో చెల్లించిన మొత్తం కూడా పెట్టుబడి వ్యయంగా పరిగణిస్తామన్నారు. ఆర్థిక మంత్రి చెప్పిన విధానం ప్రకారం మద్దతు ధరలు 8 నుంచి 47 శాతం మేర పెరిగే అవకాశం ఉందని నీతి ఆయోగ్ సభ్యుడు రమేశ్ చంద్ చెప్పారు.

# నిజాలు తేల్చాల్సిందే

- సీబీఐ జడ్జి లోయా మృతిపై విపక్షాల ఐక్యగళం
- సిట్ విచారణ జరపాలని రాష్ట్రపతికి 114 మంది విపక్ష ఎంపీల వినతి


రాష్ట్రపతి కోవింద్‌ను కలిసి వస్తున్న రాహుల్‌గాంధీ, ఇతర రాజకీయపక్షాల నేతలు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 9: సీబీఐ జడ్జి బీహెచ్ లోయా అనుమానాస్పద మృతిపై సుప్రీం కోర్టు పర్యవేక్షణలో ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని(సిట్) నియమించి.. విచారణ జరిపించాలని ప్రతిపక్షాలు రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్‌కు విజ్ఞప్తి చేశాయి. ఈ మేరకు 114మంది విపక్ష ఎంపీలు తమ సంతకాలతో కూడిన లేఖను రాష్ట్రపతికి శుక్రవారం అందజేశారు. కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీ నాయకత్వంలో 15 రాజకీయ పక్షాల నేతలు రాష్ట్రపతిని కలిసి.. ఈ వ్యవహారంపై నిష్పక్షపాతంగా దర్యాప్తు జరగాల్సి ఉందని ఆయనకు విన్నవించారు. తృణమూల్ కాంగ్రెస్, సీపీఎం, డీఎంకే, ఆప్, ఎస్పీ, ఎన్‌సీపీ, ఆర్జేడీ లతో పాటు మరికొన్ని పార్టీల ఎంపీలూ సంతకాలు చేశారు. బీఎస్పీ మాత్రం సంతకం చేయలేదు. "జడ్జి లోయా మృతిపై అనేక సందేహాలున్నాయి.. ఆయనొక్కరే కాదు. తనకు బెదిరింపులు, ఒత్తిళ్లు వస్తున్నాయని లోయా ఇద్దరు వ్యక్తులకు చెప్పారు. వారు కూడా అనుమానాస్పద పరిస్థితుల్లో మరణించారు. వారిలో ఒకరు న్యాయవాది శ్రీకాంత్ ఖండాల్కర్. 2015లో డిస్ట్రిక్ట్ కోర్టు ఆరో అంతస్తు నుంచి జారి పడి మృతి చెందారు. రెండో వ్యక్తి జిల్లా జడ్జి ప్రకాష్ తాంబ్రే! 2016లో ఆయన రైల్లో ప్రయాణిస్తుండగా పైబెర్తు నుంచి జారి పడి.. వెన్నుపూస విరిగిపోయి మరణించారు. ఈ మరణాలకూ లోయా మృతికీ సంబంధం ఉందన్నది అనేకమంది అనుమానం" అని సీనియర్ లాయర్, కాంగ్రెస్ నేత కపిల్ సిబాల్ మీడియాకు తెలిపారు. సిట్ విచారణ జరిగితేనే వాస్తవాలు వెలుగు చూస్తాయన్నారు. ఉగ్రవాది సొహ్రబుద్దీన్ షేక్, ఆయన భార్య కౌసర్‌బీ, స్నేహితుడు తులసీరామ్ ప్రజాపతి వేరువేరు చోట్ల ఎన్‌కౌంటర్లలో మరణించిన కేసులను విచారిస్తున్న సమయంలో- 2014లో నాగ్‌పూర్‌లో ఓ వివాహానికి వెళ్లిన లోయా అక్కడే గుండెపోటుతో మరణించారు. సొహ్రబుద్దీన్ ఎన్‌కౌంటర్‌లో బీజేపీ అధ్యక్షుడు అమిత్ షా ఒక నిందితుడు. లోయా మరణించిన వారం రోజులకే- ఆయన స్థానంలో వచ్చిన కొత్త జడ్జి- అమిత్ షా ను నిర్దోషిగా విడుదల చేయడం అనేక అనుమానాలకు తావిచ్చింది. అదీగాక- లోయాకు అనేక బెదిరింపులు వచ్చాయని, ఆయన మానసికంగా చాలా కలత చెందారని, ఖచ్చితంగా ఆయనది సహజ మరణం కాదని లోయా సోదరి- కారవాన్ అనే మ్యాగజైన్‌కిచ్చిన ఇంటర్వ్యూ మొత్తం కథను తిరగదోడింది. అమిత్ షా మీద అందరి దృష్టి పడింది. తన తండ్రిది సహజమరణమేనని, తాము దాన్ని గుండెపోటుగానే భావిస్తున్నామని లోయా కుమారుడు ఓ ఇంటర్వ్యూలో చెప్పినప్పటికీ - కేసు పూర్తిగా రాజకీయ రంగు పులుముకుంది. దీనిపై రెండు ప్రజాహిత దావాలుదాఖలయ్యాయి. కాంగ్రెస్ ఈ అంశాన్ని పూర్తిస్థాయిలో ప్రచారాస్త్రం చేయాలని నిర్ణయించుకొని దాడిని ముమ్మరం చేయడంతో ఇది ఇంకా కీలకంగా మారింది. లోయా మృతికి దారితీసిన పరిస్థితులపై సిట్ విచారణకు ఆదేశించాలంటూ సుప్రీం కోర్టులో ఓ పిటిషన్ కూడా దాఖలయ్యింది. దీనిని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ దీపక్ మిశ్రా నేతృత్వంలోని బెంచ్ శుక్రవారం నాడే విచారణకు స్వీకరించింది. విచారణ ఈ నెల 12కి వాయిదా పడింది. లోయా పోస్ట్‌మార్టమ్ నివేదికను తమకు అందించాలని మహారాష్ట్ర ప్రభుత్వాన్ని సుప్రీం కోర్టు ఆదేశించింది. లోయా మృతిపై స్వతంత్ర విచారణ లేదా సిట్ చేత దర్యాప్తు జరపాలంటూ దాఖలైన ప్రజాహిత దావాలను తాము వ్యతిరేకిస్తున్నట్లు మహారాష్ట్ర ప్రభుత్వం సుప్రీంకోర్టుకు తెలిపింది.

## రాఫెల్‌పై రాహుల్ మరో దాడి


- జైట్లీని.. జైట్ లై అని సంబోధించిన వైనం



న్యూఢిల్లీ, ఫిబ్రవరి 9: రాఫెల్ యుద్ధ విమానాల కొనుగోలు వ్యవహారంపై కాంగ్రెస్ మరో అస్త్రం సంధించింది. దేశ భద్రతకు సంబంధించిన ఈ యుద్ధవిమానాల కొనుగోలు ఖర్చు వివరాలను వెల్లడించడం కుదరదని, కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీ ఈ విషయంలో నాటి రక్షణ మంత్రులు - ప్రణబ్ ముఖర్జీ, ఏకే ఆంటోనీల నుంచి నేర్చుకోవాలని, వారు 15 సార్లు ఇందుకు సంబంధించిన అభ్యర్థనలను తిరస్కరించారని గురువారం పార్లమెంట్‌లో అరుణ్ జైట్లీ అన్న మాటలకు దీటుగా ప్రతిస్పందించింది. 2013లో మిరేజ్-2000 తరహా యుద్ధవిమానాలు, గోర్షకొవ్ యుద్ధనౌకల కొనుగోలుకు సంబంధించి- నాటి రక్షణమంత్రి ఏకే ఆంటోనీ- పార్లమెంట్‌లో వచ్చిన మూడు ప్రశ్నలకు ఇచ్చిన మూడు సమాధానాల్ని కాంగ్రెస్ బయటపెట్టింది. అందులో వాటికి ఎంతెంత ఖర్చయ్యిందీ, ప్రభుత్వం ఎలా బేరసారాలు జరిపినదీ వివరంగా ఉంది. 'యూపీఏ ఎన్నడూ ఈ వివరాలను బయటపెట్టలేదని మీరు అన్నారు. మీరు చెప్పినది అబద్ధం అని తెలియజెప్పే సాక్ష్యాలివిగో.. ఇకనైనా మీ రక్షణ మంత్రిని చెప్పమనండి. రాఫెల్ యుద్ధవిమానం ఒక్కోదానికీ ఎంత ఖర్చయ్యిందో!" అని రాహుల్ నిలదీశారు. "వీటిపై ఏం సమాధానమిస్తారు మిస్టర్ అరుణ్ జైట్‌లై?" అని ప్రశ్నించారు. ఈ సంబోధనపై బీజేపీ రాజ్యసభ సభ్యుడు భూపేందర్ యాదవ్ రాహుల్‌పై సభా హక్కుల ఉల్లంఘన తీర్మానం పెట్టారు. దీనికి రాజ్యసభ చైర్మన్ వెంకయ్యనాయుడు 'ప్రాథమికంగా చూస్తే ఇది కరెక్టేనని అనిపిస్తోంద'ని నోట్ రాసి - లోక్‌సభ స్పీకర్‌కు పంపారు. డిసెంబరు 27న కూడా రాహుల్- జైట్లీని.. 'జైట్ లై' అన్న విషయం తెలిసిందే.

# సెలవుకు మోదీ సెలవు

## యోగాసనం, శాకాహారం, మంచి నిద్ర...ఇవే రొటీన్!



న్యూఢిల్లీ, ఫిబ్రవరి 9: ఏళ్ల తరబడి సెలవనేదే ఎరుగని వ్యక్తి ఎవరు? అలాంటి వారు జపాన్‌లోనే ఉంటారా?....... ఈ ప్రశ్నలకు ప్రధాని మోదీ సమాధానం ఇచ్చారు... "గత కొన్ని సంవత్సరాలుగా- అంటే సుమారు ఇరవయ్యేళ్లుగా ఆయన సెలవనేదే పెట్టలేదట. "సెలవు అంటే నాకు తెలియదు. గుజరాత్ ముఖ్యమంత్రిగా పనిచేసినపుడు లేదా ప్రధాని అయ్యాక నేనెన్నడూ హాలీ డే అన్నదే తీసుకోలేదు. పండగైనా పబ్బమైనా, ఆప్తులు పిలిచినా, ఆరోగ్యం బాగులేకపోయినా.. నేను సెలవు పెట్టలేదు. పని మానలేదు. పని చేసుకోవడం నాకు ఇష్టం.." అని మోదీ వెల్లడించారు. గల్ఫ్ దేశాల్లో పర్యటనకు వెళ్లే ముందు ఆయన గల్ఫ్ న్యూస్ ఎక్స్‌ప్రెస్‌కు ఈమెయిల్ ఇంటర్వ్యూ ఇచ్చారు. "పనిలో భాగంగా నేను విస్తృతంగా ప్రయాణం చేయాల్సి వచ్చేది. గుజరాత్‌లో అయితే దాదాపు ప్రతీ జిల్లా, పట్టణం, అణువణువూ తిరిగాను. ఎంతో మందితో మంచీ చెడ్డా మాట్లాడేవాణ్ణి. అలాగే ప్రధాని కాకమునుపూ, అయ్యాక కూడా దేశమంతా పర్యటించాను. ప్రజల ఆశలు, బాధలు, ఆకాంక్షలు..అన్నీ తెలుసుకుంటూ వచ్చాను. స్థానికంగా పాప్యులరైన వంటకాలూ రుచి చూసేవాణ్ణి.. ఇవన్నీ నాకు కొత్త ఉత్సాహాన్నిచ్చేవి.. సెలవు తీసుకోవాలన్న ధ్యాసే లేకుండా చేశాయి" అని ఆయన ఆ ఇంటర్వ్యూలో పేర్కొన్నారు. మోదీ విదేశీ పర్యటనలకు వెళ్లినపుడు వంటవారు ఎవరూ వెళ్లరు. "తీసికెళ్లడం నాకు ఇష్టం ఉండదు. నేను ఆ యా దేశాల్లో చేసే వంటకాలనే రుచి చూస్తాను" అని వివరించారు. ఎలాంటి ఆహారం ఇష్ట పడతారన్న ప్రశ్నకు- నేను మరీ అంత భోజనప్రియుణ్ణి కాదు.. చాలా మామూలు శాకాహార భోజనాన్ని ఇష్టపడతాను...కూరగాయలు, పళ్లు ముఖ్యంగా ఉండాలి.. అని మోదీ బదులిచ్చారు. మోదీ ఉదయాన్నే యోగా చేస్తారని అందరికీ తెలిసిన విషయం.. "యోగా చేయడం, ఆసనాలు వేయడం మాత్రమే కాదు. నేను ఉదయం లేవగానే పేపర్లు చూస్తాను. నా ఈమెయిల్ చెక్ చేస్తాను. కొన్ని ముఖ్యమైన వాటికి సమాధానాలు పంపుతాను. కొందరు ముఖ్యులతో ఫోన్లో మాట్లాడతాను. మోదీ మొబైల్ యాప్‌ను చెక్ చేసి అందులో పౌరుల సూచనలు, సలహాలు నోట్ చేసుకుంటాను..." అని వెల్లడించారు. మరి రాత్రి పడుకునేముందు ఏం చేస్తారన్న ప్రశ్నకు- 'ముఖ్యమైన డాక్యుమెంట్లు, ఫైళ్లు తిరగేస్తాను.. వీలైనవి క్లియర్ చేస్తాను. మరుసటి రోజు ఎంగేజ్‌మెంట్స్, చేయాల్సిన పనులనూ సిద్ధం చేసుకుంటాను. నాకు నాలుగు నుంచి ఆరుగంటల నిద్ర అవసరం. ఆ నిద్ర సంపూర్ణంగా ఉంటుంది... డీప్ స్లీప్ అనమాట" అని ఆయన చెప్పుకొచ్చారు. వారంలో ఏ రోజు ముఖ్యమైనదన్న ప్రశ్నకు- 'వారంలో ఈరోజు నాకు ముఖ్యమైనది అని ప్రతీరోజూ అనుకుంటాను' అని బదులిచ్చారు.

### మాల్దీవుల సంక్షోభంపై మోదీకి ట్రంప్ ఫోన్

వాషింగ్టన్, ఫిబ్రవరి 9: మాల్దీవుల్లో తలెత్తిన పరిస్థితిపై భారత్, అమెరికా ఆందోళన వ్యక్తం చేశాయి. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ శుక్రవారం ప్రధాని మోదీకి ఫోన్ చేసి ఈ అంశంపై చర్చించారు. ప్రజాస్వామ్య వ్యవస్థలను, చట్టబద్ధ పాలనను గౌరవించడం ఎంతో ముఖ్యమని ఇరువురు నేతలూ పునరుద్ఘాటించారు. ఈ ఏడాది వీరిద్దరి మధ్య ఇదే తొలి ఫోన్‌కాల్. అఫ్ఘాన్, ఇండో-పరిఫిక్ ప్రాంతాల్లో భద్రతా పరిస్థితులపైనా వీరు చర్చించారు.

### నేడు పాలస్తీనాకు ప్రధాని

అమ్మాన్, ఫిబ్రవరి 9: మూడు అరబ్ దేశాల పర్యటనలో భాగంగా ప్రధాని మోదీ శనివారం పాలస్తీనా వెళుతున్నారు. దశాబ్దాలుగా సంక్షుభితంగా ఉన్న ఈ గడ్డపై అడుగుపెడుతున్న తొలి భారత ప్రధాని మోదీయే! ఆయన శుక్రవారం రాత్రి జోర్డాన్ రాజధాని అమ్మాన్ చేరుకుని రాజు అబ్దుల్లాతో చర్చలు జరిపారు. పాలస్తీనా తరువాత మోదీ.. యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్, ఒమాన్‌లలోనూ పర్యటిసారు. వాణిజ్య సంబంధాలను పటిష్టం చేసుకోవడమే పర్యటన లక్ష్యం.


శుక్రవారం బీజేపీ పార్లమెంటరీ సమావేశంలో ప్రధాని మోదీ, పార్టీ అధ్యక్షుడు అమిత్‌షా, హోంమంత్రి రాజ్‌నాథ్‌సింగ్, సీనియర్ నేత ఎల్‌కే అద్వాణీ

## ఇక బీజేపీ 'లంచ్ పే చర్చా'

- ప్రజల్లోకి వెళ్లి వాస్తవాల్ని వివరించండి
- ఎంపీలకు మోదీ, అమిత్ షా ఉద్బోధ

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి ): గత సార్వత్రిక ఎన్నికల సమయంలో "చాయ్ పే చర్చా" పేరిట తన ఆలోచనలు, చేపట్టబోయే పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసికెళ్లిన ప్రధాని నరేంద్ర మోదీ ఈ సారి లంచ్‌కు మారారు. గ్రామాల్లో, పట్టణాల్లో 'లంచ్ పే చర్చా' పేరిట బడ్జెట్‌లో పేర్కొన్న పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి ప్రచారం చేయాలని పార్టీ నేతలకు సూచించారు. పార్లమెంట్ బడ్జెట్ తొలి విడత సమావేశాలు ముగిశాక.. శుక్రవారం బీజేపీ పార్లమెంటరీ పార్టీ సమావేశంలో మాట్లాడిన మోదీ- ఎంపీల ప్రచారం మీదే 2019లో పార్టీ విజయం ఆధారపడి ఉంటుందన్నారు. 'వారణాసిలో నేను ప్రజలతో లంచ్ సమయంలో పార్టీ కార్యకర్తలతో వివిధ అంశాలపై చర్చించాను. అక్కడికి నా టిఫిన్ బాక్స్ నేనే తెచ్చుకున్నాను. అంచేత మీరు కూడా ప్రతీ అసెంబ్లీ నియోజకవర్గంలో మధ్యాహ్న భోజన సమయంలో సమావేశాలు నిర్వహించాలి.. మీ భోజనం మీరే తీసుకెళ్లాలి... అది సహజంగా జరిగేట్లుండాలి.. మనమేదో భోజనం పెట్టి పథకాల గురించి ప్రచారం చేసినట్లుండకూడదు' అని సూచించారు. బీజేపీపై వస్తున్న ఆరోపణలకు అంశాల వారీగా గట్టిగా సమాధానం ఇవ్వాలని మోదీ కోరారు. కేంద్ర బడ్జెట్ మధ్యతరగతి వర్గాలకు, రైతులకు ఎంతో అనుకూలంగా ఉన్నదని.. ప్రజలకు వివరించి చెప్పాలని మోదీ సూచించారు. ఆయుష్మాన్ భారత్ పథకాన్ని కూడా విస్తృతంగా ప్రజల్లోకి తీసికెళ్లాలన్నారు. రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై ప్రధానమంత్రి ప్రసంగిస్తున్నపుడు- కాంగ్రెస్ సభ్యులు అడ్డుకోవడం సరికాదని బీజేపీ అధ్యక్షుడు అమిత్ షా అన్నారు. కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీ అప్రజాస్వామిక వైఖరికి ఇది నిదర్శనమన్నారు. రాఫెల్ యుద్ధ విమానాల ఒప్పందం గురించి రాహుల్ చేస్తున్న విమర్శలను తిప్పిగొట్టాలని ఆయన ఎంపీలను కోరారు. దేశ భద్రతా కారణాల రీత్యా అన్ని వివరాలూ బయటపెట్టలేమన్నారు.

## చిరుత దాడిలో చిన్నారి మృతి


సైదులు (ఫైల్)

చెన్నై, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): ఇంటిముందు ఆడుకుంటున్న నాలుగేళ్ల చిన్నారిని చిరుత ఎత్తుకెళ్లి చంపింది. తమిళనాడులోని కోయంబత్తూరు జిల్లా వాల్పారై సమీపంలోని నడుమలై తేయాకు ఎస్టేట్‌లో ఈ ఘటన వెలుగు చూసింది. అసోంకు చెందిన ముసాఫర్ అలీ, షఫీ దంపతులకు సయ్యద్ బాబు(4) అనే కుమారుడున్నాడు. గురువారం రాత్రి ఇంటిముందు బాబుకు స్నానం చేయించిన తల్లి, తువ్వాలు తెచ్చేందుకు ఇంట్లోకి వెళ్లింది. ఆమె బయటకు వచ్చేటప్పటికి బిడ్డ కనిపించలేదు. తోటి కూలీలతో కలిసి వెతగ్గా కిలోమీటరు దూరంలో చిన్నారి తల, మొండెం వేర్వేరుగా పడి ఉన్నాయి. చిరుతను కాల్చివేయాలని బంధువులు డిమాండ్ చేశారు.

## బాబ్రీ మసీదు.. మరో చోటికి!

**తరలిద్దామన్న ముస్లిం బోర్డు సభ్యుడు.. రవిశంకర్‌తో భేటీలో సూచన**

బెంగళూరు, ఫిబ్రవరి 9: అయోధ్యలో రామజన్మభూమి-బాబ్రీ మసీదు వివాదం కీలక మలుపు తిరిగింది. బాబ్రీ మసీదును వేరే చోటకు తరలిద్దామని అఖిల భారత ముస్లిం పర్సనల్ లా బోర్డు (ఏఐఎంపీఎల్‌బీ) సభ్యుడు మౌలానా సయ్యద్ సల్మాన్ హుస్సేనీ నద్వీ ప్రతిపాదించారు. మసీదు తరలింపునకు ఇస్లాంలో నిబంధనలు అంగీకరిస్తున్నాయని చెప్పారు. ఈ వివాదానికి కోర్టు వెలుపల సామరస్య పరిష్కారానికి ఆర్ట్ ఆఫ్ లివింగ్(ఏవోఎల్) వ్యవస్థాపకుడు శ్రీశ్రీ రవిశంకర్ శుక్రవారం బెంగళూరులో మౌలానా నద్వీ సహా ఆరుగురు ముస్లిం ప్రముఖులతో సమావేశమయ్యారు. అయోధ్యలో రామాలయ నిర్మాణానికి మద్దతు తెలిపిన నద్వీ .. మసీదు, విశ్వవిద్యాలయం నిర్మాణానికి భూమి కేటాయించాలని కోరారు. కాగా కోర్టు వెలుపల పరిష్కారానికి రవిశంకర్‌ను కలిసిన ప్రముఖులంతా మద్దతు పలికారని ఏవోఎల్ వెల్లడించింది. మార్చిలో మళ్లీ భేటీ కావాలని రవిశంకర్ నిర్ణయించారు.



Printed and Published by Koganti Venkata Seshagiri Rao, on behalf of Aamoda Publications Pvt. Ltd., at the Aamoda press at Gollapalli road.,Dharmaram(B)Village,Dichpally Mandal, Nizamabad- 503230. Editor: K. Srinivas, Ph. Nos. 08461-245301, 245306. Fax 245307, RNI NO: AP TEL /2004/12975 .Managing Director : Vemuri Radha Krishna, Founder: K.L.N.Prasad.